గురువారం 18-7-2024

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 117

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL








సాక్షి ఫ్యామిలీ

II

హైదరాబాద్

గురువారం ॥ 18-7-2024



హిమాలయాల్లోని కాంగ్ యాత్సే పర్వతంపై భారత జాతీయ పతాకంతో శ్రద్ధాంజలి సాహు

పర్వత పుత్రి సాహు



శ్రద్ధాంజలి సాహు... ఒడిశాలో పుట్టి, హైదరాబాద్‌లో పెరిగిన పంతొమ్మిదేళ్ల అమ్మాయి. బీటెక్ ఫైనలియర్. చదివేది సాఫ్ట్‌వేర్ కోర్సే అయినా తన పరిజ్ఞానాన్ని దేశ రక్షణరంగం కోసం అంకితం చేయాలనుకుంటోంది. 'ఆ కల కోసమే ఎన్‌సీసీలో చేరాను, ఆ కల నెరవేర్చుకునే క్రమంలో నన్ను నేను నిరూపించుకోవడం కోసమే పర్వతాన్ని అధిరోహించాను' అంటోంది. గత జూన్ నెల 21వ తేదీన కాంగ్ యాత్సే 2 పర్వతాన్ని అధిరోహించి, శిఖరం మీద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించింది. 'నా కల చాలా పెద్దదని నాకు తెలుసు. ఆ కలను సాకారం చేసుకోవడానికి శ్రద్ధగా ఒక్కో అడుగు వేస్తున్నాను' అంటూ 'సాక్షి ఫ్యామిలీ'తో తన పర్వతారోహణ అనుభవాల్ని పంచుకుంది శ్రద్ధాంజలి సాహు.

కాంగ్ యాత్సే పర్వతశ్రేణి హిమాలయాల్లో లధాక్ రీజియన్‌లో ఉంది. కాంగ్ యాత్సే పర్వత శిఖరం ఎత్తు 6,250 మీటర్లు. నా మౌంటెనీరింగ్ జర్నీ చాలా తమాషాగా జరిగిపోయింది. ఎయిత్ లోనో, నైన్త్ క్లాస్‌లోనో గుర్తులేదు. హిందీలో 'ఎవరెస్ట్ మేరీ శిఖర్' అనే పాఠం ఉండేది. మా హిందీ టీచర్ ఆ పాఠాన్ని ఎంత అద్భుతంగా చెప్పారంటే... బచేంద్రిపాల్‌లాగ నేను కూడా పర్వతారోహణ చేయాలనుకున్నాను. పర్వతాల గురించి తెలుసుకోవడం కూడా అప్పటి నుంచే మొదలైంది.

గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్‌సీసీ, హైదరాబాద్ కమాండర్ కల్నల్ అనిల్ ఆధ్వర్యంలో మౌంటెనీరింగ్ అవకాశం రాగానే మరేమీ ఆలోచించకుండా ట్రైనింగ్‌కి వెళ్లాను. హెచ్ఎమ్ఐ (హిమాలయన్ మౌంటెనీరింగ్ ఇన్‌స్టిట్యూట్) ఆధ్వర్యంలో డార్జిలింగ్‌లో నెల రోజులు బేసిక్ ట్రైనింగ్, ఆ తర్వాత ఈ ఏడాది మార్చిలో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్, సెర్చ్ అండ్ రెస్క్యూ మెథడ్స్ ట్రైనింగ్ ఉత్తరాఖండ్‌లో పూర్తి చేసుకుని ఎక్స్‌పెడిషన్‌కు సిద్ధమయ్యాను.

అమ్మకు దూరంగా యాభై రోజులు

ఢిల్లీలో మే 28న ఫ్లాగ్ ఆఫ్, జూన్ 29న ఫ్లాగ్ ఆన్ జరిగింది. ముందు, వెనుక ప్రయాణాలన్నీ కలిపి యాభై రోజులు ఇంటికి దూరంగా ఉండడం అదే మొదటిసారి. అమ్మానాన్నల దగ్గర ఉన్నప్పుడు వాళ్ల ప్రేమను ఆస్వాదిస్తూ ఉంటాం. వాళ్లకు దూరంగా ఉండడం ఎంత కష్టమో దూరంగా ఉన్నప్పుడే తెలుస్తుంది. అమ్మానాన్నల ప్రేమ ఎంత అమూల్యమైనదో తెలిసి వచ్చిన క్షణాలవి. ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగానికి వెళ్లాలనుకున్నప్పుడు అమ్మ ఒప్పుకోలేదు. మౌంటెనీరింగ్‌కీ ఒప్పుకోలేదు. అమ్మను ఒప్పిస్తే నాన్న ఆటోమేటిగ్గా ఒప్పుకుంటాడని, అమ్మను బాగా కన్విన్స్ చేశాను. ఈ టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేశాను. ఇక రక్షణరంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవడం గురించి ఒప్పించి, నాకున్న డిఫెన్స్ యూనిఫామ్ కల నెరవేర్చుకోవాలి. ఇప్పుడు ఒప్పుకుంటారనే నమ్మకం ఉంది.

ఆరోహణలో అవరోధాలు

కాంగ్ యాత్సే 2 పర్వతారోహణ మర్ఖా వ్యాలీ దగ్గర మొదలవుతుంది. మౌంటెనీరింగ్ బూట్స్, క్రాంపన్స్‌లలో ఐదు కేజీల బరువులుంటాయి. అవసరమైన వస్తువులతో ఇరవై కేజీల బ్యాగ్ మోస్తూ నడక మొదలవుతుంది. ఐదువేల మీటర్లు దాటిన తర్వాత బేస్ క్యాంప్ ఉంటుంది. అక్కడి వరకు మన అన్నం, పప్పు ఉంటాయి. ఆంతకు పైకి వెళ్లే కొద్దీ అన్నం ఉడకదు, చపాతీలు కాల్చడం కుదరదు. డ్రై రేషన్... అంటే డ్రై ఫ్రూట్స్, నట్స్, చాక్లెట్‌లు, న్యూట్రిషన్ బిస్కట్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లతో ప్రయాణం కొనసాగుతుంది. నడక... నడక... ధ్యానంలాగ తదేక దీక్షతో సాగుతుంది. అడుగు పడిన చోట గట్టిగా ఉందా జారుతోందా అని మన ముందు వాళ్ల అడుగులను గమనిస్తూ వెళ్లాలి. ఈ నడక సమయంలో అనేక ఆలోచనలు వస్తాయి. ముందుకెళ్లి ఏం సాధిస్తాం, వెనక్కి వెళ్తే నష్టపోయేదేముంది... అని కూడా అనిపిస్తుంది. ఆరోహణ పూర్తయ్యేటప్పటికి ఒక పరిపూర్ణమైన వ్యక్తిగా మారుతాం. పరస్పరం సహకరించుకోవడంతోపాటు ఉద్వేగాలకు లోనుకాకుండా ప్రశాంతంగా ఉండడం, ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వినే లక్షణం కూడా అలవడుతుంది. శిఖరాన్ని చేరినప్పుడు సమయం ఉదయం ఏడున్నర. సూర్యోదయం అయింది. చుట్టూ తెల్లని వలయం ఆవరించినట్లు ఉంది. వైట్ అవుట్ అంటారు. మేఘాలు ఆవరించి ఉంటాయి. పది మీటర్ల దూరాన ఉన్న మనిషి కూడా కనిపించడు. శిఖరాన్ని అధిరోహించినప్పుడు కలిగే అనుభూతిని మాటల్లో వర్ణించగలిగినంత సాహిత్యాన్ని చదవలేదు'' అని నవ్వుతూ ముగించింది శ్రద్ధాంజలి సాహు. మౌంటెనీరింగ్‌లో వచ్చే ఏడాది జరిగే మౌంట్ ఎవరెస్ట్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పెడిషన్‌కు ఆమెకు ఆహ్వానం వచ్చింది. ఎంపిక ప్రక్రియ మొదలు కావాల్సి ఉంది.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఫొటోలు: **నోముల రాజేశ్ రెడ్డి**

సంప్రదాయం

ఆకాంక్షలే ఆలంబనగా రొట్టెల పండగ

అక్కడకు తరలి వచ్చేవారివి చిన్న చిన్న కోరికలే. చదువు రావాలి, ఉద్యోగం రావాలి, వివాహం జరగాలి, సంతానం కలగాలి అనే... జీవితంలో ఆకాంక్షలు ఉండాలి. ఆ ఆకాంక్షలు నెరవేరతాయనే ఆశ ఉండాలి. అలాంటి వారికి అభయమిచ్చే ఆధ్యాత్మిక వేడుకలు ఎన్నో. అలాంటి వాటిలో ఒకటి 'రొట్టెల పండగ' నెల్లూరులో జరిగే ఈ పండగలో స్త్రీలు విశేషంగా పాల్గొంటారు.



రొట్టెలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు

ప్రతి సంవత్సరం మొహరం పండగ వేళలో నెల్లూరు వీధులు పోటెత్తుతాయి. దేశ విదేశాల నుంచి జనం నెల్లూరులోని బారా షహీద్ దర్గా దగ్గరకు చేరుకుంటారు. కులం, మతం, భాష, ప్రాంతం... తేడా లేకుండా అక్కడి స్వర్ణాల చెరువులో మొక్కు మొక్కుకుంటారు. లేదా తీర్చుకుంటారు. మొక్కు తీరిన వారు రొట్టె పంచుతారు. మొక్కుకునే వారు ఆ రొట్టెను స్వీకరిస్తారు. తరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం చెక్కు చెదరడం లేదు. ప్రతి సంవత్సరం ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుక నిన్నటి నుంచి ఘనంగా జరుగుతోంది. ఇది ప్రధానంగా స్త్రీల పండగ.

ఎవరు ఈ బారా షహీద్?

మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని ప్రపంచ వ్యాప్తం చేయడంలో భాగంగా టర్కీ నుంచి సుమారు 300 ఏళ్ల క్రితం 12 మంది మతబోధకులు భారతదేశానికి వచ్చారు. ఆ సమయంలో కొడవలూరు మండలంలోని గండవరంలో తమిళనాడు వాల్జారాజులకు, బీజాపూర్ సుల్తాన్‌లకు మధ్య యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఈ 12 మంది వీరమరణం పొందారు. వీరి తలలు గండవరంలో తెగిపడగా మొండాలను గుర్రాలు నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్దకు తీసుకు వచ్చాయి. ఈ 12 మంది నెల్లూరు ఖ్వాజీకి కలలో కనపడి తమను అక్కడే సమాధి చేయాలని కోరడంతో అక్కడే సమాధులు నిర్మించారు. 12ను ఉర్దూలో బారా, వీర మరణం పొందిన అమరులను షహీద్‌లుగా పిలుస్తారు. అందుకే ఈ దర్గాకు బారా షహీద్ అనే పేరొచ్చింది.

వివాహం రొట్టె.. సంతాన రొట్టె

నెల్లూరు బారా షహీద్ దర్గాలో మొక్కు రొట్టెతో ముడిపడి ఉంటుంది. ఇక్కడకు వచ్చే భక్తులు ఉద్యోగం, ప్రమోషన్, సౌభాగ్యం, సంతానం, విద్య, స్వగృహం, వ్యాపారం... ఈ కోరికలు నెరవేరాలని మొక్కుకునేందుకు వస్తారు. గతంలో మొక్కిన మొక్కులు తీరిన వారు రొట్టెలతో వస్తారు. వారి నుంచి రొట్టె తీసుకోవాలి. అంటే గతంలో వివాహ మొక్కు మొక్కుకుని వివాహం జరిగిన వారు రొట్టెలతో వస్తారు. వివాహం కావలసిన వారు వారి దగ్గర నుంచి రొట్టె స్వీకరించి తినాలి. మొక్కు తీరాక వాళ్లు ఇలాగే రొట్టెను తెచ్చి ఇవ్వాలి. బారా షహీద్ దర్గా పక్కనే ఉన్న స్వర్ణాల చెరువులో మోకాళ్ల లోతుకు దిగి స్త్రీలు ఈ రొట్టెల బదలాయింపు చేసుకుంటారు. బాకీ తీరాలనే రొట్టె, స్థలం కొనాలనే రొట్టె, ర్యాంకుల రొట్టె... ఇవన్నీ అదృష్టాన్ని బట్టి దొరుకుతాయి. అన్నింటి కంటే ఎక్కువగా ఆరోగ్య రొట్టె కోసం వస్తారు.



రొట్టెల ఆనవాయితీ

తమిళనాడు నుంచి నెల్లూరు వరకు ఆర్కాట్ నవాబుల ఏలుబడిలో ఉన్నప్పుడు నవాబు భార్య జబ్బు పడితే ఆమెకు నయం అయ్యే మార్గం కోసం నవాబు ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో బారా షహీద్ దర్గా దగ్గర బట్టలు ఉతుకుతున్న రజకునికి ఆ రాత్రి బారా షహీద్‌లు కనబడి మా సమాధుల దగ్గరి మట్టి తీసుకుని నవాబు భార్య నుదుటికి రాస్తే నయం అవుతుందని చెప్పారు. ఆ సంగతి రజకుడు ఊరి వారికి తెలుపగా వారు నవాబుకు తెలియచేశారు. మట్టి తెప్పించిన నవాబు దానిని తన భార్య నుదుటికి రాయగా 24 గంటల్లో ఆమెకు నయం అయ్యింది. దాంతో అతడు అంత దూరం నుంచి బారా షహీద్ దర్గాను చూడటానికి వచ్చాడు. దర్శనం అయ్యాక అక్కడ ఉన్న పేదలకు రొట్టెలు పంచాడు. మొక్కు తీరాక ఇలా రొట్టెలు పంచడం ఆనవాయితీ అయ్యింది. ఈ నెల 21 వరకు రొట్టెల పండగ జరుగుతుంది.

- కొండా సుబ్రహ్మణ్యం,

సాక్షి, నెల్లూరు

హెల్దీ డైట్

మఖానా దోసె



- డాక్టర్ కరుణ

న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

కావలసినవి: మఖానా – కప్పు; దోసె పిండి – రెండు కప్పులు; ఉప్పు – పావు టీ స్పూన్; చక్కెర – పావు టీ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; మిరియాల పొడి – పావు టీ స్పూన్; నెయ్యి– 2 టీ స్పూన్‌లు

తయారీ: ● మఖానాను నీటిలో 4–5 గంటల సేపు నానబెట్టాలి. నానిన తర్వాత నీటిని వంపేసి మిక్సీలో మెత్తగా పేస్ట్ చేయాలి ● ఒక పాత్రలో దోసెపిండి తీసుకుని అందులో ఉప్పు, చక్కెర, జీలకర్ర, మిరియాల పొడి, మఖానా పేస్ట్ వేసి బాగా కలిపి గరిటె జారుడుగా చేసుకోవాలి ● స్టవ్ మీద పెనం పెట్టి వేడి చేసి దోసె పోయాలి. మీడియం మంట మీద దోరగా కాల్చి తిరగేయాలి. రెండు వైపులా కాలిన తర్వాత ప్లేట్‌లోకి తీసుకుని పిల్లలకు ఇష్టమైన వెన్న, చట్నీ, సాంబార్, పొడులతో సర్వ్ చేయాలి ● ఇష్టమైతే దోసె మీద ఉల్లిపాయ , వెల్లుల్లి, అల్లం ముక్కలు చల్లుకోవచ్చు.

* * *

మఖానా అంటే తామర గింజలు. ఫూల్ మఖానా అని కూడా అంటారు. ఈ మఖానాలో క్యాల్షియం, మెగ్నీషియం, విటమిన్ ఏ, బీ6, యాంటీ ఆక్సిడెంట్‌లు, ఫైబర్, ఐరన్ ఉంటాయి. ఇంకా మినరల్స్, కాపర్, పాస్ఫరస్, మాంగనీస్ వంటి సూక్ష్మ పోషకాలుంటాయి.



ఉండే మెగ్నీషియం, విటమిన్ ఏ కంటి చూపుకు, బీ6లు జ్ఞాపకశక్తిని పెంచడానికి దోహదం చేస్తాయి. క్యాల్షియం ఎముకలు, దంతాల గట్టిదనానికి సహకరిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్‌లు ఇతర సూక్ష్మపోషకాలు వ్యాధినిరోధక శక్తిని వృద్ధి చేస్తాయి. ఫైబర్ మలబద్ధకాన్ని నివారించి, జీర్ణవ్యవస్థ పని తీరును మెరుగుపరుస్తుంది. నీరసం, తలతిరగడం వంటి సమ్యలను ఐరన్ పరిష్కరిస్తుంది. ఇందులో గ్లూటెన్ ఉండదు. కాబట్టి గ్లూటెన్ అలర్జీ ఉన్న పిల్లలకు ఇది మంచి ప్రత్యామ్నాయం.

ఈ దోసెలో ఏమేమి ఉంటాయి... ఎంతెంత ఉంటాయి!

● శక్తి	–	700 కేలరీలు
● ప్రొటీన్	–	20 గ్రాములు
● ఫ్యాట్	–	0.2 గ్రాములు
● కార్బోహైడ్రేట్‌లు	–	153 గ్రాములు
● ఫైబర్	–	29 గ్రాములు
● క్యాల్షియం	–	120 మిల్లీ గ్రాములు
● ఐరన్	–	2.8 మిల్లీ గ్రాములు
● మెగ్నీషియం	–	196 మిల్లీగ్రాములు
● పాస్ఫరస్	–	772 మిల్లీగ్రాములు
● పొటాషియం	–	948 మిల్లీగ్రాములు
● జింక్	–	204 మిల్లీగ్రాములు

ఔనా..!

స్లిప్పర్స్‌కు లక్ష!



మీరు విన్నది నిజమే! మన రెగ్యులర్‌గా ఉపయోగించే స్లిప్పర్స్ సౌదీలో అక్షరాలా లక్షకు పైమాటే! కువైట్, చుట్టుపక్కల న్యూస్ పంచుకునే ఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాదారు ఒక స్టోర్‌లో రికార్డ్ చేసిన వీడియోను షేర్ చేసింది. 'అత్యాధునికమైనవి'గా 'చెప్పు' కుంటున్న ఈ స్లిప్పర్స్ ధర 4,590 సౌదీ రియాల్స్ పలుకుతోంది. ఇది మన రూపాయలలో లక్షా రెండువేలకు పైగానే! ఎరుపు, పసుపు, నీలం, ఆకుపచ్చ రంగులతో సహా వివిధ రంగులలో ఉన్న స్లిప్పర్స్ జతలను ఓ ఉద్యోగి గ్లాస్ కేస్‌లోంచి తీసి వీడియో రికార్డ్ చేస్తున్న వ్యక్తికి చూపించాడు. ఈ వీడియో చూసిన నెటిజనులు... 'ఇవి మా కుటుంబం వాడే బాత్రూమ్ చెప్పులు' అని, 'ఇండియాలో వీటిని టాయిలెట్ పాదరక్షలుగా ఉపయోగిస్తారని కామెంట్ చేస్తున్నారు.

యోగం

ఒత్తిడిని తగ్గించే బాలాసనం

బాలాసనంలో శరీరం మొత్తం ముందుకు సాగి, చంటి పిల్లలు బోర్లా పడుకున్నప్పుడు కనిపించే భంగిమలో ఉంటారు. దీనిని శశాంకాసనం అనికూడా ఉంటారు. ఈ ఆసనంలో వెన్నెముక సాగి, మోకాళ్లు బలపడతాయి. పొత్తికడుపులోని అవయవాలకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. నడుం నొప్పిసమస్యలు తగ్గుతాయి. ఒత్తిడి తగ్గి, శరీరం మొత్తం విశ్రాంతి పొందుతుంది.



ముందుగా మ్యాట్‌పైన కాలి మడమల మీద హిప్ భాగం ఉండేలా వజ్రాసనంలో కూర్చోవాలి. తర్వాత నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ రెండు చేతులు పైకి ఎత్తాలి. శ్వాస వదులుతూ తల, పొట్ట భాగాన్ని ముందుకు మోకాళ్ల మీదుగా పూర్తిగా వంచాలి. చేతులను నేలపై తలకిరువైపులా వెడల్పుగా 'వి' ఆకారంలో ఉంచాలి. ఈ పొజిషన్‌లో 30 సెకన్ల పాటు ఆగి, విశ్రాంతి పొందాలి. తర్వాత తిరిగి వజ్రాసనంలోకి రావాలి. ఇలా సుమారు 10 సార్లు చేయాలి.

ఫలితాలు: రోజువారీ పనుల ద్వారా కలిగే ఒత్తిడి, చిరాకు లాంటి సమస్యలు దూరం అవుతాయి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. పేగులు, కాలేయం, మూత్రపిండాలకు బలం చేకూరుతుంది. మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నవారికి మంచి ఉపశమనం లభిస్తుంది. ఎముకల సమస్యతో బాధపడేవారు, హైబీపీ ఉన్నవారు నిపుణుల సూచనలు తీసుకోవాలి.



- జి. అనూషా రాకేష్, యోగా ట్రైనర్

మానవత

పెద్ద జబ్బుతో ఆసుపత్రి పాలైన నిరుపేదల దగ్గర లక్షల్లో ఖర్చుచేసేటంత డబ్బు ఉండదు. ప్రాణాలు నిలబడాలంటే ఏం చేయాలి మరి? ఇందుకు సమాధానమే క్రౌడ్ ఫండింగ్. ఆరోగ్యం, విద్య, జంతువుల సంక్షేమం, ప్రకృతి వైపరీత్యాలు, మహిళా సాధికారత కోసం విరాళాలను క్రౌడ్ ఫండింగ్ ద్వారా సమకూర్చుతున్నాయి కొన్ని ఆన్‌లైన్ వేదికలు.



సాయం కాపాడుతున్న ప్రాణం క్రౌడ్ ఫండింగ్

కర్నూలు జిల్లాకు చెందిన తొమ్మిదేళ్ల సానియా వెంట్రిక్యులర్ సెప్టల్ డిఫెక్ట్ వ్యాధితో బాధపడుతోంది. ఈ వ్యాధి చికిత్సకు రూ.12 లక్షలు కావాలి. తండ్రి రాళ్లు కొట్టే పని చేస్తుంటాడు. తల్లి గృహిణి. కుమార్తెకు చికిత్స చేయించే స్తోమత లేకపోవడంతో వీరికి 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' అండగా నిలిచింది. ఈ ఫౌండేషన్ వివిధ వేదికల్లో క్రౌడ్ ఫండింగ్ చేపట్టింది. రూ.12 లక్షలు క్రౌడ్ ఫండింగ్ ద్వారా జమ అయ్యి, చిన్నారికి చికిత్స జరిగింది. ప్రాణాలు నిలబడ్డాయి.

●●●

రహ్మద్ బాషా విజయవాడలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఇటీవల అతనికి నెలల నిండకుండానే 704 గ్రాముల బరువుతో కూతురు పుట్టింది. ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఐసీయులో చికిత్స పొందుతోంది. 'పాప చికిత్సకు రూ.14 లక్షలు అవసరం. దయచేసి, సహాయం చేసి, మా పాపను బతికించండి' అని క్రౌడ్‌ఫండింగ్ నిధుల సమీకరణ లింక్‌లో విన్నవించుకున్నాడు. చికిత్సకు అవసరమయ్యే డబ్బు వారికి అందుతోంది.

●●●

కేరళలోని ఎర్నాకుళానికి చెందిన సారంగ్ మీనన్, అదితి నాయర్‌ల ఏడాదిన్నర కుమారుడు నిర్వాణ్ వెన్నెముక కండరాల క్షీణత అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ చికిత్సకు దాదాపు రూ.17.5 కోట్లు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఈ వ్యాధి నివారణకు ఉపయోగించే వన్‌టైమ్ డ్రగ్ జోల్జెన్స్మా ఇండియాలో అందుబాటులో లేదు. దీనిని అమెరికా నుంచి తెప్పించాలి. ఇదే విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా తెలియజేయడంతో క్రౌడ్ ఫండింగ్ ద్వారా 72 వేల మంది విరాళాలు అందించారు.

●●●

ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా, మా వల్ల ఏమవుతుంది... అంటూ కుదేలవ్వాల్సిన పని లేదని చెప్పే ఇలాంటి కథనాలు ఎంతో ధైర్యాన్నిస్తున్నాయి. ఆరోగ్యపరంగా ఎంత అవసరం వచ్చినా, దాతల నుంచి విరాళాలు తెచ్చి పెట్టేందుకు నేడు ఎన్నో వేదికలు పనిచేస్తున్నాయి. వేలాది మంది బాధితుల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయి. అదే సమయంలో ఇలాంటి బాధితులకు సాయం చేశామనే సంతృప్తి దాతలకు లభిస్తోంది. కాకపోతే విరాళం ఇచ్చే ముందు విచారించి, నిజమైనదేనని నిర్ధారించుకోవడం ద్వారా తమ దానం నిష్ఫలం కాకుండా చూసుకోవచ్చు. మెడికల్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఎలా పనిచేస్తాయో తెలుసుకుంటే.. సాయం పొందచ్చు. తోచినంత సాయమూ చేయచ్చు.

విశ్వసనీయమైన ఎంపిక

క్రౌడ్ ఫండింగ్‌లో ప్రతి ప్రయత్నం సవాల్‌తో కూడుకున్నదే. ప్రచారం చేసినప్పటికీ మొత్తం నిధుల సేకరణ లక్ష్యాన్ని చేరుకోలేకపోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో క్రౌడ్‌ఫండింగ్ విశ్వసనీయమైన ఆర్థిక ఎంపికగా మారినందున మోసం, దుర్వినియోగం వంటివీ జరగచ్చు. తప్పుదారి పట్టించే లేదా మోసపూరితమైన నిధుల సమీకరణను చూసినట్లయితే, దానిని వెంటనే మా దృష్టికి తీసుకురావాలి.



- సాయంతి రాయ్,

హెడ్ కమ్యూనికేషన్స్, మిలాప్

నిధుల సేకరణ ఇలా..!

దాతల సాయం అవసరమైన ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లను (ఇంపాక్ట్ గురూ, మిలాప్, కెట్టో, గో ఫండ్ మి, కిక్‌స్టార్టర్... మొదలైనవి) సంప్రదించవచ్చు ● పాన్, ఆధార్, మెడికల్ డాక్యుమెంట్లు సమర్పించాలి. ఎంక్వైరీ అనంతరం వారి తరపున నిధుల సమీకరణ పేజీని అవి సిద్ధం చేస్తాయి ●సాయం అవసరమైన వారు ఈ పేజీ లింక్‌ను తమ నెట్‌వర్క్‌లో షేర్ చేసుకోవాలి ● విరాళంలో కొంత మొత్తాన్ని కమీషన్ రూపంలో మినహాయించుకునేందుకు సమ్మతి తెలియజేస్తే, వారి తరపున క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు విస్తృత ప్రచారాన్ని చేపడతాయి ● విరాళం ఇచ్చేందుకు పేమెంట్ లింక్‌లు కనిపిస్తాయి. ఇలా చేసే చెల్లింపులన్నీ పన్ను రాయితీ కల్పిస్తాయి ● కావాల్సిన మొత్తం వచ్చినా, గడువు ముగిసినా లేదంటే బాధితులు అకాలంగా మరణించినా నిధుల సమీకరణ ఆగిపోతుంది. అనంతరం ఈ మొత్తం నుంచి కమీషన్ మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని బాధితులకు క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు చెల్లిస్తాయి. ఇలా చేసే ముందు హాస్పిటల్ బిల్లులను చెక్ చేస్తాయి.

ఇన్‌స్పిరేషన్

చిన్నారి సేవాగుణం

ఎంతోమంది విదేశాలకు వెళ్లిన తర్వాత పుట్టి పెరిగిన ప్రాంతాన్ని మర్చిపోతుంటారు. కాని కరీంనగర్ నుంచి అమెరికా వెళ్లి అక్కడ నివాసం ఉంటున్న ఓ ప్రవాస భారతీయుడి కుమార్తె సొంత ఊరిపై మమకారంతో అనాథ విద్యార్థుల కోసం విరాళాలు సేకరించి అందించింది. ఈ రకంగా తన తల్లితండ్రులు పెరిగిన ఊరిపై ప్రేమను చాటుకుంది.



కరీంనగర్ పట్టణానికి చెందిన ప్రవాస భారతీయులు లక్కాకుల వినయ్ అమెరికాలోని మిచిగాన్‌లో నివసిస్తుండగా వారి కూతురు లక్కాకుల హరిణి అమెరికాలోని నోవి హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. హరిణి పాఠశాల సామాజిక సేవాకార్యక్రమంలో భాగంగా రూ.1.65 లక్షల మేరకు విరాళాలు సేకరించింది. ఈ మొత్తాన్ని హరిణి కరీంనగర్ పట్టణంలోని వెంకట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలగోకులంలో 40 మంది అనాథ విద్యార్థులకు విద్యాబుద్ధులను గరపడంతోపాటు సకల సౌకర్యాలను కలుగజేస్తున్నారని తెలుసుకొని వారి అవసరాల కోసం విరాళంగా ఇచ్చారు. వయసులో చిన్న అయినా, పెద్ద మనసుతో విరాళాలు సేకరించి ఇచ్చిన హరిణికి బాలగోకులం విద్యార్థులు, వెంకట్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 117

గురువారం 18-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బుల్లెట్ దిగాలి...

పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ నుంచి బరిలో 21 మంది షూటర్లు - 14లో



శౌర్యకు కాంస్యం

ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్ సెమీఫైనల్లో పరాజయం - 14లో

మాఫీ 'లెక్క' మారిందా?

మాఫీ పొందే రైతుల సంఖ్య, నిధులు తగ్గడంపై సందేహాలు

తొలి విడత రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు ప్రకటనతో గందరగోళం

- గత బీఆర్ఎస్ సర్కారు రూ. లక్షలోపు రుణాల మాఫీకి లెక్కేసిన మొత్తం రూ.19,198 కోట్లు
- ఇప్పుడు అదే రూ.లక్షలోపు రుణాల మాఫీకి సర్కారు చెప్తున్న సొమ్ము రూ.7 వేల కోట్లే
- నాటితో లెక్కేస్తే మూడో వంతే ఉండటం ఏమిటంటున్న రైతు సంఘాల నేతలు
- ఇంత తగ్గడానికి కారణాలేమిటో స్పష్టత ఇవ్వని వ్యవసాయ శాఖ
- నిజానికి గత ఐదేళ్లలో పెరిగిన పంట రుణాలు.. బ్యాంకర్ల సమితి పేర్కొన్న ప్రకారం ఈ ఏడాది మార్చి చివరికి పంటరుణాల మొత్తం ఏకంగా రూ.64,940 కోట్లు
- గత ఏడాది డిసెంబర్ 9ని మాఫీకి కటాఫ్‌గా తీసుకున్న సర్కారు..
- మాఫీకి అవసరమైన మొత్తం రూ.31 వేల కోట్లు అని వాదన



కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: రైతుల పంట రుణాల మాఫీ అంశంలో గందరగోళం కనిపిస్తోంది. రుణమాఫీ 'లెక్క' తప్పిందని.. రైతులకు ఇవ్వాల్సిన మొత్తం తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తొలి విడతగా రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తున్నామని, 11.5 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల కోట్లు జమకానున్నాయని కాంగ్రెస్ సర్కారు చేసిన ప్రకటన సందేహాలకు తావిస్తోంది. గతంలో బీఆర్ఎస్ సర్కారు రూ.లక్షలోపు పంట రుణాల మాఫీకోసం రూ.19,198.38 కోట్ల నిధులు లెక్కతేల్చితే.. ఇప్పుడు రేవంత్ సర్కారు అదే రూ.లక్షలోపు రుణాల మాఫీకి కేవలం రూ.7 వేల కోట్లు అవుతున్నట్టు పేర్కొనడంపై రైతు సంఘాల నేతలు, వ్యవసాయ రంగ నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ఇస్తున్న పంట రుణాలు ఏటేటా పెరుగుతున్నట్టు

మిగతా 2వ పేజీలో ▶

రుణమాఫీలో రోల్‌మోడల్ కావాలి

కాంగ్రెస్ సమావేశంలో సీఎం రేవంత్

నేడే లక్ష రుణమాఫీ

ట్రయల్‌రన్ నిర్వహించిన అధికారులు

- వివరాలు 2లో



టీడీపీ గూండా జిలానీ కత్తితో నరకడంతో రక్తపుమడుగులో పడివున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్

రాజకీయ కక్షతో ఏపీలోని పల్నాడులో నడిరోడ్డుపై వైఎస్సార్‌సీపీ కార్యకర్త దారుణ హత్య

గూండారాజ్

వినుకొండలో కొబ్బరి బోండాల కత్తితో మాటు వేసి విచక్షణా రహితంగా దాడి

నిందితుడు పట్టణ తెలుగు యువత నేత తమ్ముడు

వందల మంది జన సందోహం సమక్షంలో పాశవిక ఘటన

బందోబస్తు విధుల్లో భారీగా పోలీసులు...

స్వయంగా ఎస్పీ పర్యవేక్షణ.. పూర్తి విచారణ చేయకుండా వ్యక్తిగత కక్షలే కారణమని ప్రకటించిన కొత్త ఎస్పీ 12లో

గడ్చిరోలి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్

- 12 మంది మావోయిస్టుల మృతి
- మృతుల్లో డివిజనల్ కమిటీ సభ్యుడు ఆత్రం లక్ష్మణ్ - 5లో

నేటి నుంచే డీఎస్సీ

- 11,062 టీచర్ పోస్టులకు పరీక్ష
- తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహణ
- 2.79 లక్షల మంది దరఖాస్తు.. 56 పరీక్ష కేంద్రాలు - 3లో



కన్నడనాట 'స్థానిక' రగడ!

ప్రైవేటు ఉద్యోగాలపై వివాదం

- వివరాలు 6లో



యమునా తీరే.. ఎవరికి వారే

యూపీ బీజేపీలో ఇంటి పోరు!

- వివరాలు 6లో



భారత్ మాకు వ్యూహాత్మక భాగస్వామి: రైడర్

- వివరాలు 6లో



రిజర్వేషన్లపై పట్నా హైకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

- వివరాలు 13లో

పూజారి.. ఏది దారి!

దేవాలయ అర్చకులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ బదిలీలు చేయాలని సర్కార్ నిర్ణయం

- బదిలీలపై కసరత్తు చేస్తున్న దేవాదాయ శాఖ
- వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించిన ఇద్దరు అర్చకులు
- తాత్కాలిక నిలుపుదల.. కౌంటర్ దాఖలుకు ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ప్రతి ఏడాదీ 20 శాతం మంది బదిలీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల అర్చకుల బదిలీలపై పీటముడి ఏర్పడింది. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇక ఆలయ అర్చకులను కూడా బదిలీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అర్చకులు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నారు. వీరికి ఆ శాఖలోని కొందరు అధికారులు మద్దతిస్తుండగా, మరికొందరు అధికారులు మాత్రం బదిలీ చేయటంలో ఎలాంటి తప్పు లేదని పేర్కొంటున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా అర్చకులు.. మంత్రులు మొదలు స్థానిక ఎమ్మెల్యేలను కలుస్తూ, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునేలా ఒత్తిడి ప్రారంభించారు. వాస్తవానికి ఇప్పటివరకు దేవాలయ ఉద్యోగులను మాత్రమే ఒక ఆలయం నుంచి మరో ఆలయానికి బదిలీ చేసేవారు. అర్చకులు మాత్రం అదే దేవాలయంలో పనిచేస్తూ వస్తున్నారు. అయితే ఉద్యోగులతో సమంగా ఇప్పుడు ఆలయ అర్చకులు కూడా ప్రభుత్వం నుంచి జీతాలు పొందుతున్నందున.. అర్చకులను కూడా ఆలయ ఉద్యోగులుగానే పరిగణిస్తూ బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు దేవాదాయ శాఖ పది రోజులుగా కసరత్తు చేస్తోంది.

హైకోర్టు స్టే.. కౌంటర్‌కు ప్రభుత్వం ఏర్పాట్లు..

దేవాదాయ శాఖ చరిత్రలో తొలిసారి అర్చకుల బదిలీలకు రంగం సిద్ధమైన వేళ. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ భద్రాచలం దేవాలయానికి చెందిన నారాయణాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు హైకోర్టును ఆశ్రయించటంతో కోర్టు బదిలీ ప్రక్రియను రెండు వారాలపాటు నిలిపేస్తూ స్టే ఇచ్చింది. దీనికి కౌంటర్ దాఖలు చేసేందుకు దేవాదాయ శాఖ సిద్ధమవుతోంది. అర్చకుల వివరాలు, బదిలీ చేస్తే ప్రత్యామ్నాయ దేవాలయాన్ని ఎంచుకునే ఐచ్ఛికాన్ని తెలపాలంటూ జారీ చేసిన నమూనా పత్రం ఆధారంగా ఈ ఇద్దరు అర్చకులు హైకోర్టును ఆశ్రయించారు. అయితే స్టే గడువు పూర్తి కాగానే బదిలీలు నిర్వహించాలన్న అభిప్రాయంతో ఉన్నతాధికారులున్నట్టు తెలుస్తోంది.

ప్రతి సంవత్సరం 20 శాతం మంది బదిలీ..

దేవాదాయ శాఖలో ప్రతి సంవత్సరం 20 శాతం మంది ఉద్యోగులను బదిలీ చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. బదిలీ ప్రక్రియకు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను వెల్లడిస్తూ 2019లో జీఓ నంబరు 64ను జారీ చేసింది. కానీ, అది అమలులోకి రాలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వం బదిలీలకు సిద్ధమైంది. ఈమేరకు జీఓ 243ని వారం రోజుల క్రితం జారీ చేసింది. వైష్ణవ ఆగమాలను అనుసరించే దేవాలయాల్లో పద్ధతులకు శైవ ఆగమాలను అనుసరించే దేవాలయాల్లో పద్ధతులకు చాలా తేడా ఉంటుంది. ఏ ఆగమాన్ని అనుసరించే దేవాలయ ఉద్యోగులు అదే ఆగమాన్ని అనుసరించే దేవాలయానికే బదిలీ చేయాలని నిర్ణయించింది.

ఐదు దేవాలయాల చాయిస్

ఆయా దేవాలయాల ఉద్యోగుల వివరాలను, వారు బదిలీలో ఏ దేవాలయాన్ని కోరుకుంటున్నారో (ఐదు దేవాలయాల చాయిస్) వెల్లడించాలని పేర్కొంటూ ప్రొఫార్మాను ఆలయాలకు పంపింది. ఆ వివరాలు సేకరించి.. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా అంతరజిల్లా బదిలీలు చేయాలని నిర్ణయించింది. అర్చకులతో పాటు వేద పండితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కూడా నిర్ణయించటం విశేషం.

ఎవరికి వర్తిస్తుందంటే..

రాష్ట్రంలోని దేవాలయాల ఆదాయం ఆధారంగా వాటి స్థాయిని ప్రభుత్వం విభజించింది. సాలీనా రూ.2 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న వాటిని నేరుగా పర్యవేక్షిస్తూ తన ఆధీనంలోకి తీసుకుంది. ఈ దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు ఉద్యోగుల తరహాలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా జీతాలను చెల్లిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఇలాంటివి 646 దేవాలయాలున్నాయి. వీటిల్లో 2500 మంది వరకు అర్చకులు పనిచేస్తున్నారు.

క్లుప్తంగా...

నేడు సీఎంవో అధికారులతో సీఎం రేవంత్ భేటీ

సాక్షి, హైదరాబాద్: సీఎంవో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో సమావేశం కానున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ సమీక్షా సమావేశంలో పాల్గొంటారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని, రైతుభరోసా పథకం అమలు చేసి రైతాంగానికి చేయూతనివ్వాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వ ఉత్తర్వులు లోపభూయిష్టంగా ఉన్నాయని అన్నారు. ఆంక్షలు లేవని సీఎం చెబుతున్నప్పటికీ, ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో ఉన్న గైడ్‌లైన్స్ ఎక్కడా మార్చలేదన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అప్పులు, వడ్డీలు అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతోందని ధ్వజమెత్తారు. రైతుల సంఖ్యను కుదించేందుకే ప్రభుత్వం రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల చేసిందని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాజీ మంత్రి జోగు రామన్నతో కలసి మీడియాతో మాట్లాడుతూ అన్నదాతల మీద ఆంక్షలు ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులకు బ్యాంకు ఖాతాలు ఉండగా, 11 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేస్తామంటున్నారని, మిగిలిన 49 లక్షల మంది రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కనీసం ఐదెకరాల వరకు ఉన్న రైతులకయినా రైతుభరోసా ఇవ్వాలన్నారు. రుణమాఫీకి పట్టాదారు పాస్ బుక్కును ప్రామాణికంగా తీసుకుంటే, రైతుభరోసాకు కూడా దానినే ప్రామాణికంగా తీసుకుని ఇవ్వాలన్నారు.

జస్టిస్ నర్సింహారెడ్డి వ్యాఖ్యలు అనుచితం

మన్నె క్రిశాంక్



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ విచారణ కమిషన్ చైర్మన్ నర్సింహారెడ్డి కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకునే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆయనను బాధ్యతల నుంచి తప్పించడాన్ని బీఆర్ఎస్ స్వాగతిస్తుందని ఆ పార్టీ నేత మన్నె క్రిశాంక్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకున్నాక కూడా నరసింహారెడ్డి తన స్థాయిని మరిచి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కేసీఆర్ ఇంకా సమాధానం ఇవ్వలేదని చెబుతూనే రిపోర్టు సిద్ధమని ఎలా అంటారని ప్రశ్నించారు. దీన్ని బట్టి నరసింహారెడ్డి దురుద్దేశాలు అర్థమవుతున్నాయని తెలిపారు. అలాగే నేరాభియోగంపై విచారణ ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను ముందే దోషి అన్నట్లుగా నరసింహారెడ్డి మాట్లాడారని ఆరోపించారు.

ఇదండీ సంగతి



రుణమాఫీలో రోల్‌మోడల్ కావాలి

- కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్
- తెలంగాణ మోడల్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి
- నేడు లక్షలోపు.. నెలాఖరులోపు లక్షన్నర వరకు... ఆగస్టులో రూ.2 లక్షల వరకు మాఫీ అమలు
- ఈ విషయం ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్న సీఎం
- ప్రతి పోలింగ్ బూత్, ఓటర్ వద్దకు వెళ్లాలన్న డిప్యూటీ సీఎం భట్టి



కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం, తుమ్మల, పొంగులేటి, రాజనర్సింహ, సీనియర్ నేత మధుయాష్కీ

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ విషయంలో తెలంగాణ దేశానికి రోల్‌మోడల్ కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. వ్యవసాయ విధానంలో రాష్ట్రం మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలని అన్నారు. ప్రతి రైతుకు రుణ విముక్తి కల్పించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. 'గురువారం సాయంత్రం 4 గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేస్తున్నాం. రూ.7 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళ్తాయి. నెలాఖరులోగా రూ.లక్షన్నర వరకు మాఫీ చేస్తాం. ఆగస్టులో రూ.2 లక్షల వరకు మాఫీ చేసి ప్రక్రియను పూర్తి చేస్తాం..'అని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో జరిగిన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు.

మాట ఇస్తే చేస్తామన్న నమ్మకం కలిగించాలి

'నా జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు. రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్ ద్వారా రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పాం. అయితే ఆర్థిక నిపుణులు కష్టమని చెప్పారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కానీ ఆనాడు ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. పార్టీకి నష్టమని తెలిసి కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం. రాహుల్‌గాంధీ కూడా మాట ఇచ్చారంటే అది చేసి తీరుతారన్న నమ్మకం కలిగించడం మన బాధ్యత. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రూ.28 వేల కోట్ల రుణాలు కూడా మాఫీ చేయలేకపోయారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలోనే రూ.31 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి..'అని ముఖ్యమంత్రి చెప్పారు.

హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పాలి

'కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడం లేదు. ఏకమొత్తంలో రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించాలి. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించి హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పాలి. తెలంగాణలో రైతు రుణమాఫీపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. రాహుల్ ఇచ్చిన హామీని అమలు చేశామన్న విషయాన్ని పార్టీ ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావించాలి. ఎక్కడికక్కడ పండుగ వాతావరణంలో రుణమాఫీ సంబురాలు చేయాలి..'అని రేవంత్ పిలుపునిచ్చారు.

నిద్రలేని రాత్రులు గడిపాం: డిప్యూటీ సీఎం భట్టి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రూపాయి రూపాయి పోగు చేసి రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నామని, ఇందుకోసం నిద్ర లేని రాత్రులు గడిపామని చెప్పారు. ఎవరినీ వదలకుండా అందరికీ రుణమాఫీ వర్తింపజేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులందరూ తల ఎత్తుకుని ఎక్కడా తగ్గకుండా ప్రచారం చేయాలని, ప్రతి పోలింగ్ బూత్, ఓటర్ వద్దకు కార్యక్రమాన్ని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రూ.7 లక్షల కోట్ల అప్పులతో అధికారాన్ని చేపట్టినా, నెలల వ్యవధిలోనే రూ.2 లక్షల రుణమాఫీని, ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో తగిన ప్రచారం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ప్రతి గ్రామానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని చెప్పి రైతులు, ప్రజల హృదయాలను గెలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి నేతలు పాల్గొన్నారు.

సరిగ్గా ప్రచారం చేసుకోలేకపోతున్నాం: సీఎం

సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. గత ఏడు నెలల కాలంలో రూ.30 వేల కోట్లు సంక్షేమం కోసం ఖర్చు చేసినా 3 పైసల ప్రచారం కూడా చేసుకోలేకపోయామని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. 'చారానా కోడికి బారానా మసాలా'అన్నట్టు మోదీ, కేసీఆర్‌లు ఏమీ చేయకపోయినా విపరీతంగా ప్రచారం చేసుకున్నారు. కానీ మనం అలా చేసుకోలేకపోతున్నాం. ఈ విషయంలో నాతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులందరూ విఫలమైనట్టే. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రులు వారానికో రోజైనా తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించాలి. స్థానిక నేతలు, కార్యకర్తలకు భరోసా ఇవ్వాలి. తామున్నామనే ధీమా కల్పించాలి. ముఖ్యమైన నేతలను కలెక్టర్లు, ఎస్పీలకు పరిచయం చేయాలి.

18,19, 20, 21 తేదీల్లో సంబురాలు

రైతు రుణమాఫీపై 18,19 తేదీల్లో మండల కేంద్రాల్లో, 20, 21 తేదీల్లో గ్రామాల్లో సంబురాలు చేయాలి. అంబేడ్కర్ చౌరస్తాల నుంచి రైతు వేదికల వరకు మోటార్‌సైకిల్, ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ర్యాలీలు నిర్వహించాలి. గతంలో మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దేశ వ్యాప్తంగా రూ.71 వేల కోట్లు రైతు రుణమాఫీ చేస్తే ఇప్పుడు తెలంగాణలో రూ.31 వేల కోట్లు చేస్తున్నాం. తెలంగాణ మోడల్‌పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి. ఆ బాధ్యతను ఎంపీలు తీసుకోవాలి.'అని సీఎం చెప్పినట్లు సమాచారం.

నేడే లక్ష రుణమాఫీ

- ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు
- లబ్ధిదారులతో మాట్లాడనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- 500 రైతు వేదికల్లో సంబురాలు

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ ప్రక్రియలో మొదటి విడతగా గురువారం రూ.లక్ష వరకు రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేయనుంది. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులు బుధవారం ఇందుకు సంబంధించి ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ఆధ్వర్యంలో ఈ ట్రయల్ రన్ జరిగింది. రుణమాఫీ ప్రక్రియ సజావుగా జరిగేందుకు దీనిని నిర్వహించారు. అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూసుకున్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాగానే రాష్ట్ర వ్యాప్తంగా 500 రైతు వేదికల్లో సంబురాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణమాఫీ నిధులను విడుదల చేసిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆన్‌లైన్‌లో రైతులతో మాట్లాడనున్నారు.

కొన్ని గ్రామాల్లో గందరగోళం

రైతు వేదికల్లో వేడుకలకు సంబంధించి స్థానిక అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి గ్రామం నుంచి రైతులను తరలించనున్నారు. ఇలావుండగా రుణమాఫీకి సంబంధించి అధికారులు రూపొందించిన జాబితాపై అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో గందరగోళం నెలకొంది. జాబితాలో తమ పేర్లు లేవంటూ కొందరు రైతులు ఫిర్యాదు చేస్తున్నారు.

ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయం

- పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలయ్యే వరకు నిద్రపోం
- సుప్రీంకోర్టులో కూడా పోరాడతాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలోని భారతీనగర్ కార్పొరేటర్ సింధు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యే వరకు తాము నిద్రపోమన్నారు. ఆ ఎమ్మెల్యేలు వెళ్లిపోయినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీకి నష్టం లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందన్న వాళ్లు ఆ తరువాత అడ్రస్ లేకుండా పోయారన్నారు. గతంలో పార్టీలు మారితే రాళ్లతో కొట్టండి అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ఇప్పుడు ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని హైకోర్టులో కేసు వేశామని తెలిపారు. దీనిపై త్వరలో సుప్రీం కోర్టుకు వెళ్లి పోరాడతామన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా అందుకు కార్య కర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పరిపాలన స్తంభించిందని, ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం రేషన్‌కార్డు ఆధారంగా రైతులకు రుణమాఫీ చేస్తామని ఉంటే, తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి పాస్‌బుక్ ఉంటే సరిపోతుందని నోటి మాటగా చెబుతున్నారన్నారు. ఆయన చెప్పిన మాటలనే జీవోగా తెచ్చి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరగలేని పరిస్థితి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఐదేళ్లకు మించి ఏ రాష్ట్రంలో అధికారంలో లేద న్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాల్గొన్నారు.

హరీశ్.. టీఆర్ఎస్



టీఆర్ఎస్ కండువాతో మాజీమంత్రి హరీశ్‌రావు సందడి చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్ కండువాతో హరీశ్ కనిపించడం చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా మార్చే అవకాశం ఉందా? అని స్థానిక కార్యకర్తలు, స్థానికులు చర్చించుకుంటున్నారు.

➢ During the Year, Banks have disbursed Short Term Production Loans amounting to **Rs.64,940** crores achieving **88.42%** of the annual targets.

ఈ ఏడాది స్వల్పకాలిక రుణాల కోసం రూ. 64,940 కోట్లను మంజూరు చేసినట్లు పేర్కొన్న బ్యాంకర్ల సమితి

మాఫీ 'లెక్క' మారిందా?

▶ మొదటి పేజీ తరువాయి

గణాంకాలు చెప్తున్నాయి. పైగా గత ఐదేళ్లలో రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది కూడా. అయినా రుణమాఫీ సొమ్ము మూడో వంతుకు తగ్గడం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి.

జిల్లాలకు 'మాఫీ' రైతుల జాబితాలు

రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో రూ.లక్ష వరకు రుణమాఫీ సొమ్మును గురువారం రోజున రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. 11.50 లక్షల మంది రైతులకు దాదాపు రూ.7 వేల కోట్లు జమ చేస్తామని తెలిపింది. ఈ మేరకు రైతుల జాబితాను జిల్లాలకు పంపించింది. వీరంతా లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకున్న రైతులే. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లా అధికారులకు అందిన సమాచారం ప్రకారం.. రూ.లక్ష మాఫీ అవుతున్న రైతులు 459 మంది ఉన్నారు. మిగతావారికి అంతకన్నా తక్కువ రుణాలు ఉన్నాయి.

గత సర్కారు రుణమాఫీ లెక్కలతో..

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.లక్ష వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని బీఆర్ఎస్ (టీఆర్ఎస్) హామీ ఇచ్చింది. ఇందుకోసం మొత్తంగా 36.68 లక్షల మంది రైతులకు రూ.19,198.38 కోట్ల మేర అవసరమని తేల్చింది. అంతకుముందు 2014లోనూ అప్పటి టీఆర్ఎస్ సర్కారు రూ.లక్ష రుణమాఫీ ప్రకటించి.. 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్లు మాఫీ చేసింది. మరోవైపు ఈసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మొత్తం 39లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసేందుకు సుమారు రూ.31 వేల కోట్లు అవసరమని అంటోంది. అయితే.. 2018 నాటి రూ.లక్ష రుణమాఫీ కోసం రూ.19 వేల కోట్లకుపైగా అవసరమవగా.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు అదే రూ.లక్ష వరకు రుణమాఫీ కోసం కేవలం రూ.7 వేల కోట్లనే లెక్క వేయడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గత ఐదేళ్లలో భారీగా పెరిగిన పంట రుణాలు

గత ఐదేళ్లలో పంట రుణాలు భారీగా పెరిగినట్టు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) నివేదిక స్పష్టం చేస్తోంది. 2020-21లో రూ.41,200 కోట్లు, 2021-22లో రూ.42,853 కోట్లు, 2022-23లో రూ.59,060 కోట్లు, 2023-24లో రూ.64,940 కోట్లు రుణాలు ఇచ్చినట్టు తెలిపింది. సర్కారు రుణమాఫీకి నిర్ణయించిన కటాఫ్ ప్రకారం చూస్తే.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నాటికి రైతులు తీసుకున్న రుణాలు రూ.49,500 కోట్లు కావడం గమనార్హం. బ్యాంకర్లు చెప్తున్న వివరాల ప్రకారం ఏటా రైతుల నుంచి రుణాల రికవరీ దాదాపు 90శాతం వరకు ఉంటుంది. కానీ తాము గెలిస్తే రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ 2022లోనే ప్రకటించిన నేపథ్యంలో.. 2023-24లో తీసుకున్న రుణాలను రైతులు చెల్లించి ఉండరని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. అంటే 2022-23లో తీసుకున్న రుణాల్లో కొంత మేరకు, 2023-24లో డిసెంబర్ వరకు తీసుకున్న రుణాల్లో చాలా వరకు చెల్లించకుండా ఉన్నాయని బ్యాంకుల సిబ్బంది చెప్తున్నారు. అంటే ఏ రకంగా చూసుకున్నా.. దాదాపు రూ.49 వేల కోట్ల మేరకు పంట రుణాల బకాయిలు ఉంటాయని అంచనా. రాష్ట్ర సర్కారు మాత్రం రూ.2 లక్షల వరకు రుణాల మాఫీ కోసం రూ.31 వేల కోట్లే అవసరమని వాదిస్తోంది. పీఎం కిసాన్ నిబంధనలు, పాస్‌బుక్కులు, రేషన్‌కార్డుల నిబంధనల వల్ల అర్హులైన రైతుల సంఖ్య బాగా తగ్గి ఉంటుందని.. మాఫీ సొమ్ము అందుకు తక్కువై ఉంటుందని రైతు సంఘాల నేతలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. రైతులందరికీ రూ.2 లక్షలు మాఫీ చేస్తామన్న సర్కారు.. ఇప్పుడు నిబంధనలు ఎందుకు పెడుతోందని ప్రశ్నిస్తున్నారు.

రుణమాఫీకి నిధుల అన్వేషణలో సర్కారు!

ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేస్తామన్న సర్కారు.. అందుకు అవసరమైన నిధుల సమీకరణ కోసం అన్నిరకాల మార్గాలను అన్వేషిస్తోంది. నిధులు పూర్తి స్థాయిలో సమకూరకపోవడంతోనే మూడు దశల్లో మాఫీ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ)కు చెందిన భూములు అభివృద్ధి చేసి, తనఖా పెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే మర్చంట్ బ్యాంకర్ల నుంచి రుణాల కోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)ను జారీ చేసింది. ఇక రాష్ట్రంలోని డీసీసీబీలు, ప్యాక్స్‌కు మూలధనం సమకూర్చి బలోపేతం చేసుకుంటామని చెప్పి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.5 వేల కోట్ల రుణం కోసం తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. మద్యం డిస్టిలరీలకు బ్రూవరీస్ కార్పొరేషన్ చెల్లించాల్సిన బిల్లులను 5 నెలలుగా ఆపి ఉంచినట్టు తెలిసింది, ఈ సొమ్మును రుణమాఫీకి మళ్లించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఆ మొత్తం ఐదారు వేల కోట్లు ఉంటుందని అంచనా. మరోవైపు ఈసారి రైతు భరోసా కింద చెల్లించాల్సిన నిధులను కూడా రుణమాఫీకి మళ్లించినట్టు చర్చ జరుగుతోంది. ఎఫ్ ఆర్ బీఎం పరిధిలో తీసుకోగలిగిన రుణాలను కూ డా ముందస్తుగా సేకరించడం ద్వారా రూ.ఐదు వేల కోట్లు సమీకరించే ప్రయత్నాల్లో ఉన్నట్టు సమాచారం.

రుణాల మొత్తం భారీగా పెరిగినా..


రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి లెక్కల ప్రకారం.. ఈ ఏడాది మార్చి 31వరకు మొత్తం రూ.64,940 కోట్లు స్వల్పకాలిక పంట రుణాలు మంజూరు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ కోసం గత ఏడాది డిసెంబర్ 9వ తేదీని కటాఫ్‌గా తీసుకుంది. రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయడానికి రూ.31 వేల కోట్లు అవసరమని లెక్కలు వేసింది.

2018లో రుణమాఫీ జరిగిన పంట రుణాల వివరాలివీ.. (రూ.లలో)

రుణం	రైతులు	రుణాల మొత్తం
25వేలలోపు	2.96 లక్షలు	408.38 కోట్లు
25-50వేల మధ్య	5.72 లక్షలు	1,790 కోట్లు
50-75 వేల మధ్య	7 లక్షలు	4,000 కోట్లు
75 వేలు-లక్ష వరకు	21 లక్షలు	13,000 కోట్లు
మొత్తం	36.68 లక్షలు	19,198.38 కోట్లు

రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయం

రెవెన్యూ మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రైతుకు అండగా నిలవాలనే దృఢ సంకల్పంతో వారికి రుణ విముక్తి కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకేసారి రూ.లక్ష రుణమాఫీ సాధ్యం కాదని, అసలు జరగదని మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటిస్తే..ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 15 కంటే నెలరోజులు ముందే హామీని అమలు చేసి నిబద్ధతను చాటుకున్నామన్నారు.


అధిష్టానం పరిధిలో మంత్రివర్గ విస్తరణ

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



చౌటుప్పల్: రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ అంశం అధిష్టానం పరిధిలో ఉందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని అధిష్టానమే చూసుకుంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అధిష్టానంతో చర్చించి నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఆయన బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని దేవలమ్మనాగారంలో విలేకరులతో మాట్లాడారు. సరైన అభ్యర్థులు, ప్రజలకు సేవ చేయాలనే తపన, అంకితభావం ఉన్నవారికి పదవి లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

కోతలు పెట్టడం వల్లే రుణమాఫీ సొమ్ము తగ్గింది




గత ప్రభుత్వంలో లక్ష రూపాయల రుణమాఫీ కోసమే రూ.19 వేల కోట్లు ఖర్చు లెక్క తేల్చారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణమాఫీకి రూ.7 వేల కోట్లే చెప్తోంది. గతం కంటే ఇప్పుడు రుణమాఫీ సొమ్ము పెరగాల్సి ఉన్నా.. తగ్గటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వివిధ నిబంధనలతో రుణమాఫీ సొమ్ముకు కోతలు పెట్టడం వల్లే ఇలా జరిగింది. రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబాలను గుర్తించాలని సర్కారు నిర్ణయించింది. విమర్శలు రావడంతో.. రేషన్‌కార్డుతో సంబంధం లేదని ప్రభుత్వ పెద్దలు చెప్పారు. కానీ జీవోను మాత్రం సవరించలేదు. అలాగే పీఎం కిసాన్ నిబంధనలు, రీషెడ్యూల్ చేసుకున్న రుణాలకు మాఫీ వర్తింపజేయకపోవడం వల్ల రుణమాఫీ సొమ్ము తగ్గినట్టు అనిపిస్తోంది.

– సాగర్, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి

రాజకీయ కక్షలు, ప్రతీకార చర్యలపైనే కాంగ్రెస్ దృష్టి

మాజీ మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన గాలికి వదిలేసి రాజకీయ కక్షలు, ప్రతీకార చర్యలపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాజకీయాల్లో కక్ష సాధింపు, ప్రతీకారాలకు చోటు ఉండకూడదని కోరుకునే వ్యక్తినని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ దుష్ప్రచారాలకు దేవుడు కూడా తగిన బుద్ధి చెబుతాడని, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చివరికి సత్యమే గెలుస్తుందని వెల్లడించారు. పరిమితులు దాటి కేసీఆర్ మీద కాంగ్రెస్ దుష్ప్రచారాలకు పూనుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు తప్పు బట్టిందన్నారు. కేసీఆర్ మీద కాంగ్రెస్ సర్కార్ అధికార దుర్వినియోగంపై సుప్రీంకోర్టు చెంపపెట్టు లాంటి తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు స్వస్తి పలికి ప్ర జా సమస్యలపై దృష్టి పెట్టాలని, లేదంటే ప్రజాక్షేత్రంలో కూడా ఇలాంటి తీర్పే రావటం ఖాయమన్నారు.

ప్రైవేటు డిగ్రీ కాలేజీలపై 'న్యాక్' పిడుగు

నాన్-న్యాక్ కాలేజీల కేటగిరీ.. వచ్చే ఏడాది నుంచి అమలు

- ఇటీవల బెంగళూరు కేంద్రంగా జరిగిన కీలక సమావేశం
- ఆ నిబంధనలపై ప్రైవేటు కాలేజీల అభ్యంతరం
- న్యాక్ గుర్తింపును ఐచ్ఛికంగానే పరిగణించాలనే వాదన



సాక్షి, హైదరాబాద్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు ఇప్పటివరకు లేకున్నా ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు యూనివర్సిటీలు అనుబంధ గుర్తింపు ఇచ్చేవి. న్యాక్‌ను కేవలం నాణ్యత ప్రమాణాలకు సూచిక గానే పరిగణించేవి. రాష్ట్రంలో 1100 కాలేజీల్లో, కేవలం ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు కలిపి 200 కాలేజీలకే న్యాక్ గుర్తింపు ఉంది. కానీ ఇక మీదట ప్రతీ కాలేజీ న్యాక్ పరిధిలోకి రావాల్సిందే. ఇది ఉంటేనే అనుబంధ గుర్తింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలనే ప్రతిపాదన న్యాక్ తీసు కొస్తోంది. రాష్ట్రంలోని న్యాక్ గుర్తింపు ఉన్న (న్యాక్ కాలేజీలు), న్యాక్ గుర్తింపు లేని కాలేజీలు (నాన్-న్యాక్ కాలేజీలు)గా విభజి స్తారు. నాన్ న్యాక్ కాలేజీలకు క్రమంగా అను మతి ఇవ్వకూడదనే నిబంధన తేవాలనే యోచ నలో ఉన్నారు. ఈ మేరకు ఇటీవల బెంగళూరు కేంద్రంగా న్యాక్ విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించింది. దక్షిణ భారత రాష్ట్రాల ఉన్నత విద్య మండళ్ళ చైర్మన్లను, పలువురు విద్యారంగ నిపుణులను ఈ సమావేశాలకు ఆహ్వానించింది. న్యాక్ నిబంధనలను మరింత సరళతరం చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరించింది. కొత్త నిబంధనలపై రాష్ట్రాల స్థాయిలో అవగా హన కల్పించాలని కోరింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త రూల్స్ తీసుకొచ్చేందుకు సిద్ధమవ్వాలని సూచించింది.

90 శాతం కాలేజీలకు ఇబ్బందే!

→ మౌలిక సదుపాయాల పెంపు, ఫ్యాకల్టీ, ఫలితాలు, ఉపాధి అవకాశాలు, సొంత బిల్డింగ్ ఉందా? వంటి అంశాలకు న్యాక్ బృందం మార్కులు ఇస్తుంది. దీని ఆధారంగానే గ్రేడ్‌ను కేటాయిస్తుంది. ఎక్కువగా కార్పొరేట్ కళాశాలలు మాత్రమే ఈ ర్యాంకులు పొందుతున్నాయి. కాగా, ఇప్పటి వరకూ న్యాక్ బృందాలు కళాశాలలను స్వయంగా పరిశీలించిన తర్వాతే గుర్తింపు ఇచ్చేవి. అలా కాకుండా ఆన్‌లైన్‌లోనూ పరిశీలించి అనుమతులు ఇవ్వాలని భావిస్తున్నారు. అయితే న్యాక్ నిబంధనలు అమలు చేయాలంటే 90 శాతం కళాశాలలు ఇబ్బందిపడే అవకాశం ఉంది. కార్పొరేట్ కళాశాలలు మాత్రమే దీనివల్ల విస్తరిస్తాయనే విమర్శలొస్తున్నాయి. దాంతో న్యాక్ నిబంధనల్లో కొంత సడలింపు ఇవ్వాలని మండళ్ళ చైర్మన్లు ప్రతిపాదిస్తున్నారు.



నాణ్యత లక్ష్యంగా సడలింపులు

న్యాక్ నిబంధనల్లో సమూల మార్పులు చేసేందుకు న్యాక్ కౌన్సిల్ ప్రతిపాదించింది. దీనిపై విస్తృత స్థాయి చర్చ జరిగింది. గుర్తింపు ప్రక్రియను మరింత సరళీకృతం చేయడమే దీని ఉద్దేశం. అన్ని కాలేజీలను న్యాక్ గుర్తింపు పరిధిలోకి తేవడం, నాణ్యత పెంచడమే లక్ష్యం. – ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి (ఉన్నత విద్య మండలి చైర్మన్)

అలాగైతే ఇబ్బందే

న్యాక్ నిబంధనల పేరుతో చిన్నకాలేజీల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోంది. తెలంగాణలో నిరుద్యోగులు పెట్టుకున్న కాలేజీలు ఇప్పటికే అనేక ఇబ్బందుల్లో ఉన్నాయి. ఎన్నో కాలేజీలు మూతపడ్డాయి. న్యాక్ గుర్తింపును ఐచ్ఛికంగానే పరిగణించాలి.
– గౌరీ సతీశ్, అధ్యక్షుడు, రాష్ట్ర ప్రైవేటు పీజీ, డిగ్రీ కాలేజీ యాజమాన్య సంఘం

మూడు కేటగిరీల ఏర్పాటు

→ ఇక మీదట విద్యా సంస్థలను 3 కేటగిరీలుగా విభజించాలని న్యాక్ భావిస్తోంది. విశ్వవిద్యాలయాలు, అటానమస్ కాలేజీలు, అనుబంధ కాలేజీలు అనే 3 విభాగాలను గుర్తిస్తారు. కాగా, విశ్వవిద్యాలయాలు ఇప్పటికే అన్ని వసతులతో ఉంటాయి. అటానమస్ కాలేజీలూ నిధులు సమకూర్చుకోవడంలో వెనుకాడవు. కానీ అనుబంధ గుర్తింపు ఉన్న కాలేజీల్లో ఫ్యాకల్టీ, మౌలిక వసతుల ఇబ్బంది ఉందన్న వాదనలున్నాయి.



బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం టాటా చాన్స్‌లర్స్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ మురళీధరన్

'రూపవతి' సురక్షితంగా ఉంది

- అటవీ శాఖ అధికారుల వెల్లడి
- బోనాలు, మొహర్రం ఊరేగింపుల కోసం కర్ణాటక నుంచి ఏనుగును తెప్పించిన సంబంధిత ట్రస్టులు



సాక్షి, హైదరాబాద్: బోనాలు, మొహర్రం ఊరేగింపు కోసం కర్ణాటక నుంచి తీసుకువచ్చిన 'రూపవతి'ఏనుగు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. నిజాం రిలీజియస్, అక్కన్న, మాదన్న దేవాలయ ట్రస్టుల కోసం ప్రభుత్వానికి అందిన లేఖకు అనుగుణంగా కర్ణాటకలోని దావణగెరెలోని శ్రీ జగద్గురు పంచాచార్య మందిర్ ట్రస్ట్ నుంచి ఈ ఏనుగును తీసుకువచ్చినట్లు తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం, నిబంధనలకి లోబడే ఏనుగును సురక్షితంగా తీసుకొచ్చినట్లు ఓ ప్రకటనలో తెలియజేశారు. కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చే క్రమంలో 'మొఖా'అనే ప్రదేశంలో ఏనుగుకు మొదటిసారి వెటర్నరీ వైద్య బృందం, అలాగే రాష్ట్ర పశుసంవర్ధక శాఖకి చెందిన వైద్యులు మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించారన్నారు. పశువైద్య బృందం ఈ ఏనుగు ఆరోగ్య పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం దాని శారీరక ఆరోగ్య పరిస్థితి, ప్రవర్తన సాధారణంగా ఉన్నట్లు ధ్రువీకరించారని తెలిపారు. ప్రస్తుతం ఈ ఏనుగు వెటర్నరీ వైద్యుల సంరక్షణలో పురానా హవేలీ ప్రాంతంలో సురక్షితంగా ఉందని స్పష్టంచేశారు. ఇదిలా ఉంటే.. మతపరమైన ఊరేగింపుల కోసం ఇక్కడకు తీసుకొచ్చిన ఏనుగు విషయంలో సంబంధిత వ్యక్తులు నిర్దేశిత మార్గదర్శకాలను సరిగా అమలు చేయడం లేదని జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఊరేగింపుల కోసం తెల్లవారుజామున లేదా సాయంత్రాల్లో స్వల్ప దూరాలకే ఏనుగులను ఉపయోగించాల్సి ఉందని వారు చెబుతున్నారు. ఊరేగింపుల సందర్భంగా ఏనుగుకు, ప్రజలకు మధ్య కనీసం పది మీటర్ల దూరం పాటించాల్సి ఉండగా అది జరగడం లేదంటున్నారు. 14వ తేదీన తీసుకువచ్చిన ఈ ఏనుగు ఈ నెల 29వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఉంటున్నందున.. తదుపరి జరిగే బోనాల ఊరేగింపు సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు.

రేవంత్, భట్టి చిత్రపటాలకు పాలాభిషేకం

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ప్రజాభవన్‌లో కాంగ్రెస్ నేతల సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్ పాల్గొన్నారు.

ఊరూరా రుణమాఫీ వేడుకలు :పొన్నం
ప్రజా భవన్ వద్ద రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ భారతదేశ చరిత్రలోనే ఒక రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఒకేసారి చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రైతు వేదికల వద్ద ఊరూరా రుణమాఫీ వేడుకలు నిర్వహించాలని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు మంత్రి పొన్నం పిలుపునిచ్చారు. రైతు రుణమాఫీ చేయడం పట్ల టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

సీఎస్‌ఈకే ప్రాధాన్యం

- ఎన్‌ఐటీల్లో పెరిగిన పోటీ.. ఐఐటీల్లో తగ్గిన జోష్
- ఐదవ విడత జోసా సీట్ల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీకి జోసా (జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ) నిర్వహించిన కౌన్సెలింగ్‌లో భాగంగా బుధవారం ఐదవ విడత సీట్ల కేటాయింపు పూర్తిచేసింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో సీట్ల భర్తీకి ఇది చివరిదశ. ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ఇంకా రెండు విడతల సీట్ల కేటాయింపు చేపడతారు. దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో 17,740 సీట్లు భర్తీ చేశారు. 31 ఎన్‌ఐటీల్లో 24,226, దేశంలోని 26 ట్రిపుల్ ఐటీల్లో 8,546 సీట్లు, ఇతర సంస్థలు కలుపుకొని మొత్తం 60 వేల ఇంజనీరింగ్ సీట్లు భర్తీ చేశారు. జోసా కౌన్సెలింగ్‌లో ఈసారి 121 కాలేజీలు పాల్గొన్నాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు పొందిన వారికి ఐఐటీల్లో, జేఈఈ మెయిన్ ర్యాంకు ఆధారంగా ఇతర జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు.

కలిసొచ్చిన కటాఫ్... సీట్ల పెరుగుదల

ఈసారి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కటాఫ్ పెరిగింది. దీంతో పాటు ఐఐటీల్లో అదనంగా వెయ్యి సీట్లు కొత్తగా చేర్చారు. ఫలితంగా గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ ర్యాంకులు వచ్చినా సీట్లు దక్కించుకునే అవకాశం లభించింది. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీ (నిట్)ల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మంచి ర్యాంకులు వచ్చిన విద్యార్థులు ఐఐటీల్లో ఏదో ఒక బ్రాంచీలో సీటు పొందే ఆలోచనకు దూరంగా ఉన్నారు. తాము కోరుకున్న సీటు ఎన్‌ఐటీల్లో పొందవచ్చని భావించారు. ఫలితంగా నిట్ వంటి సంస్థల్లో సీఎస్‌ఈకి ఈసారి ఎక్కువ పోటీ కనిపించింది. దీంతోపాటు రాష్ట్రస్థాయిలో ఉండే మంచి కాలేజీల వైపు జేఈఈ ర్యాంకర్లు కూడా మళ్లుతున్నారు. ఐఐటీ అడ్వాన్స్‌డ్ రాసినవారి సంఖ్య గతం కన్నా బాగా పెరిగింది. ఈ కారణంగానూ ఈసారి ఐఐటీ సీట్లు పొందే కటాఫ్ పెరిగింది. కానీ కౌన్సెలింగ్‌లో విద్యార్థుల పోటీ మాత్రం ఐఐటీల్లో అంతంత మాత్రంగానే ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో ఈ తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

సీఎస్‌ఈ రాకుంటే ఐఐటీల్లో చేరడం లేదు

అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు వచ్చినా విద్యార్థులు ఎన్‌ఐటీల్లో సీట్ల కోసమే ప్రయత్నిస్తున్నారు. ఐఐటీల్లో సీఎస్‌ఈలో సీటు వస్తే చేరేందుకు ఇష్టపడుతున్నారు. కానీ ఇతర బ్రాంచీల్లో సీటు వచ్చినా ఇష్టపడటం లేదు. వీరంతా ఎన్‌ఐటీల్లో, రాష్ట్ర టాప్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల కోసం వెళుతున్నారు. ఈ కారణంగానే ఐఐటీల్లో గత ఏడాదికన్నా ఎక్కువ ర్యాంకు వచ్చిన వారికి సీట్లు వచ్చాయి. ఎన్‌ఐటీల్లో మాత్రం పోటీ తీవ్రంగానే కనిపిస్తోంది. – ఎంఎన్.రావు, గణిత శాస్త్ర నిపుణుడు

ప్రధాన ఐఐటీల్లో గత ఏడాది.. 2024లో సీఎస్‌ఈ ఓపెన్ కేటగిరీలో సీట్లు వచ్చిన ర్యాంకులు

ఐఐటీ	2024 బాలురు	2024 బాలికలు	2023 బాలురు	2023 బాలికలు
ముంబై	68	421	67	291
కాన్పూర్	252	1117	238	610
ఖరగ్‌పూర్	415	1661	279	702
ఢిల్లీ	116	556	118	419
మద్రాస్	159	757	148	479
హైదరాబాద్	656	1,809	674	1300
తిరుపతి	5,024	6,324	3,701	6,558
రూర్కీ	481	1,870	412	1,165
పాలక్కాడ్	6,199	9,127	5,162	9,104
భిలాయ్	6,516	11,544	5,791	11,200
గోవా	5,371	11,151	4,732	7,646
ధవాడ్	6,375	11,138	5,978	10,825
జమ్మూ	6,310	12,108	4,856	9,840

ప్రధాన నిట్‌లలో గత ఏడాది, ఈ సంవత్సరం ఓపెన్ కేటగిరీలో సీఎస్‌ఈ సీట్లు వచ్చిన చివరి ర్యాంకులు

ఎన్‌ఐటీలు	2024 బాలురు	2024 బాలికలు	2023 బాలురు	2023 బాలికలు
వరంగల్	2,804	4,683	3,115	4,530
తిరుచి	1,224	2,172	1,509	2,086
సూరత్‌కల్	1,615	2,433	1,984	3,298
క్యాలికట్	4,482	8,068	5,256	6,850
తాడేపల్లిగూడెం	18,548	24,130	17,272	23,150
జలంధర్	10,957	17,015	11,017	17,138
అగర్తల	20,298	35,092	20,102	31,404
మిజోరం	33,181	43,362	31,326	38,582
మణిపూర్	30,611	43,862	29,644	44,910



దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 2.79 లక్షలు

పరీక్షా కేంద్రాలు 56

అన్నిచోట్లా సీసీ కెమెరాల నిఘా..

నేటినుంచే డీఎస్సీ

- 11,062 టీచర్ పోస్టులకు పరీక్ష..తొలిసారిగా ఆన్‌లైన్‌లో..
- రోజుకు రెండు షిఫ్టుల్లో ఆగస్టు 5 వరకు నిర్వహణ

ఆరేళ్ల తర్వాత ఉపాధ్యాయ నియామక ప్రక్రియ షురూ

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) గురువారం నుంచి మొదలు కానుంది. వచ్చే నెల 5 వరకు ఈ పరీక్ష జరుగుతుంది. అయితే మధ్యలో 6 రోజుల పాటు సెలవులు ఉన్నాయి. మొత్తం 11,062 టీచర్ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం 2,79,957 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తు గడువు పొడిగించడంతో ఇటీవల టెట్ అర్హత పొందిన 48 వేల మంది కూడా వీరిలో ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పరీక్షకు 1.60 లక్షల మంది, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ (ఎస్జీటీ) పోస్టుల కోసం 80 వేల మంది దరఖాస్తు చేశారు. మిగతా వారిలో భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులున్నారు. తొలిసారిగా కంప్యూటర్ బేస్డ్ (ఆన్‌లైన్)గా జరిగే ఈ పరీక్ష కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మొత్తం 56 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా..ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 27 కేంద్రాలున్నాయి. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

బయో మెట్రిక్ హాజరు: అభ్యర్థులకు బయో మెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయనున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని విద్యాశాఖ సూచించింది. ప్రతి రోజూ రెండు షిఫ్టులుగా పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకూ ఒక విడత, సాయంత్రం 2 నుంచి 4.30 గంటల వరకు మరో విడత ఉంటుంది. జూలై 21, 27, 28, 29, ఆగస్టు 3, 4 తేదీల్లో పరీక్ష ఉండదు. ఎస్‌ఏ పరీక్షను జూలై 18, 20, 22, 24, 25, 30, 31, ఆగస్టు 1, 2 తేదీల్లో చేపడతారు. పీఈటీ పరీక్షను జూలై 18, 26 తేదీల్లో నిర్వహిస్తున్నారు. భాషా పండితులకు జూలై 26, ఆగస్టు 2, 5 తేదీల్లో డీఎస్సీ ఉంటుంది. పీఈటీలకు ఆగస్టు 5న, ఎస్జీటీలకు జూలై 19, 22, 23, 26, ఆగస్టు 1వ తేదీన పరీక్ష ఉంటుంది. స్పెషల్ ఎడ్యుకేషన్‌కు జూలై 20న నిర్వహిస్తారు.

ఆరేళ్ల తర్వాత..: ఉమ్మడి రాష్ట్రంలో 2012 ఆగస్టు 27, 28, 29 తేదీల్లో డీఎస్సీ నిర్వహించారు. చివరిసారిగా 2018 ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు టీచర్స్ రిక్రూట్‌మెంట్ (టీఆర్‌టీ) పేరుతో జరిగింది. ఆరేళ్ల తర్వాత మళ్లీ డీఎస్సీ జరుగుతోంది. దీంతో నిరుద్యోగులు ఈ పోస్టులపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. వాస్తవానికి 2023లో 5 వేల పోస్టులకు డీఎస్సీ నిర్వహించాలనుకున్నా వివిధ కారణాల వల్ల ఆగిపోయింది.

వివాదాల మధ్య..: రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో దాదాపు 22 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటినీ భర్తీ చేస్తారని భావించినా కేవలం 11,062 పోస్టులకే డీఎస్సీ నిర్వహిస్తున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన దగ్గర్నుంచీ రకరకాల వివాదాలు చుట్టుముట్టాయి. ఖాళీలన్నీ డీఎస్సీలో చేర్చాలని నిరుద్యోగులు పట్టుబట్టారు. ఆ తర్వాత టెట్ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో డీఎస్సీ నిర్వహణకు మరికొంత సమయం ఇవ్వాలన్న డిమాండ్ తెరమీదకొచ్చింది. టెట్, డీఎస్సీ సిలబస్ వేరని, ఇప్పటికిప్పుడు పరీక్ష చేపడితే సన్నద్ధత కష్టమని కొత్తగా టెట్ ఉత్తీర్ణులైనవారు ఆందోళనకు దిగారు. కొంతమంది కోర్టును కూడా ఆశ్రయించారు. హాల్ టికెట్ల డౌన్‌లోడ్ సమయంలో కూడా డీఎస్సీ నిర్వహణపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికీ 20 శాతం మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోలేదు. వీరిలో కోర్టును ఆశ్రయించిన వాళ్ళు కూడా ఉన్నారు. న్యాయస్థానం చివరి నిమిషంలో తమకు అనుకూలంగా ఆదేశాలు ఇస్తుందనే ఆశతో వీరు ఉన్నారు. అయితే డీఎస్సీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం గురువారం నుంచి పరీక్ష నిర్వహణకు సిద్ధమైంది.

నిలకడగానే ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యం!

పెండింగ్‌లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, గైనిక్ పరీక్షల ఫలితాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్టు తెలిసింది. మూడు రోజుల వ్యవధిలో రెండుసార్లు ఆస్పత్రికి తరలించడంపై కుటుంబ సభ్యు లు, బీఆర్‌ఎస్ నేతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం కవితకు నిర్వహించిన వివిధ వైద్య పరీక్షల నివేదికను దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఆస్పత్రి వర్గాలు తిహార్ జైలు అధికారులకు ఇంకా అందజేయలేదని సమాచారం.

జైలులో సరైన వసతులు లేకే..

జైలులో సరైన వసతులు లేకపోవడం, దోమల వృద్ధి, కొద్దిరోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు, ఇంటి భోజనం చేయని కారణంగా కవిత జ్వరంతో బాధ పడుతున్నట్టు తెలిసింది. నాలుగు రోజుల క్రితం తొలుత ఆస్పత్రికి తీసుకొచ్చిన తిహార్ జైలు అధికారులు రక్త పరీక్షలు చేయించిన అనంతరం మళ్లీ జైలుకు తరలించారు. మంగళవారం మరోసారి తీవ్ర అస్వస్థతకు గురవడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, రక్త పరీక్షలు చేశారు. గైనిక్ సమస్యతో కవిత కొంత కాలంగా బాధపడుతున్న నేపథ్యంలో ఆ టెస్టు కూడా చేశారు.

కోర్టుకు వైద్య పరీక్షల నివేదిక

గురువారం ఉదయం 10–11గంటల మధ్య దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఆస్పత్రి వర్గాలు కవిత వైద్య పరీక్షల నివేదిక ఇస్తారని తిహార్ జైలు అధికారులు పేర్కొన్నారు. ఆ టెస్ట్ రిపోర్టులను మధ్యాహ్నం 12గంటల సమయంలో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తికి అందజేసే అవకాశముంది.

ఆర్.నారాయణమూర్తికి అస్వస్థత

నిమ్స్ డైరెక్టర్ బీరప్ప నేతృత్వంలో చికిత్స



లక్డీకాపూల్(హైదరాబాద్): ప్రముఖ నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. ఆయన ఆరోగ్యం స్వల్పంగా దెబ్బతినడంతో బుధవారం ఆయనను సన్నిహితులు నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు నిమ్స్ డైరెక్టర్ డా.బీరప్ప పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడ గానే ఉందని వైద్యులు తెలిపారు.

నారాయణ మూర్తికి మెరుగైన వైద్యం: మంత్రి దామోదర
ఆర్.నారాయణమూర్తి ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో ఫోన్‌లో మాట్లాడారు. మెరుగైన చికిత్సను అందించాలని సూచించారు.

ఆరోగ్యంగానే ఉన్నా: ఆర్.నారాయణమూర్తి
తన ఆరోగ్యం గురించి అభిమానులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. నిమ్స్‌లో చికిత్స తీసుకుంటున్నానని, దేవుడి దయతో కోలుకుంటున్నానని తెలిపారు.

8,600 మంది కొత్త టీచర్లు

- గురుకులాల్లో నియామకానికి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి
- రెండురోజుల్లో వెబ్ కౌన్సెలింగ్.. ఆన్‌లైన్‌లో ఆప్షన్ల ఎంపిక
- సబ్జెక్టుల వారీగా షెడ్యూల్

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థలు కొత్త టీచర్లతో కళకళలాడనున్నాయి. వచ్చేవారంలో ఏకంగా 8,600 మంది విధుల్లో చేరనున్నారు. ఇప్పటికే వీరంతా నియామక పత్రాలు అందుకుని దాదాపు 4 నెలలు కావొస్తోంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టింగ్ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగినా, ప్రస్తుతం ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను అన్ని గురుకుల సొసైటీలు పూర్తి చేశాయి. 2,3రోజుల్లో వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఆ తర్వాత పోస్టింగ్ ఇచ్చేలా గురుకుల సొసైటీలు కార్యాచరణ రూపొందించాయి. ప్రస్తుతం ఎస్సీ గురుకుల సొసైటీ మినహా మిగతా సొసైటీల్లో బదిలీల ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఈ నెల 20వ తేదీనాటికి బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం డెడ్‌లైన్ విధించగా, ఆలోపు అన్ని కేటగిరీల్లో బదిలీల పూర్తికి చర్యలు వేగవంతం చేశాయి.



బదిలీలు పూర్తి కాగానే...

కొత్తగా రాబోయే గురుకుల టీచర్లకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిర్వహించాలని గురుకుల సొసైటీలు ఇప్పటికే నిర్ణయించాయి. ఈ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసి ఖాళీల జాబితాను సిద్ధం చేశాయి. ప్రస్తుతం అన్ని సొసైటీల్లో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఎస్టీ, మైనారిటీ, జనరల్ గురుకుల సొసైటీల్లో రెండ్రోజుల్లో బదిలీలు పూర్తవుతాయి. బీసీ గురుకుల సొసైటీలో శనివారం నాటికి పూర్తయ్యే అవకాశముంది. ఎస్సీ గురుకుల సొసైటీలో పలు కేటగిరీలు పెండింగ్‌లో ఉండడంతో నిర్దేశించిన తేదీల్లోగా పూర్తయ్యే అవకాశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఎస్సీ గురుకుల సొసైటీలో రాత్రింబవళ్లు బదిలీల ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఇవి పూర్తయిన వెంటనే కొత్త టీచర్లకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిర్వహించాలని భావిస్తున్నాయి. ఇప్పటికే ఆయా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. వెబ్‌కౌన్సెలింగ్ ప్రారంభమైన వెంటనే వారికి లాగిన్ ద్వారా ఆప్షన్లు ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. అన్ని కేటగిరీల టీచర్లకు వెబ్‌ఆప్షన్లకు గరిష్టంగా రెండ్రోజుల సమయం ఇవ్వాలని సొసైటీలు భావిస్తున్నాయి. ఆ తర్వాత ఆప్షన్ల ఫ్రీజింగ్ అనంతరం పోస్టింగ్ ఉత్తర్వులు కూడా ఆన్‌లైన్ ద్వారానే జారీ చేసేలా సాంకేతికను సిద్ధం చేశారు. పోస్టింగ్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని, పూర్తిగా మెరిట్ ఆధారంగానే ప్రాధాన్యం ఇవ్వాలని సొసైటీలు నిర్ణయించి వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని ఎంపిక చేసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

జీవితం అని పిలవబడే ఈ అనంతమైన రంగస్థలంలో ప్రతి ఒక్కరూ తమ పాత్రను పోషించే దివ్యమైన హక్కును కలిగివున్నారు.
– బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 18 జూలై 2024

జనశక్తి... శ్రమయుక్తి...

సగం నీళ్ళున్న గాజు గ్లాసును చూసి... సగం నిండుగా ఉందని ఆశావహ దృక్పథం అవలంబించవచ్చు. సగం ఖాళీయే అని నిరాశ పడనూవచ్చని మనస్తత్వ శాస్త్రవేత్తలు చెబుతారు. ప్రపంచ జనాభా గురించి, అందులోనూ భారత జనాభా పొంగు కుంగుల గురించి తాజాగా వెల్లడైన లెక్కల్ని చూసినప్పుడు సరిగ్గా ఇలాగే ఎవరి ఆలోచనలు, అంచనాలు వారివి. ఐక్యరాజ్యసమితి (ఐరాస) గత వారం విడుదల చేసిన 'ప్రపంచ జనాభా దృశ్యం' (డబ్ల్యూపీపీ) నివేదికలోని సమాచారం విస్తృత చర్చనీయాంశమైంది అందుకే! ప్రాథమికంగా ఈ నివేదిక ప్రపంచ జనసంఖ్య ఎలా మారనున్నదీ అంచనా వేసి, వివిధ ప్రాంతాలు, దేశాలపై దాని ప్రభావం ఎలా ఉండనుందో భవిష్యత్ దర్శనం చేస్తోంది. ప్రపంచ జనాభా గణనీయంగా పెరగనుందనీ, 2080ల నాటికి 1000 కోట్లు దాటుతుందనీ నివేదిక అంచనా. ఆ తరువాత నుంచి మొత్తం మీద జనాభా క్రమంగా తగ్గుతుందట. అలాగే, ఇప్పటికే ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశమని పేరుబడ్డ మన భారత్ గురించి కూడా ఈ నివేదిక కీలక అంచనాలు కట్టింది. ఫలితంగా ఈ నివేదిక ఆసక్తి రేపి, ఆలోచనలు పెంచుతోంది.

అసలు 2011 తర్వాత మనం దేశంలో అధికారిక జనగణన జరగనే లేదు. దశాబ్దానికి ఒకసారి జరిపే కీలకమైన ఈ ప్రక్రియ నిజానికి 2021లోనే జరగాల్సి ఉంది. కరోనా కాలంలో ఈ బృహత్తర ప్రయత్నాన్ని ప్రభుత్వం పక్కనపెట్టింది. ఆ మహమ్మారి కథ ముగిసిన ఇన్నేళ్ళ తరువాత కూడా ఎందుకనో దానికి మోక్షం కలగనే లేదు. దేశ జనాభా స్థితిగతులపై స్పష్టమైన అవగాహన కల్పించి, పాలకులకూ, సంక్షేమ పథకాలకూ ఒక దిక్సూచిగా నిలవగలిగిన జనగణనపై ప్రభుత్వం ఎందుకనో ఇప్పటికీ ఉదాసీనత చూపుతోంది. ఈ పరిస్థితుల్లో ఐరాస వెలువరించిన ప్రతిష్ఠాత్మక డబ్ల్యూపీపీ నివేదిక మనకు మార్గదర్శి. లింగ, వయో భేదాల వారీగా వచ్చే 2100 వరకు భారత జనాభా ఎలా ఉండవచ్చనే అంచనాలను ఈ నివేదిక వివరంగా పేర్కొంది. జనసంఖ్యా సంబంధమైన సమాచారంలో ఈ ఐరాస నివేదిక ప్రపంచంలోనే అత్యంత ప్రామాణికమైనది కాబట్టి, సరిగ్గా ఉపయోగించుకుంటే భవిష్యత్ వ్యూహ రచన విషయంలో మన పాలకులకు ఇది బాగా పనికొస్తుంది.

అధికారిక లెక్కలు లేకపోయినా, గడచిన 2023 జనవరి – జూలై నెలల మధ్యలోనే ప్రపంచంలోకెల్లా అత్యధిక జనాభా గల దేశంగా భారత్ అవతరించినట్టు వార్తలొచ్చాయి. గత వారపు ఐరాస లెక్క ప్రకారం ప్రస్తుతం మన దేశ జనాభా 145 కోట్లు. సమీప భవిష్యత్తులోనూ జనసంఖ్య విషయంలో చైనా కన్నా భారతే ముందుండనుంది. 2060లలో కానీ భారత జనాభాలో తగ్గుదల మొదలు కాదు. పెరుగుతున్న ఈ జనాభా తీరుతెన్నులు, మంచీచెడుల పట్ల సహజంగానే రకరకాల విశ్లేషణలు, వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. జనాభాతో పాటు పెరిగే కనీస అవసరాలను తీర్చడం అంత సులభమేమీ కాదన్నది నిజమే. అలాగని అధిక జనాభా అన్ని విధాలా నష్టమని అతిగా భయపడాల్సిన అవసరమూ లేదు. అందుబాటులో ఉండే ఈ మానవ వనరులను సవ్యంగా వినియోగించుకోగలిగితే, ఏ దేశానికైనా దాని జనసంఖ్య అయాచిత వరమే అవుతుంది. ఐరాస నివేదిక ప్రకారం 2060ల వరకు, అంటే వచ్చే నాలుగు దశాబ్దాల పాటు భారత్‌కు అధిక జనాభా తప్పదు. దాన్ని సానుకూలంగా మార్చుకొని, ఎలా దేశాభివృద్ధికి సాధనం చేసుకోవాలన్నది కీలకం.

పనిచేసే వయసు జనాభా భారత్‌లో ప్రస్తుతం 86 కోట్లుంది. 2049 వరకు ఈ సంఖ్య పెరుగుతూ పోయి, అప్పటికి వంద కోట్లు దాటుతుందట. 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని సంకల్పం చెబుతున్న మన పాలకులు నివేదికలోని ఈ అంచనాపై లోతుగా దృష్టి పెట్టాలి. పనిచేసే వయసులోని ఈ వంద కోట్ల మందిని ఎంత నిపుణులుగా తీర్చిదిద్దుతామన్నదాన్ని బట్టి దేశ పురోగతి ఉంటుంది. ఇటీవల గుజరాత్‌లో 10 ఉద్యోగాలకు 1,800 మంది – ముంబయ్‌లో 2 వేల ఉద్యోగాలకు 22 వేల మంది హాజరవడం, తొక్కిసలాట జరగడం దేశంలోని నిరుద్యోగ తీవ్రతకు మచ్చుతునక. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సమకాలీన అవసరాలకు తగ్గ నైపుణ్యాభివృద్ధిని కల్పించి, యువజనులను సరైన ఉపాధి మార్గంలో నడపడం ముఖ్యం. అలా చేయగలిగితే ఆర్థిక ముఖచిత్రమే మారిపోతుంది. లేదంటే ఇదే జనశక్తి ఆర్థిక, రాజకీయ అస్థిరతకు కారణమవుతుంది.

ప్రపంచం సంగతికొస్తే రాగల దశాబ్దాల్లో సోమాలియా, రిపబ్లిక్ ఆఫ్ కాంగో సహా ప్రధానంగా ఆఫ్రికా ప్రాంతంలో జనాభా పెరగనుంది. విలువైన సహజ వనరులకు అవి నెలవైనందున భౌగోళిక రాజకీయ ప్రాబల్యం కోసం ఘర్షణలు తలెత్తవచ్చు. మన దాయాది పాకిస్తాన్ సైతం దాదాపు 39 కోట్ల జనాభాతో అమెరికాను సైతం దాటి, ప్రపంచ జనాభాలో మూడో స్థానంతో కీలకంగా మారనుంది. ఐరాస నివేదికలో మరో కీలకాంశం – ప్రపంచ జనాభా పతాక స్థాయికి చేరడానికి రెండు దశాబ్దాల ముందే 2060ల నుంచి భారత జనాభా తగ్గడం మొదలుపెడుతుంది. అదే సమయంలో పనిచేసే వయసులోని వారి సంఖ్య 2050 నుంచే తగ్గిపోనుంది. పనిచేసే వయసు (15 నుంచి 65 ఏళ్ళు) కన్నా తక్కువ గానీ, ఎక్కువ గానీ ఉంటూ ఇతరులపై ఆధారపడేవారి నిష్పత్తి 2040 నుంచే పెరగనుంది. అంటే, నేటి యువశక్తి నైపుణ్యాలనూ, ఆర్జన మార్గాలనూ భవిష్యత్ అవసరాలకూ, ఆధారపడేవారికీ సరిపడేలా తీర్చిదిద్దడం ముఖ్యం. వృత్తివిద్యా శిక్షణ, అప్రెంటిస్‌షిప్‌లతో మన చదువుల్ని కొంత పుంతలు తొక్కించాలి. లేదంటే, ఆధారపడేవారి సంఖ్య పెరిగాక చిక్కులు తప్పవు. ఏమైనా, రాగల మూడు దశాబ్దాలు ఇటు జనశక్తి, అటు శ్రమయుక్తితో సంఖ్యాపరమైన సానుకూలత మనదే. వాటితో ముడిపడ్డ చిక్కుల్ని ఎదుర్కొంటూ, ఈ శక్తిని సమర్థంగా వినియోగించుకోవడమే సవాలు. అందులో తడబడితే... అక్షరాలా 'అమృతకాలం' దాటిపోయినట్టే!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, తిథి: శు.ద్వాదశి సా.6.13 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.2.19 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.7.07 నుండి 8.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.48 వరకు తదుపరి ప.3.07 నుండి 3.58 వరకు, **అమృత ఘడియలు:** సా.5.32 నుండి 6.41 వరకు.

సూర్యోదయం: 5.38
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

'బ్రిక్స్' పార్లమెంట్ రానున్నదా?

విశ్లేషణ



టంకశాల అశోక్

ఈ నెల 11–12 తేదీలలో జరిగిన బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ బ్రిక్స్ పార్లమెంట్ ఏర్పాటు ప్రస్తావన చేశారు. ఆ మాట విని ప్రపంచమంతా ఉలిక్కిపడింది. ఆ కొత్త సంస్థ యూరోపియన్ పార్లమెంటుకు, లేదా అసలు ఐక్యరాజ్య సమితికే పోటీ కాకున్నా సమాంతర సంస్థ కాగలదా అన్న ప్రశ్న ఉత్పన్నమయ్యింది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌కు పోటీయా అన్నట్లు ఇప్పటికే బ్రిక్స్ బ్యాంక్ ఏర్పడింది. బ్రిక్స్ దేశాల మధ్య, దానితో పాటు తమ ద్రవ్య మారకాలను అంగీకరించే దేశాలతో అమెరికన్ డాలర్ బదులు తమ కరెన్సీలలోనే లావాదేవీలు జరపటం పెరిగిపోతున్నది. ఈ పరిణామాలన్నీ అమెరికా ఆధిపత్యాన గల ఏకధ్రువ ప్రపంచాన్ని బహుళ ధ్రువ ప్రపంచంగా తిరుగులేకుండా మార్చుతున్నాయి.

ప్రస్తుతం ప్రపంచమంతటా చర్చ జరుగుతున్న సరికొత్త విషయం బ్రిక్స్ పార్లమెంట్ నిజంగా ఏర్పడవచ్చునా అన్నది! 'బ్రిక్స్' గురించి తెలిసిందే. 'బ్రిక్స్' పార్లమెంటరీ ఫోరం మాట విన్నదే. కానీ 'బ్రిక్స్' పార్లమెంట్ కొత్త మాట. పార్లమెంటరీ ఫోరం సమావేశాలు ఈ నెల 11–12 తేదీలలో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగినప్పుడు, మొదటి రోజున ప్రారంభోపన్యాసం చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్, ఉరుములేని పిడుగువలె బ్రిక్స్ పార్లమెంట్ ఏర్పాటు ప్రస్తావన చేశారు. ఆ మాట విని ప్రపంచమంతా ఉలికి పడింది. ఆయన ఆలోచనలోని ఉద్దేశమేమిటి? 'బ్రిక్స్' దేశాలు అందుకు సమ్మతిస్తాయా? ఆ కొత్త సంస్థ లక్ష్యాలేమిటి? అది యూరోపియన్ పార్లమెంటుకు, లేదా అసలు ఐక్యరాజ్య సమితికే పోటీ కాకున్నా సమాంతర సంస్థ కాగలదా? అనే ప్రశ్నలు శరపరంపరగా తలెత్తటం మొదలైంది. ఇది ముఖ్యంగా పాశ్చాత్య దేశాలకు కలవరపాటు కలిగిస్తున్నదనేది గమనించవలసిన విషయం.

ఇందుకు సంబంధించి తెలుసుకోవలసిన సమాచారాలు కొన్నున్నాయి. అంతకన్నా ముఖ్యంగా అర్థం చేసుకోవలసిన అంతర్జాతీయ విషయాలు చాలా ముఖ్యమైనవి కొన్నున్నాయి. ఇందులో మొదటగా సమాచారాలను చూద్దాం. 'బ్రిక్స్' అనే సంస్థ మొదట 'బ్రిక్' (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా) అనే పేరిట 2006లో ఏర్పడింది. తర్వాత 2011లో సౌత్ ఆఫ్రికా చేరికతో 'బ్రిక్స్' అయింది. ఈ సంవత్సరం ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరాయి. తమను కూడా చేర్చుకోవాలంటూ మరొక పాతిక దేశాల వరకు దరఖాస్తు చేసుకున్నాయి. 'బ్రిక్స్' సభ్యదేశాలు 2009లో పార్లమెంటరీ ఫోరంను ఏర్పాటు చేసుకున్నాయి. ఈ ఫోరం 10వ సమావేశాలు ఈ నెలలో జరిగినపుడే పుతిన్ తన ప్రతిపాదన చేశారు. ఆ సమావేశంలో మన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా పాల్గొన్నారు. నిజానికి బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం అన్నది సభ్య దేశాల పార్లమెంట్ స్పీకర్ల ఫోరం. అందుకు భిన్నంగా, పుతిన్ ప్రతిపాదన కొత్తగా ఒక ఉమ్మడి పార్లమెంటును ఏర్పాటు చేసుకోవటం. 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశాలు వచ్చే అక్టోబర్‌లో రష్యాలోని కజాన్ నగరంలో జరగనున్నాయి. ఈ ప్రతిపాదన అపుడు అధికారికంగా చర్చకు వచ్చి, అందరూ ఆమోదించే పక్షంలో ఆచరణకు వస్తుంది. ఈలోగా ఈ విషయమై ప్రపంచమంతటా చర్చలు సాగుతాయి. మరొకవైపు సభ్య దేశాల మధ్య ముందస్తు సంప్రదింపులు జరగగలవని వేరే చెప్పనక్కరలేదు.

పోతే, బ్రిక్స్ లక్ష్యాలే బ్రిక్స్ పార్లమెంటు లక్ష్యాలు, విధులు కాగలవని భావించవచ్చు. బ్రిక్స్ 2006లో ఏర్పడింది. ఎందుకు? ఈ 18 సంవత్సరాలలో ఆ సంస్థ చేసిందేమిటి? అన్నవి మొదట ఉత్పన్నమయే ప్రశ్నలు. ఇది ప్రధానంగా ఆర్థిక, వాణిజ్యపరమైన సంబంధాల



కోసం ఏర్పడినటువంటిది. పరస్పర సంబంధాలతో పాటు ఇతర దేశాలతో ఆర్థిక, వాణిజ్య సంబంధాల అభివృద్ధి కూడా ఈ పరిధిలోకి వస్తుంది. బ్రిక్స్‌కు రాజకీయపరమైన, సైనికమైన, వ్యూహాత్మకమైన లక్ష్యాలు ఏవీ లేవని, గత 18 సంవత్సరాలుగా అదే ప్రకారం పని చేస్తున్నదనేది గమనించవలసిన విషయం.

అంతే గమనించవలసిందేమంటే తన ఆర్థిక లక్ష్యాల ప్రకారం బ్రిక్స్ చాలా సాధించింది. ఉదాహరణకు తాజా లెక్కల ప్రకారం, పాశ్చాత్య దేశాల కూటమి అయిన జీ–7 జీడీపీ ప్రపంచంలో 29 శాతం మాత్రమే కాగా, బ్రిక్స్ జీడీపీ 36.8 శాతానికి చేరింది. ఆర్థిక రంగంలో జరుగుతున్నదాని సూచనలను బట్టి చూడగా ఈ వ్యత్యాసం ఇంకా పెరుగుతూ పోగలదన్నది నిపుణుల అంచనా. అది చాలదన్నట్లు మునుముందు సౌదీ అరేబియా, ఇండోనేషియా, మెక్సికో తదితర దేశాలు చేరినపుడు పరిస్థితి ఏమిటో ఊహించవచ్చు. అమెరికా శిబిరానికి బ్రిక్స్ అంటే సరిపడకపోవటానికి ముఖ్యకారణం ఇదే. లోగడ ఆసియాలో ఏషియాన్, ఆఫ్రికాలో ఎకోవాస్, ఇఎసి, లాటిన్ అమెరికాలో సదరన్ కామన్ మార్కెట్ వంటివి ఏర్పడ్డాయి. ఏషియాన్ గొప్పగా విజయవంతం కాగా తక్కినవి అంతగా కాలేదు. పైగా వాటిలో అమెరికా జోక్యాలు బాగా సాగినందున తమకు పోటీగా మారలేదు. తమను అధిగమించటం అంతకన్నా జరగలేదు. బ్రిక్స్ రికార్డు వీటన్నిటికి భిన్నంగా మారింది. ఆ సంస్థ అమెరికా జోక్యానికి సమ్మతించలేదు. ఇండియాతో సహా ఎవరూ ఒత్తిళ్లకు లొంగలేదు. ఇది చాలదన్నట్లు అర్థికాభివృద్ధిలో తమను మించిపోతున్నారు. ఒత్తిళ్లను కాదని ఇదే సంవత్సరం ఈజిప్టు, యూఏఈ వంటివి చేరాయి. ఇరాన్‌ను చేర్చుకోరాదన్న ఒత్తిడికి బ్రిక్స్ సమ్మతించలేదు. అదే పద్ధతిలో సౌదీ, టర్కీ, ఇండోనేషియా, లిబియా, మెక్సికో వంటివి ముందుకు వస్తున్నాయి.

ఇదంతా చాలదన్నట్లు, ప్రపంచంపై పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆధిపత్యాన్ని సవాలు చేసే పరిణామాలు మరికొన్ని జరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌కు పోటీయా అన్నట్లు బ్రిక్స్ బ్యాంక్ ఒకటి 2014 లోనే ఏర్పడింది. అమెరికన్ డాలర్ ప్రాబల్యాన్ని అరికట్టేందుకు బ్రిక్స్ కరెన్సీ అయితే ఇంకా రూపొందలేదు గానీ, బ్రిక్స్ దేశాలకు చెల్లింపుల కోసం బ్రిక్స్ చెయిన్ పేరిట ఒక సాధనం చలామణీలోకి వచ్చింది. అట్లాగే ఈ దేశాల మధ్య, దానితో పాటు తమ ద్రవ్య మారకాలను అంగీకరించే దేశాలతో అమెరికన్ డాలర్ బదులు తమ కరెన్సీలలోనే లావాదేవీలు జరపటం పెరిగిపోతున్నది. బ్రిక్స్ బ్రిడ్జ్ పేరిట మరొక చెల్లింపుల పద్ధతి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీటన్నింటి ప్రభావాలతో పాశ్చాత్య ప్రపంచపు ఆర్థిక ప్రాబల్యం, పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్యం క్రమంగా బలహీనపడుతున్నాయి. ఉదాహరణకు ప్రస్తుత సంవత్సరంలో బ్రిక్స్ సగటు అర్థికాభివృద్ధి 3.6 శాతం మేర, జీ–7 దేశాలది కేవలం 1 శాతం మేర ఉండగలవని అంచనా. ప్రపంచంలో ఇప్పటికే రెండో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారిన చైనా మరొక దశాబ్దం లోపలే అమెరికాను మించగలదన్నది అంతటా వినవస్తున్న మాట. ఈ పరిణామాలన్నీ అమెరికా ఆధిపత్యాన గల ఏకధ్రువ ప్రపంచాన్ని బహుళధ్రువ ప్రపంచంగా తిరుగులేకుండా మార్చుతున్నాయి. ఈ శతాబ్దం ఆసియా శతాబ్దం కాగలదనే జోస్యాలు ఆ విధంగా బలపడుతున్నాయి. చైనా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో అమెరికా ఒత్తిళ్లను కాదని ఇప్పటికి 150 దేశాలు చేరటం, అందులో వారి శిబిరానికి చెందినవి కూడా ఉండటం ఈ ఆర్థిక ధోరణులకు దోహదం చేస్తున్నది.

ఈ విధమైన ప్రభావాలను ముందుగానే అంచనా వేసి కావచ్చు అమెరికన్లు, యూరోపియన్లు మొదటినుంచే బ్రిక్స్‌ను, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌ను అడ్డుకునేందుకు, బ్రిక్స్‌లోని సభ్య దేశాలను ఒత్తిడి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తూ వస్తున్నాయి. రకరకాల ఆంక్షలు ఏదో ఒక సాకుతో విధించటం (ఇండియాపై కూడా), వివిధ దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను భంగపరచజూడటం అందులో భాగమే. భారత, రష్యాల విషయంలోనూ అదే వైఖరి చూపటానికి తాజా ఉదాహరణ ఈ నెల ఎనిమిదిన ప్రధాని మోదీ, పుతిన్‌ను కలవటంపై ఆగ్రహించటం. అమెరికా శిబిరం ప్రజాస్వామ్యమనీ, ఆసియా దేశాల స్వేచ్ఛ అనీ, అంతర్జాతీయ నియమాలకూ, ఐక్య రాజ్యసమితి ఛార్టర్‌కూ కట్టుబడటమనీ నీతులు చాలానే చెప్తుంది. కానీ అందుకు విరుద్ధమైన తమ చర్యల గురించి ఎన్ని రోజుల పాటైనా చెప్పవచ్చు.

వీటన్నింటికి విరుగుడుగా తక్కిన ప్రపంచ దేశాలు తీసుకుంటున్న వివిధ చర్యలలో, బ్రిక్స్ పార్లమెంట్ అనే కొత్త ప్రతిపాదన ఒక ముందడుగు కాగల అవకాశం ఉంది. ప్రపంచ దేశాల మధ్య సమానత్వ ప్రాతిపదికగా పరస్పర సహకారానికి, ఇతోధికాభివృద్ధికి అవసరమైన చర్చలు బ్రిక్స్ పార్లమెంటులో జరగాలన్నది తన ఆలోచన అయినట్లు పుతిన్ చెప్తున్నారు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



ఫేవరెట్!



స్కూల్లో ఉన్నప్పుడు ఇంగ్లిష్ టీచర్ తమ అభిమాన టీచర్‌గా ఉన్నవాళ్లు నాలాగే ఇంకా ఎవరైనా ఉన్నారా? అసలు ఎప్పుడూ ఎందుకు ఇంగ్లిష్ టీచరే మనకు అభిమాన టీచర్‌గా ఉంటారు?

– ఇస్మత్ ఆరా, జర్నలిస్ట్

సమాజ వాస్తవం



కొంతమంది అమ్మాయిలు దీన్ని నిజంగా అర్థం చేసుకోవాలి: కొన్నిసార్లు మీరు వెళ్తున్న ప్రదేశాన్ని బట్టి దుస్తులు ధరించాలి; ప్రతిసారీ 'నా జీవితం, నా ఎంపిక, నా దుస్తులు' అనేది ఉండదు.

– ధీమహీ జైన్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సింగిల్స్ బిజినెస్



పెళ్లి చేసుకుని ఒంటరితనానికి గురికావడం కంటే, ఒంటరిగా ఉండటం మేలు. నాకు నలభై ఏళ్లకు కొంచెం తక్కువ. కుటుంబాలు అద్భుతం, కానీ అన్ని వివాహాలు గొప్పగా లేవు. వివాహితుల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. రానున్న 10–15 ఏళ్లలో నలభై దాటిన సింగిల్స్ జీవితాన్ని అర్థవంతం చేసే స్టార్టప్స్ వస్తాయి. అది మంచి వ్యాపారంగా వర్ధిల్లుతుంది కూడా!

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

బాగైపోతారంతే!



యూపీఎస్సీకి ఏదో మంత్ర శక్తి ఉంది. ఎంపికకు ముందు కాళ్లల్లో సమస్య ఉన్న ఒక ఐఏఎస్ అధికారిణి ఇప్పుడు నదిలో రాఫ్టింగ్ చేస్తూ, సైక్లింగ్ చేస్తూ, మైళ్లకొద్దీ ట్రెక్కింగ్ చేస్తూ కనబడింది. ఎయిమ్స్ గురించి గొప్పగా చెబుతుంటారు గానీ, యూపీఎస్సీ నిజమైన ఆసుపత్రి.

– ముదిత్ గుప్తా, యూపీఎస్సీ బోధకుడు

డాలర్ తగ్గాలి!



రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ తాలూకు ఈ అభిప్రాయాలతో నాకు ఏకీభావం ఉంది: 1. ఇప్పటికి అమెరికాకు అత్యంత ప్రముఖ విదేశీ శత్రువు చైనా. 2. అమెరికా ప్రధాన ప్రాంతాల్లో పునఃపారిశ్రామికీకరణ మొదలుపెట్టాలి. 3. 'బలమైన డాలర్' అనేది పునఃపారిశ్రామికీకరణకు అవరోధం.

– నోవా స్మిత్, యూఎస్ బ్లాగర్

అలాంటి కాలం వస్తుందా?



1939–1945 మధ్య ఆరేళ్లపాటు జర్మనీ ప్రాపగాండా మంత్రిత్వ శాఖ అధిపతిగా జోసెఫ్ గోబెల్స్ ఒక సూచన చేశారు. యూదులందరికీ 'సాధారణ ప్రత్యేక చిహ్నం' ఉండాలన్నారు. యూదు బ్యాడ్జీ ధరించడం అనేది యూదులందరికీ, ఆఖరికి ఆరేళ్ల పిల్లలకు కూడా తప్పనిసరైంది.

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

మన యూపీ నయం



2022లో దేశంలోని మరి ఏ ఇతర రాష్ట్రంలో లేనంతగా ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక హత్యలు జరిగాయి. 3,600 సంఘటనలు. అంటే రోజుకు పది, ఏటా ప్రతిరోజూ! ఇందులో అన్నిరకాల హత్యలున్నాయి– తుపాకీ కాల్పులు, తల నరకడాలు, మూకదాడులు, అన్నీ! అదే అమెరికాలో కేవలం తుపాకీ కాల్పుల హత్యలే ఏటా 48,000. అంటే... రోజుకు 132. ఇవన్నీ అధికారిక లెక్కలే!

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

అభివృద్ధికి కొలమానం... సంపదా? సంతోషమా?

అభిప్రాయం



దానీ

ఆత్మహత్యల్ని సామాజిక సమస్యగా పేర్కొంటూ దీని పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త గౌరవ్ కుమార్ బన్సాల్ వేసిన ప్రజాప్రయోజన వాజ్యం (పిల్) విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. సామాన్యులతోపాటూ వైద్యశాస్త్ర నిపుణులు సహితం ఇప్పటికీ ఆత్మహత్యల్ని మానసిక సమస్యగా పరిగణిస్తుంటారు. భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు మన సాధారణ అవగాహనలో ఒక గొప్ప ముందడుగు అనే భావించాలి.

ప్రభుత్వాలు ఆర్థిక సూచికల్ని ప్రచారం చేసుకున్నంతగా ఆనంద సూచికల్ని ప్రచారం చేయవు. స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) వంటి ఆర్థిక సూచికల గణాంకాలను సేకరించడం సులువు. అవి ప్రజలకు కూడ సులువుగా అర్థమవుతాయి. ఆరోగ్యం, ఆనందం, సంతృప్తి, భవిష్యత్తు మీద నమ్మకం వంటి సామాజిక సూచికల గణాంకాలు తీయడం అంత సులువు కాదు. మనుషులు తమ వ్యక్తిగత ఆందోళన, ఒత్తిడి, కుంగుబాట్లను ఇతరులతో పంచుకోరు.

జనాభాలో మనదేశం ఇప్పుడు ప్రపంచంలో అగ్రస్థానంలో వుంది. మన తరువాత చైనా, అమెరికా, ఇండోనేషియా, పాకిస్తాన్, నైజీరియా, బ్రెజిల్, బంగ్లాదేశ్, రష్యా, మెక్సికో ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థల్లో 29 ట్రిలియన్ డాలర్లతో అమెరికాది అగ్రస్థానం. నాలుగు ట్రిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో ఇండియా ఉంది. త్వరలో మనం జపాన్, జర్మనీలను అధిగమించి ప్రపంచంలో మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నట్టు కేంద్ర ప్రభుత్వ పెద్దలు కొంతకాలంగా గట్టిగా ప్రచారం చేస్తున్నారు. అది సాధ్యమూ కావచ్చు.

ఈ సందర్భంగా గమనించాల్సిన ముఖ్యమైన అంశాలు మరికొన్ని వున్నాయి. మనం జనాభాలో చైనాను అధిగమించవచ్చుగానీ చైనా ప్రజల జీవనస్థాయికి చేరుకోలేము. చైనా సాలీన తలసరి ఆదాయం 13 వేల డాలర్లు. అది అమెరికాలో 85 వేల డాలర్లు. మన దేశంలో 3 వేల డాలర్లకన్నా తక్కువ. జీడీపీలో మనం



జర్మనీని అధిగమించవచ్చు గానీ, మన ప్రజల జీవన స్థాయి జర్మన్ల జీవన స్థాయిలో 20వ వంతు మాత్రమే వుంటుంది. ఇవి సగటు లెక్కలు మాత్రమే. వాస్తవానికి జనాభాలో 20 శాతం జీవనస్థాయి ఇంతకన్నా చాలా మెరుగ్గా వుంటుంది. 80 శాతం జీవనస్థాయి ఇంతకన్నా మరీ హీనంగా వుంటుంది. మన దేశంలో సంపదకు లోటు లేనప్పటికీ సంపద పంపిణీ విధానంలో ఘోరమైన లోటు ఉన్నదని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

జీడీపీ, తలసరి ఆదాయాలకు భిన్నమైన ప్రమాణాలు కూడా సమాజంలో ఉంటాయి. ఐక్య రాజ్య సమితి ప్రతి సంవత్సరం మార్చి 20న 'అంతర్జాతీయ ఆనంద దినోత్స'వాన్ని నిర్వహిస్తోంది. ఆ సందర్భంగా ప్రపంచ ఆనంద నివేదికను (వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్–డబ్ల్యూహెచ్‌ఆర్) పకటిస్తుంది. డబ్ల్యూహెచ్‌ఆర్ – 2024లో 143 దేశాల ర్యాంకులున్నాయి. గత ఏడు సంవత్సరాలుగా ఫిన్లాండ్ ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. స్కాండినేవియన్ రాజ్యాలు, సంక్షేమ దేశాలుగా పేరొందిన నార్వే, స్వీడన్, డెన్మార్క్ తొలి పది సంతోష దేశాల్లో ఉన్నాయి. అఫ్గానిస్తాన్ అన్నింటికన్నా దిగువన వుందని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. మరి ఈ జాబితాలో ఇండియా స్థానం ఎక్కడా? 143లో 126. శ్రీలంక, మయన్మార్, పాకిస్తాన్, నేపాల్ దేశాల ప్రజలు మనకన్నా సంతోషంగా ఉన్నారని ఐక్య రాజ్య సమితి ప్రకటించింది.

సంతోష సూచికలకు, ఆత్మహత్యలకు ఒక విలోమానుపాత సంబంధం ఉంటుంది. సంతోష సూచికలు మెరుగ్గా ఉంటే ఆత్మహత్యల రేటు తక్కువగా ఉంటుంది. సంతోష సూచికలు తక్కువగా ఉంటే ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంటుంది. సంతోష సూచికలు తక్కువగావున్న కారణంగా భారతదేశంలో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉందని నివేదికలు చెపుతున్నాయి. ఇండియా ఇప్పుడు ఆత్మహత్యల కేంద్రంగా మారిందని అనేకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2022లో దేశంలో 1 లక్షా 71 వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. జనాభాలో లక్ష మందికి సాలీనా 12.4 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఇది ప్రపంచ రికార్డు. ఇవి అధికారిక గణాంకాలు మాత్రమే.

మనుషులు వ్యక్తిగత మానసిక కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటారని అనిపించడం సహజం. కానీ, ఇది రూపం మాత్రమే; సారం వేరు. ఆత్మహత్యలకు అసలు కారణం 'సమాజం సంక్షోభంలో పడడం' అని తొలిసారిగా చెప్పినవాడు ఫ్రెంచ్ సమాజ శాస్త్రవేత్త ఎమిలే దుర్ఖేమ్ (1858–1917). ఆయన అభిప్రాయం ప్రకారం సమాజ మౌలిక స్వభావం సంఘీభావం. సమాజం తన మౌలిక స్వభావమైన సంఘీభావాన్ని కోల్పోయినపుడు అక్కడ మనుషులు బతకలేరు. గ్రామీణ ప్రాంతాల్లో కన్నా నగరాల్లో, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోకన్నా అభివృద్ధి చెందిన దేశాల్లో; నిరక్షరాస్యులకన్నా విద్యావంతుల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి.

ప్రతి చారిత్రక దశలోనూ తిరిగితిరిగి ఒకే ప్రశ్న మన ముందుకు వచ్చి నిలబడుతుంది. అభివృద్ధికి కొలమానం ఏమిటి?– సంపదా? శాంతా? జీడీపీ పెరుగుదల రేటా? సంతోష సూచికలా?

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోనే ఒక అమానవీయ లక్షణం ఉందన్నాడు కార్ల్ మార్క్స్. కార్మికుడు తాను ఉత్పత్తి చేసిన సరుకుకు పరాయివాడైపోతాడు అన్నాడు. ఈ పరాయీకరణ ఫ్యాక్టరీ నుండి ఫ్యామిలీలోనికి ప్రవేశించినపుడు మనిషి ఒంటరివాడయిపోతాడు. సంఘీభావానికి నోచుకోలేడు. ఓదార్చేవాడు కనుచూపు మేరలో కనిపించకపోతే మనిషి స్వచ్ఛందంగా లోకాన్ని వదిలేస్తాడు. మనం మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి ముందే ఆత్మహత్యల నిలయంగా మారాము. అదీ విషాదం!

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు

మానసికంగా త్యజించాలి!

సన్యాసం... భౌతికంగా కన్నా అంతరంగిక ప్రాముఖ్యాన్ని అధికంగా కలిగి ఉంటుంది. కర్తవ్యాన్ని మానుకోవడం సన్యాసం కాదు. మతపరమైన ఆచార, సంప్రదాయాలు పాటించడం, మంత్రోచ్చాటన చేయడం, కాషాయ వస్త్రాలు ధరించడం వంటివి సన్యాసానికి చిహ్నాలు కాదు. అహంకార, మమకారాలను విడిచిపెట్టాలి. బాధలన్నింటికీ మూలం ఇవే. అందుకే 'నేను', 'నాది' అనే భావాలను మానసికంగా త్యజించినప్పుడే ఎవరైనా సన్యాసి కాగలడు. కాషాయ వస్త్రాన్ని ధరించడం మానసిక త్యాగానికి చిహ్నం మాత్రమే.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

అంతరంగ పరిత్యాగం పొందాలంటే, కొన్ని క్రమశిక్షణా పద్ధతులు లేక ఆచరణలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది. సంపద, సంతానం, పేరు ప్రఖ్యాతులు కావాలనే కోరికలను ప్రతి సన్యాసీ త్యజించాలి. కేవలం ఇంతటితో ఆగకుండా వైరాగ్యాన్ని పెంచుకోవాలి. ప్రపంచంలోని వస్తువులతో సంబంధం కలిగి ఉండడం వల్ల కష్టాలు కలుగుతాయనే అవగాహన అవసరం. వాస్తవంగా సన్యాసం అనేది ఇవ్వడానికి లేక పుచ్చుకోవడానికి వీలైన వస్తువు కాదు. కేవలం స్వయం ప్రేరణతో ప్రయత్నించి, తగిన కృషితో సంపాదించదగిన ఒక స్థితి. ఎవరైతే ఆలోచించకుండా, తొందరపడి సన్యాసం స్వీకరిస్తారో అటువంటివారు ఆ తర్వాత తప్పనిసరిగా పశ్చాత్తాపపడవలసి ఉంటుంది.

సంసార బంధాలను తెంచుకొని, శాశ్వత ఆనందాన్ని పొందడానికి శ్రద్ధతో ప్రయత్నించే వ్యక్తికి అనేక మార్గాలు ఉన్నాయి. ముఖ్యంగా కర్మయోగం, భక్తియోగం, రాజయోగం, జ్ఞానయోగం అనేవి అందరికీ బాగా తెలిసినవే. వీటికి అదనంగా ఆచరణ సాధ్యమైన వేరొక మార్గాన్ని మన పవిత్ర గ్రంథాలు సూచిస్తున్నాయి. అదే 'సన్యాసయోగం'.

ప్రాపంచిక వస్తువుల నుంచి, ఉద్రేకాల నుంచి, ఆలోచనల నుంచి మనస్సును దూరం చేయడమే ఈ యోగంలోని ప్రధానాంశం. ప్రాపంచిక విషయాల నుంచి దూరమైన మనస్సు భగవంతుని పాదపద్మాలను అంటిపెట్టుకొని ఉంటుంది. ఈ దృష్టికోణంలో ఆలోచిస్తే 'సన్యాసయోగం' అంటే అసంగయోగం. ఈ యోగాన్ని ఎల్లప్పుడూ స్థిరంగా అభ్యాసం చేసినట్లయితే బుద్ధిపూర్వకంగా ప్రయత్నం చేసే సాధకుని ఆత్మ కడకు లక్ష్యాన్ని చేరుతుంది. అంటే సన్యాసి ఆత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడన్నమాట!

పోలీస్ పహారా కాస్తేనే.. ఎక్స్‌ప్రెస్‌వే పనులు

- భద్రత కల్పిస్తేనే ఖమ్మం - దేవరపల్లి యాక్సెస్ కంట్రోల్డ్ రోడ్డు పనులు సాగుతాయి
- సీఎంకు ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారుల వినతి
- ఖమ్మం శివారులో రెండు వంతెనలు సహా రోడ్డు పనులు అడ్డుకుంటున్న స్థానికులు
- భూముల ధరలు పెంచుకునేందుకు కొదుమూరు వద్ద సర్వీసు రోడ్డు కోసం డిమాండ్
- ఏడాదిన్నరగా ఆ రెండు చోట్ల మొదలుకాని పనులు

అదో ఎక్స్‌ప్రెస్ వే.. పూర్తి గ్రీన్ ఫీల్డ్ హైవే.. మరో ఆరేడునెలల్లో నాలుగు వరసల ఆ రోడ్డు అందుబాటులోకి రావాల్సి ఉంది. కానీ, రెండు కీలక ప్రాంతాల్లో పని మొదలు కాలేదు, ఏడాదిన్నరగా అలాగే ఉండిపోయింది.. ఇప్పుడు ఆ రోడ్డు పనులు పూర్తి కావాలంటే పోలీసు పహారా అవసరం ఏర్పడింది. స్వయంగా ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులు ఢిల్లీ నుంచి వచ్చి మరీ ముఖ్యమంత్రిని భద్రత కోరాల్సి వచ్చింది.

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–విశాఖపట్నం మధ్య ప్రయాణ సమయాన్ని దాదాపు 4 గంటల మేర తగ్గించే కీలక రోడ్డుకు ఇప్పుడు పోలీసు భద్రత అవసరం పడింది. మిగతాచోట్ల పనులు దాదాపు పూర్తి కాగా, రెండు కీలక ప్రాంతాల్లో స్థానికులతో పేచీ ఏర్పడింది. ఒకచోట అయితే, పలుకుబడి కలిగిన ఓ వ్యక్తే పనిని అడ్డుకున్నాడు. ఏడాదిన్నరగా ఇదే సమస్య. దీంతో ఈ పనిని ముందుకు తీసుకెళ్లాలంటే రాష్ట్ర ప్రభుత్వమే జోక్యం చేసుకోవాలంటూ ఢిల్లీ ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులు కోరాల్సి వచ్చింది. పోలీసు భద్రత కల్పిస్తే పనులు చేస్తామని లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు.

- హైదరాబాద్–విశాఖపట్నం జాతీయ రహదారిలో ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు మూడేళ్ల క్రితం ఎన్‌హెచ్ఏఐ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చింది. ఖమ్మం పట్టణం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి వరకు కొత్త యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను ప్రతిపాదించింది. 162.12 కి.మీ. నిడివి ఉండే ఈ నాలుగు వరసల రోడ్డు నిర్మాణాన్ని రూ.5 వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. రోడ్డు పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. వచ్చే మార్చి నాటికి ఇది అందుబాటులోకి రావాల్సి ఉంది. కానీ, ఖమ్మం పట్టణం శివారులోని ధ్వంసలాపురం, చింతకాని మండలంలోని కొదుమూరు వద్ద అసలు పనులే ప్రారంభం కాలేదు.

సమస్య ఏమిటంటే..

ఖమ్మం శివారులోని ధ్వంసలాపురం వద్ద ఈ రోడ్డుకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ ఖమ్మం–బోనకల్ రోడ్డు, రైల్వే లైన్, మున్నేరు సమాంతరంగా ఉన్నాయి. ఇక్కడ ఓవైపు మున్నేరు మీద 100 మీటర్ల నిడివి వంతెన, మరోవైపు 150 మీటర్ల పొడవైన రైల్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. ఈ 2 వంతెనల నిర్మాణం నేపథ్యంలో, ధ్వంసలాపురం వద్ద ప్రతిపాదిత ఎక్స్‌ప్రెస్‌వే ఎత్తు ఏకంగా 14 మీటర్లుగా ఉంటుంది. అక్కడ పట్టణంలోకి వెళ్లేందుకు, పట్టణంలోని వాహనాలు ఈ రోడ్డు మీదకు వచ్చేందుకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కానీ, అంత ఎత్తుండే రోడ్డు నుంచి ఈ అనుసంధానం కావాలంటే కిలోమీటరున్నర స్థలం అవసరం. కానీ



అక్కడ కేవలం 350 మీటర్ల నిడివి మాత్రమే ఉన్నందున అది సాధ్యం కాదని ఎన్‌హెచ్ఏఐ తేల్చేసింది. దీంతో స్థానికులు ఆ రెండు వంతెనల నిర్మాణాన్ని ప్రారంభం కాకుండా అడ్డుకుంటూ వస్తున్నారు. ఇక.. చింతకాని మండలం కొదుమూరు వద్ద సర్వీసు రోడ్డు నిర్మించాలని కొందరు అడ్డుకుంటున్నారు. యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సర్వీసు రోడ్డు నిర్మించరు. అండర్‌పాస్‌లు మాత్రమే ఉంటాయి. కానీ, సర్వీసు రోడ్డు నిర్మిస్తే తమ భూముల ధరలు పెరుగుతాయన్న ఉద్దేశంతో ఒకరిద్దరు స్థానికులను రెచ్చగొడుతున్నారు. సర్వీసు రోడ్డు నిర్మిస్తే దాని వెంబడి నిర్మాణాలు, వాణిజ్య కట్టడాలు వెలిసి ఎక్స్‌ప్రెస్‌వే ప్రయోజనం నెరవేరదన్నది అధికారుల మాట. ఇలా ఏడాదిన్నరగా ఈ రెండు ప్రాంతాల్లో అసలు పనులే మొదలు కాలేదు.

ఏం చేయాలనే దానిపై ప్రభుత్వ పరిశీలన

పోలీసు బలగాలను కేటాయిస్తే ఆ రెండు చోట్ల పనులు నిర్వహిస్తామని ఎన్‌హెచ్ఏఐ పేర్కొంటోంది. ఈ రెండు అడ్డంకుల వల్ల హైదరాబాద్– విశాఖపట్నం మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించాలన్న ప్రయత్నానికే విఘాతం కలిగిందని తాజాగా ఎన్‌హెచ్ఏఐ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎన్‌హెచ్ఏఐ ఢిల్లీ అధికారులు ఈ మేరకు సహకరించాలని కోరారు. ఈ రోడ్డు పనులకు పోలీసు భద్రత కల్పించటమా, స్థానికుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని మధ్యే మార్గంగా మార్పులు చేయటమా అన్న విషయాన్ని ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం పరిశీలిస్తోంది.

నాలుగు నెలల్లో నైనీ నుంచి బొగ్గు ఉత్పత్తి

- స్థానికులకు మెరుగైన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వండి..
- సింగరేణి అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి నాలుగు నెలల్లో ఉత్పత్తి ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం కాలపరిమితితో కూడిన ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. బుధవారం సచివాలయంలో నైనీ బొగ్గు బ్లాక్‌పై ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రోస్, సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరాం, ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, ఇంధన శాఖ ఓఎస్డీ సురేందర్‌రెడ్డి, సింగరేణి జీఎం (కోఆర్డినేషన్) దేవేందర్, ఇతర అధికారులతో భట్టి విక్రమార్క సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 135 ఏళ్ల చరిత్రలో సింగరేణి సంస్థ తొలిసారి తెలంగాణ వెలుపల ప్రాజెక్టు చేపట్టిందని, తెలంగాణ ప్రభుత్వంతో పాటు సింగరేణి సంస్థ ప్రతిష్టను పెంచేలా అక్కడ మైనింగ్ చేపట్టాలని, స్థానికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్లాలని సూచించారు. నైనీ బొగ్గు బ్లాక్‌కు ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయని, అటవీ శాఖకు సంబంధించి ఆ రాష్ట్ర అధికారులతో సంప్రదింపులు జరుపుతూ చెట్ల లెక్కింపు, తొలగింపు పనులు వేగంగా పూర్తయ్యేలా చొరవ చూపాలని ఆదేశించారు.

ప్రతి రోజూ పనులపై సమీక్ష..

స్థానికులకు పునరావాసం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద కార్యక్రమాలు, యువతకు ఉపాధి అవకాశాలపై తగిన ప్రణాళికలు రూపొందించాలని భట్టి విక్రమార్క అధికారులను కోరారు. స్థానికులకు మెరుగైన పునరావాసం, పరిహార అంశాలపై చర్చించేందుకు అతి త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని, అలాగే హైటెన్షన్ విద్యుత్‌లైన్‌ను వెంటనే నిర్మించే విధంగా ఒడిశా విద్యుత్ శాఖతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. 2015లోనే ఈ బ్లాక్‌ను కేటాయించినప్పటికీ గత ప్రభుత్వ నిరాసక్తత వల్ల ఇప్పటికీ ఉత్పత్తి ప్రారంభం కాలేదని, సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో పాటు తానే స్వయంగా వెళ్లి అక్కడి ముఖ్యమంత్రితో చర్చించడం లాంటి సానుకూల పరిణామాల కారణంగా ఇప్పుడు ఉత్పత్తి ప్రారంభం కాబోతోందని భట్టి చెప్పారు. ప్రతి రోజూ పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహించాలని ఆయన ఆదేశించారు. సింగరేణి సీఎండీ బలరామ్ మాట్లాడుతూ ప్రతి పనికి కాలపరిమితి విధించుకుని పూర్తి చేస్తామని, ఈ ఏడాది అక్టోబర్ నుంచి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించేందుకు సింగరేణి తరఫున శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రాజెక్టులకు రూ.11 వేల కోట్లు కావాలి

- ఆర్థిక శాఖను కోరనున్నామన్న మంత్రి ఉత్తమ్
- ఈ ఏడాది పూర్తయ్యే ప్రాజెక్టులు ఏ–కేటగిరీలో
- ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులకు గాను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.11 వేల కోట్లను రాష్ట్ర తుది బడ్జెట్‌లో కేటాయించాల్సిందిగా ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు అందించనున్నట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులపై బుధవారం ఆయన జలసౌధలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మధ్యంతర బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు రూ.28 వేల కోట్లను కేటాయించగా, అందులో రూ.18 వేల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకే పోనున్నాయని, రూ.2 వేల కోట్లు వేతనాలు, ఇతర ఖర్చులకు పోగా ఇక రూ.8 వేల కోట్లు మాత్రమే ప్రాజెక్టుల పనులకు మిగులుతాయని చెప్పారు. పనులు జరగాలంటే రూ.11 వేల కోట్లు అవసరమని పేర్కొన్నారు. ఈ ఏడాది 8.50 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సాగులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆ దిశగా పనులు ముమ్మరం చేస్తున్నామని, ఈ ఏడాది చివరికల్లా పూర్తయ్యే ప్రాజెక్టులను ఏ– కేటగిరీలో చేర్చాలని ఆదేశించామని తెలిపారు.

2025లోగా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి

పెండింగ్‌లో ఉన్న నీల్వాయి, పాలెంవాగు, మత్తడివాగు, పింప్రి, సదర్మట్, చిన్నకాళేశ్వరం (ముక్తేశ్వర్), దేవాదుల, చనాకా కొరాటా, పాలమూరు–రంగారెడ్డి, డిండి లిఫ్ట్, కొడంగల్–నారాయణపేట, అచ్చంపేట, ఎస్ఎల్బీసీ, సీతారామ, ఇందిరమ్మ వరద కాలువ ప్రాజెక్టులను ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో చేర్చి పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు. ఇక 2025 మార్చి లేదా డిసెంబర్ లోపు కోయిల్ సాగర్, కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా ప్రాజెక్టులను పూర్తి చేయడమే టార్గెట్‌గా పెట్టుకున్నామని చెప్పారు. గోదావరి– కావేరీ అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తామని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) చేసిన ప్రతిపాదనపై శాసనసభ సమావేశాల్లో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ చెప్పారు. నీటిపారుదల శాఖలో పదోన్నతుల ప్రక్రియను న్యాయనిపుణుల సలహా తీసుకున్నాక చేపడతామని తెలిపారు.

20న ఎన్డీఎస్ఏ చైర్మన్‌తో ఉత్తమ్ భేటీ

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల శాశ్వత పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) అధికారులతో చర్చించడానికి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 20న ఢిల్లీ వెళ్లనున్నారు. ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదిక అమలు, తుది నివేదికపై ఆ సంస్థ చైర్మన్ అనిల్ జైన్‌తో సమావేశం కానున్నారు. మధ్యంతర నివేదిక అమల్లో పురోగతిపై బుధవారం మంత్రి ఉత్తమ్ జలసౌధలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ జైన్‌తో ఫోన్లో మాట్లాడారు. నివేదికలో చేసిన సిఫారసుల మేరకు వానాకాలానికి ముందు బరాజ్‌ల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు పూర్తి చేశామని చెప్పారు. కాగా తుది నివేదికను సత్వరం అందించాలని మంత్రి కోరారు.

సదర్మట్, రాజీవ్ కెనాల్ రెడీ: ఈ నెలాఖరున సదర్మట్ ప్రాజెక్టుతో పాటు ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టులో భాగంగా కట్టిన రాజీవ్ కెనాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని ఉత్తమ్ తెలిపారు. దీనికోసం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సదర్మట్ ప్రాజెక్టులో మిగిలిన పనులన్నీ సత్వరం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నీటి పారుదలశాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, డిప్యూటీ ఈఎన్సీ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి.. క్వారీ గుంతలో మునిగి ముగ్గురు మృతి

- మృతుల్లో తండ్రి, కుమార్తె.. సూర్యాపేట జిల్లాలో విషాదఘటన



ఉషాంక



రాజు



శ్రీపాల్‌రెడ్డి

ఆత్మకూర్(ఎస్): ఈత నేర్చుకునేందుకు వెళ్లి క్వారీ గుంతలో మునిగి ముగ్గురు మృతిచెందిన దుర్ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామంలో బుధవారం జరిగింది. హైదరాబాద్‌లో నివాసముండే ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామానికి చెందిన తిప్పారెడ్డి శ్రీపాల్‌రెడ్డి(42), శైలజ దంపతులు, ఏపీ పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన చామలి రాజు(45), నాగమణి దంపతులు మంగళవారం నెమ్మికల్‌లోని దండుమైసమ్మ ఆలయం వద్ద జరిగిన బంధువుల శుభకార్యానికి వచ్చారు. బుధవారం ఉదయం శ్రీపాల్‌రెడ్డి, తన పెద్ద కుమారుడు చేతన్‌రెడ్డి, చామలి రాజు, అతని ఇద్దరు కుమార్తెలు ఉషాంక(12), రితికతో పాటు శ్రీపాల్‌రెడ్డి బంధువుల అమ్మాయి వర్షిత కలిసి ఈత నేర్చుకోవడానికి బొప్పారం గ్రామం పక్కనే ఉన్న బిక్కేరు వాగుకు వెళ్లారు. అక్కడ నీరు లేకపోవడంతో గ్రామంలోని చెరువు సమీపంలో ఉన్న క్వారీ వద్దకు వెళ్లారు. చేతన్‌రెడ్డికి తప్ప మిగతా వారిలో ఎవరికీ ఈత రాదు. ముందుగా చేతన్‌రెడ్డి క్వారీలోకి దూకి ఈత కొడుతుండగా.. ఉషాంక క్వారీలోకి దిగుతూ జారి అందులో పడిపోయింది. ఆమెను కాపాడేందుకు ఆమె తండ్రి చామలి రాజు క్వారీలోకి దిగుతూ జారి నీటిలో మునిగిపోతుండడంతో శ్రీపాల్‌రెడ్డి వారిని కాపాడేందుకు అందులోకి దిగాడు. రాజు చిన్న కుమార్తె రితిక కూడా జారిపడగా చేతన్‌రెడ్డి ఆమెను కాపాడి బయటకు తీసుకువచ్చాడు. ఈత రాకపోవడంతో శ్రీపాల్‌రెడ్డి, ఉషాంక, రాజు క్వారీ గుంతలో మునిగిపోయారు. క్వారీ బయట ఉన్న వర్షిత ఫోన్ ద్వారా విషయం చెప్పడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. శ్రీపాల్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

గడ్చిరోలి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్
12 మంది మావోయిస్టుల మృతి

- మృతుల్లో మావోయిస్టు పార్టీ డివిజనల్ కమిటీ సభ్యుడు ఆత్రం లక్ష్మణ్
- ఎదురుకాల్పుల్లో ఎస్సై, జవాన్‌కు గాయాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/కాళేశ్వరం: మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు చనిపోగా.. వీరిలో డివిజనల్ కమిటీ మెంబర్, తోపాగడ్ దళ కమాండర్ ఆత్రం లక్ష్మణ్ ఆలియాస్ ఆత్రం విశాల్ ఉన్నట్టు సమాచారం. ఈ ఎదురుకాల్పుల్లో ఒక ఎస్సై, ఒక జవాన్‌కు సైతం బుల్లెట్ గాయాలు కావడంతో నాగ్‌పూర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారిద్దరూ క్షేమంగానే ఉన్నారు.

హోరాహోరీ కాల్పులు: గడ్చిరోలి జిల్లా వండోలి గ్రామ సమీపాన 15 మంది మావోయిస్టులు మాటు వేసి ఉన్నారని బుధవారం ఉదయం 10 గంటలకు యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్న భద్రతాదళాలకు సమాచారం అందింది. దీంతో సీ–60 కంపెనీకి చెందిన కమెండోలు మధ్యాహ్నం ఒంటి గంటకు మావోయిస్టులు ఉన్న ప్రాంతానికి చేరుకోగా, ఎదురుకాల్పు లు మొదలయ్యాయి. సాయంత్రం ఆరుగంటల వరకు కాల్పులు జరగగా.. ఆ తర్వాత సోదా చేయడంతో 12 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఏడు ఆటోమోటివ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మూడు ఏకే 47, రెండు ఇన్సాస్ రైఫిల్స్, కార్బైడ్, ఎస్ఎల్ఆర్‌లు ఉన్నాయి. మావోయిస్టులపై దాడిని విజయవంతంగా పూర్తి చేసిన సీ–60 కమెండోలకు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రూ.51 లక్షల నజరానా ప్రకటించారు.

తెలుగువారు ఉన్నారా ?

బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఆత్రం లక్ష్మణ్ ఆలియాస్ ఆత్రం విశాల్ మూలాలు తెలుగురాష్ట్రాల్లో ఉన్నట్టు తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆ తర్వాత అది నిజం కాదని తేలింది. ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మృతులను పోలీసువర్గాలు ఇంకా గుర్తించలేదు.

భూములు అన్యాక్రాంతమైనా స్పందించరా?

- ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం చూపే అధికారులపై చర్యలు
- ఉన్నతాధికారులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు స్పందించకపోవడం ఏమిటని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఉదాసీనత ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు, చుట్టూ ఉన్న ప్రాంతాల్లో రూ.కోట్ల విలువైన భూములను కబ్జాదారులు చెరబట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఉన్నతాధికారులకు ఆయన ఒక లేఖ రాశారు. భూఆక్రమణలపై ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి ఫిర్యాదుతో మంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎండీ, హెచ్ఎండీఏ కమిషనర్లకు శ్రీధర్ బాబు లేఖ రాశారు. హుడా ఆధీనంలోని 105.13 ఎకరాలు, టీజీఐఐసీ యాజమాన్యంలోని 75 ఎకరాల్లో అత్యధిక భాగం కబ్జాదారుల ఆధీనంలోకి వెళ్లిందని శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలపై నిర్లక్ష్యం వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నతస్థాయి అధికారులను శ్రీధర్‌బాబు ఆదేశించారు.

సింగరేణి ఓసీపీ-2లో ఇద్దరు కార్మికులు మృతి

- పైప్‌లైన్ పనులు చేస్తుండగా మట్టి కూలడంతో ప్రమాదం
- మరో ఇద్దరు కార్మికులకు గాయాలు
- పెద్దపల్లి జిల్లాలో ఘటన



వెంకటేశ్వర్లు



విద్యాసాగర్

గోదావరిఖని/రామగిరి/సాక్షి, హైదరాబాద్: పెద్దపల్లి జిల్లా సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–2 క్వారీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. బుధవారం రెండో షిఫ్టులో కార్మికులు విధులు నిర్వహిస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు (58), జనరల్ మజ్దూర్ గాదె విద్యాసాగర్ (50) అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు అక్కడ పనిచేస్తున్న ఇద్దరు జనరల్ మజ్దూర్లు సమ్మయ్య, శ్రీనివాసరాజు గాయాలతో బయటపడ్డారు. ఓసీపీలోని క్వారీలో ఉన్న నీటిని ఉపరితలానికి తరలించేందుకు పంపులను ఏర్పాటు చేశారు. కాగా, పైప్ లైన్లలో నీటి లీకేజీ ఉండటంతో మరమ్మతు నిర్వహిస్తున్నారు. ఈ పనులు నిర్వహిస్తున్న సమయంలో కందకం కోసం తొలగించిన మట్టి వర్షానికి తడిసి ఉండటంతో పాటు పక్క నుంచి భారీ డంపర్లు వెళ్తుండటంతో పెద్ద ఎత్తున మట్టి జారి నాలుగుమీటర్ల లోతులో ఉన్న వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌లపై పడింది. దీంతో వీరిద్దరు శ్వాస ఆడక అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడే పని చేస్తున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతదేహాలను సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రమాదంలో కార్మికులు మృతి చెందిన ఘటనపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్మికుల మృతిపట్ల సింగరేణి సీఎండీ ఎన్.బలరాం తీవ్ర సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు ఓ ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని ప్రకటించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు.

ఆ జాబితా తప్పుల తడక

- సీనియారిటీ జాబితాపై నర్సుల అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సీనియారిటీ జాబితా తప్పుల తడకగా ఉందని నర్సులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇష్టారాజ్యంగా జాబితా తయారు చేశారని ఆవేదన చెందుతున్నారు. పేర్లు, సీనియారిటీ, సర్వీస్ వివరాలన్నీ తప్పుల తడకగా ఉన్నాయని అంటున్నారు. మూడు సార్లు సవరించి పెట్టిన తర్వాత కూడా ఇప్పటికీ యాభై శాతానికి పైనే జాబితాలో తప్పులు దొర్లాయని చెబుతున్నారు. పైగా గురువారం నుంచి కౌన్సెలింగ్ అని చెప్పి, సవరణ జాబితాను విడుదల చేయలేదని మండిపడుతున్నారు. ఇటీవల తమ సమస్యలను పరిష్కరించాలని వరంగల్ ఎంజీఎం నుంచి కొంత మంది నర్సులు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్‌ను కోరారు. కానీ ఆయన పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

బీసీ గురుకులం ఖాళీ..

- భయంతో ఇంటి బాట పట్టిన విద్యార్థినులు



మూత పడిన దోసపహాడ్ బీసీ గురుకుల పాఠశాల

పెన్‌పహాడ్: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ బీసీ గురుకుల పాఠశాలలో మంగళవారం 5వ తరగతి విద్యార్థిని మృతి చెందడంతో పాఠశాలలోని మిగతా విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో వారంతా పాఠశాలను వదిలి ఇంటి బాట పట్టడంతో గురుకులానికి తాళం పడింది. ఈ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న నూతనకల్ మండలం మాచనపల్లికి చెందిన కొంపెల్లి సరస్వతి మంగళవారం అనుమానా స్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాలలోని 560 మంది విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు ఫోన్ చేసి పాఠశాలలో ఉండటం ఇష్టం లేదని, భయంతో చదువుకోలేమని, ఇంటికి తీసుకెళ్లమని తెలపగా తల్లిదండ్రులు వచ్చి పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు.

కాలుష్యరహిత చౌక విద్యుత్!

- తెరపైకి 'లో ఎనర్జీ న్యూక్లియర్ రియాక్షన్' టెక్నాలజీ
- కోల్డ్ ఫ్యూజన్ టెక్నాలజీ కంటే ఎక్కువ వేడి సాధ్యమంటున్న హైలైనర్
- టీ–హబ్‌లో పరికరం ఆవిష్కరణ



లో ఎనర్జీ న్యూక్లియర్ రియాక్షన్ టెక్నాలజీ పరికరాన్ని ఆవిష్కరిస్తున్న హైలైనర్ సీఈవో సిద్ధార్థ దొరై రాజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాలుష్య రహిత కరెంటు.. అది కూడా కారు చౌకగా దొరికితే ఎలా ఉంటుంది? బాగుంటుంది కదూ..ఇలాంటి టెక్నాలజీ ఇప్పటివరకు ఏదీ లేదు. కానీ ఇకపై ఇది సాధ్యమేనంటోంది హైలెనర్! ప్రపంచంలోనే తొలిసారి తాము కోల్డ్ ఫ్యూజన్ టెక్నాలజీ సాయంతో అందించే వేడి కంటే ఎక్కువ వేడిని పొందగలిగామని.. దీనివల్ల భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు ఉంటాయని హైలైనర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిద్ధార్థ దొరై రాజన్ చెప్పారు. దీని పూర్వాపరాలు ఇప్పుడు తెలుసుకుందాం. మనందరికీ వెలుగునిచ్చే సూర్యుడు కోట్ల సంవత్సరాలుగా భగభగ మండుతూనే ఉన్నాడు. విపరీతమైన వేడి, పీడనాల మధ్య హీలియం అణువులు ఒకదాంట్లో ఒకటి లయమై పోతుండటం వల్ల ఈ వెలుగు సాధ్యమవుతోంది. ఈ ప్రక్రియను కేంద్రక సంలీన ప్రక్రియ లేదా న్యూక్లియర్ ఫ్యూజన్ అంటారని చిన్నప్పుడు చదువుకున్నాం. ఇదే ప్రక్రియను భూమ్మీద నకలు చేయడం ద్వారా చౌక, కాలుష్య రహిత విద్యుత్తు ఉత్పత్తికి బోలెడన్ని ప్రయోగాలు జరుగుతున్నాయి. అయితే ఇవి ఎంతవరకు విజయవంతమవుతాయన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. ఈ నేపథ్యంలో హైలెనర్ ప్రతిపాదిస్తున్న 'లో ఎనర్జీ న్యూక్లియర్ రియాక్షన్' టెక్నాలజీ ఆసక్తి రేకెత్తిస్తోంది.

గది ఉష్ణోగ్రతలోనే..

న్యూక్లియర్ ఫ్యూజన్‌కు విపరీతమైన వేడి, పీడనాలు అవసరమని ముందే చెప్పుకున్నాం కదా..అయితే 'లో ఎనర్జీ న్యూక్లియర్ రియాక్షన్'లో వీటి అవసరం ఉండదు. గది ఉష్ణోగ్రతలోనే అణుస్థాయిలో రియాక్షన్స్ జరిగేలా చూడవచ్చు. ఫలితంగా కోల్డ్ ఫ్యూజన్ టెక్నాలజీ సాయంతో అందించే వేడి కంటే ఎక్కువ వేడి అందుబాటులోకి వస్తుంది. హైలెనర్ బుధవారం హైదరాబాద్‌లోని టీ–హబ్‌లో ఈ టెక్నాలజీని ప్రదర్శించింది. వంద వాట్ల విద్యుత్తును ఉపయోగించగా... 150 వాట్లకు సమానమైన శక్తి లభించింది. మిల్లీగ్రాముల హైడ్రోజన్ ఉపయోగంతోనే అదనపు వేడి పుట్టిందని రాజన్ చెప్పారు. టి–హబ్ సీఈవో మహంకాళి శ్రీనివాసరావు ఈ 'లో ఎనర్జీ న్యూక్లియర్ రియాక్షన్'పరికరాన్ని ఆవిష్కరించారు.

విద్యుత్ ఆదా..ఉత్పత్తి

విద్యుత్తు, వేడి అవసరమైన ఎన్నో రంగాల్లో ఈ టెక్నాలజీ ద్వారా లాభం కలగనుంది. అంతరిక్షంలో తక్కువ విద్యుత్తును వాడుకుంటూ ఎక్కువ వేడిని పుట్టించవచ్చు. చల్లటి ప్రాంతాల్లో గదిని వెచ్చగా ఉంచేందుకు ఉపకరిస్తుంది. ఇందుకోసం ఇప్పుడు కాలుష్య కారక డీజిల్ ఇంధనాలను వాడుతున్న విషయం తెలిసిందే. ఇండక్షన్ స్టౌలను మరింత సమర్థంగా పనిచేయించవచ్చు. తద్వారా విద్యుత్తు ఆదా చేయవచ్చు. విద్యుత్తు ఉత్పత్తికీ దీనిని వాడుకోవచ్చు.

1989 నాటి ఆలోచనే..

హైలెనర్ చెబుతున్న టెక్నాలజీ నిజానికి కొత్తదేమీ కాదు. 1989లో మార్టిన్ ఫ్లైష్‌మాన్, స్టాన్లీ పాన్స్ అనే ఇద్దరు ఎలక్ట్రో కెమిస్టులు తొలిసారి ఈ రకమైన టెక్నాలజీ సాధ్యతను గుర్తించారు. భారజలంతో పల్లాడియం ఎలక్ట్రోడ్‌ను వాడుతూ ఎలక్ట్రోలసిస్ జరుపుతున్నప్పుడు కొంత వేడి అదనంగా వస్తున్నట్లు వీరు గుర్తించారు. అణుస్థాయిలో జరిగే ప్రక్రియలతో మాత్రమే ఇలా అదనపు వేడి పుట్టే అవకాశముందని వీరు సూత్రీకరించారు. అయితే దీన్ని నిరూపించేందుకు ఇప్పటివరకు చాలా విఫల ప్రయత్నాలు జరిగాయని, తాము విజయం సాధించామని హైలెనర్ అంటోంది. దేశ రక్షణకు అత్యంత కీలకమైన క్షిపణులను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించిన పద్మశ్రీ ప్రహ్లాద రామారావు ఈ కంపెనీ చీఫ్ ఇన్నొవేటింగ్ ఆఫీసర్‌గా ఉండటం, ఈ టెక్నాలజీకి భారత పేటెంట్ ఇప్పటికే దక్కడం హైలెనర్‌పై ఆశలు పెంచుతున్నాయి.

బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు విడుదల చేయాలి

- బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు నిధులు విడుదల చేయాలని బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ పరిషత్ ద్వారా విదేశీ విద్యను కల్పించి మొదటి సెమిస్టర్ ఫీజు మాత్రమే చెల్లించారని, రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక నిధులు విడుదల చేయకపోవడంతో విదేశాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీనాయకులు ఎన్వీసుభాష్, అన్నావజ్ఝల సూర్యప్రకాశ్, అమర్‌నాథ్‌లతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రాహ్మణ కుటుంబాల్లోని వారు గతంలో ప్రభుత్వ సహకారంతో ప్రారంభించిన ఉపాధి వ్యాపారాలన్నీ నిధుల లేమితో దెబ్బ తింటున్నాయని తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత చర్యలు, స్వయం ఉపాధి రుణాల చెల్లించకపోవడంతో సంక్షేమపథకాల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


యమునా తీరే.. ఎవరికి వారే

యూపీ బీజేపీలో ఇంటి పోరు!

యోగి వర్సెస్ డిప్యూటీ సీఎం మౌర్య

- సొంత ప్రభుత్వంపైనే మౌర్య వాగ్బాణాలు
- కార్యకర్తలకు గౌరవం లేదంటూ విమర్శలు
- వీటి వెనక అధిష్టానం ఉందంటూ వార్తలు
- త్వరలో కేబినెట్‌లో మార్పులు, పార్టీలో ప్రక్షాళన
- 'పెద్ద' మార్పు తప్పదంటున్న మౌర్య వర్గం


కేశవ్ ప్రసాద్ మౌర్య


యోగి ఆదిత్యనాథ్

లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో పేలవ ఫలితాల దెబ్బకు రాష్ట్ర బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఒక్కసారిగా తెరపైకి వస్తున్నాయి. 2019తో పోలిస్తే యూపీలో బీజేపీ అనూహ్యంగా సగానికి సగం స్థానాలు కోల్పోవడం తెలిసిందే. పార్టీ కేంద్రంలో వరుసగా మూడోసారి సొంతంగా మెజారిటీ సాధించడంలో విఫలమవడానికి ఇదే ప్రధాన కారణంగా నిలిచింది. దీన్ని కమలనాథులు సీరియస్‌గా తీసుకున్నారు. రాష్ట్ర పార్టీలోనూ, యోగి కేబినెట్లోనూ త్వరలో భారీ మార్పుచేర్పులకు రంగం సిద్ధమవుతోంది. దీంతోపాటు సీఎం యోగి ఆదిత్యనాథ్ దూకుడుకు పగ్గాలు వేసేందుకు అధిష్టానమే ప్రయత్నిస్తున్నట్టు చెబుతున్నారు. యోగి ప్రభుత్వంపై సాక్షాత్తూ సొంత పార్టీకే చెందిన ఉప ముఖ్యమంత్రి మౌర్య బాహాటంగా విమర్శలు... రాష్ట్ర పార్టీ చీఫ్‌తో కలిసి ఆయన హస్తిన యాత్రలు... మోదీ, నడ్డా తదితర పెద్దలతో భేటీ... ఇవన్నీ అందులో భాగమేనని రాజకీయంగా జోరుగా చర్చ జరుగుతోంది..!

ఉత్తరప్రదేశ్ బీజేపీ చీఫ్ భూపేంద్రసింగ్ చౌదరి బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యతో కలిసి ఆయన మంగళవారమే హస్తిన చేరుకున్నారు. అదే రాత్రి బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో మౌర్య గంటకు పైగా సమావేశమయ్యారు. అనంతరం చౌదరి కూడా నడ్డాతో విడిగా భేటీ అయ్యారు. నిజానికి యోగి, మౌర్య మధ్య మొదటినుంచీ సత్సంబంధాలు లేవు. యోగి అభీష్టానికి వ్యతిరేకంగా మౌర్యకు అధిష్టానం డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో మౌర్య, యూపీ బీజేపీ చీఫ్ హస్తిన యాత్ర రాష్ట్రంలో రాజకీయ కలకలం రేపుతోంది. మౌర్య నెల రోజులుగా కేబినెట్ సమావేశాలకు వరుసగా డుమ్మా కొడుతూ వస్తున్నారు. యూపీలో త్వరలో 10 అసెంబ్లీ స్థానాలకు కీలక ఉప ఎన్నికలు జరగనున్నాయి. వాటి సన్నద్ధత కోసం మంత్రులతో యోగి ఏర్పాటు చేసిన భేటీకి కూడా మౌర్య వెళ్లలేదు. పైగా నెల రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి సీనియర్ కేంద్ర మంత్రులు, పార్టీ పెద్దలను వరుస పెట్టి కలుస్తూ వస్తున్నారు. జూలై 14న కూడా నడ్డాతో చాలాసేపు మంతనాలు జరిపారు.

ఆ భేటీతో...

ఆదివారం లఖ్‌నవూలో జరిగిన బీజేపీ రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశం యూపీలో రాజకీయ వేడిని ఒక్కసారిగా పెంచేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు, బీజేపీ నేతలు, ప్రతినిధులు కలిపి 3,500 మందికి పైగా పాల్గొన్న ఆ భేటీలో వేదిక మీదే యోగి, మౌర్య మధ్య పరోక్షంగా మాటల యుద్ధం సాగింది. మౌర్య ప్రసంగిస్తూ, 'ప్రభుత్వం కంటే పార్టీయే మిన్న. కనుక పార్టీదే పై చేయిగా వ్యవహారాలు సాగాలి'' అంటూ బాహాటంగా వ్యాఖ్యలు చేశారు. దాంతో అంతా విస్తుపోయారు. ప్రభుత్వ వ్యవహారాల్లో బీజేపీ నేతల మాట పెద్దగా చెల్లడం లేదని పార్టీలో యోగి వ్యతిరేకులు చాలాకాలంగా వాపోతున్నారు. అధికారులకు యోగి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడమే ఇందుకు కారణమని ఆరోపిస్తున్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతలు, కార్యకర్తలు దూకుడుగా పని చేయలేదని, రాష్ట్రంలో దారుణ ఫలితాలకు ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటన్నది వారి వాదన. ఎస్పీ, బీఎస్పీ సానుభూతిపరులైన అధికారులకు కీలక పదవులు కట్టబెట్టారంటూ వారంతా యోగిపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని సీఎం సమక్షంలోనే మౌర్య మాటల తూటాలు పేల్చారు. ''కార్యకర్తలే కీలకం. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అందరూ వారిని గౌరవించాల్సిందే. నేనైనా ముందు బీజేపీ కార్యకర్తను. తర్వాతే డిప్యూటీ సీఎంను'' అన్నారు. ''కార్యకర్తల బాధే నా బాధ. ప్రతి కార్యకర్తకూ నా ఇంటి తలుపులు నిత్యం తెరిచే ఉంటాయి'' అంటూ సర్మగర్భ వ్యాఖ్యలూ చేశారు. యోగి సమక్షంలోనే ప్రభుత్వ పనితీరును తప్పుబట్టేలా మౌర్య ఇలా మాట్లాడటం వెనక అధిష్టానం ఆశీస్సులున్నట్టు చెబుతున్నారు. అయితే మౌర్య అనంతరం మాట్లాడిన యోగి కూడా ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. ప్రభుత్వ పనితీరు ఏమాత్రం మారబోదని అదే వేదిక నుంచి కుండబద్దలు కొట్టారు. ఆ వెంటనే మౌర్య, చౌదరి హస్తిన వెళ్లడం, మోదీ, నడ్డా తదితరులతో భేటీ కావడం చకచకా జరిగిపోయాయి. అనంతరం తాజాగా బుధవారం ఎక్స్ పోస్టులో కూడా 'ప్రభుత్వం కంటే పార్టీయే పెద్ద'దన్న వ్యాఖ్యలను మౌర్య పునరుద్ఘాటించారు. వీటన్నింటినీ బేరీజు వేసి చూస్తే యూపీకి సంబంధించి బీజేపీ అధిష్టానం త్వరలో 'పెద్ద' నిర్ణయం తీసుకోవచ్చంటూ యోగి వ్యతిరేక వర్గం జోరుగా ప్రచారం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత యోగిని సీఎం పదవి నుంచి తప్పించడం ఖాయమని ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం పదేపదే చెబుతూ వస్తుండటం తెలిసిందే.

యోగి సంచలన వ్యాఖ్యలు

అధిష్టానం మనోగతాన్ని పసిగట్టిన యోగి ముందుగానే వ్యూహాత్మకంగా పై ఎత్తులు వేస్తున్నారని అంటున్నారు. అతి విశ్వాసమే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కొంప ముంచిందని మూడు రోజుల క్రితం ఆయన ఏకంగా బహిరంగ సభలోనే వ్యాఖ్యలు చేయడం ఉద్దేశపూర్వకమేనని భావిస్తున్నారు. ఇవి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. బీజేపీ అధిష్టానం ఇప్పటికిప్పుడు యోగిని మార్చడం వంటి భారీ నిర్ణయాలకు వెళ్లకపోయినా అసెంబ్లీ ఉప ఎన్నికల్లో సత్ఫలితాలు రాబట్టలేకపోతే ఆయనకు ఇబ్బందులు తప్పేలా లేవు. మరోవైపు బీజేపీ ఇంటి పోరుపై విపక్షాలన్నీ చెణుకులు విసురుతున్నాయి. యూపీకి ముగ్గురు సీఎంలున్నారంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ సహా ఎద్దేవా చేస్తున్నాయి. అంతర్గత కుమ్ములాటల్లో మునిగి తేలుతూ పాలనను గాలికొదిలారంటూ దుయ్యబడుతున్నాయి. మౌర్య, మరో డిప్యూటీ సీఎం బ్రిజేశ్ పాఠక్ కూడా సీఎంలుగానే వ్యవహరిస్తున్నారన్నది వాటి విమర్శల అంతర్యం. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో అత్యధిక స్థానాలను నెగ్గడం యోగికి అత్యవసరం. రాష్ట్ర పార్టీ కీలక నేతల సహాయ నిరాకరణ నేపథ్యంలో ఈ కఠిన పరీక్షలో ఆయన ఏ మేరకు నెగ్గుకొస్తారన్నది ఆసక్తికరం.

- సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్‌పై దాడిలో మా ప్రమేయం లేదు

ఇరాన్ స్పష్టీకరణ

టెహ్రాన్: అమెరికా ఎన్నికల ప్రచారంవేళ మాజీ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యోదంతంలో తమ ప్రమేయం అస్సలు లేదని ఇరాన్ స్పష్టంచేసింది. రెండేళ్లక్రితం ఇరాక్‌లో ఇరాన్‌కు చెందిన సైన్యాధికారి జనరల్ ఖాసిం సులేమానీని ట్రంప్ ఆదేశాల మేరకు అమెరికా సైనిక డ్రోన్ దాడిచేసి అంతంచేసింది. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆనాడు ఇరాన్ చేసిన ప్రతిజ్ఞకు, ట్రంప్ హత్యకు సంబంధం ఉండొచ్చన్న ఆరోపణల నడుమ ఇరాన్ బుధవారం స్పందించింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి కనేర్ కనానీ ఇరాన్ అధికారిక ఐఆర్ఎన్ఏ వార్తాసంస్థతో మాట్లాడారు. '' ట్రంప్ మేం దాడి చేయించామంటున్న వార్తల్లో వీసమెత్తు నిజం లేదు. మా సైనిక కమాండర్ సులేమానీని అంతం చేసినందుకు ట్రంప్‌ను అంతర్జాతీయంగా చట్టప్రకారం శిక్షార్హుడిని చేస్తాం. అంతేగానీ ఇలా హత్య చేయబోం'' అని ఆయన అన్నారు.

ఇరాన్ నుంచి ముప్పు నేపథ్యంలో ఇప్పటికే భద్రత పెంపు

ట్రంప్ హత్యకు ఆగంతకుడు విఫలయత్నం చేయడంతో ట్రంప్‌పై గతంలో కక్షగట్టిన ఇరాన్ పేరు మరోసారి తెరమీదకొచ్చింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ కమాండర్ సులేమానీని అమెరికా బలగాలు నాటి అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకే అంతమొందించాయని ఇరాన్ ఆరోపిస్తోంది. దీంతో ట్రంప్ అంతానికి ఇరాన్ కుట్ర పన్ని ఉండొచ్చని అమెరికా నిఘా వర్గాలు భావించాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ట్రంప్‌కు కొన్ని వారాల క్రితమే భద్రతను మరింత పెంచారు. అయితే ఇరాన్‌కు, ఆగంతకుడి దాడి ఘటనకు మధ్య సంబంధాన్ని అమెరికా నిఘా, దర్యాప్తు వర్గాలు సహా ఎవరూ నిర్ధారించలేకపోతున్నారు. అయితే ఇరాన్ నుంచి ముప్పు ఉందని, జాగ్రత్తగా ఉండాలని అమెరికా సీక్రెట్ సర్వీస్, ట్రంప్ ప్రచార బృందానికి గతంలోనే ముందస్తు హెచ్చరికలు చేశామని అమెరికా జాతీయ భద్రతా అధికారి ఒకరు చెప్పారు. దాడి జరగొచ్చని, తగు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని మాకు తరచూ సందేశాలు వస్తూనే ఉన్నాయని యూఎస్ సీక్రెట్ సర్వీస్ అధికార ప్రతినిధి ఆంటోనీ చెప్పారు. 'ట్రంప్‌కు ఇరాన్ నుంచి ముప్పు ఉంది. సులేమానీని చంపేశాక ఇది మరింత ఎక్కువైంది' అని అధ్యక్షభవనం వైట్‌హౌజ్‌లో జాతీయ భద్రతా మండలి మహిళా అధికార ప్రతినిధి ఆండ్రినీ వాట్సన్ చెప్పారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారుగా జాన్ బోల్టన్ ఉండేవారు. ఆయనను చంపాలని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషన్ కోర్ సభ్యుడు కుట్ర పన్నాడు. ఆ సభ్యునిపై 2022లో న్యాయశాఖ నేరాభియోగాలు మోపింది. 'ట్రంప్‌ను కోర్టులో చట్టప్రకారం శిక్షపడేలా చేస్తాం. అంతేగానీ ఇలా చంపబోం' అని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ తాజాగా స్పష్టంచేశారు.

కన్నడనాట స్థానిక రగడ!

ప్రైవేటు ఉద్యోగాల్లో కన్నడిగులకు రిజర్వేషన్

- మేనేజ్‌మెంట్‌లో 50శాతం
- నాన్‌మేనేజ్‌మెంట్‌లో 75 శాతం
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం, బిల్లుకు కేబినెట్ ఆమోదం
- ఐటీ సంస్థలు, విపక్షాల తీవ్ర విమర్శలతో యూటర్న్

సాక్షి, బెంగళూరు: కర్నాటకలో మరోసారి స్థానిక, స్థానికేతర రగడ రాజుకుంది. రాష్ట్రంలో ప్రైవేట్ ఉద్యోగాల్లో కూడా స్థానికులకే ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇందుకు కారణమైంది. రాష్ట్రంలోని పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, ఇతర ప్రైవేటు సంస్థలన్నింట్లోనూ కన్నడిగులకు రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం తీర్మానించింది. ప్రైవేట్ రంగంలో మేనేజ్‌మెంట్ స్థాయి ఉద్యోగాల్లో 50 శాతం, నాన్ మేనేజ్‌మెంట్‌లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే రిజర్వు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రూపొందించిన ఉద్యోగ బిల్లు–2024కు కేబినెట్ సోమవారం ఆమోదముద్ర వేసింది. నిబంధనలను ఉల్లంఘిస్తే రూ 25 వేల దాకా జరిమానా కూడా విధిస్తారు. అంతేగాక గ్రూప్ సి, డి తరహా చిరుద్యోగాల్లో ప్రైవేట్ కంపెనీలు విధిగా నూటికి నూరు శాతం స్థానికులనే తీసుకోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుండ బద్దలు కొట్టారు. ఈ మేరకు చట్టం చేసేందుకు వీలుగా ఒకట్రెండు రోజుల్లో బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమైంది. కానీ ఐటీ తదితర పరిశ్రమలు, ప్రైవేటు రంగ సంస్థల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వెల్లువెత్తుతుండటంతో ప్రస్తుతానికి దీనిపై వెనకడుగు వేసింది. బిల్లును పక్కన పెడుతున్నామని, మరింత అధ్యయనం చేస్తామని సీఎం కార్యాలయం బుధవారం ప్రకటించింది.



ఇదీ నేపథ్యం...

కర్నాటకవ్యాప్తంగా ప్రైవేటు ఉద్యోగాల్లో ఉత్తరాది వారికే ఎక్కువ అవకాశాలు దక్కుతున్నాయంటూ కొన్నాళ్లుగా కర్నాటకలో ఆందోళనలు జరుగుతున్నాయి. స్థానిక వనరులు, మౌలిక వసతులు ఉపయోగించుకుంటున్న ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు అందుకు తగ్గట్టుగా స్థానికులకే ఉద్యోగాలివ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఉద్యోగాల బిల్లుకు రూపకల్పన చేసింది.

100 % స్థానికులకేనంటూ సిద్ధు పోస్టు

బిల్లుకు మంత్రివర్గ ఆమోదం అనంతరం మంగళవారం సీఎం సిద్ధరామయ్య ఎక్స్‌లో పెట్టిన పోస్టు వివాదానికి దారితీసింది. ''మాది కన్నడ ప్రభుత్వం. కన్నడిగుల భద్రత, సంక్షేమానికి పాటుపడటమే మా బాధ్యత. కానీ కన్నడిగులు కన్నడనాడులోనే ఉద్యోగాలు పొందడంలో వెనకబడుతున్నారు. దీన్ని నివారించేందుకు ఈ బిల్లు ద్వారా అవకాశం కల్పిస్తున్నాం. ఇకపై రాష్ట్రంలో అన్ని ప్రైవేటు రంగ పరిశ్రమలు, కర్మాగారాల్లో గ్రూప్ సి, డి ఉద్యోగాలు వంద శాతం కన్నడిగులకే ఇవ్వాల్సిందే'' అని పోస్టులో సిద్ధు పేర్కొన్నారు. తీవ్ర విమర్శలు రావడంతో దాన్ని తొలగించారు.

> కర్నాటకలో కన్నడిగుల స్వాభిమానాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. కన్నడ నేమ్‌ప్లేట్లు, కన్నడ ధ్వజం, భాష, సంస్కృతి, పరంపర విషయంలో వెనుకంజ ఉండదు. రాష్ట్రంలో ప్రైవేటు ఉద్యోగాల్లో కన్నడిగులకు రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు తేవడం అందులో భాగమే
>
> **- బిల్లును తాత్కాలికంగా పక్కన పెట్టిన అనంతరం కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యలు**

తీవ్ర వ్యతిరేకత

సిద్ధు సర్కారు నిర్ణయాన్ని కర్ణాటకలోని ప్రైవేటు రంగ సంస్థలు, పరిశ్రమలు ముఖ్యంగా ఐటీ తదితర కంపెనీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పారిశ్రామిక దిగ్గజం, బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్ షా దీనిపై తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. టెక్ కంపెనీలకు స్థానికత కంటే ప్రతిభే ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో కంపెనీలు కర్నాటకకు రావాలంటే భయపడే పరిస్థితి తలెత్తుతుందని సాఫ్ట్‌వేర్ పరిశ్రమల జాతీయ సంఘం నాస్కామ్ విమర్శించింది. దీన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఇది వివక్షా పూరితమైన బిల్లంటూ ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్ దాస్ పాయ్ విమర్శించారు. ''ఇది రాజ్యాంగవిరుద్ధం. టెక్ రంగానికి గొడ్డలి పెట్టు వంటి ఈ ఫాసిస్టు బిల్లును వెంటనే వెనక్కు తీసుకోవాలి'' అని డిమాండ్ చేశారు. అసోచామ్ కర్నాటక సహాధ్యక్షుడు ఆర్‌కే మిశ్రా తదితరులు కూడా ఇది దూరదృష్టి లేని బిల్లంటూ తీవ్రంగా తప్పుబట్టారు. విపక్ష బీజేపీ కూడా బిల్లును తీవ్రంగా తప్పుబట్టింది.

అస్సాంలో ఎన్‌కౌంటర్

ముగ్గురు ఉగ్రవాదులు హతం, ముగ్గురు పోలీసులకు గాయాలు

అస్సాం: రాష్ట్రంలోని కాచర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ముగ్గురు పోలీసులకు గాయాలయ్యాయి. ఎస్పీ నుమాల్ మహట్టా తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాపూర్ రోడ్డు ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలపై పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం కాచర్‌లోని ధలై గంగా నగర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు ఏకే రైఫిళ్లను, ఒక సాధారణ రైఫిల్, ఒక పిస్టల్‌ను, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం పట్టుబడిన ముగ్గురూ హ్మార్ తీవ్రవాద సంస్థలో శిక్షణ పొందిన క్యాడర్‌గా ప్రాథమిక విచారణలో తేలింది. భువన్ హిల్స్‌లోని సమీపంలోని అడవిలో మరికొందరున్నట్టు, అసోం–మణిపూర్ సరిహద్దుల్లో విధ్వంసాలకు సిద్ధమవుతున్నట్లు పట్టుబడిన ముగ్గురు వెల్లడించారు. దీంతో బుధవారం తెల్లవారుజామున అదనపు ఎస్పీ నేతృత్వంలోని బృందం అరెస్టయిన ఉగ్రవాదులతో పాటు భువన్ హిల్స్‌లో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ సమయంలో భువన్‌హిల్స్‌లో ఉన్న కొందరు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. గంటపాటు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వారిలో ఇద్దరు కాచర్‌కు చెందినవారు కాగా ఒకరు మణిపూర్‌కు చెందినవారు. మరో ఆరు నుంచి ఏడుగురు ఉగ్రవాదులు తప్పించుకున్నారు. వారికోసం సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు.

ఒమన్ సమీపంలో సరుకు రవాణా నౌక మునక

- ఐదుగురు భారతీయులు గల్లంతు
- 8 మందిని కాపాడిన సిబ్బంది

దుబాయ్: ఒమన్ సమీప సముద్రజలాల్లో సరకు మూడు రోజుల క్రితం రవాణా నౌక మునిగిపోయిన ఘటనలో ఐదుగురు భారత, ముగ్గురు శ్రీలంక సిబ్బంది గల్లంతయ్యారు. మూడ్రోజుల అన్వేషణ తర్వాత 8 మంది భారతీయులను, ఒక శ్రీలంక వ్యక్తిని కాపాడగలిగారు. మిగతా వారికోసం అన్వేషణ సాగుతోంది. దుబాయ్ నుంచి బయలుదేరిన నౌక దుక్మ్ పట్టణం సమీప సముద్రజలాల్లో మునిగిపోయింది. కొమొరోస్ దేశ జెండాతో వెళ్తున్న ఈ నౌకలో 13 మంది భారత సిబ్బంది, ముగ్గురు శ్రీలంక వాసులు ఉన్నట్టు ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్ వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలు మాత్రం వెల్లడించలేదు. ఒమన్‌లోని ప్రధాన చమురు, గ్యాస్ మైనింగ్ ప్రాజెక్టులకు దుక్మ్ పోర్ట్ ప్రధాన కేంద్రంగా ఉంది. 117 మీటర్ల పొడవైన ఫాల్కన్ నౌకను 2007లో నిర్మించారు. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 16 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 13 మంది భారతీయులే.



చిరుద్యోగాల కోసం పోటెత్తిన యువత

- తొక్కిసలాట తరహా పరిస్థితి
- ముంబై ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఘటన

ముంబై: నిరుద్యోగ సమస్య తీవ్రతకు అద్దం పట్టే ఉదంతమిది. ముంబై ఎయిర్‌పోర్ట్ సమీపంలో 2,000 'లోడర్' ఉద్యోగాల కోసం ఎయిరిండియా ఇంటర్వ్యూలకు పిలిచింది. ప్రయాణికుల లగేజీ, సరకు తదితరాలను విమానాల్లో లోడ్, అన్ లోడ్ చేయడం, బ్యాగేజీ బెల్టులను సరిచూడటం వీరి పని. మరో 200 మంది గ్రౌండ్ హ్యాండ్లింగ్ టెక్నీషియన్, 400 మంది డ్రైవర్ పోస్టులకూ ఒకేసారి ఇంటర్వ్యూ నిర్వహించారు. వీటికి ఏకంగా పాతిక వేల మంది నిరుద్యోగులు పోటెత్తారు. వారిని నిలువరించడం సిబ్బందికి తలకు మించిన భారమైంది. తొక్కిసలాట పరిస్థితులు తలెత్తాయి. సంబంధిత వీడియో వైరలైంది. దాంతో వారి నుంచి సర్టిఫికెట్లు తీసుకుని, తర్వాత ఇంటర్వ్యూలు చేస్తామంటూ పంపించేశారు. కొందరు పొరుగు రాష్ట్రాల నుంచీ వచ్చారు.

కేజ్రీవాల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానం కుంభకోణం కేసులో సీబీఐ అరెస్టును సవాల్ చేస్తూ, మధ్యంతర బెయిల్ కోరుతూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును ఢిల్లీ హైకోర్టు బుధవారం రిజర్వ్ చేసింది. సాధారణ బెయిల్ కోరుతూ దాఖలు చేసిన మరో పిటిషన్‌ను జూలై 29న విచారిస్తామని తెలిపింది. ఈడీ కేసులో బెయిల్ వచ్చినా కేజ్రీవాల్‌ను జైలుకే పరిమితం చేసేందుకే సీబీఐ అరెస్ట్ చేసిందని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. ''ఇది సిగ్గుచేటు. కేజ్రీవాల్‌కు అనుకూలంగా మూడుసార్లు ఉత్తర్వులు వచ్చాయి. అయినా సీబీఐ చేసిన 'ఇన్సూరెన్స్' అరెస్ట్ వల్ల జైల్లోనే గడపాల్సిన పరిస్థితి! సీబీఐ వద్ద సాక్ష్యాలు, ఆధారాలు లేకున్నా ఇలా ముందస్తు అరెస్ట్ ప్రణాళిక అమలు చేసింది'' అని ఆయన ఆరోపించారు.

కాలువలో సిక్కిం మాజీ మంత్రి మృతదేహం



గాంగ్‌టక్: సిక్కిం మాజీ మంత్రి ఆర్సీ పౌడ్యాల్ (80) మృతదేహం పశ్చిమ బెంగాల్‌లో దొరికింది. సిలిగురి సమీపంలోని తీస్తా కాలువలో మంగళవారం మృతదేహం లభించినట్లు పోలీసులు వెల్లడించారు. చేతి వాచ్, ధరించిన దుస్తుల ఆధారంగా ఆయన్ను గుర్తించారు. మృతదేహం తీస్తా నదిలో కొట్టుకొచ్చి ఉంటుందని భావిస్తున్నారు. పౌడ్యాల్ జూలై 7న తన స్వస్థలమైన పాక్యోంగ్ జిల్లా చోటాసింగ్‌టామ్‌లో ఇంటి నుంచి సోదరి వద్దకు బయల్దేరి తిరిగి రాలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు సిక్కిం సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ ఆదేశాలతో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి గాలించారు. 9 రోజుల తరువాత ఆయన మృతదేహం లభించింది. పౌడ్యాల్ మృతి పట్ల సీఎం తమాంగ్ సంతాపం వ్యక్తం చేశారు.

నిరుద్యోగంలో రికార్డ్ బ్రేక్

ప్రధాని మోదీకి ప్రియాంక గాంధీ చురక



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల ఉద్యోగాలు సృష్టించామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ మండిపడ్డారు. బుధవారం 'ఎక్స్' వేదికగా తూర్పారబట్టారు. మంగళవారం ఉదయం ముంబై విమానాశ్రయంలో సరకుల లోడింగ్ కేంద్రం వద్ద చిరు ఉద్యోగాల కోసం వేలాది మంది నిరుద్యోగ యువత క్యూ వరసల్లో నిల్చుని తొక్కిసలాట వంటి పరిస్థితి తలెత్తిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ప్రియాంక గుర్తుచేశారు. '' కొద్దిరోజుల క్రితం ముంబైలో మోదీ మాట్లాడుతూ మేం కోట్లాది మందికి ఉపాధి కల్పించి రికార్డులు బ్రేక్ చేశామని ఢంకా బజాయించారు. కానీ అదే ముంబైలో చిన్నపాటి ఉద్యోగాల కోసం వేలాదిగా యువత ఆశతో ఎగబడటం మనందరం చూశాం. ఇదే ఏడాది గుజరాత్‌లో 25 ఉద్యోగాల కోసం ఏకంగా లక్షలాది మంది నిరుద్యోగులు తండోపతండాలుగా తరలిరావడమూ మనందరికీ తెల్సిందే. ఇవన్నీ చూస్తుంటే రికార్డులు బ్రేక్ అయినట్లు తెలుస్తూనే ఉంది. కానీ ఆ రికార్డులు నమోదైంది ఉద్యోగాల్లో కాదు నిరుద్యోగంలో. దేశాన్ని తీవ్ర నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తోంది. ఇప్పటికైనా మోదీ ఉత్తమాటలు చెప్పడం మానేసి ఉపాధి అవకాశాలపై దృష్టిపెట్టాలి'' అని ప్రియాంక నిలదీశారు.

ఇన్‌స్టాలో దుబాయ్ యువరాణి ఇన్‌స్టంట్ విడాకులు



దుబాయ్: దుబాయ్ యువరాణి షైఖా మహ్రా మహమ్మద్ రషీద్ అల్ మక్తూమ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సంచలన ప్రకటన చేశారు. తన భర్త షేక్ మనాబిన్ మహ్మద్ బిన్ రషీద్ బిన్ మనా అల్ మక్తూమ్‌కు విడాకులిచ్చారు. ''ప్రియమైన భర్తకు.. మీరు ఇతరుల సహచర్యంలో ఉన్నందున మీకు విడాకులు ఇవ్వాలనుకుంటున్నాను. ఐ డివోర్స్ యూ.. ఐ డివోర్స్ యూ.. ఐ డివోర్స్ యూ. జాగ్రత్తగా ఉండండి. ... మీ మాజీ భార్య'' అంటూ జూలై 16న ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. యువరాణి పోస్ట్ చేసిన వెంటనే ఆమె శ్రేయోభిలాషుల నుంచి సందేశాలు వెల్లువలా వచ్చాయి. మరోవైపు ఇన్‌స్టాగ్రామ్‌లో భార్యాభర్తలిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలను కూడా తొలగించారు. షైఖా మహ్రా ప్రస్తుత దుబాయ్ రాజు షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె. 2023 మేలో పారిశ్రామికవేత్త షేక్ మనా బిన్ మొహమ్మద్ బిన్ రషీద్ బిన్ మనా అల్ మక్తూమ్‌ను వివాహం చేసుకున్నారు. ఒక సంవత్సరం తర్వాత వారికి కుమార్తె జన్మించింది. ఆ భర్త, కూతురుతో ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో 'మేం ముగ్గురం' అని జత చేసి పోస్ట్ చేశారు. జూన్ 4న 'మేమిద్దమే' కూతురుతో ఉన్న ఫొటోను పోస్ట్ చేశారు. ఇప్పుడు విడాకుల ప్రకటన సంచలనమైంది.

భారత్ మాకు వ్యూహాత్మక భాగస్వామి

మోదీ రష్యాలో పర్యటించిన నేపథ్యంలో అమెరికా వ్యాఖ్యలు



వాషింగ్టన్: రష్యాతో భారత్ మైత్రి బంధం మరింత బలపడుతున్నా సరే తమకు మాత్రం వ్యూహాత్మక భాగస్వామిగానే కొనసాగుతుందని అమెరికా పునరుద్ఘాటించింది. మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక ఇటీవలే రష్యాలో పర్యటించిన నేపథ్యంలో అమెరికా తాజాగా ఇలా స్పందించింది. వాషింగ్టన్‌లో మంగళవారం అమెరికా రక్షణ శాఖ ప్రెస్ సెక్రటరీ ప్యాట్ రైడర్ మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. '' భారత్ ఎప్పటికీ అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామే. దీన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఎదురుచూస్తుంటాం. ఇరుదేశాల సైనిక ఒప్పందాలు, సత్సంబంధాలు కొనసాగుతాయి' అని స్పష్టంచేశారు. యుద్ధరంగంలో బాంబులు, బుల్లెట్ల నడుమ శాంతి స్థాపన సాధ్యంకాదని ఉక్రెయిన్ దురాక్రమణను ఉద్దేశించి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ వ్యాఖ్యానించడం తెల్సిందే. ఉక్రెయిన్–రష్యా యుద్ధంపై రైడర్ స్పందించారు. ''రష్యా దురాక్రమణను సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతున్న ఉక్రెయిన్‌కు అమెరికా సాయం చేస్తోంది'' అని ఆయన అన్నారు.

ముస్లింల జనాభా పెరుగుదల జీవన్మరణ సమస్యగా మారింది: హిమంత



రాంచీ: జనాభా సమీకరణాల్లో మార్పు అస్సాంలో అతిపెద్ద సమస్యగా మారిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు. 'అస్సాంలో 1951లో ముస్లింల జనాభా 12 శాతం మాత్రమే. కానీ ఇప్పుడది 40 శాతానికి చేరుకుంది. నాకిది రాజకీయ సమస్య కాదు. జీవన్మరణ సమస్య. మనం ఎన్నో జిల్లాలను కోల్పోయాం' అని హిమంత వ్యాఖ్యానించారు. 2021 జూన్‌లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక హిమంత మాట్లాడుతూ.. 'జనాభా విస్ఫోటం అస్సాం ముస్లింలలో పేదరికానికి, ఆర్థిక అసమానతలకు మూలకారణం' అని అన్నారు. రాంచీలో బుధవారం బీజేపీ సమావేశంలో మాట్లాడుతూ జార్ఖండ్ గిరిజన ప్రాంతాల్లో బంగ్లా చొరబాటుదారుల సంఖ్య పెరుగుతోందన్నారు. జార్ఖండ్‌ను సీఎం హేమంత్ మినీ బంగ్లాదేశ్‌గా మార్చేశారన్నారు.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం: అఖిలేశ్



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే 10 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో సమాజ్‌వాదీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ఆ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ బుధవారం విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికార బీజేపీలో అంతర్గత పోరు ఉందని, అధికారం కోసం వారి కుమ్ములాటలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఇంతకుముందు ఇతర పార్టీల్లో చీలిక రాజకీయాలు చేసిన బీజేపీ ఇప్పుడు సొంత పార్టీలోనూ చీలికలకు పాల్పడుతోందన్నారు.

పుట్టినవాడు గిట్టక తప్పదు

హత్రాస్ తొక్కిసలాటపై భోలే బాబా 'వేదాంతం'



లక్నో: హత్రాస్ తొక్కిసలాట తనను తీవ్రంగా కలచివేసిందని, అయితే విధిరాతను ఎవరూ తప్పించలేరని భోలే బాబా అన్నారు. అందరూ ఏదో ఒకరోజు మరణించక తప్పదని వేదాంతం వల్లెవేశారు. భోలే బాబా సత్సంగ్‌లో తొక్కిసలాటలో ఇటీవల 121 మంది మరణించడం తెలిసిందే. బుధవారం ఆయన పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. 'పుట్టినవాడు ఏదో ఒకరోజు గిట్టక తప్పదు. కాస్త ముందూ వెనకా అంతే' అన్నారు. తొక్కిసలాట వెనుక కుట్ర ఉందని పునరుద్ఘాటించారు. 'జూలై 2 దుర్ఘటన తర్వాత నేను తీవ్ర నిరాశకు లోనయ్యా, కలత చెందా. కానీ జరిగేదాన్ని ఎవరూ తప్పించలేరు. విషపూరిత రసాయనాలను స్ప్రే చేశారని నా న్యాయవాది, ప్రత్యక్షసాక్షులు చెప్పింది ముమ్మాటికీ నిజం. దీనివెనుక కచ్చితంగా కుట్ర ఉంది' అని బాబా పేర్కొన్నారు.

సాక్షి హైదరాబాద్

గురువారం । 18 । జూలై । 2024



గం'జాయ్'పై ఉక్కుపాదం

ధూల్‌పేట ప్రాంతంలో గంజాయి గుప్పుమంటోంది. కాగా.. ఇక్కడ ఈ మహమ్మారిని అంతమొందించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. -8లో



స్పెషల్ ఆఫీసర్.. ఫెయిల్..

హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు అధ్వానంగా తయారైంది. పాఠశాల నిర్వహణతో పాటు విద్యాబోధన, ఉత్తీర్ణత శాతంలో కూడా పూర్తిగా వెనుకబడింది. -10లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30.0/23.0

నగరంలో రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం పడవచ్చు. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు.

కుషాయిగూడలోని వేంకటేశ్వర ఆలయంలో బారులు తీరిన భక్తులు




ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని దేవాలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ప్రధానంగా వైష్ణవాలయాలకు భక్తులు భారీగా పోటెత్తారు. అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలతో ఇష్టదైవాన్ని మనసారా స్మరించుకున్నారు. ఏడాదంతా చల్లగా ఉండాలని, కుటుంబమంతా ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో విలసిల్లాలని వేడుకున్నారు.









అల్లాహ్‌పై విశ్వాసం.. సత్య సందేశం!

నల్లటి దుస్తులు ధరించిన షియా ముస్లింలు దారి పొడవునా రక్తాన్ని చిందించారు. చేతులకు చురకత్తులు, బ్లేడ్లు అమర్చుకొని ఎదపై బాదుకుంటూ సంతాపం తెలిపారు. మొహర్రం సామూహిక ఊరేగింపు బుధవారం పాతబస్తీలో ప్రశాంతంగా సాగింది. ఇస్లాం పరిరక్షణ కోసం కర్బలా యుద్ధ మైదానంలో అసువులు బాసిన హజ్రత్ ఇమాం హుస్సేన్‌ను స్మరిస్తూ షియా ముస్లింలు పాతబస్తీలో సామూహిక ఊరేగింపు నిర్వహించారు. సీఎస్ శాంతి కుమారి, నగర సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి తదితరులు చార్మినార్ వద్ద బీబీ కా ఆలం సామూహిక ఊరేగింపునకు స్వాగతం పలికారు. పూలు, దట్టీలు సమర్పించారు. డబీర్‌పురాలోని బీబీ కా అలావా నుంచి ప్రారంభమైన ఊరేగింపు చార్మినార్, గుల్జార్ హౌస్, పంజేషా, పురానీ హవేలీ, దారుషిఫా ద్వారా చాదర్ ఘాట్ వరకు కొనసాగింది. మొహర్రం సందర్భంగా మరోసారి నగరవాసుల్ని 'రూపావతి' ఏనుగు అలరించింది. – చార్మినార్



చంపేస్తున్నాయ్..

కుక్కల నుంచి ప్రజలకు రక్షణేది?	గ్రేటర్‌లో వీధి శునకాల వీరంగం	పసి పిల్లల ప్రాణాలే పణం	హామీలు ప్రకటనలకే పరిమితం	ఘటన జరిగినప్పుడే హడావుడి	కొద్ది రోజుల తర్వాత అంతే సంగతులు

జవహర్‌నగర్ ఉదంతంతోనైనా కళ్లు తెరుస్తారా? • ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించాలి


శివార్లలోని జవహర్‌నగర్‌లో కుక్కల దాడిలో ఏడాదిన్నర విహాన్ మృతి వార్తతో నగర ప్రజల గుండెలు బరువెక్కాయి. గత సంవత్సరం ఫిబ్రవరిలో సైతం అలాంటి ఘటనే చోటు చేసుకుంది. అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడు కుక్కల దాడిలో మరణించడం ఎందరినో కలచివేసింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు తగిన చర్యలు తీసుకుంటామనే ప్రకటనలు తప్ప నిజంగా ప్రజలకు.. ముఖ్యంగా పసిపిల్లల ప్రాణాలకు రక్షణ ఉంటుందా? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. వాటికి సరైన సమాధానాలు దొరకడం లేదు.

– సాక్షి, సిటీబ్యూరో



అక్కడ బాగు..

జైపూర్, గోవాల్లో ఏబీసీ కార్యక్రమాల అమలు బాగుందనే అభిప్రాయాలున్నాయి. అక్కడ ఆడ కుక్కలన్నింటికీ ఆపరేషన్లు చేయడంతో పాటు మగవాటికి సంతానోత్పత్తి వయసు వచ్చే సమయంలో (5–12 నెలల మధ్య) సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేస్తారని, 'మిషన్ రేబిస్' పేరిట వ్యాక్సినేషన్ డ్రైవ్ ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహిస్తారని జంతుప్రేమికులు చెబుతున్నారు. పాఠశాలల్లోనూ అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తారని పేర్కొన్నారు.



నాలాలు, నిర్మాణాలూ కారణమే

వీధికుక్కల బెడద పెరగడానికి ఖాళీ జాగాలు లేకుండా వెలుస్తున్న భవన నిర్మాణాలతో నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడం కూడా ఒక కారణమని వెటర్నరీ నిపుణులు చెబుతున్నారు. నాలాల పైకప్పులు, మెష్‌లతోనూ కుక్కల దాహార్తి తీరే దారి లేకుండా పోయిందంటున్నారు. ఖాళీ జాగాలుంటే నీరుండే ప్రాంతాలుంటాయని పేర్కొన్నారు. ఆహారం, నీరు దొరక్కపోవడం కుక్కలు పిచ్చిపట్టినట్లు దాడులు చేయడానికి కారణమని అంటున్నారు. వర్షాకాలంలో చర్మవ్యాధుల బాధలతోనూ తట్టుకోలేక వీధికుక్కలు పిచ్చిపట్టినట్లు కరుస్తాయని పేర్కొన్నారు.

నామ్‌కే వాస్తేగా హైలెవెల్ కమిటీ

- ఏళ్ల తరబడిగా కుక్కల బెడద ఉన్నా, వాటి దాడుల్లో ఎందరో మరణిస్తున్నా.. కుక్కలతో ఇక భయం లేదనుకునే పరిస్థితుల్ని ప్రభుత్వాలు కల్పించలేకపోయాయి. రోడ్డు ప్రమాదాలు, నాలాల్లో మరణాల మాదిరే కుక్కకాట్లతో సైతం మరణాలు చోటు చేసుకుంటుండటం విషాదకరం. వీధికుక్కలపై ప్రజల నుంచి వెల్లువెత్తిన ఫిర్యాదులతో గత సంవత్సరం జీహెచ్ఎంసీ అఖిలపక్ష సభ్యులతో హైలెవెల్ కమిటీ ఏర్పాటు చేసినా, అది 27అంశాలు సిఫార్సు చేసినా ప్రజలకు కుక్కకాట్లు తప్పడం లేదు. సిఫార్సు చేసిన అంశాల్లో ఆరేడు అంశాలు మాత్రం కొద్దిరోజులు అమలు చేశారు. ఆ తర్వాత వాటిని మరచిపోయారు. ఐదు కుక్కల సంరక్షణ కేంద్రాలు, వాటి నిర్వహణ, వెటర్నరీ విభాగంలో సిబ్బంది పెంపు వంటివి మాత్రం అమలు చేశారు.

అమలుకు నోచుకోని అమాత్యుడి హామీ..

బహిరంగ ప్రదేశాల్లో మాంసాహార వ్యర్థాలు వేసే హోటళ్లు, దుకాణాలను ప్రాసిక్యూట్ చేయడంతో పాటు వాటిని మూసి వేస్తామనే హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. మటన్, చికెన్ షాపుల వ్యర్థాలు బహిరంగంగా వేయకుండా కవర్లను అందజేస్తామన్న అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి హామీ అమలు కాలేదు. మూడు నెలల పాటు వీధి కుక్కల స్పెషల్ డ్రైవ్, వీధికుక్కల సమాచారం కోసం ప్రత్యేక యాప్ వంటివి మాటలకే పరిమితమయ్యాయి.

- సినిమాలు, టీవీల్లో స్లైడ్‌లు, షార్ట్ ఫిల్మ్, వీడియో కాంటెస్ట్ వంటి వాటితో సహ మిగతా అంశాలు మరచిపోయారు. వీధికుక్కల సంరక్షణకు ప్రీ ఫ్యాబ్రికేటెడ్ నిర్మాణాలూ అటకెక్కాయి. రాత్రి సమయాల్లోనూ వీధికుక్కలను పట్టుకోవడం, వీధికుక్కల దత్తత వంటివి పట్టింపు లేకుండా పోయాయి. కుక్కలకు ఆహారం, నీళ్ల అందుబాటులో ఉంచుతామన్న మాటలు కొద్దిరోజులే అమలయ్యాయి. కుక్కలు కనిపించినప్పుడు చేయాల్సిన, చేయకూడని పనుల గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు కొద్దిరోజులు మాత్రం నిర్వహించారు.

ఇంతే చేయగలం..

సుప్రీంకోర్టు ఆదేశాలు, కేంద్రప్రభుత్వ యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ)రూల్స్ ,కుక్కల నివారణకు జీహెచ్ఎంసీ బైలాస్ మేరకు కుక్కల సంతతి తగ్గించడం, రేబిస్ వ్యాధి సోకకుండా యాంటీ రేబిస్ (ఏఆర్) వ్యాక్సిన్ వేయడం మాత్రమే తాము చేయగలమని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. వాటితోపాటు ఫంగస్ ఇన్‌ఫెక్షన్ల వంటివి సోకకుండా ఐవర్‌మెక్టిన్ ఇంజెక్షన్లు వేస్తున్నామంటున్నారు.

కాగా.. సీఎం ఆదేశాల నేపథ్యంలో కుక్క కాట్ల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి వెటర్నరీ అధికారులతో మాట్లాడినట్లు సమాచారం.

లెక్కకు మిక్కిలిగా..

- జీహెచ్ఎంసీ గణాంకాల మేరకు పదేళ్లలో 8మంది చిన్నారుల మరణాలు, ఐపీఎం లెక్కల మేరకు 3,36,767 మంది కుక్కల బారిన పడ్డట్లు లెక్కలున్నా, అవి అంతకంటే ఎక్కువగా ఉంటాయని అంచనా.
- 2016 ఫిబ్రవరి 12న కుషాయిగూడలో 8 ఏళ్ల బాలిక మృతి.
- 2017లో 14 మంది, 2018లో 9 మంది కుక్కకాట్ల వల్ల మరణించారు.
- 2020లో అమీర్‌పేటలో ఒకేరోజు 50 మంది కుక్కకాట్ల బారిన పడ్డారు.
- 2020 ఆగస్టులో లంగర్‌హౌస్‌లో నలుగురు చిన్నారులకు గాయాలు.
- 2021 జనవరి 30 బహదూర్‌పురాలో 8 ఏళ్ల బాలుడు మృతి చెందాడు.
- 2022 డిసెంబర్ 12న పీర్జాదిగూడలో చిన్నారికి తీవ్రగాయాలు.
- 2023 ఫిబ్రవరిలో అంబర్‌పేటలో కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు.
- 2023 డిసెంబర్‌లో షేక్‌పేటలో ఐదు మాసాల పసికందు కుక్కల దాడితో అసువులు బాశాడు.
- ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.
- నగరంలో కుక్కలను కట్టడి చేయాలని హైకోర్టు ఆదేశాలున్నా, అమలుకు నోచుకోలేదు.

కళల కాణాచి తెలంగాణ

మంత్రి జూపల్లి కృష్ణారావు



'రుద్రమదేవి పరాక్రమం'

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం కళలకు కాణాచి అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో ప్రణవ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు పద్మశ్రీ జి.పద్మజా రెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శించిన కాకతీయం నృత్య రూపకం ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కళలు, సంస్కృతి, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.



నృత్యం.. రసరమ్యం..


కాగా.. రుద్రమదేవి పరాక్రమం.. శివప్రియం, కోలాటం తదితర ప్రాచీన నృత్యాల సమ్మేళనం.. రమణీయ రసజ్ఞ మనోహరంగా ప్రేక్షకులకు కనువిందు చేసింది. కార్యక్రమంలో సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, ఐసీసీఆర్ విశ్రాంత జనరల్ డైరెక్టర్ రాజశేఖర్, కళ పత్రిక సంపాదకుడు మహ్మద్ రఫీ, పద్మశ్రీ పురస్కార గ్రహీత ఎల్లా వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కళాకారిణికి మంత్రి జూపల్లి అభినందనలు




మనోహరంగా శివ ప్రియం నృత్యం



జల వనరులపై

డేగకన్ను

చెరువులు, నాలాలకు జియో ఫెన్సింగ్



సాక్షి, సిటీబ్యూరో: జల వనరుల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా ఏర్పాటవుతున్న హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (హైడ్రా) సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. చెరువులతో పాటు పార్కుల పరిరక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోనుంది. ప్రస్తుతం అమలులో ఉన్న లేక్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లకు తోడుగా డ్రోన్ టీమ్స్ రంగంలోకి దిగడంతో పాటు జియో ఫెన్సింగ్ అలర్ట్ సిస్టం అందుబాటులోకి రానుంది. యథాతథ స్థితిలో ఉన్న జల వనరులకు పరిరక్షించడంతో పాటు ఇప్పటి వరకు కబ్జా అయిన వాటిపైనా చర్యలు తీసుకోనున్నారు. వీటికి సంబంధించి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ముంపు పరిస్థితులకు అదే కారణం..

ప్రస్తుతంలో ఓ మోస్తరు వాన కురిసినా అనేక ప్రాంతాలు, కాలనీలు జలమయమవుతున్నాయి. చెరువులు, నాలాలు కబ్జాకు గురి కావడమే దీనికి ప్రధాన కారణం. ఇప్పటికీ అనేక జల వనరులు కుంచించుకుపోతున్నాయి. వాటిపై కన్నేస్తున్న కబ్జారాయుళ్లు రాత్రి వేళల్లో తమ పని పూర్తి చేసుకుపోతున్నారు. వీరికి చెక్ చెప్పే ఉద్దేశంతో డ్రోన్ టీమ్స్, జియోఫెన్సింగ్ విధానాలు వాడనున్నారు. ప్రాంతాల వారీగా ఏర్పాటు కానున్న డ్రోన్ బృందాలు ప్రతి రోజూ తమ పరిధిలోని చెరువులపై నిఘా వేసి ఉంచుతాయి. క్రమం తప్పకుండా చెరువుతో పాటు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లను గమనిస్తుంటాయి. వీటి ఫీడ్ హైడ్రా ప్రధాన కార్యాలయంలో ఉండే కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ) సిబ్బంది అధ్యయనం చేస్తుంటారు. ఎక్కడైనా పూడికకు చేసిన ప్రయత్నాలు కనిపిస్తే తక్షణం స్పందించి క్షేత్రస్థాయి బృందాలను అప్రమత్తం చేయడం ద్వారా చర్యలు తీసుకుంటారు.

జియో ఫెన్సింగ్‌తో అలర్ట్స్ విధానం..

సువిశాలంగా విస్తరించి ఉన్న నగరంలోని కొన్ని చెరువులు, పార్క్‌లు, ప్రభుత్వ స్థలాలను నిఘా ఉంచడానికి డ్రోన్లు పరిజ్ఞానం సైతం సరిపోదు. ఇలాంటి వాటిలో కీలకమైన వాటిని పరిరక్షించడానికి జియో ఫెన్సింగ్ విధానాన్ని అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ) సహా దేశ విదేశాల్లో ఉన్న సంస్థలతో సంప్రదింపులు జరపనున్నారు. వీరి సహకారంతో శాటిలైట్ల ద్వారా ఆయా చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల హద్దులను పక్కాగా గుర్తించడంతో పాటు జియో ఫెన్సింగ్ చేస్తారు. ఎవరైనా ఆ పరిధిలోకి వెళ్లి పూడ్చటానికి, నిర్మాణాలు చేపట్టడానికి సహా ఏ ఇతర ప్రయత్నం చేసినా ఆ కార్యకలాపాలను జియో ఫెన్సింగ్ ఆధారంగా శాటిలైట్లు గుర్తిస్తాయి. వెంటనే ఆ సమాచారాన్ని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు కీలక అధికారులకు అందిస్తూ అప్రమత్తం చేస్తాయి. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని సీసీసీకి అనుసంధానం చేయనున్నారు.

ఆ చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం..

హైడ్రా ఆక్రమణలను నిరోధించడంతో పాటు ఇప్పటికే కబ్జా అయిన చెరువుల విషయంలోనూ కీలక చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో 180కి పైగా చెరువులు ఉన్నాయి. వీటిలో అనేకం ఆక్రమణలకు గురి కాగా... ఇప్పటికే ప్రభుత్వ విభాగాలు కొన్నింటిపై ప్రాథమిక చర్యలు తీసుకున్నాయి. వాటి సర్వే, ప్రిలిమినరీ నోటిఫికేషన్, ఫైనల్ నోటిఫికేషన్ ప్రక్రియలు పూర్తయినవి 54 ఉన్నాయి. వీటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ఆక్రమణల తొలగింపుపై హైడ్రా దృష్టి పెడుతోంది. పర్యావరణవేత్తలతో సంప్రదింపులు జరపడం ద్వారా వీటిలో కీలకమైనవి గుర్తించనుంది. వాటిలో ఉన్న ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఈ ప్రక్రియలో సామాన్యులు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో వాణిజ్య అవసరాల కోసం కబ్జాలకు పాల్పడిన బడాబాబులను టార్గెట్‌గా చేసుకోనుంది. పర్యావరణ పరిరక్షణకు హైడ్రా కీలక ప్రాధాన్యం ఇవ్వనుంది.

ఉచిత శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: రాజేంద్రనగర్‌లోని బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ నాగరాజ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంటింగ్, జీఎస్టీ, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిక్, పీసీ హార్డ్‌వేర్, లాప్‌టాప్ సర్వీసింగ్ రంగాల్లో 39 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. పది, ఇంటర్ ఆపై విద్యార్హత ఉన్నవారు ఈ నె 17, 18 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 20 నుంచి శిక్షణ ప్రాంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు www.bired.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

యువతితో అసభ్యంగా ప్రవర్తించిన కండక్టర్ అరెస్ట్

గచ్చిబౌలి: బస్సులో యువతిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ కండక్టర్‌ను రాయదుర్గం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకటేష్ తెలిపిన ప్రకారం వివరాలు... పుప్పాలగూడలో నివాసముండే యువతి(24) పోటీ పరీక్షలకు హిమాయత్‌నగర్‌లో కోచింగ్ తీసుకుంటోంది. ఈ నెల 15న ఉదయం 8 గంటలకు పుప్పాలగూడలో ఫారూఖ్‌నగర్ డిపో ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సులో కండక్టర్ బి.సుబ్బారావు(36) ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బస్సులో తనకు ఎదురైన చేదు అనుభవం గురించి ఆమె ఈ నెల 16న ఎక్స్‌లో పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది. సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం రాయదుర్గం పోలీసులు బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. బీఎన్ఎస్ 75 సెక్షన్ కింద కేసు నమోదు చేసి బుధవారం కండక్టర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్లాట్‌ఫామ్, రైలు మధ్య ఇరుక్కుపోయి ఒకరి మృతి



అడ్డగుట్ట: ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు, ప్లాట్‌ఫాం మధ్య ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి (50) ప్లాట్‌ఫాం నెం.3 లో కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడడంతో ప్లాట్ ఫామ్, రైలు మధ్య ఇరుక్కుపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు.

గం'జాయ్'పై ఉక్కుపాదం

- ధూల్‌పేటలో నియంత్రణకు ఎక్సైజ్ శాఖ కార్యాచరణ
- ప్రత్యేక బృందాలతో విస్తృతంగా దాడులు
- 18004252523 ట్రోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వొచ్చు



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

సాక్షి సిటీ బ్యూరో: ధూల్‌పేట.. ఇది ఒకప్పుడు నాటుసారా తయారీకి పెట్టింది పేరు. దశాబ్దాల పాటు ఆ ప్రాంతంలో సారా రక్కసి రాజ్యమేలింది. అయితే కొంతకాలంగా సారా ప్రభావం తగ్గింది. ఇప్పుడు గంజాయి గుప్పుమంటోంది. డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా మార్చాలన్న కొత్త ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్, సివిల్ పోలీసులు ఉధృతంగా దాడులు నిర్వహిస్తున్నాయి. గంజాయి నామరూపాల్లేకుండా ప్రయత్నిస్తున్నారు. ధూల్‌పేట్ ప్రాంతంలో అత్యధిక శాతం మందికి రెక్కాడితేకానీ డొక్కాడని పరిస్థితి. పగలంతా కష్టపడి సాయంత్రం ఉపశమనంగా ఒకప్పుడు నాటుసారా, ఇప్పుడు గంజాయిని అలవాటు చేసుకున్నారు. అయితే ధూల్‌పేట్‌లో గంజాయి మత్తు వదిలించడానికి ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండు నెలల నుంచి ఎక్సైజ్ శాఖ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్టేట్ టాస్క్‌ఫోర్స్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇంటింటా సోదాలు నిర్వహిస్తున్నాయి. ఈ నెల 13న ఎక్సైజ్ శాఖ 8 బృందాలతో 120 మంది సిబ్బంది కలిసి తనిఖీలు చేశాయి. గంజాయి క్రయవిక్రయాలు జరిపే వారిని గుర్తించాయి. పోలీసులు కొందరు గంజాయి బాధితులను పట్టుకొని విచారించారు. మూడు రోజులపాటు ధూల్‌పేటలో యువత, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి, డ్రగ్స్‌పై సమాచారాన్ని 18004252523 ట్రోల్ ఫ్రీ నెంబర్‌కు ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

హైదరాబాద్ ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ హెడ్ అంజిరెడ్డి అధ్వర్యంలో ఐదు టీమ్‌లతో 50 మందిపైగా ఎస్టీఎఫ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కలిసి మంగళవారం నుంచి బుధవారం రాత్రి 11 గంటల వరకు దాడులు నిర్వహించారు. 2 కిలోల గంజాయిని పట్టుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. ధూల్‌పేటలో గంజాయి అమ్మకాలు, రవాణా, వినియోగం నియంత్రణకు ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు తయారు చేసింది.

ఎక్కడివారు వీళ్లు..

నిజాం కాలంలో ఉత్తరప్రదేశ్ నుంచి జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వేలాదిమంది వలస వచ్చి ధూల్‌పేట్ ప్రాంతంలో స్థిరపడ్డారు. గణేష్, అమ్మవారు, ఇతర దేవతల విగ్రహాల తయారీ వీరి ప్రధాన వృతి. విగ్రహాలతోపాటు రాఖీలు, పతంగులు తయారు చేస్తుంటారు. అన్ని రకాలు కులవృతుల పనులు చేస్తుంటారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఏడు లక్షల జనాభా ఉంది.

మార్పు వైపు అడుగులు వేయాలి

కేంద్రం తీసుకువచ్చిన కొత్త చట్టాలు, డ్రగ్స్, గంజాయిని లేకుండా చేయాలనే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యానికి ధూల్‌పేట్ ప్రజలు సహకరించాలి. గతం ఎలా ఉన్నా.. ప్రస్తుతం గంజాయిని తుదముట్టించే వరకు దాడులు జరుపుతుంటాం. గంజాయి అమ్మకాలు, రవాణా, వినియోగంపై ప్రజలు పోలీసులకు సహకరించాలి.

– వీబీ కమలాసన్‌రెడ్డి, డైరెక్టర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

'హస్తకళల' సంస్థ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



సత్యనారాయణగౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి పొన్నం, ఐఏఎస్ అధికారి శైలజారామయ్యర్ తదితరులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ(గోల్కొండ) కార్పొరేషన్ చైర్మన్‌గా నాయుడు సత్యనారాయణగౌడ్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై సత్యనారాయణగౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. క్షేత్ర స్థాయిలో కళానైపుణ్యం ఉన్నవారిని, చేతివృత్తులవారిని ప్రోత్సహించడానికి ఈ సంస్థ వేదికగా మారిందని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఈ సంస్థ టర్నోవర్ రూ.61 కోట్లు ఉందని, దానిని రూ.600 కోట్లకు తీసుకువెళతామని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున వివిధ సంస్థలకు ఇచ్చేందుకు జీవో నెంబర్ 1 ద్వారా చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని, ఈ విషయమై ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రితో మాట్లాడతానని హామీనిచ్చారు. సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో సంస్థ మరింత ముందుకు వెళ్లాలని పొన్నం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారి శైలజారామయ్యర్, ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సత్యనారాయణగౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఠాణాకు చేరిన 'పొలిమేర' పంచాయితీ

బంజారాహిల్స్: లాభాలు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడంటూ పొలిమేర–3 నిర్మాతపై పొలిమేర–2 నిర్మాత గౌరీకృష్ణప్రసాద్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2021లో 'మా ఊరి పొలిమేర' సినిమాను కృష్ణప్రసాద్ నిర్మించగా ఈ సినిమా ఓటీటీలో నేరుగా విడుదలైంది. రెండో భాగాన్ని కూడా కృష్ణప్రసాద్ నిర్మాతగా థియేటర్‌లో విడుదల చేశారు. ఈ సినిమాకు మంచి లాభాలు వచ్చాయి. నందిపాటి వంశీ పొలిమేర–2 సినిమాకు డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించారు. ఈ చిత్ర నిర్మాతను తానే కాబట్టి దానికి వచ్చిన లాభాల్లో వాటా ఇవ్వాలని అడిగినందుకు వంశీ చంపేస్తానని వార్నింగ్ ఇచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పొలిమేర–2 విడుదల తరువాత రూ.30 కోట్లు గ్రాస్ కలెక్షన్లు వచ్చాయని, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను పంపిణీ చేసిన వంశీ లాభాల్లోంచి ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదన్నారు. తనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. తాజాగా నిర్మాణం మొదలుపెట్టిన పొలిమేర–3 పార్ట్‌కు నిర్మాతగా వంశీ వ్యవహరిస్తుండటం గమనార్హం. జూబ్లీహిల్స్ పోలీసులు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జన్మనిచ్చింది... కాలేయం ఇచ్చింది..



కాలేయ మార్పిడి తర్వాత ఆరోగ్యకరంగా తల్లీ కొడుకు

నాంపల్లి: కన్నకొడుకు కాలేయ సమస్యతో మంచం పట్టడంతో తన కాలేయంలోని కొంత భాగాన్ని ఇచ్చి పునర్జన్మనిచ్చింది ఓ తల్లి. ఉస్మానియా, నిలోఫర్ ఆసుపత్రుల వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ఆ బాలుడికి కాలేయ మార్పిడి చేశారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం కొండ వనమాల గ్రామానికి చెందిన మోదుగు గుణశేఖర్, అమల దంపతుల కుమారుడు మాస్టర్ చౌహాన్ ఆదిత్య(03) పుట్టుకతోనే పిత్తాశయ ధమని, కాలేయసమస్యతో బాధపడుతున్నాడు. దీంతో బాలుడిని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు కాలేయ మార్పిడి కోసం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, కాలేయమార్పిడి బృందం, నిలోఫర్ వైద్యులు కలిసి ఈ నెల 3న ఆదిత్యకు కాలేయమార్పిడి చికిత్సను విజయవంతం చేశారు. ప్రస్తుతం తల్లి, కుమారుడు ఆరోగ్యంగానే ఉన్నారు. వారిని మంగళవారం ఓజీహెచ్ నుంచి డిశ్చార్జి చేశారు. ఇదే శస్త్రచికిత్స కార్పొరేట్ ఆసుపత్రిలో నిర్వహించి ఉంటే రూ.30 లక్షలు అయ్యేవని, కూలిపని చేసుకుని జీవించే తమ జీవితాల్లో ఉస్మానియా, నిలోఫర్ ఆసుపత్రి వైద్యులకు వెలుగులు నింపారంటూ బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం, గవర్నర్ సంతకాలు ఫోర్జరీ

ఉద్యోగాల పేరిట ఇద్దరు యువతులకు టోకరా

ఫిలింనగర్: తెలంగాణ సచివాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఇద్దరు యువతుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన నిందితుడిపై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన సీహెచ్ స్నేహ, అదే ప్రాంతానికి చెందిన బి.నిరోషా షేక్‌పేట సమీపంలోని ఓ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. స్నేహకు గత మార్చిలో మహ్మద్ అషూ అలియాస్ అఖిల్‌పాషా స్నాప్‌చాట్‌లో పరిచయమయ్యాడు. తాను సెక్రటేరియట్‌లో ఫైనాన్షియల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నానని, తనకు బాగా పరిచయాలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను నమ్మించాడు. జాబ్ కోసం ఆమె రూ.2.34 లక్షలు ఇచ్చింది. ఆమె నుంచి ఆధార్ కార్డు, పాన్‌కార్డుతో పాటు ఇతర డాక్యుమెంట్లను తీసుకున్నాడు. తెలంగాణ సెక్రటేరియట్ వాట్సాప్ గ్రూప్ అంటూ క్రియేట్ చేసి అందులో గవర్నర్, చీఫ్ సెక్రటరీ, ముఖ్యమంత్రి, మంత్రులు, ఐఏఎస్ అధికారులు ఉన్నట్లుగా చూపించాడు. ఆమె పేరును కూడా ఆ గ్రూపులో చేర్చాడు. తెలంగాణ చిహ్నంతో కూడిన లెటర్‌హెడ్‌పై ఆమెకు నకిలీ పత్రాలు కూడా అందజేశాడు. తీరా జాబ్ రాకపోయేసరికి ఇదేమిటని ప్రశ్నించింది. సమాధానం లేకపోగా, మూడు రోజుల నుంచి స్విచ్చాఫ్ చేశాడు. తెలంగాణ స్టేట్ ఎంబ్లమ్, సీఎం, గవర్నర్ సంతకాలు పోర్జరీ చేసి తనను మోసం చేసిన అషూపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఫిర్యాదు చేసింది. ఇదే హాస్టల్‌లో ఉంటున్న నిరోషా అనే యువతి నుంచి కూడా సెక్రటేరియట్‌లో ఉద్యోగం అంటూ అఖిల్‌పాషా లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. ఆమెను కూడా పోర్జరీ డాక్యుమెంట్లతో మోసగించడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ పోలీసులు అఖిల్‌పాషాపై సెక్షన్ 406, 419, 420, 465, 468, 471, 506ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుజయ్ కారంపూరికి కేటీఆర్ పరామర్శ



ప్రొఫెసర్ సుభాష్ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న కేటీఆర్

బండ్లగూడ: టీ ఫైబర్, టీ వర్క్స్ మాజీ ఎండీ సుజయ్ కారంపూరి తండ్రి ప్రొఫెసర్ సుభాష్ మంగళవారం మృతి చెందారు. మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఉదయం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రిస్పాండ్ విల్లాలో సుజయ్ ఇంటికి వెళ్లి సుభాష్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. సుజయ్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రొఫెసర్ సుభాష్ సుదీర్ఘ కాలంపాటు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో వివిధ హోదాల్లో పనిచేశారని, తెలంగాణ ఉద్యమంతో కూడా ఆయనకు అనుబంధం ఉందన్నారు. కేటీఆర్‌తోపాటు కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

'భూదాన్' బోర్డు పునరుద్ధరణకు కృషి

రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి



భూదాన్ రామచంద్రారెడ్డి జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

హిమాయత్‌నగర్: భూదాన్‌యజ్ఞ బోర్డును పునరుద్ధరించడానికి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని, ఆ భూములను తిరిగి బోర్డ్ పరిధిలోకి తీసువచ్చేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. భూదాన్ దాత వెదిరె రామచంద్రారెడ్డితోపాటు తెలంగాణ అమరుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాలలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో భూదాన్ రామచంద్రారెడ్డి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో వెదిరె రామచంద్రారెడ్డి 119వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ భూదాన్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులు కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా సర్వసేవా సంఘం జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు తోలుపునూరి కృష్ణ గౌడ్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గంట జలంధర్‌రెడ్డి, మహాదేవ్, వినయ్ చంద్రారెడ్డి, ప్రబోధ్ చంద్రారెడ్డి, భీంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మల్లు కరుణ, ఆరుట్ల శ్రీకాంత్‌రెడ్డి, చిట్యాల రామచంద్రం, దేవేందర్‌రెడ్డి, రవీంద్రచారి, శ్వేత ఐలమ్మ, చందు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ పెట్టి.. దోచేసిన కి'లేడీ'..

- నకిలీ స్థిరాస్తి పత్రాలతో నమ్మించి రూ.3.06 కోట్లు వసూలు
- సైబరాబాద్ పోలీసులకు చిక్కిన ఇందిరాదేవిరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: అధిక లాభాల పేరిట ఓ వ్యక్తికి ఆశపెట్టింది ఓ కి'లేడీ'. పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసింది. లాభాల సంగతేమోకానీ అసలు సొమ్ము అయినా తిరిగి ఇవ్వాలని అడిగితే బెదిరించింది. ఎట్టకేలకు సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్స్ వింగ్(ఈఓడబ్ల్యూ) పోలీసులకు చిక్కింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లికి చెందిన పానుగంటి ఇందిరాదేవిరెడ్డి అలియాస్ ఇందిరాలా ఇందిరాదేవిరెడ్డి నాగోల్‌లో దేవిఫుడ్స్, బ్యూటీపార్లర్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మదీనాగూడకు చెందిన ఎస్.సత్యనారాయణతో ఆమెకు పరిచయం ఏర్పడింది. తాను ప్రవాసరాలినని, తనకు నాగోల్, మాదాపూర్, గచ్చిబౌలి, నార్సింగి ప్రాంతాలలోని గేటెడ్ కమ్యూనిటీల్లో అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు ఉన్నాయని నమ్మించింది. నకిలీ యాజమాన్యపత్రాలను కూడా సృష్టించి చూపించింది. ఫుడ్ ఇండస్ట్రీ, బ్యూటీ పార్లర్‌లో పెట్టుబడి పెడితే అధికలాభాలు వస్తాయని ఆశపెట్టి సత్యనారాయణ నుంచి రూ.3.06 కోట్లు వసూలు చేసింది. బాధితుడి వద్ద నుంచి రెండు కార్లను తీసుకొని తనఖా పెట్టింది.

నూడో పోలీసులతో బెదిరింపులు..

అయితే ఆమె ఎంతకీ లాభాలు ఇవ్వడంలేదు. దీంతో లాభాలు కాదు కదా అసలు సొమ్ము అయినా వెనక్కి ఇవ్వాలని నిలదీయగా తన ఇద్దరు స్నేహితులు పోలీసు అధికారులని పరిచయం చేసింది. వారితో కలిసి తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బెదిరించి భయభ్రాంతులకు గురిచేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఇందిరాదేవిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమె నుంచి రెండు కార్లు, ఐ–ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈమె గతంలో మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోనూ ఇదే తరహా మోసాలకు పాల్పడింది. ఈ కేసులో బాధితుడి నుంచి రూ.కోటి వసూలు చేసింది.

సైబర్ వలకు చిక్కి..

పదిలంగా వెనక్కి!



పోగొట్టుకున్న రూ.18 లక్షలను బాధితుడికి ఇప్పించిన పోలీసులు

- రికార్డు స్థాయిలో 20 రోజుల్లో రిఫండ్ ప్రక్రియ
- ఫెడెక్స్ ఫ్రాడ్‌లో నష్టపోయిన అంబర్‌పేట వాసి
- మరో నాలుగు ఉదంతాల్లో రూ.28 లక్షలు ఫ్రీజ్

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో మోసపోవడం ఎంత తేలికో... ఈ కేసుల్లో నిందితులు అరెస్టు కావడం, పోగొట్టుకున్న నగదు వెనక్కి రావడం అంత దుర్లభం. అయితే సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు 'గోల్డెన్ అవర్'లో తమ వద్దకు వచ్చిన ఓ బాధితుడి సొమ్మును కేవలం 20 రోజుల్లో తిరిగి ఇప్పించారు. వివరాలు... అంబర్‌పేట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి గత నెల 27న ఫోన్‌కాల్ వచ్చింది. డిపార్టమెంట్ ఆఫ్ ఫెడెక్స్ నుంచి మాట్లాడుతున్నానని తెలిపాడు. బాధితుడి ఆధార్ వివరాలతో ముంబై నుంచి ఇరాన్‌కు ఓ పార్సిల్ బుక్ అయినట్లు చెప్పాడు. అందులో డ్రగ్స్, పాస్‌పోర్టు, బంగారం ఉన్నాయని, దీనిపై కేసు నమోదైందని బెదరగొట్టాడు. అదే ఆధార్‌తో కొన్ని బ్యాంకు ఖాతాల ద్వారా హవాలా లావాదేవీలైనట్లు మరింత భయపెట్టాడు. ఆర్‌బీఐ, సీబీఐని సంప్రదించి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసి పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలని, లేదంటే ఇబ్బందులు వస్తాయని చెప్పాడు.

రూ.19 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి

స్కైప్ కాల్ ద్వారా మాట్లాడిన సైబర్ నేరగాడు వెరిఫికేషన్ కోసం ఆర్బీఐకి చెందిన ఖాతాను బెనిఫిషియరీ ఖాతాగా యాడ్ చేసుకోవాలని బాధితుడికి సూచించాడు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి ఆ ఖాతాలోకి రూ.19,92,921 బదిలీ చేయాలని, నిర్ణీత సమయంలో ఆ డబ్బులు మళ్లీ వెనక్కు వస్తాయని నమ్మించాడు. ఈవిధంగా రూ.18 లక్షలు బదిలీ చేయించుకున్నాడు. తర్వాత మోసపోయానని గ్రహించిన బాధితుడు ఆ మరుసటి రోజు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించాడు. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ ఎస్.మట్టం రాజు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఈ వివరాలు పొందుపరిచారు. దీంతో సైబర్ నేరగాడి ఖాతాకు వెళ్లిన రూ.18 లక్షలు ఫ్రీజ్ అయ్యాయి.

కోర్టు ద్వారా 20 రోజుల్లో...

ఈ అంశాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లిన సైబర్ క్రైమ్ పోలీసులు ఫ్రీజ్ అయిన డబ్బులను బాధితుడికి అందించడానికి అనుమతి కోరారు. 20 రోజుల్లో సంబంధిత ప్రక్రియలు పూర్తి చేసి ఆ మొత్తాన్ని బాధితుడి ఖాతాకు బదిలీ చేయించారు. ఇలాగే 'గోల్డెన్ అవర్'లో పోలీసుల వద్దకు వచ్చిన మరో నలుగురికి సంబంధించిన కొంత మొత్తాన్ని అధికారులు ఫ్రీజ్ చేయించారు. నో యువర్ కస్టమర్ ఫ్రాడ్‌లో రూ.2 లక్షలు నష్టపోయిన వ్యక్తికి సంబంధించి రూ.1,75,185, ట్రాయ్ ఫ్రాడ్‌లో రూ.5.9 లక్షలు నష్టపోయిన బాధితుడికి సంబంధించిన రూ.4.73 లక్షలు, మరో ఘటనలో బాధితుడు నష్టపోయిన రూ.20,80,900, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్‌లో రూ.9.4 లక్షలు నష్టపోయిన వ్యక్తికి సంబంధించిన రూ.1.5 లక్షలు ఫ్రీజ్ చేయించారు. ఇలా నలుగురూ కోల్పోయిన రూ.37,32,900 లక్షల్లో రూ.28,07,085 ఫ్రీజ్ చేయించి బాధితులకు అందించే ప్రక్రియ ప్రారంభించారు.

జాబ్ ఫ్రాడ్‌లో నిందితుడి అరెస్టు

డేటా ఎంట్రీ జాబ్ పేరుతో నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి నుంచి రూ.5.73 లక్షలు కాజేసిన ఖమ్మంవాసిని సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అక్కడ ఓ ఇంటర్‌నెట్ కేఫ్ నడిపే ఇతగాడు విలాసాల నిమిత్తం డబ్బు కోసం పెడదారి పట్టాడు. తానో కన్సల్టెన్సీ మేనేజర్ అంటూ లోకల్ యాప్‌లో పొందుపరిచిన ఇతగాడు వివిధ రంగాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ప్రకటన ఇచ్చాడు. దీనికి ఆకర్షితుడైన నగరవాసి సంప్రదించగా... టీక్యూర్ కంపెనీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. రిజిస్ట్రేషన్ ఫీజు అని, ఇంకా ఏవేవో చెప్పి రూ.5.73 లక్షలను బాధితుడి వద్ద నుంచి కాజేశాడు. మోసపోయానని గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఏసీపీ శివమారుతి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ పి.ప్రమోద్‌కుమార్ నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు.

టెక్నాలజీతో ఐవీఎఫ్‌లో నాణ్యమైన సేవలు

బ్రహ్మ ఐవీఎఫ్‌ను ప్రారంభించిన బ్రహ్మానందం



పూజలు చేస్తున్న సినీనటుడు బ్రహ్మానందం

ఫిలింనగర్: మారుతున్న కాలానుగుణంగా టెక్నాలజీతో ఐవీఎఫ్‌లో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామని డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ పద్మజారెడ్డి అన్నారు. ఫిలింనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రహ్మ ఐవీఎఫ్ సెంటర్ క్లినిక్‌ను మంగళవారం ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ పద్మజారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఐవీఎఫ్ సమస్య తీవ్రంగా వేధిస్తున్నదని ఒకప్పుడు ఐవీఎఫ్ సమస్యలు వస్తే సరైన వైద్యం అందేది కాదని అన్నారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో నగరంలో ఐవీఎఫ్‌కు వైద్యం అందుతున్నదని అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలతో తాము వైద్యాన్ని అందిస్తున్నట్లు వారు తెలిపారు. గతంలో ఎంతో ఖరీదైన ఈ వైద్యం ఇప్పుడు మధ్య తరగతి కుటుంబాలకు కూడా అందుబాటులోకి వచ్చిందని అన్నారు. త్వరలోనే నగరంలో తమ శాఖలను విస్తరించబోతున్నట్లు వారు వెల్లడించారు.

డ్రైనేజీ పైప్‌లైన్లు వేయండి

ప్రజావాణిలో కాలనీవాసుల వినతి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని మిథిలా నగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని, ప్రస్తుతం ఖాళీ స్థలంలో సుమారు 25 నివాసాలకు సంబంధించిన డ్రైనేజీ పేరుకుపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు ప్రజావాణిలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం సమర్పించారు. కాలనీలోని సుమారు పాతిక ఇళ్లకు సంబంధించి డ్రైనేజీ పైప్‌లైన్‌ను కింద ఉన్న సయ్యద్‌నగర్ మ్యాన్‌హోల్‌లోకి కలపాల్సి ఉందని, అయితే సయ్యద్‌నగర్ బస్తీవాసులు గత కొంతకాలంగా ఇందుకు ఒప్పుకోవడం లేదని తెలిపారు. ప్రస్తుతం సయ్యద్‌నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ 200 ఎంఎం డయా ఉందని, మిథిలానగర్ కాలనీ డ్రైనేజీ కలిపితే సరిపోక ఓవర్‌ఫ్లో అవుతుందనే అనుమానాలు బస్తీవాసులు వ్యక్తం చేస్తున్నారన్నారు. సయ్యద్‌నగర్‌లో ఇప్పుడు ఉన్న పైపులు తొలగించి 250 ఎంఎం డయా పైపులు వేస్తే మిథిలానగర్ డ్రైనేజీ పైపులు కలిపేందుకు అవకాశం ఉంటుందని, బస్తీవాసులు కూడా ఇందుకు అంగీకరించారని, ఆ మేరకు పైప్‌లైన్ నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ, జలమండలి సంయుక్తంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. పార్కు స్థలం నుంచి ఈ పైపులు వేయాల్సి ఉంటుందని, జలమండలి నిధులు మంజూ రు చేస్తే పైప్‌లైన్ పనులు పూర్తవుతాయని, అప్పుడు మిథిలానగర్‌తో పాటు సయ్యద్‌నగర్‌కు డ్రైనేజీ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు.

కళాకారుడు వేముల నరేష్ మృతి

పంజాగుట్ట: తెలంగాణ ఉద్యమ కళాకారుడు, అరుణోదయ సాంస్కృతిక సంస్థ మాజీ నాయకుడు వేముల నరేష్ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కన్నుమూశారు. నరేష్ మృతి చెందడంతో తోటి కళాకారులు, ఆయన అభిమానులు ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని ఎన్నో వేదికలపై తన పాటలతో ప్రజలను చైతన్య పరిచారు. 2003–04 ప్రాంతంలో నల్గొండ జిల్లా దేవరకొండలోని రాచకొండ ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన పాదయాత్రతో తొలిసారి నరేష్ తెరపైకి వచ్చారు. ఆ పాదయాత్రలో ఆయనది కీలక పాత్ర. నరేష్ పాటలు అక్కడి ప్రజలను బాగా చైతన్య పరిచాయి. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా ఆయన పాల్గొని తన గొంతు వినిపించేవారు. ఎంతోమంది కళాకారులను ఉద్యమంలోకి తీసుకొచ్చిన నరేష్ మరణం కళారంగానికి తీరని లోటని పలువురు కళాకారులు ఆయన సేవలను కొనియాడారు.

తాతయ్య లేడని మనస్తాపంతో...

మనుమడు ఆత్మహత్య



అక్షిత్ (ఫైల్)

వెంగళరావునగర్: చిన్నతనం నుంచి ఎంతో అల్లారుముద్దుగా పెంచిన తాత మృతి చెందడాన్ని జీర్ణించుకోలేని మనుమడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో ని వాసం ఉండే కొత్తూర్ అక్షిత్ కుమార్ (16)కు చిన్నతనంలోనే తల్లి అర్చన చనిపోయింది. తండ్రి మద్యానికి బానిసయ్యాడు. దీంతో అక్షిత్‌కుమార్‌ను, అతని చెల్లి జ్యోత్స్నను పెద్దనాన్న చూసుకుంటూ చదివిస్తున్నాడు. అక్షిత్ యూసుఫ్‌గూడ శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. వీరిని తాత సాయిలు ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. ఆయన కూడా ఇటీవల మృతి చెందాడు. దీంతో అక్షిత్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం అక్షిత్ తన పెద్దనాన్న గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. ఎంతోసేపటికి తలుపు తీయకపోవడంతో అతని చెల్లి జ్యోత్స్న ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. హుటాహుటిన వచ్చి చూడగా చీరతో ఫ్యాన్‌ను ఉరివేసుకొని వేలాడుతున్నాడు. వెంటనే దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. తల్లి చిన్నతనంలో చనిపోవడం, తండ్రి మద్యానికి బానిస కావడం, ఎంతో ఇష్టమైన తాత ఇటీవల మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక క్షణికావేశంలో అక్షిత్ ఆత్మహత్య చేసుకున్నాడని పెద్దనాన్న సుదర్శన్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా ఛాన్స్ వద్దన్నందుకు...

మహిళకు బెదిరింపు

వెంగళరావునగర్: సినిమా ఛాన్స్ వద్దని అన్నందుకు మహిళను బెదిరింపులకు పాల్పడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కాకినాడ ప్రాంతానికి చెందిన మహిళ రహమత్‌నగర్‌లో ఉంటూ సినిమాల్లో నటిస్తోంది. ఈనెల 6వ తేదీ రాత్రి ఆమెకు వాట్సాప్ కాల్ వచ్చింది. తన నెంబర్ ఆమె స్నేహితురాలి ద్వారా తీసుకున్నానని, పెద్ద సంస్థలో నిర్మాతగా ఉంటున్నానంటూ పేర్కొన్నాడు. దానికి ఆమె ఆయన దగ్గర ఛాన్స్ వద్దని చెప్పింది. అతను మళ్ళీ వీడియో కాల్ చేశాడు. దీంతో ఆమె బ్లాక్ చేసింది. పదేపదే అదే నెంబర్ నుంచి ఫోన్ చేస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడు. విషయాన్ని ఆమె భర్తకు తెలపగా ఆయనను కూడా పరుషపదజాలంతో దూషించాడు. దీంతో విసుగుచెందిన ఆమె బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు





- తొలి ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు



తొలి ఏకాదశి సందర్భంగా పలు ఆలయాలకు భక్తులు ఉదయాన్నే చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉయదం నుంచే భక్తులు రావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్ టీటీడీ శ్రీవారి ఆలయం, ఫిలింనగర్ దైవసన్నిధానం, శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయం, జగన్నాథ ఆలయంలో రోడ్ నెం. 1/12 లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని ఫిలింనగర్ దైవసన్నిధానంలోని వేంకటేశ్వరస్వామికి సహస్ర తులసీ దళార్చన పూజలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. నగర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్ టీటీడీ శ్రీ వారి ఆలయానికి విచ్చేయడంతో ఆ మార్గాలన్నీ భక్తుల వాహనాలతో నిండిపోయాయి. శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకంతో పాటు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఇదిలా ఉండగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు రావడంతో పలు ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. –బంజారాహిల్స్





భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు



నందినగర్‌లో పీర్లను ఊరేగిస్తున్న నందియా అసోసియేషన్ సభ్యులు



నందినగర్ చిల్లా వద్ద పీర్లను దర్శించుకుంటున్న కార్పొరేటర్ విజయారెడ్డి...

వెంకటేశ్వరకాలనీ: మొహర్రం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్‌లో ఛిల్లా గౌస్ –ఇ–పాక్ మొహర్రం పీర్ నంద్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో పీర్ల పండుగ వేడుకలు, ఊరేగింపు వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఖాజా బందేనవాజ్, అల్లా మొహమ్మద్, ఇమామ్ హుస్సేన్ పీర్లకు ను ముస్తాబు చేసి దట్టీలు కట్టి, కుడుక బెల్లం, వెండి పంజాలు కట్టి ఘనంగా ఊరేగించారు. నందినగర్ నుంచి ఎల్లారెడ్డిగూడ వరకు ఈ పీర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామ్ దాస్‌చౌహాన్, ఉపాధ్యక్షులు మహ్మద్ అహ్మద్, వి. రాములు, మహ్మద్ సలీం, సెక్రటరీ చౌహాన్ శంకర్, సంయక్త కార్యదర్శి ఫరీద్ షరీఫ్, జోగ్యా, పి. కిషన్, షహబుద్దీన్, రూపాల్ నాయక్, దశరథ్, ప్రసాద్ యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

నందినగర్ చిల్లా వద్ద...

నందినగర్ ఖుష్బూ విద్యానికేతన్ పక్కన ఉన్న చిల్లా వద్ద మొహర్రం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖైరతాబాద్ టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి పాల్గొని పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దశరథ చౌహాన్, ప్రసాద్, రాములు, బుజిగా, ఫెరోజ్, ఖదీర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

లిబర్టీ: ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యాసంస్థల యాజమాన్యాలు పేచీ పెట్టడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ విద్యార్థులు తీవ్ర అగచాట్లకు గురవుతున్నారని బీసీ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమార స్వామి పేర్కొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కొరడా ఝులిపించాలని కోరారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివేందుకు సర్టిఫికెట్లు ఇవ్వమని కళాశాల యాజమాన్యాన్ని కోరితే ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని షరతులు విధించడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, పీజీ, డిగ్రీ ఇతర వృత్తి విద్యార్థులు పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరితే కళాశాల యాజమాన్యాలు ముప్పుతిప్పలు పెట్టి విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొన్నదని కుమారస్వామి పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుందని బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు యాజమాన్యాలకు మొర పెట్టుకున్న వినిపించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. పలు కాలేజీలు, విశ్వవిద్యాలయాల యజమాన్యాలు వేధింపులకు గురవుతున్నారని స్పష్టం చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లు ఆపొద్దని ఉన్నత విద్యా మండలి రాష్ట్ర హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ విశ్వవిద్యాలయాల కళాశాల యాజమాన్యాలు ఖాతరు చేయడం లేదన్నారు. కళాశాల యాజమాన్యాలపై ఉన్నత విద్యా మండలి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి అవసరమైతే కోర్టు ధిక్కరణ కేసును సుమోటాగా తీసుకొని యజమాన్యాల ఆగడాలను కట్టడి చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

వాడవాడలా అన్నదానాలు, షరబత్‌ల పంపిణీ

- మొహర్రంను పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు
- మసీదుల్లో ఇస్లాం బోధనలు



బోరబండలో షర్బత్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు హబీబాసుల్తానా..

రహమత్‌నగర్: మొహర్రం సందర్భంగా బుధవారం బోరబండ, రహమత్‌నగర్ డివిజన్‌లలో ముస్లిం సోదరులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బోరబండలో స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ షర్బత్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కృష్ణమోహన్, విజయ్‌కుమార్, సర్దార్, మేరి తదితరులు పాల్గొన్నారు.

- రహమత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్ మసీద్–ఏ–సయ్యదిన ఫరూఖ్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, షరబత్ పంపిణీ చేశారు. అంతేగాక ఉపవాస దీక్ష బూనిన ముస్లిం సోదరులకు సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. అనంతరం స్థానిక మసీదులో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ ఇస్లాం మత పెద్దలు హజ్రత్ సయ్యద్ సాగీర్ అహ్మద్ నక్షబంది, డా.సయ్యద్ ఖలీఉల్లా ఓవైసీ బుఖారి నక్ష బందిలు ఇస్లాం బోధనలు వివరించారు. మసీదు కమిటీ నిర్వాహకులు ఫెరోజ్ ఖాన్, కమిటీ మెంబర్ జాకీర్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు ఇంతేయాజ్ ఖాన్‌తో పాటు ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- రహమత్‌నగర్ డివిజన్ ఇందిరానగర్‌లో స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పీర్లకు మొక్కులు చెల్లించుకున్నారు. నాయకులు భాస్కర్, అంతయ్య, సి. శ్రీనివాస్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు. బోరబండ డివిజన్ ఎస్పార్టీనగర్‌లో ముస్లింలు ఏర్పాటు చేసిన షరబత్ పంపిణీలో కాంగ్రెస్ నా యకురాలు, కార్పొరేటర్‌బాబా ఫసీ యుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పేరుతో మోసం

వెంగళరావునగర్: ఇన్సూరెన్స్ ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే వేణుకుమార్ వీఎఫ్‌ఎక్స్‌లో విధులు నిర్వహిస్తుంటాడు. కొంతకాలం కిందట అతనికి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు వచ్చింది. ఈనెల 7న ఎస్‌బీఐ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని అతనికి ఫోన్ వచ్చింది. కార్డు ద్వారా ఇన్సూరెన్స్ ఇస్తున్నట్టు తెలియజేసి వేణుకుమార్‌కు ఓటీపీ పంపి దానిని వివరాలు తెలుసుకున్నారు. ఓటీపీ ఇతర వివరాలు కస్టమర్ కేర్ నెంబర్‌లోని వ్యక్తికి తెలియజేయగా అతని క్రెడిట్ కార్డు నుంచి రూ.30,582లు డెబిట్ అయినట్టుగా మెసేజ్ వచ్చింది. దీంతో బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆగస్టు 1న హంస, సింహ అవార్డ్స్ ప్రదానోత్సవం

హిమాయత్‌నగర్: వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన ప్రముఖులకు హంస, సింహ –2024 పేరుతో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్, ఫ్రెండ్షిప్ మినీస్ట్రీస్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఆలూరి విల్సన్ తెలిపారు. ఆగస్టు 1వ తేదీన హిమాయత్‌నగర్‌లోని ఎలివేట్స్ కల్చరల్ ఎలైట్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సేవా, కళా, సాహిత్యం, సినీ, టీవీ, థియేటర్, షార్ట్ ఫిల్మ్, థియేటర్, వాస్తు నిపుణులు, జ్యోతిష్యులు, జర్నలిస్ట్, డాక్టర్, లాయర్, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, విద్యావేత్తలు వ్యవసాయ రంగం, చేనేత రంగం, క్రీడలతో సహా వివిధ రంగాలకు చెందిన వారు ఈ అవార్డులకు అర్హులని ఎంట్రీల నమోదుకు జులై 25 చివరి తేదీ వరకు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు డా. ఆలూరి విల్సన్ 9396610766, 9494861669 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

మొక్కలు నాటిన దానం



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నాగేందర్

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ ఎమ్మె ల్యే దానం నాగేందర్ బుధవారం ఖైరతాబాద్ వెల్‌ఎన్ సెంటర్, పార్కులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వెల్‌నెస్ సెంటర్ వైద్యులు, స్థానిక నాయకులతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హిందూ ముస్లింల ఐక్యతను తెలియజేసేదే మొహర్రం

–టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి

హిమాయత్‌నగర్: హిందూ ముస్లింల ఐక్యతను తెలియజేసేదే మొహర్రం అని, అందుకు హైదరాబాద్ నగరమే ప్రతీక అని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి అన్నారు. మొహర్రంను పురస్కరించుకొని బుధవారం హిమాయత్ నగర్ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 4 ఫరీద్ బస్తీలో ఏర్పాటు చేసిన అలం (పీర్లు)ను ఆమె దర్శించుకుని ముస్లిం సోదరులతో కలసి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగస్టు 6న రవీంద్రభారతిలో గద్దర్ వర్ధంతి సభ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యకిరణ్

పంజగుట్ట: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 6వ తేదీన ప్రజా యుద్ధనౌక గద్దర్ మొదటి వర్ధంతిని పురస్కరించుకుని రవీంద్రభారతిలో వర్ధంతి వేడుకలు నిర్వహించనున్నట్లు గద్దర్ ఫౌండేషన్ చైర్మన్, గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలను ఉద్యమ కారుడు గాదె ఇన్నయ్య, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్, ట్రైబ్స్ కో ఆపరేటీవ్ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, గాయకుడు ఏపూరి సోమన్న, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృధ్వీరాజ్ యాదవ్‌లు తెలిపారు. చంద్రబాబు పాలనలో గద్దర్‌ను అంతమొందించేందుకు చూసినా తెలంగాణ సమాజం మొత్తం కలసి ఆయనను బతికించుకుందని గుర్తుచేశారు. ఆగస్టు 6న ఆయన వర్ధంతి సభ కాదని, ఆయన ఆశయాలను సాధించే సభ, ఆయన ఆలోచనలకు పదునుపెట్టే సభగా పేర్కొన్నారు. సామాజిక కళారూపాన్ని ప్రజలకు అందించిన మహానుభావుడు గద్దర్ అన్నారు. అంబేడ్కర్, కాన్షిరామ్ తరువాత భారతదేశం మొత్తం గుర్తించదగ్గ వ్యక్తి గద్దర్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, బిజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు అందరినీ ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దర్ సహచరులు సి.ఎల్.యాదగిరి, రాందాస్ పాల్గొన్నారు.

ఎన్నికలపై అనుమానాలను నివృత్తి చేయాలి

లిబర్టీ: ఎన్నికల ఫలితాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మళ్లీ లెక్కించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే జోక్యం చేసి తిరిగి లెక్కించి అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం మళ్లీ ఓట్లను లెక్కిస్తే తప్ప వివిధ వర్గాలు, మేధావుల్లో ఉన్న అనుమానాలు నివృత్తి అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈవీఎంలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో మళ్లీ లెక్కిస్తే అనుమానాలు తీరుతాయన్నారు.

పండుగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకం

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్



సాయన్న చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న బండ ప్రకాశ్ ముదిరాజ్

హిమాయత్‌నగర్: పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన బహుజన వీరుడు పండుగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకమని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ పోరాట యోధుడు పండుగ సాయన్న జయంతి సందర్భంగా బుధవారం హైదర్‌గూడలోని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో సాయన్న చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండ ప్రకాశ్ ముదిరాజ్ మాట్లాడుతూ సాయన్న నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి పేదలకు అండగా నిలిచిన మహానుభావుడని కొనియాడారు. సాయన్న జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, యాదగిరి, కార్యనిర్వహక కార్యదర్శి కనకయ్య, కపాసాగర్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పండుగ బాలు, రాష్ట్ర కో ఆర్డినేటర్ బొక్క శ్రీను ముదిరాజ్, నాయకులు రమేష్, పోకల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనుల్లో జాప్యం

పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంక్షేమ సంఘం

రహమత్‌నగర్: బోరబండ శ్మశాన వాటికలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంక్షేమ సంఘం ప్రతినిధులు అన్నారు. బుధవారం శ్మశాన వాటికను ఆ సంఘం ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ 54 బస్తీల ప్రజల సౌకర్యార్థం దివంగత పీజేఆర్ నాటి ప్రభుత్వ అధికారులను ఒప్పించి ఐదు ఎకరాలు స్థలాన్ని శ్మశాన వాటిక కోసం కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శ్మశాన వాటికను మరింత అభివృద్ధి పర్చాలని తమ కమిటీ ఆధ్వర్యంలో లోకాయుక్త న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, ఈ మేరకు కోటి 75 లక్షలు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో ఘాట్లు, స్నానాల గది, అస్థికలు భద్ర పరుచుగది, గ్యాస్ ఖననం చేసి యంత్రాంగం, పిండా ప్రదానం చేసే హాల్ తదితర నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అయితే శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు మందకొడిగా జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని లోకాయుక్త న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు యాదయ్య తెలిపారు. ఇకపై తమ కమిటీ వారానికోసారి శ్మశాన వాటికను సందర్శించి పనులను పరిశీలించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బిట్ల చెన్నయ్య,వైవైస్ చైర్మన్ గౌలుసుల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి అబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముద్దంగుల శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు స్వాగతం పలికిన వినోద్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) కార్యవర్గ సమావేశానికి హాజరయ్యేందుకు బుధవారం ప్రజాభవన్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు తదితరులు ఉన్నారు.

ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు

కేపీహెచ్‌బీ కాలనీ: జేఎన్‌టీయూ యూనివర్సిటీ హాస్టల్‌లోని మంజీరా బాలుర వసతి గృహంలో ఆదివారం రాత్రి పిల్లి వచ్చి ఆహారం తిన్నదన్న ఘటనపై బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డా.జి.వి.నరసింహారెడ్డి, వార్డెన్ డా.యస్.దర్గా కుమార్ విచారణ చేపట్టి జరిగిన ఘటనపై వివరణ ఇచ్చారు. హాస్టల్‌లో ఓ కిటికీ తెరిచి ఉండటంతో విద్యార్థులు భోజనాలు ముగిసిన తర్వాత ఓ పిల్లి వచ్చిందని, భోజనం సమయంలో, వంట చేసే సమయంలో రాలేదన్నారు. జేఎన్‌టీయూ హాస్టల్లో ఆహార పదార్థాల్లో పిల్లి మూతి పెట్టిందన్న అంశం పరిశీలన కోసం గవర్నమెంట్ వెరిఫికేషన్ కమిటీ అధికారులు మంజీర హాస్టల్‌ను పూర్తిస్థాయి పరిశీలన చేశారని, కిటికీ తెరవడం వల్ల పిల్లి లోపలకు వచ్చింది కానీ, ఎటువంటి ఆహార పదార్థాలు ముట్టుకోలేదన్నారు. కొందరు విద్యార్థులు హాస్టల్ సిబ్బందిపై ఉద్దేశపూర్వకంగా వారి ప్రతిష్ట దిగజార్చే విధంగా సోషల్ మీడియాలో వైరల్ చేయాలనే దురాలోచన చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పరిశీలించి నిజనిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ తెలిపారు. విషయాన్ని రెక్టార్ డా.కె.విజయకుమార్, రిజిస్ట్రార్ డా.కె. వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

మీ సమయస్ఫూర్తికి హ్యాట్సాఫ్



సాక్షి, సిటీబ్యూరో: కారు ఏసీలో నుంచి ఎగిసిపడ్డ మంటల్లో చిక్కుకున్న వ్యక్తిని వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు కాపాడారు. ఈ సందర్భంగా సిబ్బందిని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు బుధవారం నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో రివార్డుతో అభినందించారు. ఈ నెల 15న వెంకటేష్ అనే వ్యక్తి తన మహీంద్రా కేయూవీ కారులో జిల్లెలగూడ ఆర్సీఐ రోడ్డు నుంచి కడ్తాల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కారులోని ఏసీ నుంచి మంటలు చెలరేగాయి. తక్షణమే స్పందించిన అక్కడే విధులు నిర్వహిస్తున్న వనస్థలిపురం ట్రాఫిక్ సిబ్బంది నర్సింగ్ రావు, కృష్ణ, సాయిరాం కారు డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. కారును ఆపి అతడి ప్రాణాలు కాపాడారు. సెకన్ల వ్యవధిలో మంటలు మరింత ఎక్కువ కావడంతో అటువైపుగా ఇతర వాహనాలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అటుగా వెళుతున్న ఒక వాటర్ ట్యాంకర్‌తో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చాకచక్యంగా వ్యవహరించిన ట్రాఫిక్ సిబ్బంది సమయస్ఫూర్తిని సీపీ అభినందించారు. ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కేటీఆర్ పరామర్శ



ఎల్బీనగర్: అనారోగ్యంతో నగరంలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని బుధవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. సుధీర్‌రెడ్డి ఆరోగ్యంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్‌తో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఉన్నారు.

కబడ్డీ, హాకీలో అభ్యాస పాఠశాలకు మెడల్స్

సాక్షి, సిటీబ్యూరో: అసోసియేషన్ ఆఫ్ ఐసీఎస్ఇ, ఐఎస్‌సీ స్కూల్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజియన్‌లో జరిగిన కబడ్డీ, హాకీ పోటీల్లో అభ్యాస పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కుంట్లూరు జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో జరిగిన తెలంగాణ రీజియన్ 2024–25 కబడ్డీ పోటీల్లో అండర్–14, 17 కేటగిరీల్లో స్వర్ణ పతకాలు సాధించగా, అండర్–19లో రజత పతకం, హాకీ టోర్నమెంట్‌లో అండర్–14, 17, 19 విభాగాల్లో స్వర్ణం సాధించిందని అభ్యాస పాఠశాల డైరెక్టర్ వినాయక కల్లెట్ల ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలు అత్యుత్తమ ప్రదర్శనతో సత్తా చాటారన్నారు. కబడ్డీ అనేది పోరాట క్రీడ, ఇలాంటి ఛాలెంజింగ్ క్రీడల్లో ఆడపిల్లలు రాణించడం సంతోషంగా ఉందన్నారు.

డెఫ్ స్కూల్‌కు స్కిల్‌సాఫ్ట్ చేయూత



సాక్షి, సిటీబ్యూరో: స్కిల్‌సాఫ్ట్ ఇండియా ఆధ్వర్యంలో పీపుల్ విత్ హియరింగ్ ఇంపెయిర్డ్ నెట్‌వర్క్ (పీహెచ్‌ఐఎన్) డెఫ్ స్కూల్‌లో ముఖ్యమైన మౌలిక సదుపాయాలను సమకూర్చింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మలక్‌పేట్‌లోని పీహెచ్‌ఐఎన్‌లో నిర్మించిన సదుపాయాలను స్కిల్‌సాఫ్ట్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ ప్రయత్నం 120 మంది విద్యార్థులు, 10 మంది సిబ్బందికి ప్రయోజనం చేకూర్చిందని రామకృష్ణన్ తెలిపారు. ఇందులో భాగంగా ఆన్–సైట్ కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్ రూమ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులు డిజిటల్ లెర్నింగ్ కోసం అద్దె కేంద్రాలకు వెళ్లకుండా సహకారం అందించామన్నారు. విద్యార్థులు నేర్చుకోవడానికి, వారి కార్యకలాపాలకు తగినంత స్థలాన్ని అందించడంతో పాటు కేబుల్స్, ఫ్యాన్లు, ఆవరణ అంతటా లైటింగ్ సిస్టమ్ వంటి సౌలభ్యాలను ఏర్పాటు చేశాం. అదనంగా పాఠశాలకు కోట్ పెయింట్‌తో పాటు మూడు కొత్త పూర్తిస్థాయి వాష్‌రూమ్‌లను నిర్మించామని పేర్కొన్నారు.

సాక్షాత్తు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు అధ్వానంగా తయారైంది. పాఠశాల నిర్వహణతో పాటు విద్యాబోధన, ఉత్తీర్ణత శాతంలో కూడా పూర్తిగా వెనుకబడింది. గత విద్యాసంవత్సరం పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక చర్యలు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆచరణ అమలులేక పాత పరిస్థితే పునరావృతమైంది. విద్యాశాఖ అధికారులు పనితీరులో అడుగడుగునా అలసత్వం బహిర్గతం అవుతుండటంతో ఇటీవల ప్రత్యేక అధికారుల పేరిట వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులకు పాఠశాలను సందర్శించి తనిఖీ చేసే బాధ్యతలు అప్పగించారు. కానీ పరిస్థితి ఎక్కడ వేసిన గంగొలి అక్కడే అన్న చందంగా తయారైంది. కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి రెండు వారాలు గడిచినా.. ఏ ఒక్క అధికారి స్కూల్‌ను సందర్శించి నివేదిక సమర్పించిన దాఖలాలు లేనట్లు తెలుస్తోంది. దీంతో సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఆదేశాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



గోల్కొండలోని పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి (ఫైల్)

స్పెషల్ ఆఫీసర్.. ఫెయిల్..

ప్రత్యేకంగా 24 మంది జిల్లా అధికారుల నియామకం

- రెండు వారాలు గడిచినా స్కూళ్ల సందర్శన జాడలేదు
- హైదరాబాద్‌లో సర్కారు బడుల్లో పనితీరు అధ్వానం
- కనీస పర్యవేక్షణ లేక విద్యార్థులకు తప్పని తిప్పలు
- సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు బుట్టదాఖలు

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు పాఠశాలలో కనీస వసతుల కల్పన కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట పనులు మంజూరు చేసి వాటి పర్యవేక్షణ బాధ్యతలు విద్యాశాఖ అధికారులకు అప్పగించినా.. ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తికాకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పాఠశాల పునః ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు విద్యార్థులకు పంపిణీ చేసే విధంగా స్కూల్ పాయింట్లకు ఇండెంట్ సరఫరా చేసినా.. విద్యార్థులకు పంపిణీ మాత్రం అంతంతగానే తయారైంది. ఇటీవల సాక్షాత్తు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి యూనిఫాం కుట్టుశిక్షణ కేంద్రాలను సందర్శించి త్వరగా యూనిఫాంలు పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టారు. మరోవైపు రెండు మూడు పాఠశాలలను సందర్శించి యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలపై ఆరా తీయగా కొందరు విద్యార్థులు తమకు అందలేదని చెప్పిన సమాధానం కలెక్టర్‌కు ఖంగుతినిపించింది. తక్షణమే సంబంధిత హెచ్ఎం, విద్యాశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి మిగతా వారు అప్రమత్తం ఉండే విధంగా హెచ్చరిక సూచన చేసినా క్షేత్రస్థాయి పరిస్థితిలో మాత్రం మార్పు కనిపించడం లేదు.

691 పాఠశాలలు.. 24 మంది ప్రత్యేక అధికారులు

ప్రభుత్వ పాఠశాల పనితీరు మెరుగు పర్చేందుకు క్షేత్రస్థాయి పరిస్థితిపై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విద్యాశాఖ అధికారుల పనితీరులో అలసత్వం ప్రదర్శిస్తుండటంతో ఏకంగా వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులను రంగంలోకి దింపి వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది. జిల్లాలో మొత్తం 691 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. సుమారు 24 మంది జిల్లాస్థాయి అధికారులను నియామిస్తూ ఈ నెల 4న జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో అధికారి తమకు కేటాయించిన మండలంలోని పాఠశాలలను సందర్శించి పాఠశాల వారిగా నివేదిక సమర్పించేందుకు అంశాల వారిగా ప్రత్యేక ఫార్మెట్ కూడా అందించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య, హాజరు, టీచింగ్, నాన్‌టీచింగ్ వివరాలు, భవన సముదాయం, కనీస వసతులు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, యూనిఫాంల పంపిణీ, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల పరిస్థితి తదితర అంశాలను సమగ్రంగా నివేదిక రూపంలో సమర్పించే విధంగా ఆదేశించారు.

వారంలో మూడు స్కూల్స్

ప్రతివారం ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలంలోని మూడు స్కూళ్లను సందర్శించి అక్కడి పరిస్థితిపై సమగ్ర నివేదిక డీఈఓకు అందజేయాలి. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో ప్రత్యేక అధికారుల నివేదికలను కలెక్టర్ దృష్టికి తీసుకురావాల్సి ఉంటుంది. కానీ, ఆచరణలో అమలు మాత్రం లేకుండా పోయింది. జిల్లా అధికారులు తమ శాఖ పనుల్లో బిజీగా ఉండటంతో పాఠశాలల సందర్శన తలకుమించిన భారంగా తయారైంది. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే.. సర్కారు బడులు మరింత అధ్వానంగా తయారు కావడం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మండలం	పాఠశాలల సంఖ్య	ప్రత్యేక అధికారులు
అంబర్‌పేట	35	పవన్‌కుమార్, జీఎం, పరిశ్రమ శాఖ
అమీర్‌పేట	8	కే.రమేశ్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్
ఆసిఫ్‌నగర్	43	యాదయ్య, డీడీ, ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
ఆసిఫ్‌నగర్-2	44	ఒడెన్న, ఇంటర్మీడియెట్ అధికారి
బహదూర్‌పురా	46	ఇలియాస్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి
బహదూర్‌పురా-2	65	ఆశన్న, బీసీ అభివృద్ధి అధికారి
బండ్లగూడ	36	కాటోజీ, ఏడీ, ట్రైబల్ అభివృద్ధి అధికారి
బండ్లగూడ	50	ఏ.రాజేందర్, ఏడీ, వికలాంగుల శాఖ
చార్మినార్	23	అక్కేశ్వరరావు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి
చార్మినార్-2	25	రమదేవి, జిల్లా సహకార శాఖ అధికారి
గోల్కొండ	26	సురేందర్, సీపీఓ
హిమాయత్‌నగర్	16	విజయ్‌కుమార్, రీజినల్ కో ఆర్డినేటర్, మైనార్టీ శాఖ
ఖైరతాబాద్	13	కేశవులు, డీడీ, సర్వే డిపార్ట్‌మెంట్
ఖైరతాబాద్	30	జగన్నాథరావు, డీడీ, భూగర్భ జలశాఖ
మారేడ్‌పల్లి	19	సుధాకర్, జిల్లా క్రీడా అధికారి
ముషీరాబాద్	09	రమేష్, డీఎస్వో, సివిల్ సప్లై
ముషీరాబాద్- 2.	20	చిత్రారెడ్డి, జిల్లా మత్స్యశాఖ
నాంపల్లి	45	రాజేంద్రప్రసాద్, కార్మికశాఖ
సైదాబాద్	21	నాగాలక్ష్మి, డీడీ, వయోజన విద్య
సైదాబాద్-2.	18	డాక్టర్ వెంకటేశ్వర్లు, పశు సంవర్థశాఖ
సికింద్రాబాద్	29	మైత్రి, జిల్లా ఉపాధి కల్పన అధికారి
సికింద్రాబాద్-2.	16	ప్రభావతి, కార్మిక శాఖ
షేక్‌పేట	26	ఇందిరా, ఏడీ, హ్యాండ్లూమ్
తిరుమలగిరి	28	వర్మ, ఆర్‌సీఓ, బీసీ సంక్షేమ అధికారి

నగరంలో నేడు

- అమరుల బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు సదస్సు.
- సీఐటీయూ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు సదస్సు.
- కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం.
- ముస్లింలకు విద్య, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లపై లమాకాన్‌లో సాయంత్రం 4 గంటలకు సమావేశం

నేడు ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం



చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నారు. సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఐదో బంగారు బోనాన్ని సికింద్రాబాద్‌కు బాజా భజంత్రీల నడుమ భారీ ఊరేగింపుగా వెళ్లనున్నారు. పాతబస్తీ మీరాలంమండి మహంకాళేశ్వర అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సామూహిక ఊరేగింపుగా సికింద్రాబాద్‌కు వెళ్లి బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు, వడి బియ్యం సమర్పించనున్నామని కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్–2024 పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్–2024–25 దరఖాస్తు నమోదు ప్రక్రియపై వాల్ పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారిణి రోహిణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టడంతో పాటు వారి ఆలోచనలను ఆవిష్కరించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్ట్ బి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్ రావ్, సూపరింటెండెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా స్థలంపై విజిలెన్స్ కొరడా

- మిథిలానగర్‌లో వంద కోట్ల విలువైన పార్కు కబ్జా నుంచి విముక్తి
- ఇది మహిళలు సాధించిన విజయం..
- అక్రమ నిర్మాణాల కూల్చివేత..
- పార్కును అభివృద్ధి చేస్తామంటున్న అధికారులు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని కమాన్‌లో ఉన్న మిథిలానగర్ కాలనీలో రూ.100 కోట్ల విలువ చేసే ఖరీదైన పార్కు స్థలానికి కబ్జాదారుల చెర నుంచి విముక్తి లభించింది. గత 18 సంవత్సరాలుగా కాలనీ మహిళలు చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించి పార్కు స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ పార్కు స్థలం కబ్జాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి స్థలాన్ని పరిశీలించి సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం అక్రమ నిర్మాణాలను కూల్చివేయించి పార్కు స్థలాన్ని జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీకి స్వాధీనపర్చేలా చర్యలు తీసుకున్నారు. ఈ స్థలం విలువ సుమారు రూ.100 కోట్లు ఉంటుంది. మిథిలానగర్ కాలనీ లేఅవుట్‌లో 5060 గజాల స్థలాన్ని పార్కు నిర్మాణం కోసం ఓపెన్ స్పేస్‌గా వదిలారు. అయితే ఖాళీగా ఉన్న ఈ స్థలంపై కబ్జాదారులు కన్నేసి ఎవరినీ లోపలికి అడుగు పెట్టనీయకుండా కొంత కాలంగా తమ ఆధీనంలో ఉంచుకున్నారు. మిథిలానగర్ కాలనీలోని ప్లాట్‌నెంబర్ 55, 56 యజమానులు ఈ పార్కు స్థలంలోని సుమారు 700 గజాల స్థలాన్ని కబ్జా చేసి తమ ఆధీనంలోకి తీసుకుని ఇక్కడ ప్రహరీలను కూడా నిర్మించుకున్నారు. పక్కనే ఉన్న సయ్యద్‌నగర్ నివాసి ఇదే పార్కు స్థలంలోని 250 గజాల స్థలాన్ని కబ్జా చేసి ఇల్లు నిర్మించుకున్నాడు. ఈ అక్రమ నిర్మాణాలను తొలగించి పార్కును అభివృద్ధి చేసి కమ్యూనిటీహాల్ నిర్మించాలంటూ కాలనీకి చెందిన 25 మంది మహిళలు ×సహేలి¤ అనే గ్రూపును ఏర్పాటుచేసుకుని పోరాటం మొదలుపెట్టారు. ఈవీడీఎం కమిషనర్‌గా రంగనాథ్ బాధ్యతలు స్వీకరించిన రెండు రోజులకే ఈ పార్కు కబ్జాపై ఫైళ్లు తిరగేశారు. ఘటనా స్థలానికి చేరుకుని డాక్యుమెంట్లు పరిశీలించారు. కాలనీ లేఅవుట్‌లో ఖాళీ స్థలంగా గుర్తించి నాలుగు రోజుల పాటు ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనపర్చుకున్నారు. ఈ విశాలమైన పార్కు స్థలాన్ని అందంగా తీర్చిదిద్దాలని జీహెచ్ఎంసీ యూబీడీకి లేఖ రాశారు. కొద్ది రోజుల్లో పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి. మొత్తానికి మహిళల పోరాటం వృధా కాలేదు. ఈవీడీఎం కమిషనర్‌గా రంగనాథ్ రావడంతోనే పార్కులో ఆక్రమణలకు తెరపడిందనే చెప్పాలి. ఈ స్థలంలో ప్లాట్ నెంబర్ 55, 56 వెనుకన ఆక్రమణలు కూల్చివేసిన ప్రాంతంలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని స్థానిక మహిళలు కోరుతున్నారు. అలాగే పార్కు చుట్టూ ప్రహరీగోడ ఎత్తు పెంచాలని, భవిష్యత్తులో కబ్జా కాకుండా ఉంటుందని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

కళాకారుల సమస్యల్ని పరిష్కరిస్తాం



చిక్కడపల్లి: సాంస్కృతిక సంఘాలతో సంబంధింత శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కళాకారుల సమస్యల్ని పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో టీఎన్‌జీఓ, టీజీఓలకు నూతనంగా ఎంపికైనా సభ్యులకు జరిగిన అభినందన సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులను సన్మానించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మంత్రికి కళాకారులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆమని, సుభాష్, పద్మశ్రీల గీతాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖులు కోలేటి దామోదార్ గుప్తా, ఎంకే రాము, కళా జనార్దనమూర్తి, లోకం కృష్ణయ్య, రాజేష్, మల్లెల వసుంధర, నిర్మలా ప్రభాకర్, కుసుమ భోగరాజు, వెంకటరావు, శారద, జ్ఞానవల్లి, జగదీశ్వర్, ముజీబ్, సత్యనారాయణగౌడ్, ఏలూరి శ్రీనివాస్, దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.

కారంచేడు బాధితుల పోరాటం స్ఫూర్తిదాయకం



కేఎన్‌పీఎస్ సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కారంచెడు బాధితులు నడిపిన పోరాటం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత అన్నారు. ఎన్నో సవాళ్లు, ప్రశ్నలకు సమాధానాలు అందిస్తూ కారంచెడు ఉద్యమం సాగిందన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కుల నిర్మూలన పోరాట సమితి తెలంగాణ ఆధ్వర్యంలో కారంచెడు దళిత మృతవీరుల సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సూరేపల్లి సుజాత మాట్లాడుతూ ఆత్మగౌరవ ప్రతిఘటన పోరులో అసువులుబాసిన కారంచెడు దళిత మృతవీరులకు జోహార్లు అర్పించడం అభినందనీయం అన్నారు. వారి స్ఫూర్తిని పొందినప్పుడే వారికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. కేఎన్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి భూరం అభినవ్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా మానకుండా ఉన్న నెత్తుటి గాయం కారంచెడు ఘటన అన్నారు. 23 ఏళ్ల పోరాటంలో విజయం సాధించారని తెలిపారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జయరాజు, హైకోర్టు న్యాయవాది బత్తుల కార్తిక్, సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు రెంజర్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాగణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: తిరుపతి, యాదాద్రిలో ఉత్సవాలను ఎంత ఘనంగా నిర్వహిస్తారో.. ఈ ఏడాది ఖైరతాబాద్ మహాగణపతి నవరాత్రి ఉత్సవాలను సైతం అంతే వైభవంగా జరిపిస్తామని, గిన్నిస్ బుక్ చోటు సంపాదిస్తామని స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహాగణపతి తొలి పూజలకు ముఖ్యమంత్రిని, గవర్నర్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. మహాగణపతి నమూనాను శుక్రవారం విడుదల చేస్తామని నిర్వాహకులు తెలిపారు. అడ్‌హక్ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్, సభ్యులు వీణా మాధురి, సందీప్‌రాజు, సురేందర్ ముదిరాజ్, రమేష్ బిల్డర్, గజ్జల నాగేష్, బాలకుమార్, పూసమురళి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్



జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గడ్డం ప్రసాద్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బండ్లగూడ: ముదిరాజ్‌ల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మాసాబ్‌ట్యాంక్ తెలుగు సంక్షేమ భవన్ 6వ అంతస్తులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, టీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షులు ఎండీ ఫాహింఖురేషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అతి పెద్ద సామాజికవర్గమైన ముదిరాజ్ కులం, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై రేవంత్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉందన్నారు. ముదిరాజ్‌ల సమస్యలపై బహిరంగంగా ప్రస్తావించిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల్లో ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగానే వాడుకుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక టికెట్ కూడా ఇవ్వకుండా అవమానించిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌ల సమస్యలపై సానుకూలంగా స్పందించి ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి తనను మొదటి చైర్మన్‌గా ఎన్నుకోవడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

తుర్రెబాజ్ ఖాన్ త్యాగం మరువలేనిది



కోఠి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న చాడా వెంకట్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: తుర్రెబాజ్ ఖాన్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బ్రిటీష్, నైజాం సైన్యాలకు వ్యతిరేకంగా 1857 జులై 17న తుర్రెబాజ్ ఖాన్ నాయకత్వంలో హైదరాబాద్ బ్రిటిష్ రెసిడెన్సిపై 500 మంది సైన్యంతో దాడి చేసిన ఘటనలో తొలి స్వాతంత్ర్య సమరయోధుడు తుర్రెబాజ్ ఖాన్‌ను ఉరి తీశారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ కోఠిలోని మొదటి స్వాతంత్ర్య సమరయోధుల స్మారకార్థం నిర్మించిన అశోక స్థూపం వద్ద బుధవారం తుర్రెబాజ్ ఖాన్‌కు సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా భారతీయ సైనికులు ఆంగ్లేయులపై తిరుగుబాటు చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్ సంస్థానంలో నిజాం, ఆంగ్లేయులతో సైనిక సహకార ఒప్పందాన్ని ఏర్పాటు చేసుకున్నారని, దీంతో నిజాం సైన్యంలో ఆంగ్లేయుల ఆదిపత్యం పెరిగిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ మౌల్వి అల్లాఉద్దీన్, తుర్రెబాజ్ ఖాన్ నాయకత్వంలో కోఠి బ్రిటీష్ రెసిడెన్సీపై 500 మంది సైన్యంతో యుద్ధం చేశారన్నారు. భారత జాతీయ ఉద్యమ కన్వీనర్ మోటూరి కృష్ణప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి.నర్సింహ, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, శంకర్, ఛాయాదేవి, భిక్షపతి, పల్లె నర్సింహ, స్టాలిన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో గ్రామీణ బ్యాంకుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న వెంకటరామయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలిపి నేషనల్ రూరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎన్ఆర్‌బీఐ)గా చేయాలని ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటరామయ్య డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏపీ, తెలంగాణ రిజనల్ రూరల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ వేతన ఒప్పందం అమలైన సందర్భంగా విజయోత్సవ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ అందరికీ సమానంగా పెన్షన్ ఇవ్వాలని, పార్ట్‌టైమ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ బ్యాంకుల ప్రైవేటీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏఐఆర్ఆర్‌బీఈఏ సెక్రటరీ జనరల్ ఎస్. వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు బి.రవికాంత్, ఉపాధ్యక్షుడు భిక్షమయ్య, ఎల్ఐసీ యూనియన్ జోనల్ కార్యదర్శి తిరుపతయ్య, నాబార్డ్ యూనియన్ ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ మోహన్‌కుమార్, నాయకులు రాములు, కుంభం వెంకట్‌రెడ్డి, ప్రకాష్ పాండి, సామ్యూల్ పాల్గొన్నారు.

అఫర్డబుల్ ఆర్ట్స్



ప్రముఖ చిత్రకారిణి శ్రీల చటర్జీ ఆర్ట్స్ మన హైదరాబాద్ వాసులకు కనువిందు చేయనున్నాయి. అఫర్డబుల్ ఆర్ట్ ఇండియా నేతృత్వంలో అలనాటి మధురమైన చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఆశిష్ మలకర్ శిల్పాలు, బానో బట్లిబోయి పేపర్ క్రాఫ్ట్స్, డోలాన్ కుడు బంక మట్టి కళారూపాలు ఆకట్టుకోనున్నాయి. ఆగస్టు 2, 3, 4 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ, బంజారాహిల్స్‌లో ఈ ప్రదర్శన జరగనుంది.



అమెజాన్ ప్రైమ్‌లో ఫ్యాషన్-బ్యూటీ సారథితో భేటీ

అమెజాన్ ఇండియా ఆధ్వర్యంలో ప్రైమ్ డే ఈ నెల 20న నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమెజాన్‌లో బ్యూటీ అండ్ లగ్జరీ కేటగిరీల సారథిగా ఎంపికైన



సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ షాలిని మట్టాతో భేటీ అవకాశాన్ని అందిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. జంషెడ్‌పూర్‌కు చెందిన షాలిని విశాఖపట్నంలో పెరిగి..ఐఐటీ ఢిల్లీలో ఇంజనీరింగ్ డిగ్రీని, ఐఐఎం కోల్‌కత్తాలో ఎంబీఏ పూర్తి చేసుకున్నారనీ, ఆపై కంటెంట్, సోషల్ మీడియా మార్కెటింగ్ రంగంలోకి ప్రవేశించారన్నారు. విధుల్లో భాగంగా లైవ్ వీడియో షాపింగ్‌ను పర్యవేక్షిస్తారని, క్రియేటర్ కమ్యూనిటీలను నిర్మించడం, బ్యూటీ సోషల్ మీడియా, ఇన్‌ఫ్లుయెన్సర్ కంటెంట్ క్రియేషన్ వర్క్‌స్ట్రీమ్‌లను నిర్వహిస్తారన్నారు.

హంగేరీలో మన సంగీత బృందం ప్రదర్శన

నగరానికి చెందిన ఇండో యూరోపియన్ ఆర్కెస్ట్రా బృందం హంగేరీలో ప్రదర్శన ఇవ్వనుంది. ఈ విషయాన్ని ఆర్కెస్ట్రా వ్యవస్థాపకులు మైఖేల్ రూపమ్ మఖాల్ తెలిపారు. హంగేరీలోని బుడాపెస్ట్‌లో ఆగస్టు 14న జరుగనున్న ప్యాలెస్ ఆర్కెస్ట్రా ఫెస్టివల్‌లో భాగంగా ఈ సంగీత ప్రదర్శన జరుగనుందని, ఈ ప్రదర్శనలో నగరానికి చెందిన పలువురు యువ వయోలిన్ వాయిద్యకారులు పాల్గొననున్నారని వివరించారు.



'పీఎన్‌బీ' బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్..

దేశవ్యాప్తంగా యువ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకుగాను ప్రముఖ బీమా సేవల సంస్థ పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఆధ్వర్యంలో జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. నగరంతో సహా దేశంలోని 10 ప్రధాన నగరాల్లో వీటిని నిర్వహించనున్నామని, తొలి పోటీ ఆగస్టు 1నుంచి 6వ తేదీ వరకూ ఢిల్లీలో జరుగుతుందని, హైదరాబాద్‌లో సెప్టెంబరు 24 నుంచి 28 వరకూ జరిగే పోటీలతో చాంపియన్ షిప్ ముగుస్తుందని వివరించారు. పోటీలో పేర్లు నమోదు చేసుకునేందుకు ఫోన్ నెం +91 9820006190లో కాల్ చేయాలని కోరారు. - సాక్షి, సిటీబ్యూరో

ప్లీజ్.. స్టాండ్

నిలబడి వర్క్ చేస్తే ఆరోగ్యానికి మేలంటున్న కార్పొరేట్స్

- సుదీర్ఘకాలం కూర్చోవడం స్మోకింగ్‌తో సమానం
- వెన్నునొప్పికి దారితీస్తున్న సిట్టింగ్ పొజిషన్
- పలు అధ్యయనాల నివేదికల్లో స్పష్టం



నగరంలోని పలు కంపెనీల్లో స్టాండింగ్ డెస్క్‌ల ఏర్పాటు

వర్క్ ఫ్రమ్ హోమ్ అలవాటు కారణంగా కార్పొరేట్ ప్రొఫెషనల్స్‌కి వెన్నునొప్పి సమస్య ముదిరి తన రోజువారీ కార్యకలాపాలను సైతం ప్రభావితం చేస్తోంది. నగరంలోని ఓ మొబైల్ వాలెట్ కంపెనీలో పనిచేస్తున్న అన్మిల్, స్నేహితుల సలహా మేరకు స్టాండింగ్ డెస్క్‌ను ఎంచుకున్నాడు. 'ఇప్పుడు, నా వెన్నునొప్పి తగ్గిపోయింది' అని అన్మిల్ చెబుతున్నారు.. ఎక్కువ గంటలు కూర్చోవడం స్మోకింగ్‌తో సమానమైన వ్యసనంగా తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకు తగ్గట్టే పలు రకాల ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్న నేపథ్యంలో డెస్క్ జాబ్స్ చేసే నగరవాసులకు స్టాండింగ్ డెస్క్‌లు పరిష్కారంగా మారిపోయాయి.

- సాక్షి, సిటీబ్యూరో





ఆధునిక పరిస్థితుల్లో మనం కంప్యూటర్లు, టెలివిజన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ముందు కూర్చొని ఎక్కువ సమయం గడుపుతున్న కొద్దీ, మన శారీరక మానసిక ఆరోగ్యంపై నిశ్చల జీవనశైలి తాలూకు ప్రతికూల ప్రభావాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే, ఈ ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవడానికి ఒక సులభ పరిష్కారం స్టాండింగ్ డెస్క్., దీనిని సిట్-స్టాండ్ డెస్క్ అని కూడా పిలుస్తారు. కూర్చున్నా.. నిలబడి ఉన్న భంగిమలకు అనుగుణంగా సర్దుబాటు చేయగల డెస్క్. రోజంతా రెండు రకాల భంగిమలకు మధ్య మారడానికి వీలుగా ఇవి రూపొందాయి.

చలనం.. ఆలోచనల ఫలం..

ఆరోగ్య లాభాలను గుర్తించిన మీదట నగరానికి చెందిన ప్రోగ్రామర్ అభిషేక్ మాండ్లోయ్ 3 నెలల క్రితం స్టాండింగ్ డెస్క్‌కి మారారు, కంపెనీ అతనికి ఫర్నిచర్ అలవెన్స్ ఇచ్చింది. 'ఈ మార్పుకు గాను నాకు రూ.27,000 ఖర్చయ్యింది. అయితే దీని వల్ల లాభాలు అంతకు మించి వస్తున్నాయి. నిలబడి ఉన్నప్పుడు నేను నలువైపులా కదలగలను. అది నేను మరింత వేగంగా ఆలోచించగలిగేలా చేస్తుంది' అని మాండ్లోయ్ అన్నారు. ఆధునిక సంస్థలు ఉద్యోగుల పని పరిసరాలు, వారి ఆరోగ్యానికి చాలా ప్రాధాన్యతనిస్తున్నాయి. ఉద్యోగులు ఉత్తమమైన ఆరోగ్యాన్ని కలిగి ఉండేలా వివిధ మార్గాల్లో ప్రయత్నిస్తున్నారు. ఫిట్‌నెస్ అగ్రిగేటర్ జింపిక్ వ్యవస్థాపకుడు అమరేష్ ఓజా మాట్లాడుతూ, 'స్టాండింగ్ డెస్క్ మరింత చురుకుగా పని చేసేలా చేస్తుందని తన స్టార్టప్‌లోని సగం మంది సిబ్బంది ఇప్పటికే స్టాండింగ్ డెస్క్‌లను కొనుగోలు చేశారని చెప్పారు. అదే క్రమంలో యాపిల్ సంస్థ సైతం తన కొత్త ప్రధాన కార్యాలయం యాపిల్ పార్క్‌లో పనిచేసే ఉద్యోగులందరికీ స్టాండింగ్ డెస్క్‌లను ఏర్పాటు చేసిందని సమాచారం.

డెస్క్‌కు డిమాండ్...

ఈ స్టాండింగ్ డెస్క్‌కు సంబంధించిన బ్రాండెడ్ ఉత్పత్తుల ధరలు రూ. 20,000 నుంచి ప్రారంభమై రూ. 50,000 వరకూ ఉంటాయి. వర్క్ ఫ్రమ్ హోమ్ ట్రెండ్ బలపడడంతో అది స్టాండింగ్ డెస్క్‌ల డిమాండ్ పెరగడానికి దారితీసింది. 'కోవిడ్‌కు ముందుతో పోలిస్తే ఈ డెస్క్‌ల సేల్స్ ఇప్పుడు రెట్టింపైంది' అని ఎర్గో డెస్క్ రిటైల్ స్టోర్ నిర్వాహకులు రాహుల్ మాథుర్ అన్నారు. గత త్రైమాసికం నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ సొల్యూషన్‌ల డిమాండ్ 45% కంటే పెరిగి, ఇప్పటికీ స్థిరంగా పెరుగుతోందని ఫర్నిచర్ రెంటల్ పోర్టల్ సిటీఫర్నిష్ వ్యవస్థాపకుడు నీరవ్ జైన్ వెల్లడించారు. స్టాండింగ్ డెస్క్‌ల కోసం కార్యాలయాల నుంచి బల్క్ ఆర్డర్‌లు తగ్గాయి, అదే సమయంలో రిటైల్ అమ్మకాలు పెరిగాయి. వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రారంభమైనప్పటి నుంచి రిటైల్ అమ్మకాలు 100% పెరిగాయని ఎర్గోనామిక్ ఫర్నిచర్ స్టార్టప్ పర్ప్‌లర్క్ వ్యవస్థాపకుడు గుణశేఖరన్ జయరామన్ అంటున్నారు.

- ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఊబకాయం, గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్లు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఈ తరహా నిశ్చల జీవనశైలికి దూరం అయ్యేలా స్టాండింగ్ డెస్క్‌ని ఉపయోగించవచ్చు. తద్వారా పలు వ్యాధుల ప్రమాదాన్ని నివారించవచ్చు.
- ఎక్కువసేపు కూర్చున్నప్పుడు, మెదడుకు రక్త ప్రసరణ పరిమితంగా మారుతుంది. ఇది చిత్త వైకల్యం వంటి మెదడు జబ్బుల ప్రమాదానికి దారితీస్తుంది. నిలబడి ఉన్నప్పుడు, మెదడుకు రక్త ప్రసరణ పెరుగుతుంది. దానికి అవసరమైన ఆక్సిజన్ ఇతర పోషకాలను అందిస్తుంది.

కూర్చోవడం వర్సెస్ నిల్చోవడం..

- చాలాసేపు కూర్చోవడం వల్ల అలసట బద్ధకం వస్తాయి. దీనికి విరుద్ధంగా, స్టాండింగ్ శక్తి స్థాయిలను పెంచి చురుకుదనాన్ని ఇస్తాయి.
- సృజన, సమస్యల పరిష్కార సామర్థ్యాలను మెరుగుపరుస్తుంది. ఉత్పాదకతను పెంచడంలో స్టాండింగ్ డెస్క్‌లు సహాయపడతాయని, తక్కువ సమయంలో ఎక్కువ పని చేయడం వీలవుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.
- గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల మన వెన్నెముక కుదించబడే అవకాశం ఉంది. ఇది వెన్నునొప్పికి దారితీస్తుంది. అదే నిలబడి ఉన్న డెస్క్‌లు నిటారుగా నిలబడటానికి మన కోర్ కండరాలకు మద్దతు అందించడం ద్వారా వెన్నెముక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.
- గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల మన మనస్సు పలు చోట్లకు సంచరించేలా చేస్తుంది. దీని వల్ల ఏకాగ్రత కష్టమవుతుంది. దీనికి భిన్నంగా స్టాండింగ్ డెస్క్‌ని ఉపయోగించడం ద్వారా మన దృష్టి ఏకాగ్రతలను మెరుగుపరచవచ్చు.



నిర్విరామం ప్రమాదం...

నగరంలోని ఓ ఆస్పత్రిలో వెన్నెముక సర్జరీ చీఫ్ డాక్టర్ అరుణ్ భానోట్ మాట్లాడుతూ 'సరైన భంగిమలో ఉపయోగించినప్పుడు స్టాండింగ్ డెస్క్‌లు మంచి ఫలితాలను అందిస్తాయి' అని స్పష్టం చేశారు. అయితే ఎక్కువగా వంగిన భంగిమలో గానీ, లేదా నిలుచుని పనిచేస్తుంటే అది కొత్త సమస్యలకు దారి తీస్తుంది' అని భానోట్ హెచ్చరిస్తున్నారు. మణికట్టు డెస్క్‌పై ఫ్లాట్‌గా ఉన్నప్పుడు మోచేతులు 90 డిగ్రీల కోణంలో ఉండాలని సూచిస్తున్నారు. అయితే 30 నిమిషాల కంటే ఎక్కువసేపు నిర్విరామంగా నిలబడడం అంత మంచిది కాదని స్పష్టం చేశారు.

రెగట్టాలో మనోళ్ల హవా





సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా కొనసాగుతున్న సెయిలింగ్ మాన్‌సూన్ రెగట్టా పోటీల్లో మరోసారి తెలంగాణ సెయిలర్లు రాణిస్తున్నారు. సాగర్‌లో జరుగుతున్న 15వ మాన్‌సూన్ రెగట్టాలో బుధవారం అండర్-16 ఆప్టిమిస్ట్ ఫ్లీట్‌లో ఉద్భవ్ స్కూల్ నుంచి గోవర్ధన్ పల్లార, లాహిరి కొమరవెల్లి, దీక్షిత కొమరవెల్లి విజయాలను తమ ఖాతాలో వేసుకున్నారు. గోవర్ధన్ తన విజయాలతో రెండవ స్థానం కన్నా ముందే ఉన్నప్పటికీ అగ్రస్థానం కోసం మరో 4 రేసులతో నైపుణ్యాలను ప్రదర్శించాలి. సెయిలింగ్ స్టార్ లాహిరికి ఓ ప్రమాదంలో ఎడమ చేయి విరగడంతో మొదటి రెండు రేసులకు అనుమతించలేదు. చివరకు వైద్యుడి పర్యవేక్షణలో అనుమతించడంతో లాహిరి ఒక రేసులో మొదటి స్థానంలో నిలిచింది. అయినప్పటికీ 39 సెయిలర్ ఫ్లీట్‌లో ప్రశంసనీయంగా 19వ స్థానంలో నిలిచింది. ఐఎల్‌సీఏ 4 బాలుర విభాగంలో టీఎస్‌సీ మైసూర్‌కు చెందిన కృష్ణ దివాకర్ మధ్యప్రదేశ్‌కు చెందిన ఏకలవ్య బాథమ్ (3వ స్థానం)ను బీట్ చేసి అగ్రస్థానంలో నిలిచాడు. శశాంక్ బాథమ్ రెండవ స్థానంలో ఉన్నాడు. బాలికల విభాగంలో సోమ్యా సింగ్, అలియా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇంటర్నేషనల్ 420 మిక్స్‌డ్ లోకల్స్‌లో తనుజా కామేశ్వర్, వైష్ణవి అగ్రస్థానంలో నిలిచారు. బాలికల హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో అఖిల కొప్పుల (13) స్వర్ణం, రెయిన్‌బో హోమ్స్ ముషీరాబాద్‌కు చెందిన నికిత జీరు (12) రజతం సాధించారు.



షాహీ నాష్టా..

నోరూరించే నిజాంల నాటి వంటకాలు



షాహీ నాష్టా.. అంటే నిజాం కాలంలో ఉదయం పూట అల్పాహారం. పాయారోటీ, గుర్దా భాజీ, ఖీమారోటీ, ఖిచిడీ ఖీమాలాంటి పదార్థాలను నిజాములు అల్పాహారంగా సేవించేవారు. నిజాముల కాలం నాటి వంటకాలు కొన్ని, నేటికీ ప్రజాదరణలో ఉన్నాయి. క్రమేణా ఈ వంటకాలన్నీ పాతబస్తీ హోటళ్లు, సికింద్రాబాద్‌లోని ఒకటి రెండు హోటళ్లలో సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చాయి. దీంతో నగరంలో నాన్‌వెజ్ బ్రేక్‌ఫాస్ట్ అందించే రెస్టారెంట్ల సంఖ్య పెరుగుతోంది. జంటనగరాలతోపాటు శివారు ప్రాంతాల్లో నాన్‌వెజ్ అల్పాహార వంటకాల కోసం ఉదయం పూట వందలాది మంది వేచి చూస్తారంటే అతిశయోక్తి కాదు.

- సికింద్రాబాద్

- నాన్‌వెజ్ టిఫిన్స్‌కి కేరాఫ్ పాతబస్తీ
- జంట నగరాలతో పాటు విస్తరిస్తున్న ట్రెండ్
- పెరుగుతున్న రెంస్టారెంట్ల సంఖ్య
- వారాంతాల్లో నగరవాసుల క్యూ

ప్రతిరోజు 6 గంటల నుంచే వేడివేడిగా మాంసాహారపు వంటకాల అల్పాహారాలను రెస్టారెంట్ల నిర్వాహకులు సిద్ధంగా ఉంచుతున్నారు. భాజీగుర్దా, ఖీమా కర్రీ, పాయ వంటి పురాతన వంటకాలతోపాటు చిల్లిగారె, పూరి, ఇడ్లీ, వడ, దోశ, రాగిముద్ద వంటి బ్రేక్‌ఫాస్ట్‌ను చికెన్, మటన్‌తో కూడిన వివిధ వంటకాలతో రడీగా ఉంచుతున్నారు. మరికొన్ని హోటళ్లు అయితే ఉదయం 5 గంటల నుంచి 11.30 గంటల వరకూ నాన్‌వెజ్ వంటకాలను అందుబాటులో ఉంచుతున్నారు. రాత్రి 12 గంటల లోపే నాణ్యమైన మాంసం, అవసరమైన ఆకుకూరలు, మసాలాలను సిద్ధం చేసుకుని తెల్లవారుజామున ఒంటిగంట, రెండు గంటల ప్రాంతంలో వంటలు ప్రారంభిస్తున్నారు. ఉదయం 5 గంటలకు రెస్టారెంట్లను తెరిచి పూరి, రోటీ ఇతర టిఫిన్లతో కస్టమర్లకు సర్వ్ చేస్తున్నారు.

వయసుతో పని లేకుండా...

ఉదయం వేళల్లో చోటా ఆరగించేవాళ్లలో అన్ని వయస్కుల వాళ్లూ కనిపిస్తున్నారు. 18 ఏళ్ల నవయువకుల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకూ ఈ టిఫిన్లు ఆరగిస్తున్నారు. కేవలం నాన్‌వెజ్ క్రేజ్‌తో ప్రత్యేకంగా లభించే టిఫిన్లు ఆరగించడం కోసం వచ్చే వాళ్లు మిత్రులుగా మారిన వారూ ఉంటున్నారు. నాన్‌వెజ్ టిఫిన్లు సేవించేవారు మైదానాల్లోనే మిత్రులుగా మారుతున్నారు. కొందరు ఐతే ఏకంగా నాన్‌వెజ్ టిఫిన్స్ కోసం చాట్ గ్రూప్స్ మెయింటెన్ చేస్తున్నారు.



వారాంతాల్లో జాతరే!

రోజు రోటీ, ఇతర టిఫిన్లు తినేందుకు నాన్‌వెజ్ టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్ల వద్ద కస్టమర్లు బారులు తీరుతున్నారు. శని, ఆదివారం వచ్చిందంటే చాలు మాంసాహార టిఫిన్‌సెంటర్ల ముందు జాతర కనిపిస్తుంది. భాజీగుర్దా.. ఖీమాతో రోటీ పాటు, ఇడ్లీ, వడ, దోశ వంటి అల్పాహారాలు కూడా మాంసం కూరలతో తినేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో కస్టమర్లతో రెస్టారెంట్ల వద్ద సందడి వాతావరణం కనిపిస్తుంది. మార్నింగ్ వాకర్లు, స్విమ్మర్లు, జిమ్‌కు వెళ్లేవాళ్లు, క్రికెటర్లు వారాంతపు రోజులు, సెలవు దినాల్లో వ్యాయామం ముగించుకున్నాక నేరుగా మాంసాహార టిఫిన్ సెంటర్ల వద్దకు చేరుకుంటారు. వీళ్లే కాకుండా పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కూడా సెలవు దినాల్లో నాన్‌వెజ్ టిఫిన్స్ ఆరగించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

వారానికి రెండుసార్లు సేవిస్తాం

బోయిన్‌పల్లి నుంచి షటిల్ మిత్రులతో వారానికి ఒకసారి నాన్‌వెజ్ టిఫిన్ ప్రిఫర్ చేస్తాము. సకింద్రాబాద్ ప్యారడైజ్ మొదలు, సుచిత్ర, కొంపెల్లి వరకూ నాణ్యతను పాటించే రెస్టారెంట్లను ఎంచుకుని వెళతాము.



రకరకాల వంటకాలతో పూరీ, రోటీ తింటాము. మిత్రులతో వస్తే రెండు కర్రీలు షేర్ చేసుకుంటాం. నచ్చిన వంటకాలు ఉన్నచోటికి కుటుంబసభ్యులతో వెళ్లేందుకు ప్లాన్ చేస్తాము.

- శ్రీనివాస్‌రెడ్డి, బోయిన్‌పల్లి

డిమాండ్ పెరుగుతోంది..

మా వద్ద లభించే నాన్‌వెజ్ టిఫిన్స్ నిజాం వంటకాలను తలపిస్తాయి. ఆకు కూరలు, మాంసం విషయంలో నాణ్యత పాటిస్తాం. అందుకే మా వద్ద ఉదయం సీతా ఫల్‌మండి, నాగోల్ ప్రాంతాల్లో లభించే అన్ని రకాల మాంసాహార వంకాలతో కూడిన టిఫిన్స్‌కు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. శని, ఆది వారాల్లో క్రౌడ్ బాగుంటుంది. ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా కూడా నాన్‌వెజ్ టిఫిన్స్‌కు డిమాండ్ పెరుగుతుంది.



- సాయికుమార్, మేనేజర్ సంజుబాబు నాన్‌వెజ్ టిఫిన్స్



ఘోరం.. దారుణం.. అత్యంత దుర్మార్గం.. మాటలకందని మహా క్రౌర్యం.. నారావారి ఏలుబడిలో నరనరాన ఉన్మాదాన్ని నింపుకున్నట్లు పసుపు గూండాలు పేట్రేగిపోతున్నారు.. పల్నాడులో అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై తెలుగుదేశం కార్యకర్త కొబ్బరి బొండాల కత్తితో తెగబడ్డాడు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తను అత్యంత దారుణంగా నరికేశాడు. పసుపు గూండాల బరితెగింపునకు ఈ ఘటన పరాకాష్ట. 40 రోజులుగా అమలవుతున్న 'రెడ్‌బుక్ రాజ్యాంగం' ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసింది. హత్యలు, దాడులు, గృహదహనాలు, ప్రభుత్వ- ప్రైవేటు ఆస్తుల విధ్వంసాలతో ఏపీ అట్టుడికిపోతోంది.

గూండారాజ్

రాజకీయ కక్షతో పల్నాడులో వైఎస్సార్ సీపీ కార్యకర్త దారుణ హత్య



రషీద్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేస్తున్న జిలానీ ● పోలీసుల అదుపులో నిందితుడు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తొలి ఏకాదశి పర్వదినం .. ఎటు చూసినా కోలాహలం.. పల్నాడులో రామలింగేశ్వరుడి దర్శనం కోసం కిక్కిరిసిన భక్త జన సందోహం.. బందోబస్తు విధుల్లో వందల మంది పోలీసులు.. స్వయంగా ఎస్పీ పర్యవేక్షణ.. బుధవారం రాత్రి 7.30 గంటల సమయం.. రాజకీయ కక్షలతో ఒక్కసారిగా పచ్చ మూకల ఉన్మాదం పురి విప్పింది! వినుకొండ నడిబొడ్డున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ యువకుడిని కొబ్బరి బొండాలు నరికే కత్తితో దారుణంగా నరికి చంపారు. వందలాది మంది చూస్తుండగానే నిత్యం రద్దీగా ఉండే ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. మరోవైపు సత్తెనపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో పలువురు గాయపడగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.ఐ

కొబ్బరి బోండాల కత్తితో మాటు వేసి..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన షేక్ అబ్దుల్ రషీద్ (27) రాత్రి ఇంటికి వెళ్తుండగా పట్టణ తెలుగు యువత నాయకుడు ఎస్‌కె.జానీ తమ్ముడైన జిలానీ మరో ఇద్దరితో కలసి ముండ్లమూరు సెంటర్‌లో మాటు వేశాడు. రషీద్ అక్కడికి చేరుకోగానే వెంట తెచ్చుకున్న కొబ్బరి బోండాల కత్తితో ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. ఈ హఠాత్ పరిణామంతో బాధితుడి చెయ్యి తెగిపోయి దూరంగా పడిపోయింది. అయినా ఆగకుండా నిందితుడు కిందపడిపోయిన రషీద్‌పై కూర్చుని విచక్షణా రహితంగా నరుకుతూనే ఉన్నాడు. తర్వాత తాపీగా అక్కడి నుంచి వెళ్లాడు. పోలీసులకు హత్యాయుధాన్ని అప్పగించి లొంగిపోయాడు. ఈ పాశవిక ఘటనతో వినుకొండ ఒక్కసారి ఉలిక్కిపడింది. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుకుంటున్న రషీద్‌ను పోలీసులు వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైద్యశాల వద్దకు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కొత్త ఎస్పీ రాగానే మళ్లీ మొదలు..

సార్వత్రిక ఎన్నికల సమయంలో పల్నాడులో దాడులు, దౌర్జన్యాలు, రిగ్గింగ్‌లకు పాల్పడిన టీడీపీ నేతలు మరోసారి వైఎస్సార్ సీపీ కార్యకర్తలే టార్గెట్‌గా దాడులకు తెగబడుతున్నారు. ఎన్నికల రోజు దాడులు, విధ్వంసాలకు సంబంధించి అప్పటి ఎస్పీ బిందుమాధవ్‌తో పాటు పలువురు పోలీసు అధికారులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. తాజాగా కంచి శ్రీనివాసరావు ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న రెండు రోజుల్లోనే పల్నాడులో హింసాకాండ తిరిగి మొదలైంది. ఎస్పీ స్వయంగా వినుకొండలో ఉన్న సమయంలోనే తెలుగు యువత నాయకుడి తమ్ముడు నడిరోడ్డుపై హత్యకు తెగబడ్డాడు. కాగా ఈ ఘటనపై పూర్తి విచారణ చేయకుండా వ్యక్తిగత కక్షలే కారణమని కొత్తగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కంచి శ్రీనివాసరావు ఫక్తు రాజకీయ నేత మాదిరిగా వ్యాఖ్యానించడంపై తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది.

సత్తెనపల్లిలో..

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలో బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీకి చెందిన ఓ మహిళ కుటుంబంపై టీడీపీ నేతలు దాడి చేశారు. ఘటనలో గాయపడ్డ వారిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. ఒక్కసారిగా మళ్లీ పల్నాడులో దాడులు మొదలు కావడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సినిమా అయిపోలేదని, ఇంకా ఉందంటూ టీడీపీ నేతలు బరి తెగించి హెచ్చరికలు చేస్తుండటం గమనార్హం.

ప్రభుత్వ హత్యలే: మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ హత్య, సత్తెనపల్లిలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తల దాడులను చూస్తుంటే జిల్లా ఎస్పీని మార్చిన వెంటనే హింసకు తెగబడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ హింసాకాండను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. ఇవన్నీ సర్కారు హత్యలే. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించాలి.

రాబందుల రాజ్యంలో రాక్షస కాండ

- వరుస హత్యలు, దాడులతో పేట్రేగిపోతున్న టీడీపీ గూండాలు
- కూటమి ప్రభుత్వం వచ్చిన ఒక్క నెలలోనే 31 మంది హత్య

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సీఎం ఐటీ చెల్లింపులపై వివరణ ఇవ్వండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, మంత్రులు, అసెంబ్లీ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్, కేబినెట్ ర్యాంక్ ఉన్న సలహాదారులు తదితరుల ఆదాయపు పన్నును సర్కార్ చెల్లించ డంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హై కోర్టు ఆదేశించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్య దర్శికి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణ వాయి దా వేసింది. 'ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, అసెంబ్లీ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్, కేబి నెట్ ర్యాంక్ ఉన్న సలహాదారులు తదితరులంతా ప్రభుత్వ ఉద్యోగులే. వీరు తీసుకుంటున్న వేతనంపై ఐటీ చెల్లించాలి. అయితే వ్యక్తిగతంగా వీరు ప న్ను చెల్లించకుండా.. ఏపీ పేమెంట్స్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డీక్వాలిఫికేషన్ యాక్ట్ 1953- సెక్షన్ 3(4)ను తెలంగాణకు వర్తింపజేస్తూ ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లిస్తున్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నుల నుంచి వేతనాలు పొందుతూ, మళ్లీ వారు కట్టే పన్నులు కూడా ఖజానా నుంచి చెల్లించడం సరికాదు. ఐటీ చట్టం ప్రకారం వేతనాలు పొందుతున్న వారే పన్ను చెల్లించాలి. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు వ్యక్తి గతంగా పన్ను చెల్లిస్తున్న ప్పుడు పైన పేర్కొన్న వ్య క్తులు కూడా అలాగే చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలి' అంటూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ హై కోర్టును ఆశ్రయించింది. ఎన్జీవో తరఫున సోమ శ్రీనివాస్‌రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. గత విచారణ సందర్భంగా ఏపీ యాక్ట్‌ను పేర్కొనడంపై సీజే ధర్మాసనం అభ్యంత రం వ్యక్తం చేసింది. తెలంగాణలో ఏ చట్టాన్ని అమ లు చేస్తున్నారో పేర్కొంటూ పిటిషన్‌ను మార్చా లని చెప్పింది. ఈ పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ పేమెంట్స్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డీక్వాలిఫికేషన్ యాక్ట్ 1953 సెక్షన్ 3(4) కింద ఐటీ పన్ను చెల్లిస్తున్నట్లు పిటిషన్‌ను మార్చామని చెప్పారు. దీనికి స్పందించిన ధర్మాసనం.. మార్పు నకు అనుమతిస్తూ ఆ మేరకు చర్యలు తీసుకో వాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

బిడ్డా.. లే!



అమ్మ ఎవరికైనా అమ్మే. వాహనం ఢీకొని కాళ్లు విరిగిన కోడెదూడ స్థితిని చూసి ఒక ఆవు తల్లడిల్లిపోయింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని కోడెదూడకు రెండు కాళ్లు విరిగాయి. లేవలేని స్థితిలో ఉన్న ఆ దూడ పరిస్థితిని గమనించిన తల్లి ఆవు కొమ్ములతో బిడ్డను లేపే ప్రయత్నం చేసింది. ఈ విషయాన్ని స్థానికులు మున్సిపల్ అధికారులకు తెలియజేయడంతో సిబ్బంది వచ్చి.. కోడె దూడను యజమానికి అప్పగించి రక్తం గడ్డ కట్టిన ప్రదేశాన్ని శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు.

- హుజూర్‌నగర్

గుండి వాగుతో గండం



కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న గుండివాసులకు ఏటా వాగు కష్టాలు తప్పడం లేదు. 2006లో ప్రారంభించిన వంతెన పనులు నిలిచిపోయాయి. కుమురంభీం ప్రాజెక్టు నుంచి బుధవారం నీటిని రెండు గేట్ల ద్వారా విడుదల చేయడంతో.. గుండి వాగులో వరద పెరిగింది. దీంతో జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు దాదాపు 30 కిలోమీటర్లు తిరిగి ఆసిఫాబాద్‌కు చేరుకోవలసి వస్తోంది. కొందరు మాత్రం వాగు నీటిని ప్రమాదకరంగా దాటుతున్నారు. వరద మరింత పెరిగితే తెప్పలపై ప్రయాణించాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో వాగులో తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు.. తొలకరి వర్షాలకే కొట్టుకుపోవడం గమనార్హం. -ఆసిఫాబాద్ రూరల్

చిరుద్యోగిని సస్పెండ్ చేసి.. అక్రమాలపై 'మట్టి' కప్పి..

భౌగోళిక వారసత్వ సంపదైన విశాఖ ఎర్రమట్టి దిబ్బలపై 'పచ్చ'గద్దలు

- యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు.. బఫర్ జోన్ దాటి మరీ అక్రమాలు
- వ్యవహారం వెలుగులోకి రావడంతో కూటమి సర్కారు తూతూ మంత్రంగా చర్యలు
- సచివాలయం ఇన్‌చార్జి ప్లానింగ్ సెక్రటరీ సస్పెన్షన్
- అసలైన పాత్రధారులను తప్పించేందుకు కుయుక్తులు

సాక్షి, విశాఖపట్నం: దేశంలోనే అత్యంత సుందరమైన ఎర్రమట్టి దిబ్బల్ని టీడీపీ నేతలు ధ్వంసం చేసిన వ్యవహారంలో కూటమి ప్రభుత్వం విచారణను మమ అనిపించేసింది. ఓ చిరుద్యోగిని బలి చేసి, అసలు పాత్రధారులు, సూత్రధారులైన కూటమి నేతల్ని పక్కకి తప్పించేసింది. భౌగోళిక వారసత్వ సంపద అయిన ఎర్రమట్టి దిబ్బల్ని పరిరక్షించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బఫర్ జోన్‌ని దాటి అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న దారుణాన్ని 'సాక్షి'బట్టబయలు చేసింది. దీంతో కూటమి ప్రభుత్వం ఉలిక్కిపడింది. అధికార కూటమి నేతలే ఎర్రమట్టి దిబ్బల్ని హరిస్తుండటంతో దిద్దుబాటు చర్యలు చేపడుతున్నట్లు నాటకమాడింది. ప్రభుత్వ ఆదేశంతో జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) మయూర్ అశోక్, రెవెన్యూ, గనులశాఖ అధికారులు బుధవారం ఉదయం ఆ ప్రాంతాన్ని మొక్కుబడిగా పరిశీలించారు. అక్రమ తవ్వకాలపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా చేస్తున్న పనులను వెంటనే ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. విచారణకు ఆదేశించారు. స్థానిక అధికారులదే తప్పని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామంటూ హడావుడి చేశారు. ఈ ప్రాంతాన్ని సమగ్ర సర్వే చేయాలని నిర్ణయించారు. ఎంత విస్తీర్ణంలో తవ్వేశారో గనుల శాఖ అధికారులు కూడా లెక్కలు వేస్తున్నారు. వెంటనే ఇక్కడ తవ్వకాలు నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అసలు కథేంటంటే..

విశాఖ జిల్లా భీమిలీ మండలం సర్వే నం 49లో నేరెళ్లవలస గ్రామం ఉంది. సర్వే నం.49/1లో మొత్తం 1,067 ఎకరాలు ఉంది. ఇందులో 550 ఎకరాల్లో ఐఎన్ఎస్ కళింగ విస్తరించి ఉంది. సుప్రీంకోర్టుకు వెళ్లి తమకు చెందిన స్థలమని కోర్టులో విజయం సాధించిన ఓ బిల్డింగ్ సొసైటీ పేరుతో 287 ఎకరాల భూములున్నాయి. ఈ రెండింటి మధ్యలో మొత్తం 262.92 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఎర్రమట్టి దిబ్బలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు. ఇవి కాకుండా.. పక్కనే ఉన్న కొత్తవలస గ్రామ పరిధిలోని సర్వే నం 75, సర్వే నం.86, 87లో సుమారు 80 ఎకరాల్లో 1982లో డీ-పట్టాలు ఇచ్చారు. ఈ ప్రాంతంలోనే లేఅవుట్ల అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. అయితే.. కొత్తవలసలోని సర్వే నం.86/1ని సబ్‌డివిజన్ చేసి.. 86/3లో ఉన్న దాదాపు 148 అడుగుల మేర బఫర్ జోన్‌గా గుర్తించి.. ఆ ప్రాంతాన్నీ గత ప్రభుత్వం భౌగోళిక వారసత్వ సంపదగా.. విశాఖ పర్యాటక ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న ఎర్రమట్టి దిబ్బలకు భవిష్యత్తులోనూ ఎలాంటి ముప్పు రాకుండా చేసింది. భౌగోళిక వారసత్వ సంపదగా ఉన్న 262.92 ఎకరాల్ని సంరక్షిస్తూ ఎర్రమట్టి దిబ్బలకు ప్రత్యేక బఫర్‌జోన్ ఏర్పాటుచేసి భూ సమీకరణ పూర్తిచేసింది. ల్యాండ్ డెవలప్‌మెంట్ ప్రక్రియ కూడా చేపట్టింది. కానీ, అప్పట్లో పవన్, చంద్రబాబు ఈ అభివృద్ధి పనులపై నానా యాగీ చేసి ఎర్రమట్టి దిబ్బల్లో లేఅవుట్లు వేస్తున్నారని తెగ దుష్ప్రచారం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ఈ పనులు ఆపేస్తామని చెప్పారు. కానీ, ఇప్పుడు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే బఫర్ జోన్‌లోకి చొరబడి మరీ మట్టిని అడ్డగోలుగా తవ్వేస్తున్నారు.

కనీస అవగాహన లేకుండా గగ్గోలు..

ఎర్రమట్టి దిబ్బల్ని ఆనుకుని 70-80 ఏళ్లుగా జీడితోటలు సాగు చేసుకుంటూ డీ-పట్టాలున్న రైతుల నుంచి మాత్రమే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూలింగ్ చేపట్టింది. ఇలా అభివృద్ధి చేస్తున్న ప్రాంతం కూడా ఎర్రమట్టి నేలలే. వీటికి ప్రభుత్వం డీ-పట్టాల్ని ఎలా ఇస్తుందన్న కనీస అవగాహన లేకుండా టీడీపీ నేతలు అప్పట్లో హడావిడి చేశారు. అందుకు పవన్‌కళ్యాణ్ తందాన అంటూ గుడ్డిగా రోడ్డెక్కారు. నిజానికి.. నేరెళ్లవలసలో భూ సమీకరణకు 2016లోనే తెలుగుదేశం ప్రభుత్వం సిద్ధమైంది. అధికారంలో ఉన్నప్పుడు ఒప్పు అయిన అదే పూలింగ్.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం తప్పు అంటూ తప్పుడు ఆరోపణలు చేసింది. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రాగానే తూచ్ అనడం.. పవన్ కూడా సైలెంట్ అవడంపై పర్యావరణవేత్తలు విమర్శలు సంధిస్తున్నారు. పైగా.. అప్పట్లో పవన్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదుచేస్తా.. 48 గంటల అల్టిమేటం జారీ చేస్తున్నానంటూ గతేడాది ఆగస్టులో వ్యాఖ్యలు చేశారు. నిజానికి.. గత ప్రభుత్వం అభివృద్ధి పనులు మొదలుపెట్టిన లేఅవుట్‌కు హెరిటేజ్ సైట్‌కు అసలు ఏమాత్రం సంబంధమేలేదు. ఈ డీ-పట్టా భూముల్లో తోటలున్న ప్రాంతాన్ని మాత్రమే ప్రభుత్వం భూ సమీకరణ చేసిందే తప్ప.. ఎర్రమట్టి దిబ్బల్ని తొలగించడం లేదన్నది నూరు శాతం వాస్తవం.

చిరుద్యోగిపై చర్య

ఎర్రమట్టి దిబ్బలను టీడీపీ నేతలు విధ్వంసం చేస్తున్న తీరును సాక్షి వెలుగులోకి తేవడంతో కూటమి సర్కారు రంగంలోకి దిగి ఓ చిరుద్యోగిపై చర్యతో సరిపెట్టింది. ఎర్రమట్టి దిబ్బలు నిడిగడ్డ సచివాలయం పరిధిలో ఉండటంతో ఆ సచివాలయం ఇన్‌చార్జి ప్లానింగ్ సెక్రటరీ కాగిత అజయ్‌కుమార్ సరిగా స్పందించలేదంటూ అధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారు. వాస్తవానికి అజయ్‌కుమార్ భీమిలి తోట వీధి సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ. నిడగడ్డకు ఇన్‌చార్జిగా వచ్చారు. అయినా అతని సస్పెన్షన్‌తో ఈ వ్యవహారాన్ని మమ అనిపించేశారు. తుది విచారణలోనూ ఉద్యోగుల్నే బలి చేయాలని, నేతల పేర్లు బయటికి తేవద్దంటూ ఇప్పటికే జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.


ఎర్రమట్టి దిబ్బలను తవ్వేస్తున్న దృశ్యం (ఫైల్)

2016 టీడీపీ హయాంలోనే భూసమీకరణ..

గతంలోనూ వివిధ అభివృద్ధి పథకాల కోసం వుడా (ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో భూ సమీకరణ చేపడుతున్నట్లు 2016 నవంబరు 25న టీడీపీ ప్రభుత్వం జీఓ-304ని జారీచేసింది. దీని ప్రకారం పెందుర్తి మండలం సౌభాగ్య రాయపురంలో 128.94 ఎకరాలు, దబ్బందలో 114.23 ఎకరాలు, కొమ్మాదిలో 116.64 ఎకరాల్ని మొదటి విడతలోనూ.. నేరెళ్లవలసలో సర్వే నం.49/1పీలో 114.34 ఎకరాల అసైన్డ్ భూములు, గండిగుండంలో 69 ఎకరాల ల్యాండ్ పూలింగ్ చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై కసరత్తు చేసిన వుడా అధికారులు 2018 డిసెంబర్ 5న అప్పటి ఆర్డీఓ, వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారికి ఫైల్ పంపించారు. కొత్తవలసలోని సర్వే నం.75లో పూలింగ్‌కు సంబంధించి భూముల స్థితిగతులు పంపించాలని కోరారు. దీనికి సమాధానంగా వీఎంఆర్డీఏ ప్రత్యేక తహసీల్దార్ (ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్) సర్వే నం.75, 85, 86లో ఉన్న అసైన్డ్ భూములు, సరిహద్దులు వివరిస్తూ నోట్ అందించారు. ఇలా భూ సమీకరణకు సంబంధించిన కీలక ప్రక్రియ మొత్తం 2014-19 మధ్య టీడీపీ హయాంలోనే జరిగింది. అయితే, ఆ తర్వాత ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం జరిగింది.

ప్రభుత్వ పెద్దల సహకారంతోనే తవ్వకాలు: గుడివాడ అమర్‌నాథ్

కొమ్మాది: ప్రభుత్వ పెద్దల సహకారంతో, స్థానిక కూటమి నేతల మద్దతుతోనే ఎర్రమట్టి దిబ్బలను తవ్వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. ఆయన బుధవారం సాయంత్రం తవ్వకాల వద్ద సెల్ఫీ తీసుకుని ఈమేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బాబు కూటమి అధికారంలోకి వచ్చి 35 రోజుల్లో భౌగోళిక వారసత్వ సంపద అయిన ఎర్రమట్టి దిబ్బల పరిస్థితి ఇదంటూ పోస్టు చేశారు. కూటమి పాలనలో విశాఖ భవిష్యత్తు ఎలా ఉండబోతోందో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెప్పకనే చెబుతున్నారని తెలిపారు.

నేడు శ్రీవారి అక్టోబర్ నెల ఆర్జిత కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 22న మధ్యాహ్నం మూడు గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేవిధంగా ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు, శ్రీవారి సేవ కోటా ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. కాగా, అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు సుప్రభాత సేవ మినహా, మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు. అక్టోబర్ 11, 12వ తేదీల్లో సుప్రభాత సేవతో పాటు అన్ని ఆర్జిత సేవలు రద్దయ్యాయి. అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు అంగప్రదక్షిణ, వర్చువల్ సేవా దర్శనం టికెట్లను రద్దు చేశారు.

శ్రీశైలం దిశగా కృష్ణమ్మ పరుగులు

- నారాయణపూర్ డ్యామ్ 9 గేట్లు ఎత్తి దిగువకు 37,260 క్యూసెక్కుల నీటి విడుదల
- నాలుగైదు రోజుల్లో శ్రీశైలానికి వరదనీరు చేరే అవకాశం
- ఆల్మట్టిలోకి నిలకడగా వరద ప్రవాహం
- తుంగభద్రలో పెరిగిన వరద


భద్రాచలం వద్ద జలకళ సంతరించుకున్న గోదావరి


తాలిపేరు ప్రాజెక్టు నుంచి భారీగా విడుదలవుతున్న వరదనీరు

సాక్షి, హైదరాబాద్: కృష్ణానది వరద ఉధృతికి కర్ణాటకలోని నారాయణపూర్ డ్యామ్‌లో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో ఆ రాష్ట్ర అధికారులు బుధవారం డ్యామ్ గేట్లు 9 ఎత్తి దిగువకు 37,260 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో కృష్ణమ్మ శ్రీశైలం వైపు పరుగులు తీస్తూ వస్తోంది. జూరాల ప్రాజెక్టులో నీటినిల్వ ఇప్పటికే 7.66 టీఎంసీలు ఉన్న నేపథ్యంలో..ఒక్క రోజులోనే ఆ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుంది. ఆ తర్వాత జూరాల గేట్లు ఎత్తి దిగువకు నీటికి విడుదల చేస్తారు. ఈ నేపథ్యంలో నాలుగైదు రోజుల్లో శ్రీశైలానికి ఎగువ నుంచి వరద చేరే అవకాశం ఉందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల కృష్ణా ప్రధానపాయ, ఉపనదుల్లో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి డ్యామ్‌లోకి 92,836 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా.. నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరింది. దీంతో ఆ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 65 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఆ జలాలు నారాయణపూర్ డ్యామ్‌లోకి చేరుతున్నాయి. కృష్ణా ప్రధానపాయలో వరద మరో నాలుగైదు రోజులు ఇదే రీతిలో కొనసాగే అవకాశముందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 49,522 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 39.72 మీటర్లకు చేరుకుంది.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఏపీకి 4.5 టీఎంసీలు.. తెలంగాణకు 5.414 టీఎంసీల నీటిని కేటాయిస్తూ మంగళవారం కృష్ణా బోర్డు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సాగర్‌లో నీటిమట్టం కనీస స్థాయికి దిగువన ఉన్న నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 5.705 టీఎంసీలను విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ కుడి కేంద్రం ద్వారా ఏపీ 15,800, ఎడమ కేంద్రం ద్వారా తెలంగాణ 6,357 వెరసి 22,157 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తుండటంతో నీటినిల్వ 33.24 టీఎంసీలకు తగ్గింది. సాగర్‌లోకి 21,481 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 122.69 టీఎంసీలకు చేరుకుంది. తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు బుధవారం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బుధవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటి నిల్వ ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1705	129.72	1699.67	102.53	92,736	65,000
నారాయణపూర్	1615	37.64	1611.75	33.21	51,250	37,260
ఉజ్జయిని	1630	117.64	1603.25	48.85	20,980	200
జూరాల	1045	9.66	1041.7	7.66	2,500	2,720
తుంగభద్ర	1633	105.79	1611.07	39.72	49,522	393
శ్రీశైలం	885	215.81	808.20	33.24	-	22,189
నాగార్జునసాగర్	590	312.05	504	122.69	21,481	6,398
పులిచింతల	175	45.77	99.41	0.72	154	50
ప్రకాశం బ్యారేజీ	57.05	57.05	3.07	3.07	8,193	8,193

వరద గోదావరి

భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 21 అడుగులకు చేరే అవకాశం

భద్రాచలం అర్బన్: గోదావరి నిండుకుండను తలపిస్తోంది. భద్రాచలం వద్ద ఈ నెల 13వ తేదీ నుంచి 13 అడుగుల మేర నీటిమట్టం నిలకడగా ఉంది. రెండు,మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద వచ్చి చేరుతుండడంతో మంగళవారం రాత్రి 14.5 అడుగులకు చేరింది. ఆపై అంతకంతకూ పెరుగుతూ బుధవారం సాయంత్రం 5 గంటలకల్లా 18.1 అడుగులకు చేరుకుంది. కాగా, బుధవారం రాత్రి మరో మూడు అడుగుల మేర పెరిగి 21 అడుగులకు చేరే అవకాశముందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు నదిలోకి దిగొద్దని హెచ్చరిస్తున్నారు.

'తాలిపేరు'కు పోటెత్తుతున్న వరద

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తుతోంది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో బుధవారం ఉదయం ప్రాజెక్టు 25 గేట్లలో 12 గేట్లు అడుగు మేర ఎత్తి 16,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అయినా వరద ఉధృతి ఆగలేదు. దీంతో మధ్యాహ్నం 3 గంటలకు 22 గేట్లు అడుగు మేర ఎత్తి ద్వారా 63 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి వరద మరింతగా పెరగగా, 20 గేట్లను రెండేసి అడుగుల మేర, మిగతా ఐదు గేట్లను పూర్తిగా ఎత్తి 70,750 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు.

ప్రేమోన్మాది ఘాతుకం

- ఇంట్లోకి చొరబడి యువతి తల్లిపై కత్తితో దాడి
- విశాఖ జిల్లాలో ఘటన


నిందితుడు సిద్ధూ

పెదగంట్యాడ(విశాఖ): ప్రేమోన్మాది రెచ్చిపోయాడు.. తనను ప్రేమించాలంటూ ఓ యువతిని వేధించడంతోపాటు వారింట్లోకి కత్తితో చొరబడి యువతి తల్లిపై విరుచుకుపడ్డాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొంతివానిపాలెంలో సింగనపల్లి కేశవరావు అనే వ్యక్తి భార్య సావిత్రి, ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్నాడు. ట్యాక్సీ నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని పెద్ద కుమార్తె సింగనపల్లి శ్యామల డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన సిద్ధూ అనే యువకుడు ఏడాది కాలంగా శ్యామలను ప్రేమించమంటూ వెంటపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కేశవరావు ఆ యువకుడిని పలుమార్లు హెచ్చరించాడు. అయినా ఆ యువకుడి తీరులో మార్పురాకపోగా.. కేశవరావుతో తరచూ గొడవలు పడడంతోపాటు అతనిపై దాడి చేశాడు. దీంతో ఆయన గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. కొంతకాలం జైలులో ఉన్న ఆ యువకుడు విడుదలైన తర్వాత మళ్లీ ఆ యువతి వెంట పడడం మొదలెట్టాడు. ఈ నెల 16న రాత్రి 9 గంటల సమయంలో ఆ యువతి ఇంట్లోకి కత్తితో చొరబడ్డాడు. అడ్డువచ్చిన యువతి తల్లి సావిత్రిపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో ఆ యువకుడు పరారయ్యాడు. బాధితురాలిని వెంటనే గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి సావిత్రి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో నరహరి, ఆనంద్

న్యూస్ ఫొటో పోటీల్లో పాల్గొనండి

డిప్యూటీ సీఎం భట్టి

- ఉత్తమవార్త చిత్రం పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- ఫొటో జర్నలిస్టుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం
- ఆగస్టు 10 తుదిగడువు

హిమాయత్‌నగర్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం (టీఎస్‌పీజేఏ) ప్రతి ఏటా నిర్వహించే న్యూస్ ఫొటో పోటీల్లో ఫొటో జర్నలిస్టులు పాల్గొనాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్త ఉత్తమ వార్త చిత్రం పోటీల వాల్‌పోస్టర్‌ను హైదరాబాద్‌లో బుధవారం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ...న్యూస్ ఫొటో కాంటెస్ట్‌లో పాల్గొనడం వలన పత్రిక ఫొటోగ్రాఫర్లకు, తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, న్యూస్ ఫొటోగ్రఫీ సంఘంలో మంచి గుర్తింపు రావాలనుకుంటున్న వారికి అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. టీఎస్‌పీజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరి మాట్లాడుతూ...2024–25 ఏడాది ఉత్తమ వార్త చిత్రం పోటీల విజేతలకు ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.8,000, తృతీయ బహుమతి రూ.5,000లతోపాటు రూ. 2,000, 25 కన్సోలేషన్ బహుమతులు ఉంటాయన్నారు. ఆసక్తి గల ఫొటో జర్నలిస్టులు పోటీలలో పాల్గొనడానికి మూడు 8+12 సైజు కలర్, బ్లాక్ అండ్ వైట్ ఫొటోలను టీఎస్‌పీజేఏ కార్యాలయం, టీయూడబ్ల్యూజే బిల్డింగ్, దేశోద్ధారక భవన్, బషీర్‌బాగ్, హైదరాబాద్‌కు పంపించాలని, అందుకు ఆఖరు తేదీ ఆగస్టు 10వ తేదీ తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌పీజేఏ రాష్ట్ర నేతలు నగర గోపాల్, అలీముద్దీన్, హరి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ముప్పు సైబర్ టెర్రరిజం

సైబర్ నేరగాళ్లు.. లక్షలు, కోట్లలో డబ్బులు వ్యక్తిగత ఖాతాల్లోంచి కొల్లగొట్టడమే కాదు.. సైబర్ టెర్రరిజానికి తెరతీస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ఉగ్రవాద ముప్పు క్రమంగా కొత్తరూపు సంతరించుకుంటోంది.. ఇది భవిష్యత్తులో జడలువిప్పుకుని సైబర్ టెర్రరిజంగా మారి మానవాళికి ముప్పుగా మారబోతోందని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు సైబర్ టెర్రరిజం అంటే ఏంటి? దీంతో ప్రపంచ దేశాలకు వచ్చే ముప్పు ఏంటి? దీన్ని ఎలా ఎదుర్కోవాలి? అన్న విషయాలపై 'సాక్షి 'ప్రత్యేక కథనం.



మచ్చుకు కొన్ని ఘటనలను చూస్తే..

సైబర్ టెర్రరిజం వేళ్లూనుకుంటుందనడానికి ఇటీవలి కొన్ని పరిణామాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి. హ్యాకర్లు సోనీ అంతర్జాతీయ సంస్థపై సైబర్ దాడి చేసి గోప్యమైన సమాచారాన్ని హ్యాక్ చేసి సంస్థ కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రి డేటాపై ర్యామ్సన్‌వేర్ ఎటాక్ జరగడం, హైదరాబాద్‌లో ఏపీ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు హ్యాకింగ్ ఘటన, తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేయడం కూడా ఇలాంటి కోవలోనివే.

సాధారణ సైబర్ నేరాలకు భిన్నంగా సైబర్ టెర్రరిజం | జనజీవనాన్ని స్తంభింపచేస్తారు.. వ్యవస్థలను గందరగోళపరుస్తారు

కీలక మౌలిక సదుపాయాలకు తీవ్ర ఆటంకాలు సృష్టిస్తారు | సైబర్ టెర్రరిజం ముప్పు గుర్తించకపోతే అనర్థాలే

సాక్షి, హైదరాబాద్

రోజువారీ జీవితంలో సాంకేతికతపై ఆధారపడటం విపరీతంగా పెరిగింది. అదే సమయంలో సాంకేతికంగా అభివృద్ధి చెందిన తీవ్రవాదులు వారి ప్రయోజనాల కోసం ఇందులో ఉన్న లొసుగులను ఉపయోగించుకొనే అవకాశం కూడా పెరుగుతోంది. జనజీవనాన్ని స్తంభింపజేసి, వ్యవస్థలను గందరగోళపర్చి తమ గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు డిజిటల్ సాధనాలు, సాంకేతికతను ఉపయోగించడాన్ని సైబర్ టెర్రరిజంగా చెబుతున్నారు సైబర్ భద్రత నిపుణులు. తరచుగా హింసపై ఆధారపడే సంప్రదాయక ఉగ్రవాద రూపాల్లా కాకుండా సైబర్ ఉగ్రవాదులు తమ లక్ష్యాలను సాధించడానికి ఇంటర్నెట్‌ను ఉపయోగించుకుని వర్చువల్‌గా పనిచేస్తారు. సైబర్ దాడులతో ప్రభుత్వ, ప్రైవేట్ వ్యవస్థలను హ్యాక్ చేయడం, మౌలిక సదుపాయాలకు అంతరాయాన్ని కలిగించడం, సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేయడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం సైబర్ ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యాలు.

సైబర్ టెర్రరిజానికి గురవుతున్న ప్రధాన రంగాలు..

సైబర్ ఉగ్రవాదులు ప్రభుత్వరంగ సంస్థలు, పవర్ గ్రిడ్‌లు, రవాణా నెట్‌వర్క్‌లు, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు వంటి కీలకమైన మౌలిక సదుపాయాలకు అంతరాయం సృష్టించి ప్రజా భద్రత, సంక్షేమానికి ఆటంకాలు కలిగిస్తారు. ప్రతికూల పరిస్థితులను సృష్టించి సామాజిక జీవనాన్ని బలహీనపర్చడం వీరి లక్ష్యం. సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఫోరమ్‌ల ద్వారా తీవ్రవాద భావజాల వ్యాప్తికి, హింసను ప్రేరేపించేందుకు సైబర్ టెర్రరిజాన్ని వాడుతున్నారు.

నాలుగు రకాలుగా హాని

సైద్ధాంతిక ఉగ్రవాదం: సైబర్ ఉగ్రవాదులు తమ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, అనుచరులను నియమించుకోవడానికి, ప్రత్యర్థులపై హింసను ప్రేరేపించడానికి సైబర్‌స్పేస్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నారు.

భౌగోళిక, రాజకీయ లక్ష్యాలు: ప్రత్యర్థి ప్రభుత్వాలను అణగదొక్కడం, రహస్యమైన సమాచారాన్ని దొంగిలించడం, శత్రు భూభాగంలో కీలకమైన అవసరాలకు అంతరాయం కలిగించడం లాంటివి చేస్తారు.

ఆర్థిక లాభం: సైబర్ టెర్రరిజం లక్ష్యం సైతం ఆర్థిక వ్యవస్థల్ని దోచుకోవడమే. ఉగ్ర సంస్థలు లేదా హ్యాకర్లు ర్యామ్సన్‌వేర్ దాడులు, ఆర్థిక మోసాలతో డబ్బులు కొల్లగొడుతారు. అవసరమైన డేటాను ఎన్‌క్రిప్ట్, డిక్రిప్ట్ చేయడానికి భారీగా డబ్బును డిమాండ్ చేస్తారు.

సైకలాజికల్ వార్‌ఫేర్: భయం, అనిశ్చితి, అపనమ్మకాన్ని వ్యాప్తి చేసే లక్ష్యంతో ప్రజల మానసిక స్థితిపై ప్రభావం చూపేలా ప్రభుత్వరంగ సంస్థలను హ్యాక్ చేస్తుంటారు.

ఎలా చేస్తారు?

మాల్వేర్: వైరస్‌లు, ట్రోజన్‌లు, ర్యాన్సమ్‌వేర్ వంటి హానికర సాఫ్ట్‌వేర్లను సైబర్ ఉగ్రవాదులు ఎక్కువగా వాడుతున్నారు.

ఫిషింగ్: వీటిని సోషల్ ఇంజనీరింగ్ ఎటాక్‌గా చెప్పొచ్చు. లక్ష్యంగా ఎంచుకున్న సంస్థల నెట్‌వర్క్‌లు, సంస్థలు, వ్యక్తులకు మోసపూరిత ఈ– మెయిల్‌లు, ఎస్ఎంఎస్‌లలో లింకులు పెట్టి పంపుతారు. దీని ద్వారా హాక్ చేస్తే కలిగే నష్టం ఊహించడానికి కూడా భయంకరంగా ఉంటుంది.

డిస్ట్రిబ్యూటెడ్ డినైయల్ ఆఫ్ సర్వీస్: వీటినే డీడీఓఎస్ దాడులు అంటారు. టార్గెట్ చేసిన నెట్‌వర్క్‌కు విపరీతమైన ట్రాఫిక్ ఉండేలా చేసి వాటిని వినియోగదారులకు అందుబాటులో లేకుండా చేస్తారు. కీలకమైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక సంస్థలు లేదా ప్రభుత్వ సంస్థల కార్యకలాపాలకు అంతరాయం కలిగించేందుకు ఉపయోగిస్తారు. ఆర్థిక, ఆరోగ్య రంగాల్లో గందరగోళం సృష్టించడం ఈ దాడి లక్ష్యం.

సాఫ్ట్‌వేర్ వల్నరబిలిటీ ఎటాక్: సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌లు, ఆపరేటింగ్ సిస్టమ్, నెట్‌వర్క్ ప్రోటోకాల్‌లోని చిన్నపాటి లోపాలను ఆసరాగా తీసుకుని దాడులు చేస్తారు.

సప్లై చైన్ అటాక్స్: కస్టమర్‌లు లేదా క్లయింట్‌ల నెట్‌వర్క్‌లలోకి చొరబడేందుకు థర్డ్ పార్టీ విక్రేతలుగా చేరి నెట్‌వర్క్‌కు హాని కల్గిస్తారు.

సైబర్ టెర్రరిజాన్ని ఇలా ఎదుర్కోవచ్చు

సైబర్ సెక్యూరిటీ చర్యలు

సైబర్ టెర్రరిస్ట్‌ల నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాలను కాపాడుకునేందుకు సైబర్ సెక్యూరిటీ సాంకేతికతను, సైబర్ దాడులను అడ్డుకోవడానికి బలమైన ఫైర్‌వాల్స్‌ను ఏర్పాటుచేసుకోవాలి. చొరబాట్లను గుర్తించే వ్యవస్థలు, ఎన్‌క్రిప్షన్ మెకానిజమ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. వీటి కోసం ప్రభుత్వం అదనంగా పెట్టుబడి పెట్టాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు పరస్పర సహకారంతో సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేసేలా ఉమ్మడి ప్రణాళికలు అమలు చేయాలి.

అంతర్జాతీయ సహకారం

సైబర్ ఉగ్రవాదం ముప్పును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, సైబర్‌నేరగాళ్లను పట్టుకోవడానికి ఆయా దేశాలు ద్వైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాలు చేసుకోవాలి.

గుర్తించకపోతే అనర్థాలు



సాంకేతికత వినియోగం పెరిగేకొద్దీ సైబర్ టెర్రరిజం ముప్పు కూడా పెరుగుతోంది. ఇది అనేక రంగాలకు విస్తరించే ప్రమాదం ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వాలు అన్ని స్థాయిల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు చర్యలు ప్రారంభించాలి. భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే సైబర్ టెర్రరిజం ముప్పును గుర్తించకపోతే అనర్థాలు తప్పవు.

–అద్వైత్ కంభం, సైబర్ సెక్యూరిటీ ట్రైనర్

ప్రజల్లో అవగాహన పెంచాలి

ఫిషింగ్ స్కామ్‌లు, మాల్‌వేర్ బెదిరింపులు ఇతర సైబర్ ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. విద్యాసంస్థలు, సైబర్ సెక్యూరిటీ సంస్థలు శిక్షణ, వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలి.

కనీసంగా 60 గజాల స్థలం ఉండాలి

- అంతమేర స్థలం ఉంటేనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- నమూనాలో మాత్రం స్వేచ్ఛ
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒకే నిబంధన
- ఇతర రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం పూర్తి చేసిన అధికారులు
- ప్రభుత్వానికి నివేదిక.. త్వరలో తుది విధివిధానాలు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇంటి నమూనా విషయంలో లబ్ధిదారుకు పూర్తి స్వేచ్ఛ ఉంటూనే ఇంటి విస్తీర్ణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఉండేలా ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేయబోతోంది. అంత విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం జరగాలంటే లబ్ధిదారుకు కనీసం 60 చ.గజాల స్థలం ఉండాల్సి ఉంటుంది. అంతమేర స్థలం ఉన్నవారికే ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక హాలు/గది, పడకగది, వంటగది, మరుగుదొడ్డి తప్పకుండా ఉండేలా లబ్ధిదారు ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి త్వరలోనే పూర్తి విధివిధానాలు ఖరారు కానున్నాయి. ఇతర రాష్ట్రాల్లో పేదలకు ఇళ్ల నిర్మాణం విషయంలో ఆయా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి వచ్చిన అధికారుల బృందం ప్రభుత్వానికి తాజాగా ఓ నివేదిక సమర్పించింది. లబ్ధిదారు నయా పైసా కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన అవసరం లేకుండా పూర్తి నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వమే భరించే పద్ధతి వేరే రాష్ట్రాల్లో లేదని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. రాష్ట్రంలో ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం విడతల వారీగా రూ.5 లక్షలను అందించనుంది. వేరే రాష్ట్రాలు ఇంతమొత్తాన్ని ఇవ్వటం లేదని పేర్కొన్నారు.

రెండు పథకాలకు మధ్యస్తంగా...

ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద 300 చ.అ.కు తగ్గకుండా ఇంటి నిర్మాణం జరగాలని కేంద్రప్రభుత్వం విధివిధానాల్లో ఖరారు చేసింది. అంతకంటే విస్తీర్ణం తక్కువగా ఉన్న ఇంటికి కేంద్రప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందదు. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకం కింద 560 చ.అ. స్థలంలో ఇంటి నిర్మాణం జరిపిన విషయం తెలిసిందే. ఆ పథకం ప్రభుత్వానికి అప్పట్లో ఆర్థిక భారంగా మారింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం అటు కేంద్రప్రభుత్వ విధివిధానాల్లోని కనిష్ట విస్తీర్ణం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ధారించిన విస్తీర్ణానికి మధ్యస్థంగా ఇంటి నిర్మాణ విస్తీర్ణాన్ని ఖరారు చేసింది.

ఏ పథకంలో లబ్ధి పొందనివారికే..

ప్రభుత్వపరంగా పేదల ఇళ్ల పథకాల్లో ఎప్పుడూ లబ్ధి పొందని వారినే ఇప్పుడు గుర్తించాలని నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో లక్షల కుటుంబాలు ఇళ్ల పథకాల కింద లబ్ధిపొందాయి. అలాంటి వారు ఇప్పుడు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వానికి అందిన 83 లక్షల దరఖాస్తుల్లో అలాంటివి లక్షల్లో ఉన్నాయి. వాటన్నింటినీ తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడూ ఏ గృహనిర్మాణ పథకంలో లబ్ధిపొందని కుటుంబాలను గుర్తించి ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. చాలా నిరుపేద కుటుంబాలు ఒక్క గదిలో ఉంటూ జీవనం గడుపుతున్నాయి. ఆ గది పైకప్పు పక్కా నిర్మాణమైతే, వారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నా.. ఇందిరమ్మ పథకానికి అనర్హులుగానే గుర్తించాల్సి ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. అదే, వారు ఉంటున్న ఇల్లు విశాలంగా ఉన్నా, పైకప్పు కచ్చా అయి ఉంటే పథకానికి అర్హులుగా మారతారు.

పట్టణమైనా, గ్రామీణమైనా విస్తీర్ణం అంతే..

గతంలో రెండు పడకగదుల ఇళ్ల పథకంలో.. పట్టణ ప్రాంతాలు, గ్రామీణప్రాంతాలకు ఇంటి విస్తీర్ణం వేరుగా ఉండేది. కానీ, ఇందిరమ్మ పథకంలో ఇంటి కనీస విస్తీర్ణం ప్రాంతాలతో సంబంధం లేకుండా 400 చ.అ.గా నిర్ధారించారు. సొంత నిధులతో దాన్ని విస్తరించుకునే వెసులుబాటు కల్పించింది.

రిజర్వేషన్లపై పట్నా హైకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం



సుప్రీంకోర్టులో జస్టిస్ ఈశ్వరయ్య పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: విద్యాసంస్థల్లో ప్రవేశాల నిమిత్తం బిహార్ రిజర్వేషన్ సవరణ చట్టం అనుసరించి ఆ రాష్ట్రంలో జనాభా ప్రకారం 65 శాతానికి పెంచిన రిజర్వేషన్లు పట్నా హైకోర్టు రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ పేర్కొంది. ఈ మేరకు పట్నా హైకోర్టు తీర్పు రద్దు చేయాలని ఫెడరేషన్ అధ్యక్షుడు, ఏపీ హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పట్నా హైకోర్టు ఆదేశాలు ఆర్టికల్ 14, 15, 16 కింద సమానత్వ నిబంధనను ఉల్లంఘించినట్లుగా ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించారని, కానీ అత్యంత వెనకబడిన తరగతులు సహా బీసీలు 63.14 శాతం ఉన్నా ఆ మేరకు రిజర్వేషన్లు అందడం లేదని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన వేర్వేరు తీర్పులను అనుసరించి డేటా ఆధారంగా రిజర్వేషన్లు పెంపు ఎందుకు సాధ్యం కాదు అని పిటిషన్‌లో పేర్కొన్నారు. బిహార్‌లో కులగణన నిర్వహించి, సమానత్వ సూత్రాల ఆధారంగా పెంచిన రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు ఎలా చెబుతుందని ప్రశ్నించారు. ఇందిరా సాహ్ని, నాగరాజు, లీలాప్రసాదరావు తదితర కేసుల తీర్పులను పరిగణనలోకి తీసుకోవడంలో హైకోర్టు విఫలమైందన్నారు. బిహార్‌లో 85 శాతంగా ఉన్న వెనకబడిన వర్గాలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని గుర్తించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.


రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నేరెళ్ల శారద. చిత్రంలో మంత్రి సీతక్క

బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారద

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా నేరెళ్ల శారద పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని బుద్ధ భవన్ మహిళా కమిషన్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆమె ప్రత్యేక పూజలు చేసి అనంతరం బాధ్యతలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొని ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. మహిళలకు నిత్యం అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

రూ.90 కోట్లు.. 85 కోట్ల చేపపిల్లలు

ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వ ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: మత్స్యకారుల అభ్యున్నతి కోసం ఉచితంగా చేపపిల్లలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వాటి పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మొత్తం 26 వేలకుపైగా ఉన్న చెరువులు, రిజర్వాయర్లు, జలాశయాల్లో చేప పిల్లలు వదలాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ దిశగా ముందుకు వెళుతోంది. గత ఏడాది రూ.93 కోట్లు ఖర్చు చేసి..89 కోట్ల చేప పిల్లలు వదలగా.. ఈ ఏడాది రూ.90 కోట్లు ఖర్చు చేసి 85 కోట్ల చేప పిల్లలు సేకరించాలని నిర్ణయించింది. ఇందుకోసం టెండర్లు నిర్వహిస్తోంది. గతంలో మాదిరిగా టెండర్లలో ఎలాంటిలోపం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఈ ఏడాది సకాలంలో జలాశయాల్లో నీరు లేకపోవడంతో ఆలస్యంగా టెండర్లు పిలిచినట్టు సమాచారం. చేప పిల్లల పంపిణీకి సంబంధించి ఈ నెల 23వ తేదీ వరకు టెండర్లు దాఖలు చేయవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 3:30 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తారు. ఇందులో తక్కువ కోట్ చేసిన వారికి టెండర్లు అప్పగిస్తారు. అయితే టెండర్లు దక్కించుకున్న వారు చేప పిల్లల ఉత్పత్తి, వారి గత రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తారు.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం

చేప పిల్లల పంపిణీకి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. టెండర్లలో ఎక్కడా అవకతవకలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన చేప పిల్లలు వదలాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. దానికి తగినట్టుగా ముందుకు వెళుతున్నాం.

–మెట్టు సాయికుమార్, ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్

హుజూరాబాద్‌లో 25 మందిపై పిచ్చికుక్కల దాడి

తీవ్రంగా గాయపడిన ఇద్దరిని వరంగల్ ఎంజీఎంకు తరలింపు

హుజూరాబాద్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని పలు వీధుల్లో బుధవారం రాత్రి పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. ఏకంగా 25 మందిపై దాడిచేశాయి. పట్టణంలోని మామిళ్లవాడ, ప్రతాప్‌వాడ, విద్యానగర్, గాంధీనగర్, బోర్నపల్లి, సిద్ధార్థనగర్‌లో రోడ్డుపై వెళ్తున్నవారిని కరిచాయి. ప్రతాప్‌వాడకు చెందిన మంతెన అఖిల, జమ్మికుంట రోడ్డులోని సుమలతకు తీవ్ర గాయాలు కాగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మిగితా వారికి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నారు.

వీధికుక్కల బెడద అరికట్టండి

- జవహర్‌నగర్ ఘటన కలచివేసింది
- వీధికుక్కల దాడులకు కారణాలేంటో అధ్యయనం చేయాలని సీఎం ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రెండేళ్ల బాలుడిని వీధికుక్కలు దాడి చేసి చంపేసిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను బుధవారం ఆయన ఆదేశించారు. పలుమార్లు ఇలాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి కాల్‌సెంటర్ లేదా టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీధికుక్కల దాడులకు వాతావరణ పరిస్థితులు లేదంటే ఇతర కారణాలేవైనా ఉన్నాయా అని అధ్యయనం చేసేందుకు పశువైద్యులు, బ్లూక్రాస్ లాంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా వీధికుక్కలకు టీకాలు వేయడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించాలని చెప్పారు. కుక్కలు దాడులు చేస్తే తక్షణం అవసరమయ్యే మందులను జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) అందుబాటులో ఉంచాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

బిడ్డా.. ఎంత తల్లడిల్లినవో

మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు ● స్వగ్రామంలో విహాన్ అంత్యక్రియలు


చిన్నారి విహాన్‌తో తల్లిదండ్రులు (ఫైల్‌ఫొటో)


విహాన్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి వెంకటలక్ష్మి

మిరుదొడ్డి/జవహర్‌నగర్: గోరంత ముల్లు గుచ్చు కుంటేనే తల్లడిల్లే ప్రాణంరా నీది.. గుంపులుగా వచ్చిన కుక్కలు గాట్లు పడేలా కొరుకుతూ, ఈడ్చుకెళుతుంటే ఎంత తల్లడిల్లినవో కొడుకా అంటూ ఆ చిన్నారి తల్లిదండ్రులు రోదించిన తీరు కంటతడిపెట్టించాయి. మల్కాజిగిరి–మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లోని ఆదర్శనగర్‌లో కుక్కల దాడిలో విహాన్ మృతి చెందడం యావత్ రాష్ట్రాన్నే కుదిపేసింది. విహాన్ మృతదేహం బుధవారం ఉదయం స్వగ్రామమైన మిరుదొడ్డికి చేరుకుంది. నిలువెల్లా గాయాలతో నిండిపోయిన చిన్నారి మృతదేహాన్ని చూసిన బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. మధ్యాహ్నం తర్వాత విహాన్ అంత్యక్రియలు పూర్తయ్యాయి.

బతుకుదెరువుకు వలసొచ్చి.. కొడుకును కోల్పోయి

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన పుల్లూరి భరత్‌కుమార్–వెంకటలక్ష్మి దంపతులకు ఎనిమిదేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు సాహితి, శృతి, కుమారుడు విహాన్ ఉన్నారు. గ్రామంలో కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. నెలరోజుక్రితం బతుకుదెరువుకు జవహర్‌నగర్‌కు వలసవచ్చారు. స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి విహాన్ బ్రెడ్ ప్యాకెట్ తీసుకొని ఆరు బయటకు వెళ్లాడు. అక్కడే వేచి ఉన్న వీధికుక్కలు విహాన్ వెంటపడి విచక్షణారహితంగా దాడిచేసి కొరికాయి. కుక్కలదాడిలో విహాన్ బలికావడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

అఖిలపక్ష నేతల నిరసన

జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల నేతలతో కలిసి ప్రజలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విహాన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌లు అన్నారు. తక్షణ సహాయంగా రూ. 50వేలు అందిస్తున్నామన్నారు. బాలుడి కుటుంబానికి మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగంతో పాటు ఇంటిస్థలం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కదిలిన మున్సిపల్ యంత్రాంగం

వీధి కుక్కల దాడిలో బాలుడు మృతి చెందడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీంతో మున్సిపల్ అధికారులు ప్రధాన రహదారుల్లో ఉన్న వీధి కుక్కలను పట్టుకొని వ్యాన్‌లో ఎక్కించి బయటకు తీసుకెళ్లారు.

విహాన్ కుటుంబాన్ని ఆదుకోవాలి: ఎంపీ ఈటల

విహాన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మేడ్చల్ కలెక్టర్‌తోపాటు జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురువారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలిస్తానని చెప్పారు.

కలెక్టర్‌కు నివేదించాం: కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

వీధికుక్కల దాడి ఘటనపై పూర్తి వివరాలతో మేడ్చల్ కలెక్టర్‌కు నివేదిక అందించామని జవహర్‌నగర్ కమిషనర్ తాజ్‌మోహన్ రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.50 వేలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



నేటి నుంచి ఇంగ్లండ్, విండీస్ రెండో టెస్టు... వుడ్‌కు చోటు

వెస్టిండీస్ జట్టుతో నేడు నాటింగ్‌హామ్‌లో మొదలయ్యే రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు ఒక మార్పుతో బరిలోకి దిగనుంది. లార్డ్స్‌లో జరిగిన తొలి టెస్టు తర్వాత ఇంగ్లండ్ పేసర్ అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ నేపథ్యంలో అండర్సన్ స్థానంలో రెండో టెస్టు కోసం మరో పేస్ బౌలర్ మార్క్ వుడ్‌కు ఇంగ్లండ్ తుది జట్టులో చోటు లభించింది. 34 ఏళ్ల మార్క్ వుడ్ ఇప్పటి వరకు 34 టెస్టులు ఆడి 108 వికెట్లు పడగొట్టాడు. మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ తొలి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో గెలిచింది.



ఆరో స్థానంలో యశస్వి జైస్వాల్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ పురుషుల టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. తాజా ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ సూర్యకుమార్ యాదవ్ తన రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకోగా... ఓపెనర్ యశస్వి జైస్వాల్ నాలుగు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు. జింబాబ్వేతో జరిగిన టి20 సిరీస్‌లో యశస్వి 141 పరుగులు సాధించడంతో అతని ర్యాంక్ మెరుగైంది. రుతురాజ్ గైక్వాడ్ ఒక స్థానం పడిపోయి ఎనిమిదో ర్యాంక్‌లో నిలిచాడు. జింబాబ్వే సిరీస్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన గిల్ 36 స్థానాలు పురోగతి సాధించి 37వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

బుల్లెట్ దిగాలి...

- భారత షూటర్లపై భారీ అంచనాలు
- అత్యధికంగా ఈసారి 21 మంది బరిలోకి
- ప్రతి విభాగంలో మనోళ్ల ప్రాతినిధ్యం
- గత రెండు ఒలింపిక్స్ క్రీడల్లో నిరాశపరిచిన షూటర్లు

PARIS 2024
మరో 8 రోజుల్లో...

ఇంతింతై వటుడింతై అన్న నానుడి భారత షూటింగ్ క్రీడాంశానికి వర్తిస్తుంది. 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో తొలిసారి భారత్ తరఫున ఇద్దరు షూటర్లు బరిలోకి దిగారు. నాటి నుంచి ప్రతి ఒలింపిక్స్‌లో భారత షూటర్ల ప్రాతినిధ్యం కనిపిస్తోంది. 2016 రియో ఒలింపిక్స్‌లో తొలిసారి రెండంకెల్లో భారత షూటర్లు పోటీపడగా... 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ అది కొనసాగింది... ఇప్పుడు పారిస్ ఒలింపిక్స్‌లోనూ భారత్ నుంచి మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా 21 మంది షూటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోను న్నారు. మెడల్ ఈవెంట్స్‌గా ఉన్న 12 విభాగాల్లోనూ భారత షూటర్లు ఉండటంతో ఈసారి రిక్తహస్తాలతో కాకుండా ఒకట్రెండు పతకాలతో తిరిగి వస్తారని భారీ అంచనాలున్నాయి. మన షూటర్లు లక్ష్యంలో బుల్లెట్‌లు దించి పతకాలను కొల్లగొడుతారా లేక గురితప్పి నిరాశపరుస్తారో వేచి చూడాలి.

–సాక్షి క్రీడా విభాగం



ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్

రెండు దశాబ్దాల క్రితం ఏథెన్స్ ఒలింపిక్స్‌లో భారత సైనికాధికారి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ 'డబుల్ ట్రాప్' షూటింగ్ ఈవెంట్‌లో దేశానికి తొలిసారి రజతం రూపంలో పతకాన్ని అందించాడు. నాలుగేళ్ల తర్వాత 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అభినవ్ బింద్రా ఎవ్వరూ ఊహించని విధంగా భారత్ ఖాతాలో స్వర్ణ పతకాన్ని జమ చేశాడు. 2000 సిడ్నీ, 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో విఫలమైన అభినవ్ బింద్రా 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో అద్భుత ప్రదర్శనతో అందరి అంచనాలను తారుమారు చేశాడు. స్వతంత్ర భారత్‌కు వ్యక్తిగత క్రీడాంశంలో తొలి బంగారు పతకాన్ని అందించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో విజయ్ కుమార్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం... గగన్ నారంగ్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్యం సాధించడంతో భారత్‌కు వరుసగా మూడు ఒలింపిక్స్‌లో షూటింగ్ క్రీడాంశంలో పతకాలు దక్కాయి. 2016 రియో ఒలింపిక్స్‌లో భారత్ నుంచి తొలిసారి అత్యధికంగా 12 మంది షూటర్లు పోటీపడటంతో వరుసగా నాలుగోసారీ పతకాలు గ్యారంటీ అని అభిమానులు అనుకున్నారు. కానీ 12 మందిలో ఇద్దరు (అభినవ్ బింద్రా, జీతూ రాయ్) మాత్రమే ఫైనల్ చేరుకున్నారు. వరుసగా ఐదో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ అభినవ్ బింద్రా నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పతకాన్ని కోల్పోగా... పిస్టల్ షూటర్ జీతూ రాయ్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ నుంచి ఏకంగా 15 మంది షూటర్లు పాల్గొనగా... ఒత్తిడికి తట్టుకోలేక స్టార్ షూటర్లు కూడా తడబడ్డారు. కేవలం సౌరభ్ చౌధరీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లోకి ప్రవేశించి ఏడో స్థానంలో నిలిచాడు.



అంజుమ్



మనూ భాకర్

అనుభవం పతకం తెస్తుందా...

టోక్యో ఒలింపిక్స్ వైఫల్యాన్ని పక్కనబెడితే ఈసారి పారిస్ ఒలింపిక్స్‌కు ఏకంగా 21 మంది భారత షూటర్లు అర్హత సాధించారు. 21 మందిలో నలుగురు మాత్రమే టోక్యో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ వాళ్లున్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో ఆడిన మనూ భాకర్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల ఎయిర్ పిస్టల్), ఇలవేనిల్ వలారివన్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్), అంజుమ్ మౌద్గిల్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్) పారిస్ ఒలింపిక్స్‌లోనూ బరిలోకి దిగనున్నారు. మనూ భాకర్ మాత్రం ఈసారి రెండు ఈవెంట్స్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. ఈ నలుగురు కాకుండా మిగతా 17 మంది షూటర్లు తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నారు. ఒలింపిక్స్‌లాంటి అత్యున్నత వేదికపై మిల్లీమీటర్ల వ్యత్యాసంలో పతకాలు, ఫలితాలు తారుమారవుతాయి. షూటర్లకు చెక్కు చెదరని ఏకాగ్రత, మానసిక దృఢత్వం అత్యవసరం. గత ఒలింపిక్స్ వైఫల్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈసారి నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఒలింపిక్ బెర్త్‌లు సాధించిన షూటర్లకు నేరుగా పారిస్ ఒలింపిక్స్‌కు పంపించకూడదని నిర్ణయించింది. నాలుగు దశల్లో సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహించి ట్రయల్స్‌లో నిలకడగా రాణించిన షూటర్లనే పారిస్‌కు పంపిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రయల్స్‌లోనూ రాణించి ఫామ్‌లో ఉన్న మనూ, అంజుమ్, ఇలవేనిల్, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ అసలైన వేదికపై కూడా మెరిపించి పతకాలతో తిరిగి రావాలని ఆశిద్దాం.

అరంగేట్రంలోనే మెరిపిస్తారా!

తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడుతున్న 17 మంది షూటర్లు ఒత్తిడికి లోనుకాకుండా సంయమనంతో వ్యవహరిస్తేనే పతకాల రేసులో నిలుస్తారు. ముఖ్యంగా అందరి దృష్టి 23 ఏళ్ల పంజాబ్ షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రాపై ఉంది. 2022 ఆసియా క్రీడల్లో సిఫ్ట్ కౌర్ 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో ప్రపంచ రికార్డు సృష్టించడంతోపాటు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ షూటర్ ఇషా సింగ్ నుంచి భారీ అంచనాలే ఉన్నాయి. 19 ఏళ్ల ఇషా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, ఆసియా క్రీడల్లో పిస్టల్ టీమ్ ఈవెంట్స్‌లో స్వర్ణ పతకాలు సాధించింది. అదే జోరును ఆమె పారిస్‌లో కొనసాగించాలని ఆశిద్దాం. పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ పోటీలు జూలై 27 నుంచి ఆగస్టు 5 వరకు జరుగుతాయి.



ఇషా సింగ్

'పారిస్'లో భారత షూటర్లు

పురుషుల విభాగం: సందీప్ సింగ్, అర్జున్ బబూటా (10 మీటర్ల ఎయిర్ రైఫిల్), సరబ్‌జోత్ సింగ్, అర్జున్ సింగ్ చీమా (10 మీటర్ల ఎయిర్ పిస్టల్), స్వప్నిల్ కుసాలే, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), అనీశ్ భన్వాలా, విజయ్‌వీర్ సిద్ధూ (25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్), పృథ్వీరాజ్ (ట్రాప్), అనంత్‌జీత్ సింగ్ నరూకా (స్కీట్). మహిళల విభాగం: ఇలవేనిల్ వలారివన్, రమితా జిందాల్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్), రిథమ్ సాంగ్వాన్, మనూ భాకర్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్), ఇషా సింగ్, మనూ భాకర్ (25 మీటర్ల పిస్టల్), సిఫ్ట్ కౌర్ సమ్రా, అంజుమ్ మౌద్గిల్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), రాజేశ్వరి కుమారి, శ్రేయసి సింగ్ (ట్రాప్), రైజా ఢిల్లాన్, మహేశ్వరి చౌహాన్ (స్కీట్).



శౌర్యకు కాంస్యం

హ్యూస్టన్ (అమెరికా): ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు కాంస్య పతకం లభించింది. అండర్–19 బాలుర సింగిల్స్ విభాగంలో 18 ఏళ్ల శౌర్య బావా భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఢిల్లీకి చెందిన శౌర్య 5–11, 5–11, 9–11తో టాప్ సీడ్, గత ఏడాది రన్నరప్ మొహమ్మద్ జకారియా (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయాడు. 2014లో కుశ్ కుమార్ తర్వాత ఈ మెగా టోర్నీలో పతకం నెగ్గిన రెండో భారతీయ ప్లేయర్‌గా శౌర్య గుర్తింపు పొందాడు.

క్వార్టర్స్‌లో యూకీ ద్వయం



స్టాడ్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో మూడో సీడ్ యూకీ–ఒలివెట్టి ద్వయం 6–4, 6–4తో ఫెడెరికో జెబలాస్–బోరిస్ అరియాస్ (బొలీవియా) జంటను ఓడించింది. 59 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ జోడీ పది ఏస్‌లు సంధించడంతోపాటు తమ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

రిత్విక్ జోడీ ఓటమి



న్యూపోర్ట్ (అమెరికా): హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ రిత్విక్ చౌదరీ–నికీ కలియంద పునాచా (భారత్) ద్వయం 1–6, 4–6తో ల్యూక్ సవిల్లె–అలెగ్జాండర్ వుకిచ్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. 56 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్ ద్వయం ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేయడంతోపాటు తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది.

సినిమా



వరలక్ష్మి
నికోలయ్ సచ్‌దేవ్

కొత్త ప్రయాణం ఆరంభమైంది

- వరలక్ష్మి

''హైదరాబాద్ నాకు సెకండ్ హోమ్. తెలుగు ప్రేక్షకులు నా సినిమాలు చూసి నన్ను చాలా ప్రోత్సహించారు. మీ ప్రోత్సాహం ఎప్పుడూ ఇలాగే ఉండాలి'' అని నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌తో వరలక్ష్మి వివాహం ఈ నెల 12న థాయ్‌లాండ్‌లో జరిగింది. బుధవారం వరలక్ష్మి–నికోలయ్ హైదరాబాద్‌లో మీట్ అండ్ గ్రీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పాలనే ఉద్దేశంతో నా భర్తతో కలిసి హైదరాబాద్ వచ్చాను. నా కెరీర్ ముగిసిపోలేదు. నా సరికొత్త ప్రయాణం ఇప్పుడే మొదలైంది. నా భర్త ప్రోత్సాహంతో మరిన్ని సినిమాలు చేస్తాను'' అన్నారు. ''నా భార్య వరలక్ష్మి అద్భుతమైన నటి. తన వ్యక్తిత్వం కూడా ఉన్నతమైనది. సంస్కృతి, సంప్రదాయం, కుటుంబానికి గౌరవం ఇస్తుంది. ఆమెను పెళ్లి చేసుకోవడం నా లక్. మీరంతా తనని ఇలానే సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా'' అన్నారు నికోలయ్.

పండగ వచ్చిందే చాన్నాళ్లకి...



విక్రమ్, పార్వతీ తిరువోతు

గూడెంలోని ప్రజలందరూ ఆ రోజు శుభవార్త విన్నారు. ఆ ఆనందంలో 'మనకి మనకి మనలో మనకి పండగ వచ్చిందే చాన్నాళ్లకి... అలికీ అలికీ ఊరే అలికీ ముగ్గులు ఏసేద్దాం ముంగిళ్లకీ...' అంటూ పాడుకున్నారు. విక్రమ్ హీరోగా నటించిన 'తంగలాన్' చిత్రంలోని పాట ఇది. పా. రంజిత్ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రంలో పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందింది. బుధవారం ఈ చిత్రంలోని 'మనకి మనకి...' లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా సింధూరీ విశాల్ పాడారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది.

మా డార్లింగ్ కూడా గుర్తుండిపోతుంది

- ప్రియదర్శి



''తెలుగులో ఈ ఏడాది ఇప్పటి వరకూ ఓ వంద సినిమాలు వచ్చాయనుకుంటే అందులో ప్రేక్షకులు బాగా నవ్వుకుని, గుర్తు పెట్టుకున్న సినిమాలు ఓ నాలుగైదు ఉన్నాయి. మా 'డార్లింగ్' కూడా అలా గుర్తుపెట్టుకొని నవ్వుకునే సినిమా అవుతుంది. ఈ చిత్రం ఆడియన్స్‌కి మంచి థియేటర్ అనుభూతిని ఇస్తుంది'' అని హీరో ప్రియదర్శి అన్నారు. అశ్విన్ రామ్ దర్శకత్వంలో ప్రియదర్శి, నభా నటేశ్ జోడీగా నటించిన చిత్రం 'డార్లింగ్'. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రియదర్శి మాట్లాడుతూ– ''నేను నటించిన 'మల్లేశం, బలగం' చిత్రాలతో పాటు 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌కి వచ్చిన రెస్పాన్స్ ఫ్యామిలీ డ్రామాకి ఎప్పుడూ స్పేస్ ఉందని నిరూపించింది. ఆడియన్స్ రిలేట్ చేసుకునే కథలు చెప్పడంలో మజా వేరుగా ఉంటుంది. 'డార్లింగ్'లో నభా నటేశ్ పాత్రకి స్ప్లిట్ పర్సనాలిటీ అనే స్పెషల్ కండిషన్ ఉంటుంది. దీన్ని అశ్విన్ రామ్ తెరపై చూపించిన తీరు వైవిధ్యంగా ఉంటుంది. 'హాయ్ నాన్న' సినిమా షూటింగ్‌లో జగదీశ్ రాసిన కథని నానీ అన్నకి చెప్పాను. కథ విన్న వెంటనే ఆయన సినిమా చేద్దాం అన్నారు. నేను నటించిన '35 చిన్న కథ కాదు' ఆగస్టు 15న వస్తోంది. గీతా ఆర్ట్స్‌లో నటించిన మూవీ షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం ఇంద్రగంటి మోహనకృష్ణగారితో ఓ సినిమా చేస్తున్నాను. అలాగే వైజయంతీ మూవీస్‌లో ఓ సినిమా, నాని అన్న వాల్‌పోస్టర్ బ్యానర్‌లో ఒక చిత్రంతో పాటు 'సేవ్ ది టైగర్స్' సీజన్ 3 చేయాల్సి ఉంది'' అన్నారు.

అందుకే మాస్క్ వేసుకుని తిరుగుతున్నా!

- డైరెక్టర్ విస్కీ



భరత్, విస్కీ

''నేను చిత్ర పరిశ్రమలోకి వెళ్లడం నా కుటుంబ సభ్యులకు ఇష్టం లేదు. నేను అమెరికాలో ఉద్యోగం వదిలి ఇండియా వచ్చిన సంగతి కూడా వారికి తెలియదు. అందుకే నా పేరు మార్చుకుని, నా ముఖం కనిపించకుండా మాస్క్ వేసుకుని తిరుగుతున్నా. కోవిడ్‌లో నాకెంతో ఇష్టమైన కుక్క పిల్ల చనిపోయింది. దాని జ్ఞాపకార్థం నా పేరును విస్కీగా మార్చుకున్నాను'' అన్నారు డైరెక్టర్ విస్కీ. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల నటించిన చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. ఐ. భరత్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విస్కీ మాట్లాడుతూ– ''నా జీవితంలో జరిగిన వాస్తవ ఘటన స్ఫూర్తితో ఈ మూవీ కథ రాశా. బర్త్‌డే బంప్స్ వల్ల ఒక ఫ్రెండ్ ఎలా చనిపోయాడు? అనేది ఉత్కంఠభరితంగా ఉంటుంది'' అన్నారు. ఐ. భరత్ మాట్లాడుతూ–''నాకూ దర్శకత్వం చేయాలనే ఆసక్తి ఉండేది. అయితే విస్కీ చెప్పిన కథ నచ్చడంతో ప్రొడ్యూస్ చేయాలనిపించింది. బర్త్ డే పేరు మీద జరుగుతున్న కొన్ని వింత పోకడల్ని ఈ మూవీలో చూపించాం'' అన్నారు.




దీపికా పదుకోన్

డైట్ అంటే కడుపు మాడ్చుకోవడం కాదు

''డైట్' అనే పదం చుట్టూ చాలా అపోహలు ఉన్నాయని నాకనిపిస్తోంది. డైట్ అంటే కడుపు మాడ్చుకోవడం, తక్కువ తినడం, కష్టంగా నచ్చనవి తినడం అని మనందరం అనుకుంటాం. కానీ డైట్ అంటే మనం తీసుకునే ఆహారం, తీసుకునే పానీయాలు. నిజానికి డైట్ అనే పదం గ్రీకు పదం 'డైటా' నుంచి వచ్చింది. డైటా అంటే జీవన విధానం అని అర్థం'' అన్నారు దీపికా పదుకోన్. ప్రస్తుతం ఆమె గర్భవతి అని తెలిసిందే. ఈ నేపథ్యంలో దీపికా ఫలానా డైట్‌ని ఫాలో అవుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. అయితే ప్రచారంలో ఉన్నవి నమ్మవద్దంటూ దీపికా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ విధంగా పేర్కొన్నారు.

''నేను బాగా తింటాను. కాబట్టి సరిగ్గా తిననని వస్తున్న వార్తలను నమ్మొద్దు. డైట్ అంటే క్రమం తప్పకుండా తినడం, మన శరీరాన్ని అర్థం చేసుకోవడం.. ఫాడ్ డైట్ (త్వరగా బరువు తగ్గే ఆహార ప్రణాళిక)ని ఫాలో కాను. శుభ్రంగా తినడానికే ఇష్టపడతాను. నా డైట్‌లో ఇవి ఉన్నాయని ఆశ్చర్యపోతున్నారా?'' అంటూ కేక్స్, సమోసా వంటి వాటి ఫొటోలను కూడా షేర్ చేశారు దీపికా పదుకోన్. ఇక సెప్టెంబరులో బిడ్డకు జన్మనివ్వనున్నట్లు ఆ మధ్య దీపికా, ఆమె భర్త–హీరో రణ్‌వీర్ సింగ్ ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

వారం తర్వాత బడ్డీ...



అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బడ్డీ'. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, అధనా జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ మూవీని ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు తొలుత చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే మరో వారం ఆలస్యంగా ఆగస్టు 2న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ''అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'బడ్డీ' తెరకెక్కింది. ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై కొత్త ప్రయోగంగా ఈ సినిమా ఉండబోతోంది. హిప్ హాప్ తమిళ అందించిన పాటలు ఇప్పటికే హిట్‌గా నిలిచాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

ఇది నాకు క్లిష్ట సమయం!



నవీన్ పొలిశెట్టి

'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, జాతి రత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు హీరో నవీన్ పొలిశెట్టి. అమెరికాలో జరిగిన ఓ ప్రమాదంలో ఆయన గాయపడ్డట్లు గతంలో వార్తలొచ్చాయి. ఈ విషయంపై తొలిసారి ఓ నోట్‌ని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు నవీన్ పొలిశెట్టి. ఆ లేఖ సారాంశం ఏంటంటే.. ''ఈ రోజు మీతో (అభిమానులు, ప్రేక్షకులు) నేనొక వ్యక్తిగత విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. దురదృష్టవశాత్తూ ఓ ప్రమాదంలో నా కుడి చేయి, కుడి కాలు ఫ్రాక్చర్ అయ్యాయి. ఇది నాకు క్లిష్ట సమయం. గాయాల కారణంగా త్వరితగతిన నా సినిమాలను మీ ముందుకు తీసుకురాలేకపోతున్నా. నేను పూర్తిగా కోలుకుని, నా బెస్ట్ ఎనర్జిటిక్ వెర్షన్‌ని చూపించడానికి వైద్యుల సూచనలు పాటిస్తున్నాను. కోలుకోవడానికి మరికొన్ని నెలలు పట్టేటట్లు ఉంది. కోలుకున్న వెంటనే షూటింగ్ మొదలుపెడతాను'' అన్నారు.

భవనమ్‌లో థ్రిల్



'షకలక' శంకర్, ధనరాజ్, సప్తగిరి

సప్తగిరి, ధనరాజ్, 'షకలక' శంకర్, అజయ్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'భవనమ్'. బాలాచారి కూరెళ్ల దర్శకత్వంలో సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో ఆర్బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 9న విడుదల చేయనున్నట్లు బుధవారం యూనిట్ ప్రకటించింది. ''సస్పెన్స్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో రూపొందించిన ఈ చిత్రంలో మంచి వినోదం ఉంది. కీలక తారాగణం పండించే కామెడీ బాగుంటుంది. అన్ని వర్గాలవారూ ఎంజాయ్ చేసేలా ఆసక్తికరమైన కంటెంట్‌తో తెరకెక్కించిన 'భవనమ్' మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది.

అందుకే టిక్కెట్ ధర తగ్గించాం

- ధీరజ్ మొగిలినేని



రాకేశ్ వర్రే, ధీరజ్ మొగిలినేని

''పెద్ద సినిమాలకు టిక్కెట్ ధర ఎంత పెట్టినా ప్రేక్షకులు వస్తారు. కానీ, చిన్న సినిమాలకి తక్కువ రేట్లు ఉంటే కానీ రారు. అందుకే 'పేక మేడలు' టిక్కెట్ ధరని వంద రూపాయలు చేశాం'' అన్నారు నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని. వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నీలగిరి మామిళ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'పేక మేడలు'. రాకేశ్ వర్రే నిర్మించిన ఈ మూవీ రేపు విడుదలవుతోంది. ఈ సినిమాని రిలీజ్ చేస్తున్న ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ– ''పేక మేడలు'లాంటి మంచి సినిమాని ప్రేక్షకులకు చేరువ చేయాలని విజయవాడ, వైజాగ్, హైదరాబాద్‌లలో యాభై రూపాయలకే ప్రీమియర్స్ వేశాం. చూసినవారు సినిమా బాగుందన్నారు'' అన్నారు. ''ప్రీమియర్స్‌కి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే ఇది ప్రీ సక్సెస్ మీట్‌లాగా ఫీల్ అవుతున్నాను'' అన్నారు నీలగిరి. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్న ధీరజ్, రానా, అడివి శేష్, విశ్వక్ సేన్ గార్లకి కృతజ్ఞతలు'' అన్నారు రాకేశ్ వర్రే.

సాక్షి బిజినెస్

గురువారం
18-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)

	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	52	26
	80,717	24,613

విదేశీ సూచీలు (తొలి సెషన్ రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,008	▽ 500
డోజోన్స్	41,139	▲ 184
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,187	▲ 23
డాక్స్	18,437	▽ 81
షాంఘై	2,963	▽ 13
నికాయ్	41,098	▽ 177

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై మంగళవారం

బంగారం (99.9 స్వచ్ఛత)	72,932	▲ 407
బంగారం (99.5 స్వచ్ఛత)	72,640	▲ 405
వెండి (కిలో)	91,835	▲ 107

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	83.14	84.16
£	బ్రిటన్ పౌండ్	[illegible]	107.22	109.81
€	యూరో	[illegible]	89.94	92.32
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	52.38	53.53
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.72	57.67
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.50	64.16
SAR	సౌదీ రియాల్	[illegible]	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.87	23.66
¥	చైనా యువాన్	[illegible]	10.39	12.46

ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం ఫ్లాట్

క్యూ1లో రూ. 1,135 కోట్లు



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ ఎల్‌టీఐమైండ్‌ట్రీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 1.5 శాతం క్షీణించి రూ. 1,135 కోట్లకు పరిమితమైంది. లాభాల మార్జిన్లు నీరసించడం ప్రధానంగా ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం మాత్రం 5 శాతానికిపైగా పుంజుకుని రూ. 9,143 కోట్లకు చేరింది. నిర్వహణ లాభ మార్జిన్లు 16.7 శాతం నుంచి 15 శాతానికి క్షీణించాయి. ఈ కాలంలో కొత్తగా 1.4 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. విలీన సమయంలో ప్రకటించిన 17-18 శాతం మార్జిన్లను సాధించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో దేవశిష్ చటర్జీ పేర్కొన్నారు. అయితే ఇందుకు మరింతకాలం పడుతుందని తెలియజేశారు. నిజానికి త్రైమాసిక వారీ(క్యూ4)గా చూస్తే మార్జిన్లు 0.3 శాతం బలపడ్డాయి. అయితే ఎప్పటిలోగా మార్జిన్ల లక్ష్యాన్ని చేరుకునేదీ అంచనా వేయజాలమని చటర్జీ స్పష్టం చేశారు. ఈ క్యూ1లో 1,400 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. జూన్ చివరికల్లా మొత్తం ఉద్యోగుల సంఖ్య 81,934కు చేరింది. గతేడాది జూన్‌లో ఈ సంఖ్య 82,738కాగా.. ఈ ఏడాది మార్చిలో 81,650గా నమోదైంది.

ఏషియన్ పెయింట్స్ లాభం డౌన్

రూ. 1,187 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 25 శాతం క్షీణించి రూ. 1,187 కోట్లకు పరిమితమైంది. వేసవి ఎండలు, సార్వత్రిక ఎన్నికల కారణంగా పెయింట్లకు డిమాండ్ మందగించడం ప్రభావం చూపినట్లు కంపెనీ ఎండీ, సీఈవో అమిత్ సింగ్లే పేర్కొన్నారు. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,575 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,182 కోట్ల నుంచి రూ. 8,970 కోట్లకు స్వల్పంగా నీరసించింది. మొత్తం వ్యయాలు మాత్రం రూ. 7,305 కోట్ల నుంచి రూ. 7,559 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో డెకొరేటివ్ విభాగం అమ్మకాల పరిమాణం 7% పుంజుకున్నప్పటికీ ప్రొడక్ట్ మిక్స్‌లో మార్పులు, ధరల తగ్గింపు వంటి అంశాలు లాభదాయకతను దెబ్బతీసినట్లు అమిత్ పేర్కొన్నారు. ముడిసరుకుల ధరలు, సప్లైచైన్ సవాళ్లు సైతం ఇందుకు జత కలసినట్లు వెల్లడించారు. అయితే ఇండస్ట్రియల్ బిజినెస్ 6% పుంజుకున్నట్లు తెలిపారు.

రేసు గుర్రాలు.. చిన్న షేర్లు



- ఈ ఏడాది మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సుల దూకుడు
- బీఎస్‌ఈ సెన్సెక్స్‌ను మించుతూ 30 శాతం హైజంప్
- సెన్సెక్స్‌తోపాటు రికార్డ్ గరిష్టాలకు మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు

కొద్ది నెలలుగా సరికొత్త గరిష్టాల రికార్డులను నెలకొల్పుతూ సాగుతున్న దేశీ స్టాక్ మార్కెట్లలో ఇటీవల మధ్య, చిన్నతరహా కౌంటర్లు సైతం జోరు చూపుతున్నాయి. వెరసి సెన్సెక్స్‌ను మించి బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు లాభాల దౌడు తీస్తున్నాయి. వివరాలు చూద్దాం..

ఈ క్యాలెండర్ ఏడాదిలో ఇప్పటివరకూ మధ్య, చిన్నతరహా కౌంటర్లకు భారీ డిమాండ్ కనిపిస్తోంది. చిన్న షేర్లు మార్కెట్ ఫేవరెట్లుగా నిలుస్తున్నాయి. దీంతో పలు చిన్న షేర్లు పెద్ద(భారీ) లాభాలను అందిస్తున్నాయి. ఇందుకు దేశీ ఆర్థిక వ్యవస్థ మూలాలు పటిష్టంగా ఉండటం, మెరుగుపడిన లిక్విడిటీ తదితర అంశాలు తోడ్పాటునిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వెరసి ఈ ఏడాది జూలై 16(మంగళవారం)వరకూ చూస్తే బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 10,985 పాయింట్లు(30 శాతం) దూసుకెళ్లింది. ఈ బాటలో స్మాల్‌క్యాప్ సైతం 11,628 పాయింట్లు(27 శాతంపైగా) జంప్‌చేసింది. ఇదే కాలంలో బీఎస్‌ఈ ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ కేవలం 8,476 పాయింట్లు(12 శాతం) ర్యాలీ చేసింది.

బుల్ మార్కెట్

దేశీయంగా లిక్విడిటీ పరిస్థితులు బలపడటం మిడ్, స్మాల్ క్యాప్ షేర్ల వృద్ధికి కారణమవుతున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతి పేర్కొన్నారు. మ్యూచువల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసులు(పీఎంఎస్), ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా నిధులు చిన్న షేర్లలోకి ప్రవహిస్తున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం దేశీయంగా దీర్ఘకాలిక(స్ట్రక్చరల్) బుల్ ట్రెండ్‌లో మార్కెట్ కొనసాగుతున్నట్లు అభిప్రాయపడ్డారు. దీంతో మిడ్, స్మాల్ క్యాప్స్ మార్కెట్లను మించి పరుగు తీస్తున్నట్లు తెలియజేశారు. అయితే లార్జ్‌క్యాప్ స్టాక్స్ సైతం ర్యాలీ చేస్తున్నప్పటికీ చిన్న షేర్లతో పోలిస్తే వెనకబడుతున్నట్లు వివరించారు. ఎఫ్‌ఐఐల అమ్మకాలు ఇందుకు కారణమన్నారు. ప్రస్తుతం యూఎస్ అధ్యక్షతన ప్రపంచవ్యాప్తంగా బుల్ మార్కెట్ల హవా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. షేర్ల విలువలరీత్యా చూస్తే లార్జ్ క్యాప్స్ మరింత బలపడేందుకు వీలున్నట్లు అంచనా వేశారు. గతేడాది చివర్లో అమ్మకాలకు ప్రాధాన్యత ఇచ్చిన ఎఫ్‌ఐఐలు ప్రస్తుతం పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు.

సరికొత్త రికార్డులు

బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఈ మంగళవారం (16న) 48,175 పాయింట్లను అధిగమించి చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకుంది. అంతకుముందే అంటే ఈ నెల 8న స్మాల్‌క్యాప్ 54,618 పాయింట్లకు చేరడం ద్వారా సరికొత్త గరిష్టాన్ని లిఖించింది. ఇక మరోవైపు సెన్సెక్స్ ఈ నెల 16నే 80,898ను తాకి చరిత్రాత్మక రికార్డుకు తెరతీసింది. ఇందుకు టెక్నాలజీ, హెల్త్‌కేర్, కన్జూమర్ గూడ్స్ రంగాలు ప్రధానంగా దోహదపడినట్లు మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ అర్వీందర్ సింగ్ నందా పేర్కొన్నారు. అందుబాటులో షేర్ల విలువలు, అధిక వృద్ధికి వీలు, ఆర్థిక పురోగతి వంటి అంశాలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు తెలియజేశారు. కాగా.. మిడ్, స్మాల్ క్యాప్స్‌లో దిద్దుబాటుకు వీలున్నట్లు సునీల్ అభిప్రాయపడ్డారు. అయితే ప్రస్తుతం పటిష్ట లిక్విడిటీ పరిస్థితుల కారణంగా కరెక్షన్ సమయాన్ని అంచనా వేయలేమని తెలియజేశారు. విధానాల్లో మార్పులు, ఫలితాల్లో నిరాశ తదితర అంశాలు ఇందుకు దారిచూపవచ్చని అభిప్రాయపడ్డారు.



వచ్చే వారం వెలువడనున్న సార్వత్రిక బడ్జెట్ సానుకూలంగా ఉండవచ్చని, దీంతో మార్కెట్ల ర్యాలీ కొనసాగేందుకు వీలున్నదని పలువురు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తే దేశీ స్టాక్స్‌లో మరిన్ని పెట్టుబడులకు వీలుంటుందని అభిప్రాయపడ్డారు. సాధారణంగా చిన్న షేర్లను దేశీ ఫండ్స్, రిటైలర్లు కొనుగోలు చేస్తే, లార్జ్ క్యాప్స్‌లో పెట్టుబడులకు విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపే సంగతి తెలిసిందే. దేశ ఆర్థిక పరిస్థితులు, కార్పొరేట్ ఫలితాలు, ఇన్వెస్టర్ల సెంటిమెంటు, గ్లోబల్ మార్కెట్లు వంటి పలు అంశాలు మార్కెట్ల ట్రెండ్‌ను నిర్దేశిస్తుంటాయని మార్కెట్ నిపుణులు వివరించారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



పర్యాటకానికి పరిశ్రమ హోదా..

జీఎస్‌టీ రేటు క్రమబద్ధీకరించాలి ● ట్రావెల్ ఏజెంట్ల సమాఖ్య టీఏఏఐ డిమాండ్

పర్యాటకానికి ఊతమిచ్చే దిశగా బడ్జెట్‌లో చర్యలు తీసుకోవాలని, టూరిజానికి పరిశ్రమ హోదా కల్పించాలని ట్రావెల్ ఏజెంట్ల సమాఖ్య టీఏఏఐ కేంద్రాన్ని కోరింది. అలాగే వీసా నిబంధనలను సరళతరం చేయడం, వీసా-ఫ్రీ ఎంట్రీని ప్రోత్సహించడం, జీఎస్‌టీ రేట్లను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేసింది. దేశ జీడీపీలో సుమారు 5.8 శాతం వాటాతో, 2047 నాటికి 1 లక్ష కోట్ల డాలర్ల లక్ష్యం పెట్టుకున్న ట్రావెల్, టూరిజం రంగానికి బడ్జెట్‌పై సానుకూల అంచనాలు ఉన్నట్లు వివరించింది. వీటిని అమలు చేస్తే ఇటు వ్యాపారాలు, అటు ప్రయాణికులకు కూడా ప్రయోజనం చేకూరగలదని టీఏఏఐ పేర్కొంది. కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటు, రైల్వేలు.. రహదారులు .. జలమార్గాల విస్తరణ ద్వారా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లోనూ ప్రధానంగా దృష్టి పెట్టడాన్ని కొనసాగించగలదని ఆశిస్తున్నట్లు టీఏఏఐ వివరించింది. జీఎస్‌టీపై సానుకూలంగా వ్యవహరిస్తే టూరిస్టులకు బస ఏర్పాట్లు అందుబాటు స్థాయిలోకి రాగలవని, ఈ రంగంలో పెట్టుబడులకు ప్రోత్సాహం లభించగలదని పేర్కొంది.



మరోవైపు, హోటళ్లపై ప్రస్తుతం వివిధ రకాలుగా ఉన్న జీఎస్‌టీ రేటును 12 శాతానికి క్రమబద్ధీకరించాలని ఆన్‌లైన్ ట్రావెల్ సేవల సంస్థ మేక్‌మైట్రిప్ సహ వ్యవస్థాపకుడు రాజేష్ మగోవ్ తెలిపారు. ప్రస్తుతం గది అద్దె, సీజన్ తదితర అంశాలను బట్టి ఇది 12 శాతం, 18 శాతంగా ఉంటోందన్నారు. పర్యావరణ అనుకూల విధానాలు పాటించే హోటళ్లు, హోమ్‌స్టేలకు పన్నులపరమైన ప్రోత్సాహకాలు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని ఆయన చెప్పారు. 'విద్యుత్ ఆదా చేసే లైటింగ్, నీటిని ఆదా చేసే డివైజ్‌లు, వ్యర్థాలను తగ్గించే విధానాలను పాటించే వారికి పన్నులపరమైన మినహాయింపులు ఇస్తే పర్యావరణహిత లక్ష్యాల సాధనలో పరిశ్రమ కూడా భాగం కావడానికి తోడ్పడగలదు' అని రాజేష్ వివరించారు. పర్యాటకం, ఆతిథ్య రంగానికి మౌలిక పరిశ్రమ హోదా కల్పిస్తే మరిన్ని పెట్టుబడులు రావడానికి ఆస్కారం ఉంటుందని హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ (వెస్టర్న్ ఇండియా) ప్రెసిడెంట్ ప్రదీప్ శెట్టి పేర్కొన్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

సనోఫీ హెల్త్‌కేర్ భారీ పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న ఫ్రెంచ్ సంస్థ సనోఫీ భారత్‌లో సుమారు రూ.3,655 కోట్లు వెచ్చించనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లోని గ్లోబల్ కెపాసిటీ సెంటర్ (జీసీసీ) కోసం 2030 నాటికి ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్టు సనోఫీ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మ్యాడలిన్ రోచ్ వెల్లడించారు. ఇందులో రూ.914 కోట్లు వచ్చే ఏడాదికల్లా వ్యయం చేస్తామని చెప్పారు. తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి సనోఫీ జీసీసీ నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించిన సందర్భంగా రోచ్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ కేంద్రంలో ప్రస్తుతం 1,000 మంది సిబ్బంది ఉన్నారని చెప్పారు. కొత్త ఫెసిలిటీకి 2,600 మంది ఉద్యోగులు కూర్చునే సామర్థ్యం ఉందన్నారు.



జీసీసీ నూతన భవనం ప్రారంభోత్సవంలో శ్రీధర్‌బాబుతో సనోఫీ ప్రతినిధులు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-7-2024	
విశాఖ	575-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555-00
విజయవాడ	555-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం



పోస్టల్ శాఖలో 44,228 పోస్టులు

గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్).. దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 44,228.
» **తెలుగు రాష్ట్రాల్లో పోస్టుల సంఖ్య:** ఆంధ్రప్రదేశ్-1355, తెలంగాణ-981.
» **పోస్టులు:** బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్(ఏబీపీఎం), డాక్ సేవక్.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» **వేతనం:** నెలకు బ్రాంచ్ పోస్టు మాస్టర్ పోస్టుకు రూ.12,000 నుంచి రూ.29,380, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు, మాస్టర్/డాక్ సేవక్ పోస్టుకు రూ.10,000 నుంచి రూ.24,470.
» **వయసు:** 18 నుంచి 40 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ట వయసులో సడలింపు వర్తిస్తుంది.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో సాధించిన మెరిట్ లిస్ట్ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.08.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 06.08.2024 నుంచి 08.08.2024వరకు
» **వెబ్‌సైట్:** https://indiapostgdsonline.gov.in

మెకాన్ లిమిటెడ్, రాంచీలో 309 ఇంజనీర్ పోస్టులు

రాంచీలోని మెకాన్ లిమిటెడ్.. ఫుల్‌టైం ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 309.
» **పోస్టులు:** డిప్యూటీ ఇంజనీర్, ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్.
» **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, డిజైన్, స్ట్రక్చరల్, సేఫ్టీ, ఐటీ, హెచ్‌ఆర్, పర్చేజ్ అండ్ స్టోర్, ఎస్టేట్, ప్రాజెక్ట్, ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో సీఎంఏ/సీఏ/డిప్లొమా/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 15.06.2024 నాటికి 50 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు,పని అనుభవం,పర్సనల్ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ల వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.07.2024.
» **వెబ్‌సైట్:** http://www.meconlimited.co.in

బీటెక్‌లో.. బెస్ట్‌గా నిలవాలంటే!

» మొదట్నుంచే అకడెమిక్స్‌పై దృష్టిపెట్టాలి
» ప్రాక్టికాలిటీ, అప్లికేషన్ అప్రోచ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి
» లేటెస్ట్ టెక్నాలజీని, జాబ్ స్కిల్స్‌ను అందుకోవడం ముఖ్యం

బీటెక్.. నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సు! ఏటా లక్షల మంది ఎంట్రన్స్ టెస్ట్‌లలో ర్యాంకు సాధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతుంటారు. మెచ్చిన కోర్సులో, నచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లో అడుగు పెట్టడంతోనే స్వప్నం సాకారమైనట్లు భావిస్తే పొరపాటే! ఎందుకంటే.. నాలుగేళ్ల బీటెక్ కోర్సులో ఉత్తమంగా రాణిస్తేనే కంపెనీలు క్యాంపస్ ఆఫర్లు ఇస్తాయి. అందుకే కోర్సులో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే అకడెమిక్ నైపుణ్యాలతోపాటు లేటెస్ట్ జాబ్ స్కిల్స్ పెంచుకోవడంపై దృష్టిపెట్టాలి. తాజాగా.. దేశ వ్యాప్తంగా ఇంజనీరింగ్ ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో.. బీటెక్‌లో బెస్ట్‌గా రాణించేందుకు నిపుణుల సూచనలు, సలహాలు...



ఎంట్రన్స్‌లో సాధించిన ర్యాంకు కార్డు.. గేట్ పాస్ లాంటిది. అది కాలేజీలో, కోర్సులో చేరడానికి అవకాశం కల్పిస్తుంది. కానీ.. ఆ తర్వాత పరిపూర్ణమైన ఇంజనీర్లుగా క్యాంపస్ నుంచి బయటకు రావాలంటే.. విద్యార్థులు మొదట్నుంచే నిర్దిష్ట ప్రణాళికలతో, క్రమశిక్షణతో అధ్యయనం కొనసాగించాలి అంటున్నారు నిపుణులు.

తొలిరోజు నుంచే

బీటెక్‌లో సీటు కోసం ఎంతో కష్టపడిన విద్యార్థులు.. కోర్సులో చేరాక మరింత పట్టుదలతో చదువు కొనసాగించాలి. ఎందుకంటే.. నేటి పోటీ ప్రపంచంలో వేగంగా మారుతున్న టెక్నాలజీ యువతకు ఎన్నో సవాళ్లు విసురుతోంది. అత్యుత్తమ ప్రతిభ చూపితేనే కోరుకున్న అవకాశాలు దక్కుతాయి. కాబట్టి బీటెక్‌లో చేరిన తొలిరోజు నుంచే విద్యార్థులు నిరంతరం తమను తాము తీర్చిదిద్దుకోవాలి. ముఖ్యంగా ఇండస్ట్రీ 4.0 స్కిల్స్ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో వాటిపై దృష్టిపెట్టాలి. టెక్నాలజీ యుగంలో వస్తున్న మార్పులను వేగంగా పసిగట్టి, వాటిపై పట్టు సాధించాలి. అప్పుడే నాలుగేళ్ల తర్వాత సర్టిఫికెట్ చేతికందే సమయానికి బెస్ట్ ఇంజనీర్లుగా నిలుస్తారు.

ఇంటర్‌పర్సనల్ స్కిల్స్

బీటెక్‌లో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులు క్యాంపస్ వాతావరణానికి త్వరగా అలవాటుపడే ప్రయత్నం చేయాలి. ప్రధానంగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల విద్యార్థులు ప్రవేశాలు పొందే ఐఐటీలు, ఎన్‌ఐటీల క్యాంపస్‌లలో విభిన్న నేపథ్యాల విద్యార్థులతో కలిసిపోవాలి. రాష్ట్రాల స్థాయిలోని కళాశాలల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కొత్త వాతావరణంలో ఒత్తిడికి గురికాకుండా త్వరగా ఇమిడి పోయేందుకు కృషిచేయాలి. అందుకోసం కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ పెంచుకోవాలి. అందరితో కలిసిమెలిసి ఉండేలా తమను తాము మలచుకోవాలి. కొత్త వాతావరణం, ఫ్రెషర్స్ అనే భావన నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడి అకడెమిక్స్‌పై ఫోకస్ చేయాలి.

సిలబస్‌పై అవగాహన

నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్‌లో..సెమిస్టర్ విధానం అమలవుతున్న విషయం తెలిసిందే. అంటే.. పరీక్షలకు పెద్దగా సమయం ఉండదు. తరగతులు ప్రారంభమైనప్పటి నుంచే ఏరోజు సబ్జెక్టు ఆరోజు పూర్తి చేస్తేనే సెమిస్టర్ ఎగ్జామ్స్‌కు సన్నద్ధత లభిస్తుంది. కాబట్టి విద్యార్థులు తొలుత నాలుగేళ్ల సిలబస్‌పై ప్రాథమిక అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత మొదటి సంవత్సరం సబ్జెక్టులు, సిలబస్‌పై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టాలి. మొదటి సంవత్సరం సబ్జెక్టులు.. ఇంజనీరింగ్ కోర్సుకు పునాది వంటివి. వీటిపై పట్టు సాధిస్తేనే తర్వాత మూడేళ్ల అకడమిక్స్‌లో రాణించడం సులువవుతుంది. సబ్జెక్టులను అవగాహన చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే.. లెక్చరర్స్, ప్రొఫెసర్స్ సహాయం తీసుకోవడానికి వెనుకంజ వేయకూడదు. పలు ఇన్‌స్టిట్యూట్‌లు మెంటారింగ్ సెల్స్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. తరగతి గదిలో సందేహాలు నివృత్తి చేసుకోవడానికి బిడియపడే విద్యార్థులకు ఇవి ఎంతో ఉపయుక్తమని చెప్పొచ్చు.

రెండో ఏడాది నుంచి

రెండో ఏడాది నుంచి పూర్తిగా ప్రాక్టికాలిటీకి ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవానికి ఇంజనీరింగ్‌లో సంబంధిత బ్రాంచ్ సబ్జెక్ట్‌ల బోధన రెండో ఏడాది నుంచే పూర్తి స్థాయిలో ప్రారంభమవుతుంది. కాబట్టి విద్యార్థులు తమ బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్‌లు,వాటికి అవసరమైన క్షేత్ర నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి. రెండో ఏడాది నుంచి సబ్జెక్టులను లోతుగా అన్ని కోణాల్లో అధ్యయనం చేయడం ప్రారంభించాలి. అందుకోసం మూక్స్, ఎన్‌పీటీఈఎల్ వంటి ఆన్‌లైన్ విధానాలతోపాటు ప్రొఫెసర్స్ రాసిన ప్రామాణిక పుస్తకాలను చదవాలి. ముఖ్యంగా ప్రతి అంశాన్ని వాస్తవ పరిస్థితులతో అనుసంధానిస్తూ అవగాహన చేసుకునే ప్రయత్నం చేయాలి.

ఇంటర్న్‌షిప్స్

ప్రస్తుత పరిస్థితుల్లో ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా రియల్ టైమ్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. అందుకోసం కనీసం రెండు లేదా మూడు ఇంటర్న్‌షిప్స్ పూర్తి చేయడం ఎంతో మేలు చేస్తుంది. ఈ మేరకు ఏఐసీటీఈ కూడా మార్గదర్శకాలు జారీ చేసింది. కాబట్టి ఇంజనీరింగ్ విద్యార్థులు రెండో ఏడాది చివరి నుంచే ఇంటర్న్‌షిప్స్ సాధించే విధంగా ప్రయత్నాలు సాగించాలి. ఇందుకోసం క్యాంపస్‌లోని ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెల్, ఆయా సంస్థల్లో పని చేస్తున్న సీనియర్ల సహకారం తీసుకోవాలి. ఇలా ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా తాజా పరిస్థితులపై అవగాహన వస్తుంది. దీంతో జాబ్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవచ్చు.

మూడో ఏడాది.. లక్ష్యం

మూడో ఏడాది నుంచి తమ భవిష్యత్తు లక్ష్యాల సాధన దిశగా అడుగులు వేయాలి. ఉన్నత విద్య కోసం గేట్, క్యాట్ వంటి పరీక్షల ప్రిపరేషన్‌కు శ్రీకారం చుట్టాలి. అదే విధంగా క్యాంపస్ ఆఫర్స్ పొందాలనే లక్ష్యం ఉన్న విద్యార్థులు దానికి అనుగుణంగా సన్నద్ధ మవ్వాలి. ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నైపుణ్యాలు పెంచుకోవాలి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియపై అవగాహన పెంచకోవాలి. అందుకుతగ్గట్టు కొత్త నైపుణ్యాలు, సబ్జెక్ట్ నాలెడ్జ్ అందిపుచ్చుకునే మార్గాలను అన్వేషించాలి.

ప్రాజెక్ట్ వర్క్.. రియల్‌గా

నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులో అత్యంత కీలకమైంది.. ప్రాజెక్ట్ వర్క్. నాలుగో ఏడాదిలో ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది. రియల్ టైమ్ ప్రాజెక్ట్ వర్క్ చేసేందుకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఫేక్ ప్రాజెక్ట్ వర్క్స్ వైపు దృష్టి సారిస్తే.. భవిష్యత్తులో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పడంలో తడబాటు ఎదురవుతుందని గుర్తించాలి.

ప్రాక్టికాలిటీ, అప్లికేషన్ అప్రోచ్

ఇంజనీరింగ్ విద్యార్థులు.. ప్రాక్టికాలిటీ, అప్లికేషన్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఇందుకోసం ల్యాబ్ వర్క్‌ను శ్రద్ధగా చేయాలి. ప్రాక్టికల్స్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. పుస్తకాలకే పరిమితమైతే పరీక్షల్లో ఎక్కువ మార్కులు స్కోర్ చేయొచ్చేమోకానీ.. రియల్ టైం నైపుణ్యాలు మాత్రం లభించవు. రియల్ టైమ్ నాలెడ్జ్ పెంచుకునే ప్రయత్నం చేయాలి. క్లాస్ రూమ్ లెర్నింగ్‌కే పరిమితం కాకుండా.. ఇండస్ట్రీ వాస్తవ పరిస్థితులను ఆకళింపు చేసుకుంటూ నైపుణ్యాలు పెంచుకోవాలి.అప్పుడే కోర్సు పూర్తయ్యే సమయానికి సమర్థవంతమైన ఇంజనీర్లుగా, జాబ్ మార్కెట్లో అవకాశాలు అందుకోవడంలోనూ ముందంజలో నిలిచే ఆస్కారం లభిస్తుంది.

సర్టిఫికేషన్స్.. సమర్థవంతంగా

ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో ఇండస్ట్రీ 4.0 స్కిల్స్ పేరిట ఆటోమేషన్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, రోబోటిక్స్, 3-డి డిజైన్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ స్కిల్స్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. కంపెనీలు తమ కార్యకలాపాల నిర్వహణలో నిత్యం కొత్త టెక్నాలజీని ప్రవేశపెడుతున్నాయి. వీటిని కొన్ని సందర్భాల్లో కరిక్యులంలో భాగంగా అభ్యసించే వీలుండదు. ఇలాంటి లేటెస్ట్ టెక్నాలజీకి సంబంధించి సర్టిఫికేషన్ కోర్సులు పూర్తిచేయడం లాభిస్తుంది. తద్వారా భవిష్యత్తులో జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలిచే వీలుంటుంది.

మూక్స్‌తో లేటెస్ట్ టెక్నాలజీ

నేటి ఇంటర్నెట్ యుగంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు వరం.. మూక్స్(మాసివ్‌లీ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్). అంతర్జాతీయంగా పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆయా అంశాలకు సంబంధించి ప్రత్యేకంగా ఆన్‌లైన్ విధానంలో కోర్సులను అందిస్తున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులు మూక్స్ ద్వారా తమ సబ్జెక్టులతోపాటు లేటెస్ట్ టెక్నాలజీపైనా అవగాహన పెంచుకోవచ్చు. మన దేశంలోనూ ఎన్‌పీటీఈఎల్ ద్వారా ప్రముఖ ప్రొఫెసర్స్ బోధించే పాఠాలను ఆన్‌లైన్‌లో వినే అవకాశముంది. వీటిల్లో విద్యార్థులకు ఉపయోగపడే వర్చువల్ ల్యాబ్స్ సౌకర్యం సైతం లభిస్తుంది.

పర్సనాలిటీ డెవలప్‌మెంట్

విద్యార్థులు కాలేజీలో ఉన్నప్పుడే వ్యక్తిత్వ లక్షణాలు మెరుగుపరచుకోవాలి. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్, లాంగ్వేజ్ స్కిల్స్, టీమ్ వర్కింగ్ వంటి నైపుణ్యాలు పెంచుకోవాలి. కాలేజీలో నిర్వహించే సెమినార్లకు హాజరవడం, తోటి విద్యార్థులతో గ్రూప్ డిస్కషన్స్ వంటి వాటిలో ఉత్సాహంగా పాల్గొనాలి. అదే విధంగా కాలేజ్‌లో జరిగే కల్చరల్ యాక్టివిటీస్‌లోనూ భాగస్వాములయ్యే విధంగా వ్యవహరించాలి. ఫలితంగా వ్యక్తిత్వ వికాసం పొందొచ్చు.

స్వీయ అధ్యయనం

బీటెక్ విద్యార్థులు సెల్ఫ్ లెర్నింగ్ అలవాటు చేసుకోవాలి. దీనికోసం ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న అన్నిరకాల వనరులను ఉపయోగించుకోవచ్చు. లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీలను వినియోగించుకోవాలి. తద్వారా తమ కోర్ సబ్జెక్ట్‌లకు సంబంధించి తాజా పరిణామాలపై అవగాహన పొందాలి. అదే విధంగా రియల్ టైమ్ ప్రాబ్లమ్స్, వాటికి ఆ రంగంలోని నిపుణులు కనుగొన్న పరిష్కారాలను అధ్యయనం చేయాలి. ఇందుకోసం రీసెర్చ్ జర్నల్స్, రీసెర్చ్ పేపర్స్‌ను చదవడం అలవర్చుకోవాలి.

లక్ష్యంపై స్పష్టత

బీటెక్‌లో చేరిన విద్యార్థుల్లో కొందరు కోర్సు పూర్తికాగానే కొలువులో చేరాలనుకుంటున్నారు. మరికొందరు ఉన్నత విద్యను లక్ష్యంగా చేసుకుంటున్నారు. కాబట్టి ఇంజనీరింగ్ విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యంపై స్పష్టతతో ముందుకు సాగాలి. ట్రెండ్ కంటే అభిరుచికి ప్రాధాన్యమివ్వడమే శ్రేయస్కరం అనేది నిపుణుల అభిప్రాయం. విదేశాల్లో ఎంఎస్ కోసమైతే రెండో సంవత్సరంలోనే టోఫెల్‌ను, మూడో ఏడాదిలోపు జీఆర్‌ఈకి హాజరవ్వాలి. ఎంటెక్, ఎంబీఏ కోసం 'గేట్' లేదా 'క్యాట్' పరీక్షలకు కూడా మూడో ఏడాది నుంచే ప్రిపరేషన్ ప్రారంభించాలి.




పాలధారల బొగత

ములుగు జిల్లా వాజేడు మండల పరిధి చీకుపల్లి గ్రామ సమీపాన ఉన్న బొగత జలపాతం పరవళ్లు తొక్కుతూ కనువిందు చేస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు గుట్టల పైనుంచి వరద పోటెత్తింది. పాల నురగలా జలధారలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. వరద ఉధృతంగా రావడంతో స్నానాల కొలను మునిగి పోయింది. జలపాతం వద్ద సిబ్బందితో పాటు పోలీసులు పహరా ఉన్నారు.

- వాజేడు

టుడేస్ గ్రాఫిక్



డ్రగ్స్ క్వీన్ బ్లెస్సింగ్!

బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 20సార్లు కొకైన్ సరఫరా

- ఏడుసార్లు విమానంలోనే ప్రయాణించిన నైజీరియా యువతి
- నైజీరియన్ డాన్ సుజీకి హైదరాబాద్ కొరియర్ ఈమెనే
- దర్యాప్తులో గుర్తించిన సైబరాబాద్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: నైజీరియన్ డ్రగ్స్ సిండికేట్‌లో సరికొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. డ్రగ్స్ కింగ్‌పిన్ డివైన్ ఎబుకా సుజీ దేశంలోని అన్ని మెట్రో నగరాలను లక్ష్యంగా చేసుకొని దందా నిర్వహించేవాడు. నగరానికి ఒకరిని చొప్పున అంకితమైన డ్రగ్ పెడ్లర్‌ను నియమించుకునేవాడని, ఈక్రమంలో హైదరాబాద్‌కు అనోహా బ్లెస్సింగ్ కొరియర్‌గా వ్యవహరించినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఇటీవల తెలంగాణ నార్కోటిక్ బ్యూరో (టీజీ న్యాబ్), సైబరాబాద్ పోలీసులు అంతర్జాతీయ డ్రగ్ రాకెట్‌ను ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నైజీరియన్లు బ్లెస్సింగ్, అజీజ్ నోహీమ్ అడెషోలాతో సహా ఐదుగుర్ని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.



అనోహా బ్లెస్సింగ్

నకిలీ పాస్‌పోర్టుతో..

2018లో ఉపాధి నిమిత్తం ముంబైకి వచ్చిన బ్లెస్సింగ్.. కొంతకాలానికి బెంగళూరుకు మకాం మార్చింది. హెయిర్ స్టయిలిస్ట్‌గా పనిచేస్తూ స్థానిక డ్రగ్ పెడ్లర్‌తో పరిచయం పెంచుకుంది. తొలుత చిన్న మొత్తాల్లో డ్రగ్స్ సరఫరా ప్రారంభించిన ఈమె క్రమంగా సుజీ ఆదేశాల మేరకు బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ నగరాలకు డ్రగ్స్ సరఫరా చేసే స్థాయికి ఎదిగింది. పోలీసులకు చిక్కినా తన అసలు గుర్తింపులు బహిర్గతం కాకుండా చూసుకునేది. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో జోనా గోమ్స్ పేరుతో పశ్చిమ ఆఫ్రికాలోని గినియా బిస్సా దేశం పాస్‌పోర్టును తీసుకుంది. కేవలం అంతర్జాతీయ సిమ్ కార్డులు, వాట్సాప్ ద్వారా మాత్రమే సంప్రదింపులు జరుపుతుండేది. 2019 సెప్టెంబర్ 27న ఒకసారి ధూల్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు.

డ్రగ్స్‌తో 20సార్లు హైదరాబాద్‌కు..

సుజీ సూచనల మేరకు ఆమె నివసించే బెంగళూరు నుంచి ఢిల్లీకి విమానంలో వెళ్తుంది. అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి లేదా అప్పటికే నిర్మానుష్య ప్రాంతంలో ఉంచిన డ్రగ్ పార్సిల్‌ను తీసుకొని హైదరాబాద్‌కు సరఫరా చేసేదని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు 20సార్లు నగరానికి డ్రగ్స్ సరఫరా చేయగా.. ఇందులో ఏడు సందర్భాల్లో విమానంలో ప్రయాణించిందని, 13 సందర్భాల్లో రైళ్లు, బస్సుల్లో నగరానికి చేరుకుందని ఓ అధికారి తెలిపారు. బ్లెస్సింగ్ తన బ్యాగేజ్‌లో కొకైన్ దాచి పెట్టి, దాన్ని విమానం ఎక్కేక్రమంలో చెకిన్ లగేజ్‌లో ఇచ్చేదని, విమానాశ్రయంలో మాదక ద్రవ్యాల ఉనికి గుర్తించడంలో భద్రతా సిబ్బంది డొల్లతనానికి ఇదొక ఉదాహరణనని ఆయన పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చాక ఈ డ్రగ్ పార్సిల్‌ను లంగర్‌హౌస్‌లోని సన్‌సిటీలో ఉంటున్న ఫ్రాంక్లిన్ ఉచెన్నా అలియాస్ కలేషి లేదా ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన అజీజ్ నోహీమ్ అడెషోలాకు అందజేస్తుంది. ఈమె డ్రగ్స్‌ను నేరుగా వినియోగదారులకు లేదా ఇతర పెడ్లర్లకు విక్రయించేదని, డ్రగ్స్ హైదరాబాద్‌కు చేర్చిన ప్రతీసారి సుజీ... బ్లెస్సింగ్‌కు రూ.20 వేలు చెల్లించేవాడని పోలీసులు గుర్తించారు. బ్లెసింగ్‌కు ఈ డ్రగ్ పార్సిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. అయితే సుజీ పోలీసులకు చిక్కితేనే ఈ కేసు మూలాలు బయటపడతాయని ఓ అధికారి అభిప్రాయపడ్డారు.



కప్పర్లలో ఆడబిడ్డల ఆత్మీయ సమ్మేళనం

సందడి చేసిన గండ్రత్, అర్గుల కుటుంబాలు

తాంసి: ఇప్పటి వరకు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు చూశాం.. ఇదే తరహాలో రెండు కుటుంబాల ఆడబిడ్డలంతా బుధవారం ఆత్మీయ సమ్మేళనం పేరిట ఒక్క చోటుకు చేరారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం కప్పర్ల గ్రామం ఇందుకు వేదికైంది. గ్రామంలోని గండ్రత్, అర్గుల కుటుంబాలకు చెందిన ఆడపడుచులు తొలిఏకాదశి, మొహర్రం రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 100 మందికిపైగా ఆడపడుచులు గ్రామానికి రాగా వారికి డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. అనంతరం వారంతా సవారీ బంగ్లాకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆడబిడ్డల కానుకగా రూ.3 లక్షలతో తయారు చేసిన బంగారు ఆభరణాన్ని హసన్, హుస్సేన్ దేవస్థానానికి అందజేశారు. తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధురస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. దీంతో ఊరంతా సందడి వాతావరణం నెలకొంది. ఇందులో ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటమ్మతో పాటు కాంగ్రెస్ నాయకురాలు గండ్రత్ సుజాత, కొడాల భాగ్యలక్ష్మి, గండ్రత్, అర్గుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

డోలీనే.. అంబులెన్స్



డోలీ కట్టి బురద దారిలోనే జ్వరపీడితుడిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

బూర్గంపాడు: వర్షాకాలం వస్తే.. ఆ కాలనీకి కనీసం సైకిల్ కూడా వెళ్లదు. రోడ్డు లేకపోవడంతో నడక తప్ప మరోమార్గం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక సమీపంలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీవాసులు (చంద్రయ్య గుంపు) ఏటా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కాలనీకి చెందిన సోడే రాజు వారంరోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగు రోజులు ఇన్‌పేషంట్‌గా చేరి చికిత్స చేయించుకున్నాడు. జ్వరం తగ్గకపోవడంతో అక్కడే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ కూడా జ్వరం తగ్గకున్నా వైద్యానికి డబ్బులు ఖర్చవుతుండటంతో రెండురోజుల క్రితం ఇంటికి వచ్చాడు. మంగళవారం రాత్రి జ్వరం తీవ్రం కావడంతో బుధవారం నడవలేని పరిస్థితికి చేరుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు గ్రామస్తులు అతడిని కుర్చీలో కూర్చోబెట్టి రెండు కర్రలతో డోలీ కట్టి బురదలోనే మోసుకుంటూ రెండు కిలోమీటర్లు వచ్చారు. ఆ తర్వాత ఆటోలో భద్రాచలం తరలించారు.

రెండేళ్ల క్రితం ఓ గర్భిణిపురిటి నొప్పులతో బాధపడుతుండగా, గ్రామస్తులుమంచాన్ని డోలీగా చేసి మూడు కిలోమీటర్లు మోసుకొచ్చి ఆస్పత్రికి తరలించారు.

గతేడాది ఓ వ్యక్తి పాముకాటుకు గురైతే ఇలాగే డోలీ కట్టాల్సి వచ్చింది.

ఐదేళ్లకు లొద్ది మల్లయ్య దర్శనం

- నల్లమలలో పోటెత్తిన భక్తులు.. తొలిఏకాదశి సందర్భంగా పూజలు



సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అభయారణ్యంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువైన లొద్దిమల్లయ్యస్వామి దర్శనానికి అటవీశాఖ అధికారులు ఐదేళ్ల తర్వాత బుధవారం భక్తులను అనుమతించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలోని గుహలో కొలువుదీరిన శివలింగాన్ని స్థానికులు లొద్ది మల్లయ్య స్వామిగా పిలుచుకుంటారు. ఏటా తొలిఏకాదశి సందర్భంగా భక్తులు లొద్ది మల్లయ్య స్వామిని దర్శించుకుంటారు. మిగతా సమయంలో అటవీ ప్రాంతంలోకి వెళ్లేందుకు అనుమతి ఉండదు. 2019లో తొలి ఏకాదశి సందర్భంగా చివరిసారిగా భక్తులను అనుమతించారు. కరోనా నేపథ్యంలో ఐదేళ్లుగా అటవీ శాఖ అధికారులు లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతించడం లేదు. ఈసారి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ తదితర సంఘాల విజ్ఞప్తి మేరకు బుధవారం భక్తులను దర్శనానికి అనుమతించారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లను అడవిలోకి అనుమతించలేదు. ఎత్తైన కొండలు, లోయల్లో కొలువైన లొద్ది మల్లయ్యను దర్శించుకునేందుకు భక్తులు నల్లమలలోని కొండలు, లోయలు, జలపాతాలను దాటుకొని ప్రయాణించాల్సి ఉంటుంది. అధికారులు అనుమతితో వేలాది మంది దర్శనం కోసం పోటెత్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.